RNI No. APTEL/2003/12253

Reffered Journal & Peer Reviewed Journals

# భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 23 Issue No. 01 Monthly January 2026 ISSN No. 2456-4702 Rs. : 15/-



## నాయని కృష్ణ కుమారి

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# భావవీణ

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. : 2456-4702 | RNI No. : APTEL/2003/12253



# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522 034.
Mail : bhavaveena2024@gmail.com
Cell : 99499 29674, 79890 88274.

**BHAVAVEENA**
(SPECIAL MAGAZINE)
Journal - Arts, Literature, Culture and Language Study

Reffered Journal & Peer Reviewed Journals
ISSN No. : 2456-4702
RNI No. : APTEL/2003/12253

| | | |
|---|---|---|
| ముద్రణ | : | **జనవరి - 2026** |
| ప్రతులు | : | **500** |
| వెల | : | **రూ. 15/-** |
| కాపీలకు | : | **డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.** |
| గమనిక | : | **ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - సంపాదకవర్గం.** |
| ఎడిటోరియల్ చిరునామా | : | **డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.** |
| డి.టి.పి & ప్రింటింగ్ | : | **తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్ గుంటూరు జిల్లా, సెల్ : 94 94 660 509.** |




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

***Founder :***

Kolla Sri Krishnarao (Late)

***E-mail :***

bhavaveena2024@gmail.com

7989781963
9949929674
7989088274

# 135-14-716, Dwaraka Nagar,
12th Lane, Nagaralu, Guntur - 522034.

**Vol. 23 - Issue. 01 - January 2026 - Reffered Journal & Peer Reviewed Journals - Rs. : 15/-**
**| ISSN No. : 2456-4702 | RNI No. : APTEL/2003/12253 |**



**EDITORIAL BOARD**

*Honourable Editor*
**Dr. PITTA SANTHI**
*M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),Ph.D.*

*Chief Editor*
**Dr. PAYARDA NAGAIAH**
*M.A.(Tel), M.A(Pol-Sci).,M.Ed.,Ph.D.*
# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

**ADVISORY COMMITTEE**

1. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Former Vice Chancellor,
Dravidian University, Kuppam, A.P.

2. **Prof. G. Yohan Babu,** (Rtd.) M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.

3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.

4. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Hyderabad Central University, Hydetabad, Telangana.

5. **Dr. Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.

6. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD, Dept. of Telugu
Sri A.S.N.M. Govt. Degree College,
Palakollu, West Godavari Dist., A.P.

7. **Prof. T. Rama Prasad Reddy**
Dean, Faculty of Arts & Education,
Yogi Vemana University, Kadapa, Andhra Pradesh.

8. **Dr. T. Swarupa Rani,** M.Sc., M.Ed., M. Phil., Ph.D.
Principal,
St.Joseph's College of Education for Women,
Sambasivapet, Guntur, Andhra Pradesh.

**ASSOCIATE EDITORS**

1. **Prof. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.

2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI,
Tamilnadu.

3. **Dr. D. SESHU BABU**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.

4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.

5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.

6. **Dr. CHINTHAM PRAVEEN KUMAR**
HOD, Dept of Telugu
University Arts & Science College (UASC),
Kakatiya University Subedari - 506001
Hanumakonda,Warangal, Telangna.

7. **Prof. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Prof. N. Eswar Reddy,** M.A., PhD.
Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
University of Hyderabad, Gachibowli - 46,
Hyderabad, Telangana.

11. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu
Central University, Gachibowli, Hyderabad,
Telangana.

12. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Associate Professor, Dept. of Telugu
P.G. Centre, Gadwal,
Palamuru University,
Mahabobnagar, Telangana.

**LEGAL ADVISER**

**Pitta Sundara Babu**, ***M.A., B.L.,***
Advocate, Narasapur.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, Guntur - 2. Cell : 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11 Brodipet, Guntur - 522 002,
Andhra Pradesh. Cell : 7386529274, 7989781963, E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Guntur - 522 002. Ph. 94 94 660 509.

# నాయని కృష్ణకుమారి

(జననం : 30 మార్చి 1930 - మరణం : 30 జనవరి 2016)

నాయని కృష్ణకుమారి తెలుగు సాహితీవేత్త, ప్రముఖ రచయిత్రి, సాహితి విమర్శకురాలు. ఈమె ప్రముఖ తెలుగు సాహితి వేత్త, నాయిని సుబ్బారావు కుమార్తె. తల్లి అనుమాయమ్మ. ఆమెకు ఒక తమ్ముడు ముగ్గురు చెల్లెలు ఉన్నారు. నాయని కృష్ణకుమారి తన తండ్రిని ఆదర్శంగా తీసుకొని చిన్నతనం నుండి సాహితీ రచనలకు పూనుకుంది. ఆమె కథ, కవిత్వం, నవల, చారిత్ర విమర్శనా ప్రక్రియలలో రచనలు చేశారు. నాయని కృష్ణకుమారి ప్రాథమిక విద్యాభ్యాసం నరసరావుపేట గుంటూరులో జరిగింది. తరువాత ఇంటర్మీడియట్ గుంటూరులో పూర్తి చేసి ఎం.ఏ తెలుగు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పూర్తి చేసింది. తరువాత హైదరాబాదులో ఉస్మానియా యూనివర్సిటీలో లెక్చరర్‌గా, తరువాత ప్రొఫెసర్ అయ్యింది. తరువాత పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్ గా 1999లో పదవి వివరణ చేసింది.

ఆమె అగ్నిపుత్రి (1978) ఆయాతా (కథల సంకలనం) ఏం చెప్పను నేస్తం (కవితా సంకలనం 1988) పరిశీలన (వ్యాస సంకలనం 1977) పరిశోధన (వ్యాస సంకలనం 1979) జానపద సరస్వతి (జానపద సాహిత్య పరిషత్ 1996) కాశ్మీర దీపకళిక (యాత్రా చరిత్ర) బిరుదు రాజు రామరాజు, నాయని కృష్ణకుమారి జానపద వాంగ్మయ చరిత్ర (సంకలనం) నాయని కృష్ణకుమారి వివిధ ప్రక్రియను రచన చేశారు. ఆమె రచనలు తెలుగు పాఠకుల హృదయాల్లో శాశ్వత ముద్ర వేసుకున్నాయి. ఆమె రచనలు తెలుగు సాహితీ చరిత్రలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నాయి. ఆమె రాసిన విభిన్న రచనలకు అనేక బిరుదులు సత్కారాలను అందుకుంది. గృహలక్ష్మి స్వర్ణకంకణం, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఉత్తమ రచయిత్రి బహుమతి, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ నుండి ఉత్తమ బహుమతిని అందుకుంది. నాయన కృష్ణ కుమారి 216 జనవరి 30న హైదరాబాదులో తుదిశ్వాస వదిలారు.

- చీఫ్ ఎడిటర్

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | తెలుగు అనువాద సాహిత్యం - అనువాదకుల కృషి | - డా॥. వి. గోపాల్ | 8 |
| 2. | ఆదిమ సమాజంలో గ్రామ దేవతల వైశిష్ట్యం | - డా॥. బూసి వెంకటస్వామి<br>- డా॥. పెండ్యాల లావణ్య | 11 |
| 3. | ఆంధ్రదేశంలోని దిగువ కృష్ణానదీతీర ప్రాంతం - శైవ, వైష్ణవ మతాల ప్రాభవం | - డా॥. ముసుగు శ్రీనివాసరావు | 15 |
| 4. | చోడగిరి చంద్రరావు - జీవితం, సాహిత్యం | - డా॥. ఎల్లే విజయానందరాజు | 20 |
| 5. | ధుర్జటి శ్రీకాళహస్తి శతకం - భక్తి వైశిష్ట్యం | - డా॥. కొయ్యా శ్రీనివాసులు | 25 |
| 6. | మహిళా చైతన్యానికి 'దర్పం' పట్టిన కథలు | - డా॥. ఎ.ఎ. నాగేంద్ర | 28 |
| 7. | దాశరథి కవిత - జాతీయత | - డా॥. ఆగపాటి రాజ్ కుమార్ | 33 |
| 8. | దాశరథి సాహిత్యం సామాజిక స్పృహ | - డా॥. డకర వెంకటరమణ | 38 |
| 9. | పదార్థం వ్యాసాల్లో బెల్లి యాదయ్య విమర్శా దృక్పథం | - డా॥. బి. నర్సింహ<br>- డా॥. జి. మహేందర్ | 42 |
| 10. | పెరుగుపల్లి బలరామ్ 'వర్తమాన భారతి' - సమీక్ష | - డా॥. దాసరి రమేష్ | 47 |
| 11. | భారతీయ జర్నలిజం - జ్ఞాన వ్యవస్థల సమ్మేళనం : పరిశీలన | - డా॥. జీకేడీ ప్రసాదరావు | 51 |
| 12. | నన్నయ భారతంలో మానవీయ దృక్పథాలు | - మేడసాని శ్రీనివాసరావు | 54 |
| 13. | రావి నూతల ప్రేమ కిషోర్ సాంఘిక నాటకాలు - సామాజిక దృక్పథం | - చెరుకూరి వేణు | 62 |
| 14. | బీసీ ఉద్యమంతో బీసీ కవిత్వం - పరిశీలన | - పెందోట వీణ | 66 |
| 15. | వాడ్రేవు వీరలక్ష్మీ దేవి గిరిజన కథలు-జీవన విధానం సమస్యలు - పరిష్కారాలు | - హిమబిందు వేదుల<br>- ఆచార్య జర్రా అప్పారావు | 70 |
| 16. | పెద్దీటి యోహాను - క్రైస్తవ బుర్రకథల పరిచయం | - సుజిత రెడ్డి<br>- వై. సుభాషిణి | 75 |

| | | |
|---|---|---|
| 17. నీటికి కులం, మతమున్న దేశమిదన్న 'మహారు'డు ఆచార్య ఎండ్లూరి సుధాకర్ | - చీరబోయిన తిరుపతి | 82 |
| 18. బోయి భీమన్న కూలిరాజు నాటకం - సామాజికత | - యం. శైలజ | 86 |
| 19. వేమన పద్యాలలో నాటి, నేటి సామాజిక వ్యవస్థ | - జి. ప్రేమలత | 90 |
| 20. మల్లెసాల శతాధిక చేతివృత్తుల కథలు - జీవన చిత్రణ | - అఫ్రోజ్ రుక్సానా | 95 |
| 21. జాతశ్రీ నవలల్లో, కథల్లో వృత్తి కులాల జీవనం | - బంటు నర్సింహులు | 100 |
| 22. గిరిజన నవలలో స్త్రీలు - సామాజిక జీవన చిత్రణ | - డా॥. సూరేపల్లి గోదావరి | 104 |
| 23. తిరుమల రామచంద్రుని బాల్యం - సాంఘిక పరిస్థితులు | - తోట రామకృష్ణ | 109 |
| 24. ఉత్తరాంధ్ర తెలుగు కథా సాహిత్యంలో భూషణం స్థానం | - వంతిన బాలజీ<br>- ఆచార్య జర్రా అప్పారావు | 112 |
| 25. శ్రీపూతి చంద్రభూషణం గారి కథలు - సమాజం సమకాలీన సమస్యలు - సాహితీ సమాలోచన | - బోణం మోహన్‌గాంధీ | 118 |
| 26. ఒక దశాబ్ది కథలు - మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాల విశ్లేషణ | - మామిడి విజేత | 121 |
| 27. తెలంగాణ మట్టి పరిమళం - అన్నవరం దేవేందర్ కవిత్వం | - పుష్పలత | 125 |
| 28. బి.వి.యన్. స్వామి రచనల్లో కథన రీతులు - వస్తు శిల్పాల సమన్వయం | - రెడ్డి శ్రీనివాస్ | 128 |

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# తెలుగు అనువాద సాహిత్యం - అనువాదకుల కృషి



- డా॥. వి. గోపాల్

అసిస్టెంట్ ప్రొఫెసర్, పబ్లికేషన్స్ శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

అనువాదమనేది ఒక ప్రత్యేక విభాగంగా పరిగణింపబడినా, తులనాత్మక సాహిత్యాధ్యయనంలో ఇదొక అవినాభావ సంబంధమైన అంశంగా నిలద్రొక్కుకుంది. అనేక ఇతర భాషాసాహిత్యాల మధ్య ఉన్న పరస్పర సంబంధాలను నిర్ధారించుకోవడానికి అనువాదానికి మించిన మరో సాధనం ఏదీ లేదనే చెప్పవచ్చు. శాస్త్రీయ, సాంకేతిక పరిశోధన ఫలితాంశాలను యావత్ప్రపచానికీ చాటగలిగిన సామర్థ్యం ఒక్క అనువాదానికే ఉందనడంలో అతిశయోక్తిలేదు. అనువాదమనేది విభిన్న ప్రజల, ప్రాంతాల మధ్య, విభిన్న దేశాలమధ్య ఉన్న అంతరాన్ని తొలగించడానికి శక్తివంతమైన ఉపకరణంగా నేటికాలంలో ఉపకరిస్తుంది. ఇదొక కళ.

"అనువాదం" శాస్త్రమా కళా అనే మీమాంసకూడా ఎదురవుతుంది. ఫ్రేసర్ టైట్లర్ పద్దెనిమిదో శతాబ్దంలోనే పరిశోధనా పూర్వకంగా దీనిని "భాషాశాస్త్రం"లో అంతర్భాగమని చెప్పాడు. శాస్త్రవాదులు అనువాదాన్ని సమగ్రానువాదం, పరిమితానువాదం, పాక్షికానువాదం, స్వేచ్ఛానువాదం, నిబద్ధానువాదం, వర్ణానువాదం, ధ్వన్యానువాదం, లిప్యనువాదం, వ్యాకరణపరిమితానువాదం, పద పరిమితానువాదం, యథామాతృకానువాదం, నుడికారపు అనువాదం, రేఖానువాదం, కోశానువాదం ఇలా ఎన్నో రూపాలుగా వర్గీకరించారు. సాంకేతిక పరిజ్ఞాన విజృంభణతో ఆశ్చర్యపరిచే "యాంత్రికానువాదం" వచ్చి చేరింది. కళానువాదం దృష్టిలో అనువాదం గొప్పకళ. కావ్యం ఉత్తమ కళాసృష్టి అయితే, వారు అనువాదాన్ని విశిష్ట కళానుసృష్టిగా పరిగణిస్తారు. మధ్యేమార్గం అభిలషించే వారు అనువాదం కళాత్మక శాస్త్రమనీ, శాస్త్రీయ కళ అనీ సంభావిస్తారు.

ఈ వాదాలు పరిత్యజిస్తే అనువాదం ముఖ్యంగా సాహితీ ప్రపంచానికి మహత్తరవరంగా భాసిస్తుంది. రెండు, అంతకంటే ఎక్కువ భాషల్లో ప్రవేశం సాధించేవారు చాలా తక్కువ. మిగిలిన వారందరూ ఇతర భాషా సాహిత్యాలు తెలుసుకునేందుకు సాధనం అనువాదం. ఈ సాధనమే లేకపోతే టాల్స్టాయ్, చేకోవ్, షేక్స్పియర్, గాలిబ్, ఫిరదౌసి, కాళిదాసు, తులసీదాసు, వాల్మీకి, రవీంద్రుడు, శరత్‌బాబు, జయదేవుడు, ప్రేమ్‌చంద్, సుబ్రహ్మణ్య భారతి, కువెంపు, అనంతమూర్తి, గిరీష్‌కర్నాడ్, వల్లత్తోల్, మహాశ్వేతాదేవి వంటి సహస్రాధిక సాహితీ శిఖరాల వెలుగులు అన్యభాషీయులు చూడగలిగేవారు కాదు. అదృష్టవశాత్తు అనువాద సాధనం ప్రపంచ సాహిత్యాలను సన్నిహితపరిచింది. ఈ బలీయసాహిత్యానువాద గుణ విశేషాలను స్థాలీపులాకంగా పరిశీలించేందుకు ఈ వ్యాసం

యత్నిస్తోంది. క్వాచిత్కంగా ఇతర భాషలు కనుపించినా వీనిలో ప్రధానంగా ఇంగ్లీషు, తెలుగు భాషల ప్రస్తావన ఉంటుంది. తెలుగు సంబంధించి సాహిత్యానువాద రంగంలో గణనీయమైన కృషి జరిగింది. అరవై అయిదు శాతం సంస్కృతానువాదాలను జీర్ణించుకున్న తెలుగు సంస్కృతం నుంచి వేదవాఙ్మయం, పురాణేతిహాసాలు, కావ్యనాటకాదులను తనదైన రీతిలో అనువదించుకుంది.

తెలుగులో మొదటి దశలో జరిగిన సాహిత్య కృషి స్థూలంగా పురాణేతిహాసాలను అనుసరించి జరిగిందన్నది వాస్తవం. వ్యాస భారత, భాగవతాలు, వాల్మీకి రామాయణం అనువాదాలన్న న్యూనతాభావం రాకుండా కవిత్రయం, పోతన, విశ్వనాథ వారు వాటిని తెలుగులో మలచిన కావ్యరీతి ప్రశంసనీయం. ఇప్పటివరకు ఇతివృత్తాలలో మార్పులున్నా తెలుగు రచనా రీతి కవిత్రయం నెలకొల్పిన పద్యకవితా మార్గంలోనే జరుగుతుంది.

ప్రాచీనాంధ్ర సాహిత్యమంతా సంస్కృతం నుండి పునరుద్ధరించుకొన్నదని విజ్ఞులందరికీ తెలిసిన విషయమే, ప్రాచీన భారతీయ ఆర్థిక, సామాజిక, రాజకీయ, మత భావాలను తమ కాలపు సమాజానికి అందించడం మన పూర్వీకుల ధ్యేయం. అయితే తెలుగుసేత (Translation from Sanskrit) కేవలం యథాతథానువాదంగా ఉండాలని నన్నయాదులు అభిప్రాయపడలేదు. సమకాలీనమైన స్పృహతో తమ కాలపు ప్రజలకు నచ్చేరీతిగా రచించడం వారి ప్రయత్నం. ఈ ప్రయత్నంలో నన్నయాదులు వాల్మీకి, వ్యాసాదులు వారి భావాలను తమ భాషలో విశ్లేషణా సహితంగా వ్యక్తపరిచారు. సంస్కృత రచనను తెలుగులో అనువాదం చేసేటప్పుడు ప్రాచీన కవులను అనుసరించింది. యథాతథానువాద పద్ధతికాదు. సంస్కృత కవుల హృదయాన్ని ఆవిష్కరించడం, సంస్కృత కావ్యాలను తెలుగువారికి స్పష్టపరిచే పద్ధతి. విపులంగా చెప్పాలంటే మహాభారత కవులది (కవిత్రయం వారిది) కథానువాద పద్ధతి. అలాగే ప్రబంధ కవులనుసరించినది భావానువాద పద్ధతి అని తమ కావ్య ప్రక్రియల్ని దృష్టిలో పెట్టుకొని పెద్దలు పేర్కొన్నారు. మహాకవి శ్రీనాథుడు తన అనువాదం ఎన్నెన్ని విధాలుగా చేశాడో తనే చెప్పుకొన్నాడు. తెలుగుసేతలో భాషా విషయాన్ని గూర్చి మొల్ల కవయిత్రి అభిప్రాయం పరిశీలించదగింది. "సంస్కృతి భాష తెలుగు ప్రజలకు అర్థం కాదని, సంస్కృత రచనను తెలుగు చేస్తున్నాం. అందులో మరలా, మరలా తమ పాండిత్యాన్ని గుప్పించి సంస్కృత సమాసాలతో నింపి ప్రజలకు అప్పుడూ, ఇప్పుడూ ఏమీ తెలియనది చేస్తే రుచి ఏముంది? కాబట్టి, ఆంధ్రీకరణలో తెలుగు మాటల ఆధిక్యత ఉండాలి. ఒక రచనను ఆ కాలపు తెలుగు వారికి అర్థమయ్యే రీతిలో అనువదించాలి అని మొల్ల అభిప్రాయ పడింది. పైన పేర్కొన్న వివరణ అంతా తెలుగుసేత ఏ భాషనుండైనా సరే చక్కటి తెలుగునుడికారంతోను, సరస పదజాలంతోనూ కూడి సులభశైలిలో పాఠకులందరికీ అర్థమయ్యే రీతిలో రూపొందించాలి.

**అనువాద సాహిత్యం ప్రాధాన్యం**

తెలుగు పాఠకులు స్వతంత్ర రచనలతో పాటుగా ప్రపంచంలోని వివిధ సాహితీ ప్రక్రియలను అనువాదాలు, అనుకరణ రూపంలో మక్కువతో సొంతం చేసుకున్నారు. అందుకు అలనాడు ఆంధ్రదేశంలో అసంఖ్యాకంగా ప్రాచుర్యంలో ఉన్న బెంగాలీ నవలలే ఉదాహరణలు. ఈనాటికీ బహుళంగా ప్రచారంలో ఉన్న బెంగాలీ పేర్లే ఉదాహరణ. అలాగే వంగసాహితీ సుమాల సౌరభాన్ని రవీంద్రుల గీతాలు, శరత్ నవలలను ఎంతగా ఆదరించారో చెప్పనక్కరలేదు. తమిళ, కన్నడ, మలయాళాలలో ఎన్నో రస నిష్యందమైన గ్రంథాలన్నీ తమ భాషలోకి పునఃసృష్టి చేసి మురిసిపోయే విశాల దృక్పథం తెలుగుజాతి సాంస్కృతిక జీవధాతువు లక్షణం. ఇరుగుపొరుగు ప్రాంతాలలోని పత్రికలు, సాహిత్య పత్రికలు చేసిన కృషి అపారం. వివిధ దశలలో తెలుగు సాహిత్యాన్ని మలుపు తిప్పిన వారి రచనలని, కవిత, నవల, నాటిక, కథానికల నన్నీ కలుపుకొని ఎంపిక చేసిన వాటిని ఇతర భాషల్లోకి అనువదించే బృహత్పథకం అమలు ఇది గతంలో జరగేది కాదు. ఎక్కడో ఒక దగ్గర మొదలు కాకపోతే పూర్తిచేసే ప్రశ్నే ఉండదు.

మనదేశంలోని భిన్న ప్రజలకు సంబంధించిన అందరి విషయాలు అందరికీ తెలియ చేయడానికి అనువాదం

ఉపకరిస్తుంది. తెలుగులోని త్యాగరాజ కీర్తనలు హిందీ భాషలోకి కేవలం అనువాదం వల్లనే వెళ్ళగలిగాయి. ప్రపంచంలోని ప్రజల మనస్తత్వాలు, ఆలోచనలు అందరికి తెలియటానికి అనువాదం ఎంతో ఉపయోగ పడుతోంది. దానివల్ల మానవ జీవితపు ఆలోచనా విధానా లలో మార్పు కలిగే అవకాశం ఉంది. భిన్న భాషలను వ్యవహరించబడే దేశంలో ప్రతి భాషలోను ప్రతి విషయాన్ని తెలియజేయాల్సిన అవసరం ఉంది. దేశ సమైక్యతలో అనువాదం ప్రముఖ పాత్ర వహిస్తోంది.

అనువాదాలు లేకపోతే షేక్స్పియర్, మిల్టన్ వంటి పాశ్చాత్య మహాకవుల కావ్యాలు శరత్, రవీంద్రుల రచనలు కాని చవిచూసే అదృష్టం మనకు ఉండేది కాదు. అందుకే ఆయా భాషల స్వరూపం, పలుకుబడి, ఆయా దేశాల సంస్కృతి నాగరికతలు ఆయా భాషల సాహిత్యాల సౌందర్యం తెలుసుకోవడానికి అనువాదాల అవసరం ఎంతైనా ఉంది.

జ్ఞానపీఠ అవార్డు పొందిన సాహిత్య గ్రంథాల్ని కేంద్ర సాహిత్య అకాడమీ అన్ని భాషల్లోకి అనువదిస్తుంది. భారతీయ భాషల్లో ఉత్తమ సాహిత్యాన్ని అన్ని భాషల ప్రచురణకు అందించాలనే ధ్యేయంతో కేంద్ర ప్రభుత్వం నేషనల్ బుక్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసింది. ఈ సంస్థ ఇతర భారతీయ భాషల్లోని ఉత్తమ సాహిత్య గ్రంథాలను తెలుగులోకి అనువిస్తుంది. తెలుగు సాహిత్యంలో స్వతంత్ర రచనల కంటే అనువాదాలే ఎక్కువ అనే భావం కలుగుతూ ఉంది. ఉత్తమ అనువాదాలు సర్వదా ఆదరణీయాలే.

**ఉపయుక్త గ్రంథాలు :**

1) అనువాద సమస్యలు - రాచమల్లు రామచంద్రారెడ్డి
2) అనువద సిద్ధాంతాలు - డా॥ ఎస్. అక్కిరెడ్డి
3) పరిపాలనా న్యాయపదకోశం - తెలుగు అకాడెమి.
4) అనువాదం - ద్రావిడ విశ్వవిద్యాలయం.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# ఆదిమ సమాజంలో గ్రామ దేవతల వైశిష్ట్యం



- డా॥. బూసి వెంకటస్వామి
శాఖాధిపతి, శ్రీ ఏ యస్ యన్ యం ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), పాలకొల్లు, పశ్చిమగోదావరి జిల్లా.

- డా॥. పెండ్యాల లావణ్య
తెలుగు అధ్యాపకురాలు
ప్రభుత్వ డిగ్రీ కాలేజి, రాజోలు, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా



ఆదివాసీయులు ఎత్తైన కొండలు, దట్టమైన అడవుల్లో జీవనం సాగిస్తున్నారు. భారతీయ సంస్కృతికి మూల పురుషులు ఆదిమసీయులు. ఆదివాసీయులనే గిరి జనులుగా వ్యవహరిస్తారు. ఆదిమానవుడి ఉనికి ఛాయలు ఆదివాసీయుల్లో ఇప్పటికీ కనబడుతూనే ఉన్నాయి. ఎందుకంటే ఆదివాసీయులు ప్రకృతి నుండి లభించిన సమస్తాన్ని దైవప్రసాదంగా భావిస్తారు. అలా భావించ డానికి కూడా ఒక కారణం ఉంది. ఆదిమానవుడు పగలు రాత్రిని గమనించాడు. ఎండ, వాన, చలిని మొదలగు ప్రకృతిలో జరుగుతున్న పెనుమార్పులను అవగాహన చేసుకున్నాడు. మనుషులు పుడుతున్నారు, చని పోతున్నారు. ఆదిమానవుడు ప్రకృతి నుండే సమస్తాహా రాన్ని తీసుకుంటున్నాడు. ప్రకృతిలో విలయ తాండవ బీభత్సాలను చవిచూశాడు. వీటన్నింటి వెనుక ఏదో మానవతాతీత శక్తి నడిపిస్తుందని భావించారు. అదే ప్రకృతి శక్తిగా అమ్మతల్లిగా వనదేవతగా పూజించడం ప్రారంభించారు. ప్రకృతిని శాంతింపచేయడానికి ఎన్నో మార్గాలను ఆశ్రయించారు. వాటికి మంత్రాలు తెలియదు. ఏవో తమకు లభించిన ఆహార, వసతి సౌకర్యాలను మనసులో ధ్యానించుకుంటూ ఏవో తెలియని కూని రాగాలు తన్మయత్వంతో తీస్తారు. కూనిరాగావే ఆరాధనగా పరిణమించింది. ప్రకృతి శాంతింపజేయడానికి ఎన్నో మార్గాలను ఆశ్రయించారు. క్రమంగా దేవతారాధన గ్రామ దేవతల ఆరాధనగా మారిపోయింది. మొదట్లో ప్రకృతిని శాంతింపజేయటానికి గ్రామ దేవతకు నరబలి కాస్త జంతుబలిగా పరిణమించింది.

**గ్రామ దేవత ఆరాధన ప్రారంభ వికాసాలు :**

ఆదిమానవుడు ప్రారంభించిన ప్రకృతి ఆరాధన క్రమంగా గ్రామదేవతల ఆరాధనగా పరిణమించింది. ప్రకృతిలోని పంచభూతాలనే తమ దైవాలుగా కొలిచారు.

భూమి తమకు ఆహారాన్ని, నిసాన్ని, గాలి తమకు ఊపిరినిస్తుందని, నిప్పు తమకు వెలుగును, ప్రాణాధార మైన నీటిని, పగలు రాత్రిని ప్రసాదిస్తున్న నింగిని పంచ భూతాలుగా భావించి పూజించసాగారు. వీటితో పాటు తమకు అందుబాటులో అధికసంఖ్యలో లభిస్తున్న ఏ వనరులనైన దైవంగా భావించి కొలుస్తారు. ఉదా : కుంకుళ్ళు ఎక్కువగా పండే ప్రాంతంలో కుంకుళ్ళుగా భావించి కొలుస్తారు. అలాగే గోగులు పూచే ప్రాంతంలో గోగులమ్మ గాను, జొన్నలు పండే ప్రాంతంలో జొన్నలమ్మ అని, వరి బాగా పండే ప్రాంతంలో నూకాలమ్మ అని రక రకాల పేర్లతో గ్రామదేవతలను సృష్టించుకొని ఆరాధిస్తుంది.

బతుకునిచ్చే తల్లిని బతుకమ్మ గాను, అన్నంపెట్టే అమ్మను అన్నమ్మ గాను, జలానికి సంబంధించి గంగమ్మ, గంగాలమ్మలు గ్రామదేవతలుగా వెలిశారు. పగటిపూట సూర్య తేజస్సును సూరమ్మగాను, రాత్రిపూట వెన్నెలను చంద్రుడితో కలిపి పున్నమ్మలను దైవాలుగా కొలుస్తారు. గ్రామ దేవతలకు కుడికన్ను సూరమ్మ గాను, ఎడమ కన్ను పున్నమ్మ గాను భావించి ఇద్దరి కళలు ఉన్న అమ్మను "ఇరుకళమ్మ"గా పూజిస్తారు. కొండ ప్రాంతాలలో గాలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది గిరిజన భాషలో "కరువలి" అనగా పెద్దగాలి అని అర్థం. గాలి ఉన్నచోట దెయ్యాలు తిరుగుతుంటాయని, ఆ దయ్యాలు మనుషుల్ని పట్టి పీడిస్తుంటాయని అలా పీడించకుండా తమన రక్షించే దేవతగా కరువలమ్మను దైవంగా ప్రతిష్ఠించుకొని కొలుస్తారు.

గ్రామ పొలిమేరను కూడా గ్రామ దేవతగా భావించి పోలేరమ్మగా కొలుస్తారు. పొలిమేరమ్మ జన వ్యవహారంలో పోలేరమ్మగా మారిపోయింది. "తలపు" అనగా ఆలోచన అని అర్థం. భక్తుల తలపుల్ని (కోరికల్ని) తీర్చే తల్లిగా తలపులమ్మను ఆరాధ్యదైవంగా కొలుస్తారు. గ్రామ సరిహద్దులను ఎల్లలంటారు. గ్రామ సరిహద్దుల్లో కాపలా కాసే దేవతను ఎల్లమ్మగా కొలుస్తారు. జీవితాన్ని పండించే దేవతగా పోచమ్మ గాను, పాము పుట్టులుండే ప్రాంతాల్లో వెలసిన దేవతలను పుట్టమ్మ, సుబ్బమ్మ, పాపమ్మలుగా కొలుస్తారు.

గ్రామాలన్నీ కలిపి ఒక గ్రామదేవతను సృష్టించుకుంటారు. ఆ దేవతనే మావుళ్ళమ్మగా కొలుస్తారు. శివుడి కంఠంనీలంగా ఉంటుంది. అది చూసేవారికి మచ్చగా కనిపిస్తుంది. గిరిజనులు ఆ మచ్చనే "అంకం"గా వ్యవహరిస్తారు. శివుడి కంఠపు మచ్చ (అంకం) కారణంగా అంకగళమ్మ అంకాలమ్మగా కొలుస్తారు. మనిషి ఆయుష్షును పెంచే దేవతగా కట్టమైసమ్మగా కొలుస్తారు. ఆదివాసీయులు స్వచ్ఛంగా భావించే తల్లి సత్తెమ్మ - స్వచ్ఛమైన తల్లి జన వ్యవహారంలో అచ్చెమ్మగా మారిపోయింది. "పుల్ల" అంటే వికసించిన అని అర్థం. "పుల్ల" - పుల్లమ్మగా వెలసింది. నైవేద్యం సమర్పించడాన్ని అర్పణ అంటారు. అర్పణమ్మ అప్పలమ్మగా కొలువబడుతున్నారు.

గిరజనులు తమ గ్రామ దేవతలుగా ఏడు అడుగుల నిలువురాయిని ప్రతిష్టించుకుని దాని పసుపు కుంకమ్మలతో అలంకరిస్తారు. ముఖ్యంగా దేవతరాయిని వేప, రావి చెట్టు కలిసి ఉన్న చోటే ప్రతిష్టించి ఆరాధిస్తారు. గ్రామ దేవతలకి ప్రత్యేకించి గుడులంటూ ఉండవు. ఊరి పొలిమేరల్లోనూ, రావి చెట్టు, వేపచెట్టు కలిసిన చోట ఒక కొలరాయిని ప్రతిష్టించి దానికి పసుపు, కుంకుమలతో అలంకరించి పూజిస్తారు. దేవతగా ప్రతిష్టించిన గ్రామ దేవతకు తామరపూలు, బంతిపూలు, తంగేడు, గన్నేరు మొదలగు పూలతో అలంకరిస్తారు. నాగరిక సమాజంలో వారానికొక దేవతను అనుకొని గుడికి వెళతారు. అయితే గిరిజన సమాజంలో అలా కాదు దేవతను ఊరి బయట (సరిహద్దుల్లో), వేప, రావిచెట్టు కలిసిన చోటులో అమ్మవారిని ప్రతిష్టించి జాతర్లు, పండుగలు నిర్వహిస్తారు. శిష్ట పూజించే దేవతల్ని ఆర్య దేవతలుగాను, ద్రావిడులు పూజించే దేవతలను గ్రామ దేవతలుగాను భావిస్తారు.

ఆదివాసీయులు తమ ఇష్టదైవాలుగా కొలిచే దేవతలు తమ మధ్యలోనే మనుషులుగా అవతరించి చెడును అంతంచేసే దేవతలుగా అవతరించారని భావిస్తారు. అటువంటి గ్రామ దేవతలే గిరిజన సమాజంలో అధిక సంఖ్యలో దర్శనమిస్తారు. గిరిజన సమాజంలో అందరు స్త్రీ దేవతలే ఎక్కువ సంఖ్యలో కనిపిస్తారు. గ్రామ దేవతలందరికి ఒకే ఒక తమ్ముడు పోతురాజు. పోతురాజు తన తోబుట్టువుల్ని పరిరక్షిస్తుంటాడు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 34 గిరిజన తెగల్లోను ఒక్కొక్కరు ఒక్కొక్క గ్రామ దేవతను కులదైవంగా ప్రతిష్టించుకుని ఆరాధిస్తారు. గ్రామ దేవతలను పూజించడానికి ఆయా గ్రామంలోని కొంత మంది వంశీయుల్ని పూజా కార్యక్రమానికి పెద్దగా నియమించుకుంటారు. వారు అందరు కలిసి మిగతా వాళ్ళందరి జాతర్లు, పండుగలు, ఉత్సవాలు పేరుతో ఒక దగ్గరకు చేర్చి ఆనందంగా పండుగను జరుపుకుంటారు.

ఆదివాసీయులు పండుగలు, జాతర్లు, ఉత్సవాలు జరుపుకోవడానికి నెలలు, తిథులు, వారాలు, నక్షత్రాలను బట్టి జరుపుకుంటారు. ఆదివాసీయులకు కూడా వారి భాషనే తెలుగు నెలలు, సంవత్సరాలు, నక్షత్ర రాశులున్నాయి.

| **తెలుగు నెలలు** | | **ఆదివాసీయుల నెలలు** |
|---|---|---|
| ఇటింగ్ | - | ఏప్రిల్ |
| బైనగ్ | - | మే |
| లండిజెడ్ | - | జూన్ |
| ఆషడ్ | - | జూన్ |
| బంధవన్ | - | ఆగష్టు |
| ఓషా | - | సెప్టెంబర్ |
| దోశర | - | అక్టోబర్ |
| సవితి | - | నవంబర్ |
| వల్కామ్ | - | డిసెంబర్ |
| సంకురాతిరి | - | జనవరి |
| శివరాతిరి | - | ఫిబ్రవరి |
| పోగోన్ | - | మార్చి |

ఈ నెలల ఆధారంగా గిరిజనులు గ్రామ దేవతల జాతర్లు, ఉత్సవాలు, ఊరేగింపులు నిర్వహిస్తుంటారు. ముఖ్యంగా గిరిజనులు వ్యవసాయ పనులు ప్రారంభించే ముందు వారివారి కుల దైవాలను తయారు చేస్తారు. తయారు చేయటమంటే ఎవరి పోలాల్లో వాళ్ళు కొంత మట్టిని తీసుకుని దాన్ని దేవతా ఆకారంలో మలచి పూజలు చేస్తారు. పూజ చేసిన మట్టిని తిరిగి భూమిలోనే కలిపిస్తారు. అలా కలపటం వలన పంటలు బాగా పండుతాయని బలంగా నమ్ముతారు. అదేవిధంగా గిరిజనులు వారి మాతృభాషలోని నెలలతోపాటు నక్షత్రరాశులను కూడా అనుసరిస్తుంటారు.

**తెలుగు వారి నక్షత్ర రాశులు : 27**

1. అశ్విని, 2. భరణి, 3. కృత్తిక, 4. రోహిణి, 5. మృగశిర, 6. ఆరుద్ర, 7. పునర్వసు, 8. పుష్యమి, 9. అశ్లేష, 10, మఖ, 11. పుబ్బ, 12. ఉత్తర, 13. హస్త, 14. చిత్త, 15. స్వాతి, 16. విశాఖ, 17. అనురాధ, 18. జ్యేష్ట, 19. మూల, 20. పూర్వాషాడ, 21. ఉత్తరాషాడ, 22. శ్రవణం, 23. ధనిష్ట, 24. ఉత్తరాభాద్ర, 25. పూర్వాభద్ర, 26. రేవతి, 27. రేవతి

**ఆదివాసీయుల నక్షత్ర రాశులు : 33**

1. కుంబిస్త, 2. రేవస్త, 3. ఎనక, 4. ఎనగ, 5. ఆసడ, 6. పాటి, 7. బిరిన, 8. కెర్త, 9. రోహిని, 10. దాగరక, 11. ఏర్క, 12. కోడ్రు, 13. గొమ్మ, 14. వట్టి, 15. కుప్పి, 16. మగ, 17. పారిగ, 18. తూన్గ, 19. తోక, 20. సబ్ధు, 21. సిత్త, 22. సాతి, 23. అస్తి, 24. కొత్త, 25. జట్టి, 26. మూలగ, 27. గండగ, 28. పడువు, 29. పాల్టింగ, 30. గలకాసిక, 31. ఆలగ, 32. తొడ్డిగ, 33. ఏకుంబిస్త

ఆదివాసీయులు వారి మాతృభాషల్లోని నక్షత్రాలు, నెలలతోపాటు వారాలను కూడా పాటిస్తారు.

| **తెలుగు వారి వారాల పేర్లు** | | **ఆదివాసీయుల ఉచ్ఛారాలో వారాల పేర్లు** |
|---|---|---|
| 1. ఆదివారం | - | ఆది అర |
| 2. సోమవారం | - | సొంబారి |
| 3. మంగళవారం | - | మంగలార |
| 4. బుధవారం | - | బుధవార |
| 5. గురువారం | - | లిక్కిన్వార |
| 6. శుక్రవారం | - | సుక్లోర |
| 7. శనివారం | - | శని అర |

ఆదివాసీయులు ఏరోజు బిడ్డ పుడితే ఆ వారం రోజును పేరుగా పెడతారు.

| **ఆడబిడ్డ పుడితే పెట్టే పేరు** | | **మగబిడ్డ పుడితే పెట్టే పేరు** |
|---|---|---|
| 1. అడ్డి | - | అడ్డాయి |
| 2. సొంబరి | - | సొంబర |
| 3. మంగడి | - | మంగడ |
| 4. బుధి | - | బుధ |
| 5. లక్కి | - | లకియ |
| 6. సుక్కి | - | సుక్కు |
| 7. సందరి | - | శనియ, సందడి |

అమావాస్య రోజు మగబిడ్డ పుడితే "మాసా" అని ఆడబిడ్డ పుడితే "నాసలి" అని పేర్లు పెట్టుకుంటారు.

ఆంధ్రదేశంలో నివసించే 33 తెగల గిరిజనుల్లో గోండులు కొంత ప్రత్యేకతను కలిగి ఉన్నారు. వీరు మిగి లిన గిరిజన తెగలవారు అనుసరించిన నక్షత్రరాశులనే

అనుసరించినా నెలలను మాత్రం అనుసరించరు. గోండులకు ప్రత్యేకమైన వారి మాతృభాషల్లోనే నెలలను అనుసరిస్తారు.

**గోండుల మాతృభాషలోని నెలలు :**

1. ధురాడి, 2. చైత్, 3. భావెయ్, 4. బుడ్ భావెయ్, 5. అకాడి, 6. పోరా, 7. అకుర్పోక్, 8. దివాడి, 9. కార్తి, 10. సట్టి, 11. పూస్, 12. మహెూ

గిరిజన ఎన్ని తెగలున్నప్పటికిని వారి పరిధి మేరా ఏర్పర్చుకున్న సంస్కృతి, సంప్రదాయాలకి కట్టుబడి ఉంటారు. వీళ్ళు పురోహితుడిని "దీసరోడు"గా వ్యవహరిస్తారు. విత్తనాలు చల్లాలన్నా, ఇల్లు కట్టాలన్నా, పోడు కొట్టాలన్నా, పెళ్ళి చేయాలన్నా దీసరోడో మంచిరోజును నిర్ణయిస్తాడు. చనిపోయిన వారికి ఏ రోజు కర్మకాండ చేయాలో, పుట్టినబిడ్డ నక్షత్రబలం ఎలాంటిదో నక్షత్ర గమనాల ఆధారంగా మార్గదర్శకంగా చెబుతాడు. ఆదివాసీయులు పండుగలు, జాతర్లు చేయాలన్నా తిథి, వార, నక్షత్రాల ప్రకారమే చేసుకుంటారు.

**ముగింపు :**

గిరిజనులు పుట్టింది మొదలు చనిపోయేంత వరకు జరిగే జీవన గమనంలో ప్రతీదీ దైవంతో ముడిపడి ఉంటుంది. తమ ఆనందాలకి, దుఃఖాలకి కారణం దైవానుగ్రహంగానే భావిస్తారు. దైవాన్ని శాంతిపజేయటానికి అనేక జాతర్లు, ఉత్సవాలు, పండుగలు జరిపిస్తుంటారు. గిరిజన జాతర్లు, పండుగలు, ఉత్సవాలు భారతదేశ వారసత్వ సంస్కృతి, సంప్రదాయాల్ని తెలియజేస్తాయి అనటంలో అతిశయోక్తి లేదు.

**ఆధార గ్రంథాలు :**


1. డా॥. యం. సూర్యనారాయణ, భారతదేశము - గిరిజన సముదాయాలు, తెలుగు అకాడమీ, హైదరాబాద్, 2005.
2. వెంకటరావు టి., సవరల జీవన సరళి.
3. నదీం హసైన్, భారతీయ గిరిజనులు, ఓరియంటల్ వాంగ్మన్ లిమిటెడ్, హైదరాబాద్, 1995.
4. అశోక్ యం., భారతీయ గిరిజన సంస్కృతి, తెలుగు అకాడమీ, హైదరాబాద్, 2006.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# ఆంధ్రదేశంలోని దిగువ కృష్ణానదీతీర ప్రాంతం – శైవ, వైష్ణవ మతాల ప్రాభవం



– డా॥. ముసుగు శ్రీనివాసరావు

అసోసియేట్ ప్రొఫెసర్, పీఠాధిపతి (ఐ.సి), చరిత్ర, సంస్కృతి, పురావస్తుశాస్త్ర పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, శ్రీశైల ప్రాంగణం, ఆంధ్ర ప్రదేశ్.

ప్రాచీన ఆచారాలకు, సంప్రదాయాలకు, కళలకు, పురాతన కట్టడాలకు భారతదేశం ప్రపంచ ప్రఖ్యాతి గాంచినది. చిత్ర శిల్పకళా శోభాయమానమైన దేవతలకు నిలయమైన దేవాలయాలతో, ప్రాచీన స్థలాలు, కోటలు, నగరాలు మన భారతదేశంలో విశిష్టమైన సంస్కృతికి నిలయమైనవి. కొన్ని క్షేత్రాలు రకరకాల శిల్ప సంపదలతో, వాస్తు నిర్మాణాలతో మన రాష్ట్రం భారతావనిలోనే ప్రత్యేకతను సంతరించుకున్నది. అందుకు కారణం మన రాష్ట్రం ఉత్తర-దక్షిణాది సంస్కృతులకు మధ్య ప్రాంతమై ఉండుటయే గాక, పుష్కలంగా పండే భూములు, నదీ తీరాలు, సౌందర్యము నావరించుకొన్న కొండకోనలు రాష్ట్ర సంస్కృతికి ప్రాచీన కాలం నుండి ప్రతీకలుగా నిలిచి యున్నవి. క్రీ.పూ. రెండవ శతాబ్దము నుండే ఆంధ్ర దేశంలో, ముఖ్యంగా కృష్ణానదీ తీరం వెంబడి శ్రేష్టమైన శిల్పకళా ఖండాలు కనబడినట్టు తవ్వకాల ద్వారా తెలియుచున్నది.

ఆంధ్రప్రదేశ్‌లోని దేవాలయాలు తొలి నుండి మన దేశంలో నిర్మించబడియున్న అనేక వాస్తు, శిల్ప నిర్మాణ రీతుల ప్రభావమునకు లోనగుచూ ఒక నూతన, మిశ్రమ తరహా వాస్తు, శిల్పరీతికి అవకాశమిచ్చినది[1]. ప్రాచీనకాలం నుండి దేవాలయ నిర్మాణానికి, పూజా ప్రతిమల రూపణకు వస్తువును ఎన్నుకొనుటలో ఒక ప్రత్యేకత కనబడుచున్నది. మన రాష్ట్రంలో ముఖ్యంగా కృష్ణానది తీరంలో శ్రేష్టమైన శిల్ప కళాఖండాల సృష్టి క్రీ.పూ. రెండు, మొదటి శతాబ్దాల లోనే ఆరంభమైనది[2].

ఒక నిర్ణీత పద్ధతిలో వాస్తు, శిల్పాలను పోషించినది సింధూ ప్రజల తరువాత మౌర్యులనే చెప్పవచ్చును. మౌర్యుల కాలంలో బౌద్ధస్తూప నిర్మాణాలు గావించ బడినవి. వీరి తరువాత ఆంధ్ర శాతవాహనుల కాలంలో బౌద్ధస్తూప నిర్మాణాలు నిర్దిష్టమైన రూపురేఖలను సమకూర్చుకొని, చైత్యశాలలు (బౌద్ధుల ప్రార్థనా మంది రాలు) గాను, విహారాలు (బౌద్ధ భిక్షువుల నివాస స్థలం) గాను అవతరించినాయి.

ఈ బౌద్ధ స్తూపాలు కృష్ణానదీ తీరంలోని ఒక్క అమరావతిలోనే గాక నాగార్జునకొండ, ఘంటసాల (గుంటూరు జిల్లా), జగ్గయ్యపేట, రామిరెడ్డిపల్లి, గుమ్మడి దుర్రు, అలూరు ఘంటసాల, గుడివాడ మరియు శ్రీకాకుళం (కృష్ణా జిల్లా) మొదలగు ప్రాంతాలందు బయలుపడినవి. తరువాత కాలంలో గుప్తులు బ్రాహ్మణ మతోద్ధరణకు పూనుకొన్నారు. పర్యవసానంగా విష్ణువు, దశావతారాలు, శివుడు, పార్వతి, వినాయకుడు,

కార్తికేయుడు, సూర్యుడు మొదలగు దేవతల ఆరాధన కోసం దేవాలయాలను నిర్మించారు.

క్రీ.శ. 5, 6 శతాబ్దములలో బ్రాహ్మణ, బౌద్ధ మరియు జైన మత గుహాలయాలు నిర్మించబడినవి. అయితే, వీటిలో అధికసంఖ్యలో నిర్మించబడినవి మాత్రం హిందూ గుమాలయాలే. గుప్తుల కాలంలో చేపట్టిన దేవాలయ నిర్మాణంలోనూ, దేవాలయ రూపురేఖలలోనూ కొన్ని ప్రాంతీయ విబేధాలు చోటు చేసుకొన్నాయి. ఈ తేడాలను బట్టి దేవాలయాలను మూడు రకాలుగా విభజించుట జరిగినది. అవి నాగర, ద్రావిడ మరియు వేసర దేవాలయ శిఖరాలు, వాటి రూపురేఖలను బట్టి దేవాలయాలను ఉత్తరాహికాలనీ, దక్షిణాత్యాలనీ చెప్పవచ్చును. నదీ రాష్ట్రంగా పేరొందిన ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా జిల్లా 8727 చ.కి.మీ. వైశాల్యంలో విస్తరించింది. కృష్ణా జిల్లాలో సుమారు 100 మైళ్ళకు పైగా ప్రవహిస్తున్న కృష్ణా నదికి (పశ్చిమ కృష్ణా జిల్లా) ఉత్తరభాగంలో ఉన్న ప్రాంతమే నతవాడి ప్రాంతం.

**కృష్ణా మహాత్యము :**

మహారాష్ట్రలోని నాసికాత్రయంబకం వద్ద జనించిన కృష్ణవేణి అనేక ప్రాంతాల గుండా ప్రవహిస్తూ, అనేక క్షేత్రాలను తీర్థాలుగా మారుస్తూ, అందరినీ పునీతుల్ని చేస్తూ, నతవాడి సీమను కూడా తాకుతూ ప్రవహించి, చివరకు కృష్ణా జిల్లాలోని హంసలదీవి వద్ద బంగాళా ఖాతంలో కలుస్తుంది. ముక్త్యాల వద్ద కృష్ణానది భరద్వాజ కొండ (శ్వేత శృంగాద్రి)ను తాకి అటు నుండి ఉత్తరముగా కొద్దిదూరం ప్రవహించి, మరల ముక్త్యాల నుండి తూర్పుగా ప్రవహిస్తూ (గుడిమెట్ల వైపు) ఉండుట వలన ఈ ప్రాంతంలో కృష్ణమ్మ "ఉత్తర వాహిని"గా పేరొందింది. ఈ ఉత్తరవాహినిలో స్నానమాచరిస్తే మోక్షం ప్రాప్తిస్తుందని ఐతిహ్యం".[3] ఎక్కువమంది భక్తులు చనిపోయిన తమ రక్త సంబంధీకులకు కర్మకాండల కొరకు కృష్ణానదిలో అస్థికలను, పితృపిండములను వదలి, బ్రాహ్మణుల చేత పూజలు చేయించుదురు. కొందరు భక్తులు అచ్చటనే తమ తలవెంట్రుకలు తీయించుకొని, కృష్ణానదిలో స్నానం చేసి, అచ్చట గల ముక్తేశ్వర స్వామిని దర్శించి, తరించి ముక్తిని పొందుచున్నారు.

ముక్త్యాల వరకూ ఉత్తరంగా ప్రవహిస్తూ వచ్చిన కృష్ణమ్మ ఈ క్షేత్రం నుండి తూర్పు వైపునకు మలుపు తిరిగిన దృశ్యాన్ని కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు ఈ విధంగా వర్ణించిరి.

"కడు వేదాద్రియు జట్టుకొన్న తలపాగావోలె ముక్త్యాల
మొప్పెడు నెచ్చోటను
కృష్ణ వంపు తిరిగెన్ విష్ణుండు శ్రీ నారసింహుడుగా
కోరను వంచినట్లు"[4]

పావన కృష్ణవేణీ నదీ ప్రవాహము చేత ఈ ప్రాంతము సారవంతమైనది. అందువలన నతవాడి సీమ చారిత్రక పూర్వం నుండి జనజీవం ఉన్నట్టుగా తెలియుచున్నది. నందిగామ తాలూకా నందు గల ఉస్తేవల్లి గ్రామము, పరిసర కృష్ణానదీ తీర పరివాహక ప్రదేశాలందు నవీన శిలాయుగపు రాతి పనిముట్టు కూడా లభ్యమైనాయి.[5]

చారిత్రక ఆధారాలను పరిశీలించినట్లయితే ఈ ప్రాంతము నందు మౌర్యుల పరిపాలనా కాలం నుండి జనవాసము ఉన్నట్టుగా చెప్పవచ్చును.[6] క్రీ.పూ. మూడవ శతాబ్దంలో మౌర్య చక్రవర్తి అశోకుని పరిపాలనాంతరం, ఆంధ్ర శాతవాహనుల మౌర్య సామ్రాజ్యాధికారాన్ని ధిక్కరించి, స్వతంత్ర శాతవాహన రాజ్యాన్ని స్థాపించినారు. ఈ శాతవాహనులు కృష్ణా జిల్లా తీరం నందే గల 'శ్రీకాకుళము' (దివి తాలూకా)ను ప్రథమ రాజధానిగా చేసుకొని పాలించిరి. వీరి కాలంలో రాజధానిగా విలసిల్లిన శ్రీకాకుళం నేడు ఒక చిన్న గ్రామంగా మిగిలినది. శాతవాహనుల రాజధాని శ్రీకాకుళం నుండి 'ధాన్యకటకము' (ధరణికోట)నకు మార్చబడినది. క్రీ.శ. 3వ శతాబ్ది మొదటిభాగంలో శాతవాహన సామ్రాజ్యం పతనమైన తరువాత ఆంధ్ర రాజ్యానికి వచ్చిన ఇక్ష్వాకులు కూడా తమ రాజధాని 'విజయపురి'ని చేసుకొని ఈ ప్రాంతమును పాలించిరి. వీరి కాలంలోనే నతవాడి సీమలోని వేలగిరి (జగ్గయ్యపేట) వద్ద బౌద్ధ మతానికి చెందిన ఒక మహా చైత్యము ఉన్నది. అంతేగాక రామిరెడ్డిపల్లి, గుమ్మడిదుర్రు, అలూరు (నందిగామ తాలూకా) మొదలగు ప్రదేశాలు బౌద్ధ క్షేత్రాలుగా వర్ధిల్లినాయి.[7] ఇక్ష్వాకుల పాలనానంతరం ఈ ప్రాంతం పల్లవుల ఆధీనంలో

ఉన్నది. తరువాత బృహత్పలాయనులు కూడూరు హారము (దివిసీమలోని కోడూరు)ను రాజధానిగా చేసుకొని పాలించిరి. తరువాత కాలంలో శాలం కాయనులు కృష్ణా, గోదావరి నదుల పరివాహక ప్రాంత మైన "వేంగిని" (ఏలూరు సమీపంలోని పెద్ద వేగి) రాజధానిగా చేసుకొని ఒక శతాబ్దం పాటు రాజ్యపాలన చేశారు. వీరి అనంతరం విష్ణుకుండినులు క్రీ.శ. 4వ శతాబ్దం నుండి క్రీ.శ. 7వ శతాబ్ది మొదటి భాగం (క్రీ.శ. 358-624) వరకు పాలించినారు. వీరి కాలంలోనే "విజయవాడ" రాజధానిగా ఏర్పడినది. విష్ణుకుండినుల కాలంలో బౌద్ధమతం మొదట ఆదరించబడి, తర్వాత కాలంలో బౌద్ధమతం క్షీణించి, వైదికమతం వ్యాప్తి చెందినది.[8] ఇక్ష్వాకుల కాలంలో వలే విష్ణుకుండినుల పరిపాలనా కాలంలో కూడా జగ్గయ్యపేట, రామిరెడ్డిపల్లి క్షేత్రాల బౌద్ధారామాలుగా విలసిల్లినవి.[9] విష్ణుకుండిన కడపటి రాజగు నాల్గవ మాధవవర్మను బాదామీ చాళు క్య చక్రవర్తియైన రెండవ పులకేశి ఓడించి, తన తమ్ముడైన కుబ్జ విష్ణువర్ణనుని వేంగీ పాలకునిగా నియమించుటతో కృష్ణా జిల్లా ప్రాంతం పశ్చిమ చాళుక్యుల ఆధీనంలోకి వచ్చినది. తరువాత కుబ్జ విష్ణువు వేంగినే రాజధానిగా చేసుకొని పాలించెను. వీరి పాలనే తూర్పు చాళుక్యుల కాలంగా పరిగణించబడినది.

తూర్పు చాళుక్యుల కాలంలో నరేంద్ర మృగరాజ బిరుదాంకితుడైన రెండవ విజయాదిత్యుడు (క్రీ.శ. 806-846) తన పాలనాకాలంలో 108 శివాలయాలను కట్టించెను. వీటిలో విజయవాడలోని దుర్గామల్లేశ్వర దేవాలయము, కొనకంచిలోని (నందిగామ తాలూకా) శ్రీ నరేంద్రేశ్వరాయములు ముఖ్యమైనవి.

క్రీ.శ. 1070 సంవత్సరం నుండి క్రీ.శ. 1477 సంవత్సరం వరకు నతవాడి, విజయవాడ విషయము లను దుర్జన వంశజులైన త్యాగి (చాగి) రాజులు గుడిమెట్టను కేంద్రంగా చేసుకొని పాలించినారు. చారిత్ర కంగా సాగి లేదా చాగి వంశపాలకుడు ముప్ప భపాలుడు. ముప్ప భూపాలుడే నతవాడి రాజధాని నగరమైన గుడిమెట్ట నగరాన్ని నిర్మించెను. ఇతని అనంతరం ముప్ప భూపాలుడు. ముప్ప భూపాలుడే నతవాడి రాజధాని నగరమైన గుడిమెట్ట నగరాన్ని నిర్మించెను. ఇతని అనంతరం ముప్ప భూపాలుని కుమారుడైన మొదటి ధోరభూపాలుడు క్రీ.శ. 1118వ సంవత్సరంలో రాజ్యము నకు వచ్చెను. ఇతని పెద్ద కుమారుడైన మొదటి పోత రాజు (పోత - 1) క్రీ.శ. 1161వ సంవత్సరం నుండి క్రీ.శ. 1182వ సంవత్సరం వరకు పాలించెను. ఇతడు గొప్ప యుద్ధవీరుడేగాక, చక్కని పాలనాధ్యక్షుడుగా కీర్తించ బడెను. ఇతని తరువాత రెండవ దోరాధిపుడు (క్రీ.శ. 1182-1197), ఆ తరువాత రెండవ పోతరాజు (క్రీ.శ. 1197-1230) పాలించినారు. ఇతరు నతవాడి త్యాగిరాజు లందరిలో పేరెన్నికగొన్నవాడు. ఇతని కాలంలో సుభిక్షమైన పాలన సాగినట్లుగా చెప్పవచ్చును. రెండవ పోతరాజు క్రీ.శ. 1199వ సంవత్సరంలోనే ముక్త్యాల నందు ముక్తేశ్వర స్వామి దేవాలయాన్ని నిర్మించినాడు.[10] రెండవ పోతరాజు తరువాత అతని సోదరుడైన చాగి గణపయ (ధోరా-///) (క్రీ.శ. 1230-1257), తరువాత చాగి మన్మపోతరాజు (మన్మగణపయ) (క్రీ.శ. 1257-1268) రాజ్యమునకు వచ్చెను. ఇతని కాలంలోనే క్రీ.శ. 1259వ సంవత్సరంలోనే వేదాద్రి నందు శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయము నిర్మించబడినది.[11] చాగి మన్మ గణపయ దేవరాజు తరువాత మన్మ పోతరాజు (పోత-///) రాజ్యమునకు వచ్చెను. ఇతని తరువాత క్రీ.శ. 1268-1292 సంవత్సరాల మధ్య మన్మచాగిరాజు రాజ్యమునకు వచ్చి గుడిమెట్టనే రాజధానిగా చేసుకొని పాలించెను. మన్మ చాగిరాజు అనంతరం పాలించిన వారిలో నాల్గవ ధోరాధి పుడు, రుద్రయ చాగి (క్రీ.శ. 1292-1305 సం॥లు) రాజులు ముఖ్యులు.

కడపటి చాగి రాజుల అనంతరం ఈ నాతవాడి ప్రాంతం పూర్తిగా కాకతీయుల సామ్రాజ్యంలో కలసి పోయింది. తరువాత ఢిల్లీ సుల్తానుల కాలంలో రెడ్డిరాజుల పరిపాలనలోను, గజపతులు పరిపాలనలోను, క్రీ.శ. 16వ శతాబ్దిలో విజయనగర రాజుల కాలంలోను,అ అటు తరువాత బహమనీ సుల్తానుల కాలంలోను వున్నది. బహమనీ సుల్తాన్ అయిన కులీ కుతాబ్షా (గోల్కొండ

నవాబు) తెలంగాణా, తీరాంధ్రులపై (క్రీ.శ. 1531-32) నాలుగుసార్లు దండయాత్రలు చేసెను. ఇతని మూడో దండయాత్రలో కొండపల్లి పాలకుడైన రామచంద్ర గజపతి సామంతుడు, ఓరుగల్లు పాలకుడైన సీతాపతి (షితాబ్‌ఖాన్) మధ్య నతవాడి సీమలోని "బృహత్ కాంచీ పురము" (పెనుగంచిప్రోలు) నందు జరిగిన యుద్ధంలో హైందవ రాజులైన గజపతుల రాజ్యం అంతరించిపోయి, నతవాడి గోల్కొండ నవాబుల పాలనలోకి వచ్చింది. వీరి పాలనలోనే బ్రిటీష్‌వారు ఆంధ్రప్రాంతంలో వ్యాపారం ప్రారంభించినారు.[12] చివరకు క్రీ.శ. 18వ శతాబ్దంలో ఈ ప్రాంతం 'ధరణికోట'ను కేంద్రంగా చేసుకొని పాలించిన శ్రీరాజ వాసిరెడ్డి జగ్గ భూపాలుని ఏలుబడిలోకి వచ్చినది.

ప్రాచీనాంధ్ర దేశంలో కళలకు ప్రసిద్ధిగాంచి, రాష్ట్రం నడిబొడ్డున పావన కృష్ణానదీ తీరంలో విలసిల్లిన కృష్ణా జిల్లా మహిమాన్వితమైన చరిత్ర గాంచిన దేవాలయాలకు పుట్టినిల్లు. కృష్ణా జిల్లాలోని ఒక్క నతవాడిలోనే అనేక దేవాలయాలు గలవు. అట్టివాటిలో కొనకంచిలోని శ్రీ నరేంద్రేశ్వర స్వామి దేవాలయము మరియు శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయము, గుడిమెట్టలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయము, శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవాయలము మరియు శ్రీ సోమేశ్వర స్వామి దేవాయలము, నవాబుపేటలోని శ్రీ సోమనాధ దేవాలయము, పెనుగంచిప్రోలులోని శ్రీ అంబికేశ్వర స్వామి దేవాలయము, శ్రీ గంగా, పార్వతి సమేత (స్వయంభు లింగేశ్వరస్వామి ఆలయము, శ్రీ వేణు గోపాలస్వామి దేవాలయము, శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయము మరియు శ్రీ లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి దేవాలయము, మాగల్లులోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయము, ముక్త్యాలలోని శ్రీ ముక్తేశ్వరస్వామి వారి దేవాలయమ, నదీగర్భమందు గల ముక్తేశ్వర స్వామి దేవాలయము మరియు సదాశివ దేవాలయము, శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయము మరియు వేదాద్రి నందు గల శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవాల యము, శ్రీ జ్వాలా నరసింహస్వామి స్వయంభువు మరియు శ్రీ విశ్వేశ్వరస్వామి ఆలయము మొదలగు దేవాలయములు కలవు.

క్రీ.శ. 1199వ సం॥లో చాగి రాజైన రెండవ పోతరాజు ముక్తి గ్రామమును, ముక్త్యేశ్వర స్వామి దేవాలయమును నిర్మించుటయేగాక, సింహాచల నరసింహస్వామికి చాగి పోత సముద్రమును (ఏకకాలంలో) త్రవ్వించెను.[13]

దేవాలయాల ముఖము (ఫేసింగ్) ఏ దిక్కున ఉండాలనేది వాస్తుశిల్పి ఇష్టాన్ని బట్టిగాక వాస్తు శాస్త్రాల రీత్యా పాటించాల్సిన నియమానుసారంగా నిర్ణయించ బడుచున్నది. సాధారణంగా దేవాలయ ముఖ ద్వారాలు తూర్పువైపునకే నిర్మించబడి, భానోదయ కిరణాలు దేవతా ప్రతిమలను స్పృశించే విధంగా ఏర్పాటు చేయడం జరుగు తుంది. అయితే, తూర్పు వైపునకే గాక పశ్చిమ, ఉత్తర మరియు దక్షిణ వైపులకు కూడా ముఖము కలిగి దేవాలయాలు నిర్మించబడుచున్నవి. ఈ విధంగా నందిగామా తాలూకా నందు నిర్మించబడిన దేవా లయాలు కూడా ఎక్కువగా తూర్పు ముఖంగానే నిర్మించ బడి ఉన్నవి.

వీటిలో రాజనరేంద్రేశ్వరాలయము (కొనకంచి), సోమేశ్వరస్వామి దేవాలయము (జజ్జూరు), సోమనాథ మహాదేవాలయము (నవాబుపేట), స్వయంభులింగేశ్వర స్వామి దేవాలయం, అంబికేశ్వర దేవాలయము మరియు శ్రీ లక్ష్మీతిరుపతాంబ (నూతన) దేవాలయములు (పెను గంచిప్రోలు), వేణుగోపాలస్వామి దేవాలయము (మాగల్లు), ముక్త్యాలలోని నాలుగు దేవాలయాలు మరియు వేదాద్రిలోని విశ్వేశ్వర దేవాలయాలు తూర్పు ముఖంగా నిర్మించబడి ఉన్నవి.

జజ్జూరులోని యోగానంద నరసింహస్వామి దేవా లయము, పెనుగంచిప్రోలులోని వేణుగోపాలస్వామి దేవాలయము మరియు వేదాద్రిలోని యోగానంద నరసింహస్వామి వారి దేవాలయము పశ్చిమ ముఖంగా నిర్మించబడి ఉన్నవి.

ఉత్తర ముఖంగా ఒక్క చెన్నకేశవస్వామి దేవాలయము (గుడిమెట్ట) మాత్రమే ఉండగా, దక్షిణ ముఖంగా నిర్మించబడిన దేవాలయంలో ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయము (కొనకంచి), రామలింగేశ్వరస్వామి దేవా

లయము (గుడిమెట్ట), లక్ష్మీనరసింహస్వామి దేవాలయము (జజ్జూరు)లు గలవు.

దేవాలయ నిర్మాణంలో ఎక్కువగా సున్నము, మిశ్రమము, సైజురాళ్ళను ఉపయోగించినారు. గుడిమెట్టలోని రామలింగేశ్వరస్వామి దేవాలయము, జజ్జూరులోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయములకు పెద్ద పెద్ద రాళ్ళను మాత్రమే ఉపయోగించినారు. అదేవిధంగా, నవాబుపేటలోని సోమనాథ దేవాలయము, జజ్జూరులోని యోగానంద నరసింహస్వామి దేవాలయములందు ఇసుక, సున్నము, మిశ్రమములతో పాటుగా ఇటుకను కూడా ఉపయోగించినారు. ఈ విధంగా ఇటుకను వాడుట విజయనగర దేవాలయ శైలికి నిదర్శనము. నూతనంగా నిర్మించబడిన విమానాలు, గోపురాలు మరియు ప్రాకారాలందు ఇసుక, సిమెంట్ మిశ్రమాన్ని ఉపయోగించి నిర్మించుట జరిగినది. నేడు వేదాద్రి, నవాబుపేట, మాగల్లు, పెనుగంచిప్రోలు దేవాలయాలలో పింగాణి పలకలను (టైల్స్) ఉపయోగించి, లోపల కుడ్యాలనున అందంగా తీర్చిదిద్దబడి ఉన్నవి. యోగానంద నరసింహస్వామి గర్భాలయం (వేదాద్రి) వెలుపలి ప్రస్తరము (కుడ్య) కూడా పింగాణి పలకలను అమర్చినారు. నతవాడి దేవాలయాలు గర్భాలయముతో పాటు అంతరాళము, ముఖమండపము మరియు అర్ధమండపములు (ప్రవాణాలు) నిర్మించబడి ఉన్నవి. దేవాలయాలన్నీ చతురస్ర, దీర్ఘచతురస్రకారంలోనే నిర్మించబడినవి. గుడిమెట్టలోని దేవాలయాలు (రామలింగేశ్వర చెన్నకేశవ) ముక్త్యాల, నదీగర్భంలోని దేవాలయము, జజ్జూరులోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయాలు గర్భగృహం పైన విమానము లేకుండా సమతలమైన పైకప్పును కలిగి ఉన్నాయి. మిగతా అన్ని దేవాలయాలకు విమానాలు నిర్మించబడి ఉన్నవి. ఎక్కువ దేవాలయాలు ఏకతల విమానాలు కలిగి ఉండగా, జజ్జూరులోని యోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయము, సోమేశ్వరస్వామి దేవాలయము, పెనుగంచిప్రోలులోని వేణుగోపాలస్వామి దేవాలయము, ముక్త్యాలలోని ముక్తేశ్వరస్వామి దేవాలయాలు ద్వితల విమానాలను కలిగి ఉన్నవి.

**అథోజ్ఞాపికలు :**


1. సుబ్రహ్మణ్యం రెడ్డి, డి., : ఆంధ్ర గుహాలయాలు, కావలి, 1988, పుట. 4.
2. కామేశ్వరరావు, వి., : భారతీయ వాస్తుశిల్పం, హైదరాబాదు, 1990, పుట. 41.
3. గురుమూర్తిశాస్త్రి, టి., : కృష్ణామహాత్మ్యం (కావ్యం), ముక్త్యాల, 1917, పుట. 18.
4. గౌరీశంకర్, టి., : ముక్త్యాల దీపం, చల్లపల్లి, 1988, పుట. 9.
5. రాజగోపల్, ఎమ్.వి., : ఆంధ్రప్రదేశ్ డిస్ట్రిక్ట్ గెజిటీర్స్, కృష్ణా, హైదరాబాద్, 1977, పుట. 27
6. కృష్ణారావు, వై.వి. & ఏటుకూరి బలరామమూర్తి : ఆంధ్రప్రదేశ్ దర్శిని, హైదరాబాద్, 1987, పుట. 833.
7. హనుమంతరావు, బి.ఎస్.ఎల్. : ఆంధ్రుల చరిత్ర, హైదరాబాదు, 1996, పుట. 136.
8. కృష్ణారావు, వై.వి. & ఏటుకూరి బలరామమూర్తి : ఆప్.సిట్., పుట. 834.
9. శాస్త్రి, బి.ఎన్., : ఆంధ్రదేశ చరిత్ర - సంస్కృతి, మొదటి భాగము, హైదరాబాదు, 2000, పుట. 275.
10. దక్షిణ భారత శాసన సంపుటి : 10, పుట. 293.
11. దక్షిణ భారత శాసన సంపుటి : పుట. 188.
12. కృష్ణారావు, వై.వి. & ఏటుకూరి బలరామమూర్తి : ఆప్.సిట్., పుట : 885.
13. రమణయ్య, జె. : టెంపుల్స్ ఆఫ్ సౌత్ ఇండియా, న్యూఢిల్లీ, 1989, పుట. 164.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# చోడగిరి చంద్రరావు - జీవితం, సాహిత్యం



- డా॥. ఎల్లే విజయానందరాజు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తిరువూరు.

సమాజంలో ప్రతిభావంతులైన కొందరు కవులు చరిత్ర పుటల్లోకి ఎక్కుతారు. మరికొందరు కవులు కాలగర్భంలో కలిసిపోతారు. చరిత్రకెక్కిన వారు మరింత ప్రసిద్ధికెక్కి యుగయుగాల వరకు నిలుస్తారు. చరిత్రపుటల్లోకి ఎక్కని వారిని వెలికితీసి, వారి కృషిని విశ్లేషించి, పాఠకలోకానికి పరిచయం చేయటం పరిశోధకుల కర్తవ్యం. అందుకే ఇటీవలి కాలంలో ప్రముఖ కవి, విమర్శకుడు, ఉపన్యాసకుడు, నిత్య పరిశోధకుడైన డాక్టర్ కోయి కోటేశ్వరరావు విస్మృత దళితకవి చోడగిరి చంద్రరావును వెలికితీసి, వారి సాహిత్యాన్ని అంతా ఒకచోటకి చేర్చారు. దానినే "భీమకవి చోడగిరి చంద్రరావు సమగ్ర కవిత్వం" పేరుతో సాహిత్య లోకానికి పరిచయం చేయటం మన అందరి అదృష్టంగా భావిస్తున్నాను.

తొలితరానికి చెందిన ఈ దళితకవి ఈనాటి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, కపిలేశ్వరపురం మండలం, కోరుమిల్లి గ్రామంలో 14 జూలై, 1932న ఒక నిరుపేద మాల కుటుంబంలో జన్మించారు. బుల్లెమ్మ, వేంకటస్వామి వీరి తల్లిదండ్రులు. తండ్రి వెంకటస్వామి నీటిపారుదలశాఖలో లాక్ సూపరింటెండెంట్‌గా పని చేశారు. చంద్రరావు రామచంద్రపురం జాతీయ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక విద్యను, కాకినాడ పి.ఆర్. కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించారు. ఆ తరువాత వీరు కొంతకాలం మైసూర్ శాండిల్ కంపెనీ లోను, మరికొంతకాలం రైల్వేశాఖలో వివిధ హోదాల్లో విధులను నిర్వహించి, చివరకు సూపర్‌వైజర్‌గా పదవీ విరమణ పొంది 1997 అక్టోబర్ 8న మరణించారు. వీరికి ముగ్గురు సంతానం. అమ్మాయి లలితాదేవి ఎం.ఏ. చదివి, ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. అల్లుడు నేలపూడి బాలరాజు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి. ప్రస్తుతం వీరు ఇరువురు పదవీవిరమణ పొందారు. పెద్దబ్బాయి పల్లయరాజా, ఎం.ఏ. (సంస్కృతం) చదివి, ఓరియంటల్ ఇండియా ఇన్సూరెన్స్‌లో మేనేజర్‌గా పనిచేస్తూ గుండెపోటుతో మరణించారు. చిన్న కుమారుడు బుల్లిరాజ అంబేద్కర్, ఎం.ఏ; ఎం.ఫిల్ చదివి ప్రస్తుతం ఎన్.టి.ఆర్ హెల్త్ యూనివర్సిటీ, విజయవాడలో సహాయ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నారు.

చంద్రరావు విద్యార్థి దశలోనే 'వేకువ' అనే కవితా సంపుటిని రచియించి, తన గురువు వేదుల సత్య నారాయణశాస్త్రి గారికి అంకితం ఇచ్చారు. వేమన, వేదుల సత్యనారాయణ, బోయి భీమన, గుఱ్ఱం జాషువా మొదలగువారిని తన సాహిత్య గురువులుగా చెప్పుకున్నారు. భీమకవి, మధురకవి, గౌతమికోకిల, బిరు

దాంకితులైన చంద్రరావు మంచి గాయకుడు. సంగీత ప్రావీణ్యం ఉన్న హార్మోనిస్టు. పహడి రాగమన్నా, బడేగులాం ఆలీ, పర్వన్ సుల్తానా, రాజేశ్వరరావు గాయకులన్నా ఆయనకు ఎంతో ఇష్టం. తాను రాసిన పద్యాలను, గేయాలను తానే స్వరపరచి, హార్మోనియం సహాయంతో మధురంగా ఆలపించి, పల్లె పల్లెలో వినిపించి, అంబేద్కర్‌ను అణగారిన జనంలో ప్రతిష్ఠించారు. 1965లోనే కాకినాడలో 'భీమసాహితీ స్రవంతీ' అను సంస్థను స్థాపించి, తన రచనలను ప్రచురించటంతోపాటు అంబేద్కర్ భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు.

చంద్రరావు వేకువ (1950), మన గేయాలు (1953), హృదయవీణ (1968), భీమశతకం (1972), గౌతమీ కోకిల శ్రీవేదుల (1973) చంద్రరావు గీతాలు (1974), చంద్రరావు కవిత (1977), అన్వేషణ (1981), భీమశతకం రెండవ భాగం (1989), చంద్రరావు కథలు (అముద్రితం) మొదలగు రచనలు చేశారు. ఇందులో వేకువ, మన గేయాలు, చంద్రరావు కథలు అలభ్యాలు. వీరి సాహిత్యాన్ని పద్యం, గేయం, వచన కవిత, కథ మొదలగు విభాగాలు చేయవచ్చు. వీరి పద్య కవిత్వం రసభరితంగాను, గేయకవిత్వం సరళ సుదరంగాను ఉంటుంది. వీరి చరనలన్నింటికీ మూలసూత్రం బుద్ధిజం.

**భీమశతకాలు : (మొదటిభాగం – 1968, రెండవ భాగం – 1989)**

చంద్రరావు 1944లో అంటే తన 12వ యేట అంబేద్కర్ గారు తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించినప్పుడు స్వయంగా దగ్గరనుంచి చూచి స్ఫూర్తి పొందారు. ఆ తరువాత అంబేద్కర్ ఉద్యమాన్నీ, ఆలోచనల్నీ పద్యాలుగా, గేయాలుగా మలచి పదునైన కవిత్వం వ్రాశారు. శతక ప్రారంభంలో డాక్టర్ అంబేద్కర్ జీవితాన్ని, ఆయన దళితులకు చేసిన అపూర్వమైన కృషిని చక్కగా వచనంలో వివరించారు. 'ఏమిసెప్పనయ్య భీమరాయ' అను మకుటంతో రాసిన భీమశతకాలు సామాన్య మానవుడు కూడా చదివి స్ఫూర్తిని పొందే విధంగా సరళమైన భాషలో ఉండి, ప్రజాదరణ పొందాయి. భీమశతకం మొదటి భాగాన్ని (143 పద్యాలు) శ్రీ సి. పావన మూర్తి గారికి అంకితం ఇచ్చి, రెండవ భాగాన్ని (108 పద్యాలు) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారికి అంకితమిచ్చారు. ఈ సందర్భంలో

"కవితనీవు నాకు, కావ్య వస్తువు నీవు
కంఠమందునీవు కనుల నీవు
నీవు లేని నేను నిర్జీవ ప్రతిమనే
ఏమి సెప్పనయ్య భీమరాయ" అంటూ తన కావ్యాలకు వస్తువు, తన దేహానికి ప్రాణమూ అంబేద్కరే అని అంబేద్కర్ పట్ల తన ఆరాధనా భావాన్ని చాటుకున్నారు.

ఈ శతకాలలో అంటరాని సమస్య, కుల సమస్య, అంబేద్కర్ ఆలోచనా ధోరణి, దళితుల జీవన స్థితిగతులు మొదలగు అనేక అంశాలను వర్ణించారు. దళితులకు కావలసింది ఆత్మగౌరవం . అది కులాల మధ్య అంతరాలు పోయినప్పుడే కలుగుతుందని భావించి

"కులము లేనివాడు కలుగుశాంతి
కులము వేళ్ళతోడ కుళ్ళిపోవాలిరా" అంటూ కుల నిర్మూలన అవసరాన్ని నొక్కి చెప్పారు.

"కుశల ప్రశ్నలేదు కుల ప్రశ్నయేగాని" అంటూ చమత్కరించిన చంద్రరావు

"సమ సమాజం మంచు చాటించుకొనువారు
చెప్పుకున్నదెల్ల చేయవలయు
చెప్పుకొనుట యొకటి సేయునదొక్కటా" అని అగ్రవర్ణాలను నిలదీశారు.

"ఆవు పేడకన్న అంత తక్కువ వీడు?
మంత్రియైన, ముఖ్యమంత్రియైన
ఎవడు సృష్టి జేసె నీ కులమ్ముల తండ్రి"
అంటూ అంటరాని వానికంటె ఆవు పేడకే విలువ ఎక్కువ అని కులవ్యవస్థను నిరసించాడు.

"కులహీనుడంచు గొడ్డళ్ళతో గొట్టి
గునపములను దించి గుండెలందు
ఇళ్ళు తగల పెట్ట నేమి మా నెరమ్ము" అంటూ కులం పేరుతో జరుగుతున్న సామాజిక హింసను వాస్తవిక దృష్టితో అక్షరబద్ధం చేశారు.

అప్పట్లో పేదలకు "ఇందిరమ్మ ఇళ్ళ"ను ఇచ్చేవారు.

అవి చిన్నవిగా అగ్గిపెట్టెల్లా ఉండేవి. వాటిని ప్రస్తావిస్తూ కవి గారు

"హరిజనులకు యూరికావల నొకచోట
బొమ్మరిళ్ళుగట్టి బొమ్మదీసి
పత్రికలను వేసి ప్రకటించు కొందురా" అంటూ సమాజంలోని అసమానతలను తన రచనల ద్వారా బహిర్గతం చేసారు.

**హృదయ వీణ (1968)**

ఇది 37 విభిన్న కవితలతో ఉన్న ఖండకావ్యం. దీనికి శ్రీ వేదుల సత్యనారాయణశాస్త్రి (ఆశీస్సు), స్ఫూర్తిశ్రీ (అభినందనము), డాక్టర్ దివాకర్ల వేంకటావధాని (అభిప్రాయం), డాక్టర్ బోయి భీమన్న (కావ్యశ్రుతి) డాక్టర్ సి. నారాయణ రెడ్డి (ఆశీర్మాల), సురగాలి తిమోతి జ్ఞానానందము (పరిచయము), విద్వాన్ శ్రీ గున్నేపల్లి అక్షయ లింగకవి మొదలగు సుప్రసిద్ధులు ఈ ఖండకావ్యానికి ముందు మాటల్ని అందిస్తూ ప్రశంసించారు. ఈ కృతిని చంద్రరావు గారు శ్రీమతి సందక పాపయ్యమ్మ గారికి అంకితం చేశారు.

**'ఎవరు' కవితలో**

"ఇది యొకప్పుడు శిథిలంపు హృదయవీణ
మరల నెవ్వరు మొట్లునమర్చి దీని
తెగిన తీగల సరిజేసి తీయనైన
భావగీతాల నీవేళ పాడు మనిరి" అని గానం చేసి ఆయనే స్వయంగా పునరుత్తేజితుడయ్యాడు.

**'కవి సందర్శనము' కవితలో**

"గబ్బిలమ్మువంటి కావ్యమ్ము సృష్టించి
జబ్బుచేత మూల్గుజాతి కీవు
అబ్బురమ్ము గొల్పు నౌషధమ్మిచ్చితే
అబ్బ! నీవు బ్రహ్మ కబ్బవు సుమ!

అంటూ జాషువా రాసిన గబ్బిలము కావ్యాన్ని, జబ్బుతో మూల్గుతున్న దళిత జాతికి ఔషధముగా భావించారు.

**'సవాలు' కవితలో**

"చీనివాడు, కుట్ర జేసినాడని నేడు
చెప్పికొనుట సిగ్గుచేటు గాదె?
చీనివాని గూర్చి చెప్పె నంబేద్కరుం
డిరువదేండ్లనాడె యిండియాకు" అంటూ ఇరువది సంవత్సరాలు ముందే చైనా కుట్రబుద్ధిని అంబేద్కర్ చెప్పాడని తెలియపరచారు.

**"తండ్రి" కవితలో**

"గొఱ్ఱెపోతుల మ్రింగగా గుడులు వలయు
కాని బుద్ధదేవున కేమి కావలయును?" అంటూ కొన్ని సందర్భాలలో జంతు బలుల్ని ఖండించారు.

**చంద్రరావు గీతాలు (1974)**

ఇందులో 12 గీతాలున్నాయి. ఇవి మనము రాగ యుక్తంగా పాడుకోవడానికి, పాఠశాల స్థాయిలో విద్యార్థులకు పాఠ్యాంశాలుగా బోధించడానికి అనువుగా ఉన్నాయి. ఈ రచనను శ్రీ వడ్లమూడి బాబూరాజేంద్రప్రసాద్ మరియు శ్రీమతి సీతారామమ్మ దంపతులకు పెండ్లి కానుకగా అంకితమిచ్చారు. రచయిత ముందు 'మనవి'లో "నేను సాహితీ వ్యాసంగం మొదలుపెట్టి పాతికేండ్లు కడచినవి. ఇది నా అయిదవ కావ్యం. వీటిలో కొన్ని గేయాలను పాతిక సంవత్సరాల క్రితమే వ్రాయడము, వానిని ఆలిండియా రేడియో, విజయవాడ నుండి ప్రసారము చేయడమూ జరిగినది" అని చెప్పుకున్నారు.

డిసెంబర్ 6, 1956న బాబా సాహెబ్ అంబేద్కర్ కీర్తిశేషులైన సందర్భంగా 'దివ్య సంస్మృతి' అను శీర్షికతో తొలి స్మృతి గీతం రచించి నివాళి అర్పించారు. ఈ గీతం ఆరంభంలో

"బాబా లేవా - లేనే లేవా
మము వీడినావ - మరి కనరావ
నీ జీవితమును ఆదర్శముగ
నిడికొని బ్రతికెదమయ్య
నీ ఆశయములు - నెఱవేరగను
నిరతము పోరెదమయ్య" అంటూ అంబేద్కర్ ఆశయాలకు అక్షర జోహారులు అర్పించారు. ఈ పాటను ఆయన స్వరంలోనే వినుటకు అనువుగా 'చోడగిరి చంద్రరావు సమగ్రకవిత్వం' పుస్తకంలో (పుట : 209) QR కోడ్ అందుబాటులో ఉంచటం ప్రత్యేకంగా చెప్పాలి.

'దీపావళి' గీతంలో పనిదొరక, పొట్టచేత పట్టుకుని పట్నం చేరే కార్మికుల ఆకలి సన్నివేశాలను చూచి

"విసిరేసిన విస్తరికై
రెక్కాడని బక్కవాడు
కుక్కలతో పోరాడుతు
ఎక్కడైన కనిపించును
మీరును చూచేయుందురు
చూడనట్లు నటియింతురు" అంటూ సమాజంలో విలయతాండవం చేస్తున్న దారిద్ర్యాన్ని చిత్రించారు.

**చంద్రరావు కవిత (1977)**

ఛందోబద్ధ పద్యాలతోపాటు మాత్రాఛందస్సుతో కూడిన రచన ఇది. ఇందులో 23 కవితలున్నాయి. దీనిని చంద్రరావుగారు శ్రీ కొవ్వూరి ఆదిరెడ్డి గారికి అంకితం చేసారు. డాక్టర్ దివాకర్ల వేంకటావధాని గారు, డాక్టర్ సి. నారాయణరెడ్డి గారు, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారు, కొలకలూరి ఇనాక్ మొదలగు సుప్రసిద్ధుల ఆశీస్సులను ప్రారంభంలో పొందుపరిచారు. శ్రీ పి. హనుమయ్య, ఎం.ఏ; (పరిచయము) శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి (ఆమోదము) కొవ్వూరి రామారెడ్డి (చంద్రరావు-కవిత) మొదలగు వారు ఈ రచనకు పరిచయ వాక్యాలు రాసారు.

'మావూరు' కవితలో కోనసీమ అందాలను, గౌతమీ తీర సౌందర్యాన్ని వర్ణించారు.

"ఏటిమీదకు వంగి చెవిలో
మాటయేదో మరువవద్దని
మాటి మాటికి తలల నూచెడి
మాలతీ లతలు!
..................................
..................................
పచ్చ పూవులు విచ్చి నవెవ్వను
పచ్చనీ చేలన్ని నవ్వెను
అచ్చ తెలుగున పాటలను విని
అందమే నవ్వెన్" అంటూ తన ప్రాంత పల్లె సోయగాల్ని కనువిందు చేసారు.

"ఏకలవ్యుడు' కవితలో బొటనవ్రేలు గురుదక్షిణగా కోసి ఇవ్వమని అడిగిన ద్రోణాచార్యుల కుటిల బుద్ధి గురించి

"................ బోయవానికిన్
గురువులు లభ్యమౌదురొకొ?
గొప్ప కులమ్మున పుట్టకున్నచో
గురువులు లేరు శిష్యులకు
కూర్మియులేదు దగా జగత్తునన్" అంటూ ఆవేదన చెందారు.

'ఎవరు' కవితలో అంబేద్కర్‌ని దేవుళ్ళు కన్నా ఉన్నత స్థానంలో ప్రతిష్టించారు. బుద్ధుడితోపాటు అంబేద్కరూ తనకు తండ్రితో సమానమన్నారు.

"ఏసుక్రీస్తు ప్రభువు ఏడుకొండలవాడు
విడిచినట్టి జనుల విడువనట్టి
యతడు భీమరావు అంబేద్కరుండు నా
గుండెనిండ నిండుయుండు తండ్రి" అంటూ తన వీరాభిమానాన్ని చాటుకున్నారు.

**"అక్కటా!" కవితలో**

తెలుగునేల పుట్టి తెలుగన్నమే తిని
తెలుగుపల్కు లేని తెల్వి నేడు
ధూర్త వేషమందు ధూమపానమునందు
చీట్లపేకలందు చిక్కువడియె!" అంటూ తెలుగుభాష పట్ల ఆందోళన, యువతపట్ల ఆవేదన చెందారు. ఇంకా భారతదేశంలో ఏర్పడిన అత్యవసర పరస్థితిని, దాని తరువాత వచ్చిన 'సామాజిక స్థితిగతులను పరిచయం చేసారు.

**అన్వేషణ (1981)**

12 కవితలున్న ఈ చిన్న రచనను చంద్రరావు గారు డాక్టర్ జి.ఆర్. మోకా గారికి అంకితం చేశారు. కాకినాడ పి.ఆర్. ప్రభుత్వ కళాశాల, ఆంధ్రోపన్యాసకులు ఇజ్జాడ వెంకట్రావు (చంద్రుడికో నూలుపోగు), మారెళ్ళ కేశవరావు (మనవి) మొదలగు వారు పరిచయ వాక్యాలు రాసారు.

'అంతరానితనము' కవితలో కులం వలన కలిగే కష్టాలను వర్ణిస్తూ

"దేశప్రగతి సర్వనాశనమ్మొనరించి

కులవ్యవస్థ గూర్చి కుమిలి యేడ్తు
హార్టెటాకు, టీబి అబ్బ! క్యాన్సరుకన్న
అంటరానితనము హానికరము" అంటూ కులం సమాజానికి చేసే చేటు గురించి ఆవేదన చెందారు.

"అతడు తెచ్చు పాలకంటు లేనేలేదు
అతడు తెచ్చు పూలకంటు లేదు
అతడు నడచుదారి అది యెట్లు మైలయ్యె
ఎంత తన్నుకొన్న ఎరుకపడు"
...............................
...............................
అంటరానితనము అంతరించని యెడ
భారతజాతి చరిత్ర భ్రష్టమగును
అంటరానితనము ఆటంకమే గాదు
దేశప్రగతికే వినాశకరము" అంటూ కుల వ్యవస్థ దుర్మార్గాన్ని ఎండగట్టి, కులనిర్మూలన అవసరాన్ని ప్రబోధించారు.

ఇప్పుడు మనం మాట్లాడుతున్న వృక్షరక్షణ, పర్యావరణ పరిరక్షణ మొదలగు విషయాలను చంద్రరావు గారు ఎప్పుడో చెప్పారు. 'వృక్ష సంపద' కవితలో

"చెట్లు నరికి వేయ చేలెట్లు పండును
నీరు లేక నదులు నిండుటెట్లు
చెట్లు కొట్ట తుదకు చేటు మీకేమి సుమా"
................................
................................
మనసులోన పెంచు మంచియాలోచనల్
ఇంటికొక్క చెట్టు ఇపుడె పెంచు
అడవి నఱికివైచి అగచాట్లు పడవద్దు" అంటూ హితబోధ చేశారు.

ఇలా ఆయన రచనలన్నిటిలోనూ కుల వివక్ష, అంబేద్కరిజం, రాజకీయస్పృహ, మనువాదం, ప్రకృతి, భాష సంస్కృతి, విద్య, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, భక్తి మొదలగు అనేక అంశాలు కన్పిస్తాయి.

చంద్రరావు రచనా నిర్మాణంలో అసాధారణ నైపుణ్యాలు కనిపిస్తాయి. చాలాచోట్ల ప్రాసలు, పద విన్యాసాలు అద్భుతంగా ప్రయోగించారు. ఉదాహరణకు:

"కుశల ప్రశ్నలేదు కులప్రశ్నయే గాని"
"కులమ్మ లేదు వ్యాకులమ్మేగాని"
"అగ్రహారమేడ? ఆహారమే లేదు"
"ఆశలేదు మాకు ఆయాసమే కానీ"
"చక్రధారి పట్టె వక్రదారి"
"కవితకిపుడు వలయు కాకాలు బాకాలు"
"గంజి లేదు కాని బెంజికారా?
"ఊరు కోరుమిల్లి ఉనికి పేదలపల్లి" మొదలగు అనేక ప్రయోగాలలోనూ "గుండు బల్ల సభ (రౌండ్ టేబుల్ సమావేశాలు) సిరిజనులు (అగ్రవర్ణాలు) లాంటి పదాల ఎంపికలో ప్రత్యేకత కన్పిస్తుంది.

పైన పరిశీలించిన రచనలను బట్టి చంద్రరావుగారు హరిజన సమస్యకే పరిమితం కాకుండా మొత్తం సమాజ అభ్యుదయాన్ని కాంక్షిస్తూ రచనలు చేశారు. సుప్రసిద్ధ కవుల చేత ప్రశంసలందుకున్న చంద్రరావు, కలం ద్వారానే కాకుండా తన గళం ద్వారా హరిజనాభ్యుదయం కోసం పోరాడి తెలివి, సృజనాత్మకత ఒక వర్గం సొత్తుకాదని నిరూపించారు. అటువంటి చంద్రరావు గారు కాలగర్భంలో కలిసిపోకుండా కాపాడవలసిన బాధ్యత మనందరి మీద ఉంది. కావున వారి అలభ్యరచనలను సంపాదించి అచ్చు వేయడం, ముద్రిత రచనలను ప్రస్తుత సమాజానికి అందించడం ఎంతో అవసరం.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్యం - హరిజన రచయితల సేవ, డా॥ వై. విజయానందరాజు, అముద్రితం
2. దళిత సాహిత్య చరిత్ర, డా॥ పిల్లి శాంసన్, 2000.
3. భీమకవి చోటగిరి చంద్రరావు సమగ్ర కవిత్వం, డా॥ కోయి కోటేశ్వరరావు (సంపాదకులు), 2025.
4. హరిజనాభ్యుదయం - ఆధునికాంధ్ర కవిత్వం, డా॥ కల్లూరి ఆనందరావు, 1994.

★★★

Vol. 23 | Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study



# ధూర్జటి శ్రీకాళహస్తి శతకం - భక్తి వైశిష్ట్యం

- డా॥. కొయ్యా శ్రీనివాసులు

తెలుగు విభాగాధిపతి & లెక్చరర్, శ్రీ సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బుక్కపట్నం.

**ధూర్జటి జీవితం :**

స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కులకేల గల్గెనో యతులిత మాధురీ మహిమ ...... అని శ్రీ కృష్ణదేవ రాయలచే కీర్తిపొందిన ధూర్జటి తెలుగు కవులలోనే ఒక గొప్ప మహాకవి, ధూర్జటి రాయలవారి ఆస్థానంలోని అష్టదిగ్గజాలలో ఒకరన్నది నిర్వివాదాంశం. ఈయన క్రీ.శ.1500-1530 వరకు విజయనగరంలో ఉండే వారని పరిశోధకుల విశ్వాసం. ధూర్జటి కవిత కాళహస్తీశ్వరుని పవిత్రసేవకే అంకితమైంది. ఆయన రచించిన రెండు కృతులు కాళహస్తీశ్వర మహత్మ్యం, కాళహస్తీశ్వర శతకం మొదటి రచన ఒక క్షేత్ర మహత్మ్యం, రెండవది ఒక గొప్ప శతకం.

శివకవుల భక్తిలోని తీక్షణతను, ప్రబంధ కవులలోని కావ్యకళామర్మాల్నీ ఏకీకృతం చేసిన కవి ధూర్జటి. ధూర్జటి అంటే శివుడని అర్థం. పేరులోనే కాదు జీవితంలోనూ అణవణువునా శైవాన్ని నింపుకున్నవాడు 'అతులిత మాధురీ' కవితాధారతో రుద్రాభిషేకం చేసిన భక్తకవి తన రచనలు రెండింటినీ దైవాంకితం చేశాడు.

**ధూర్జటి వ్యక్తిత్వం :**

ధూర్జటి వ్యక్తిత్వాన్ని తెలియజేసే రచన శ్రీకాళహస్తీశ్వర శతకం. ఇది కవి ధూర్జటి ఆత్మీయతను పట్టి ఇచ్చే శతకం. ఐహిక భోగాలకు, రాజాస్థానాలకు విరక్తి చెంది రచించిన కవిత్వమిది. శ్రీకాళహస్తి మహత్మ్యంలో వివిధ పాత్రల ద్వారా పలికించిన వైరాగ్య భావాలను, మోక్షవాంఛను ప్రత్యక్షంగా, ఆత్మీయత ఉట్టిపడేటట్టుగా రచించిన కావ్యమే శ్రీకాళహస్తీశ్వర శతకం. ఈ శతకంలోని ప్రతి పద్యంలోనూ ధూర్జటి నిజమైన వ్యక్తిత్వము, భక్తి తత్పరత గోచరిస్తుంది. ధూర్జటి ఎంతటి గొప్ప పండితుడో ఈ క్రింది పద్యం ద్వారా తెలుసుకోవచ్చు.

పరిశీలించితి మంత్రతంత్రములు చెప్పన్వింటి సాంఖ్యాది యా
గర హస్యంబులు వేద శాస్త్రములు వక్కాణించితిన్ శంక పో(వో)
దరయన్ గుమ్మడికాయలోన నవగింజంతైన నమ్మించి సు
స్థిర విజ్ఞానము త్రోవ జెప్పగదవే, శ్రీకాళహస్తీశ్వరా!

ఈ పద్యమును బట్టి ధూర్జటి మంత్రతంత్ర శాస్త్రము లను పరిశీలించిన వాడని, సాంఖ్యాది యోగ రహస్యవేత్త అని, స్వాధ్యాయ సంపన్నుడని, శాస్త్రవైదుష్యశాలి అని, లోకజ్ఞుడని తెలియుచున్నది.

**ధూర్జటి కాళహస్తీశ్వర శతక వైశిష్ట్యం :**

ధూర్జటి తన కాళహస్తీశ్వర శతకంలో ప్రధానంగా ఈ క్రింది అంశాల మీద దృష్టి సారించినట్టు కనబడుచున్నది.

1. ఐహిక సంపదలు మెరపు తీగల వంటివి.
2. ఈశ్వరుని కరుణే సంసార తరుణోపాయం (తనము గాంచి) (సంసార సముద్రాన్ని ఈదాలంటే పరమేశ్వ రుని కరుణ కావాలి)

3. అనుభవైక్యవేద్యమయిన జ్ఞాన ప్రకాశమే ముక్తి
4. అహంకారము మోక్షానికి ప్రతిబంధకము
5. రాజధూషణము (వ్యక్తి పూజ పనికిరాదు)
6. ఈ జగుత్తుకు ఈశ్వరుడే ప్రభువు (స్వామి ద్రోహము చేసి, వేరొకని కొల్వబోతివో)

భగవంతుని కరుణాకటాక్షం లభించాలన్నా (ప్రసరించాలంటే), మోక్షం కలగాలన్నా, -- యజ్ఞయాగాదులు, జపతపాలు, వేదశాస్త్ర పఠనాలు... ఇవన్నీ అవసరమా? అనే ప్రశ్నకి ధూర్జటి స్థితప్రజ్ఞతతో అల్లిన పద్యమిది.

"ఏ వేదంబు పఠించె లూత భుజగంజే శాస్త్రముల్ చూచె..........

........... సేవా సక్తియేకాక జంతుతతికిన్ శ్రీకాళహస్తీస్వరా!

"సాలె పురుగు ఏ వేదం చదివింది? పాము ఏ శాస్త్రాలు పరిశీలించింది? ఏనుగు అభ్యసించిన విద్య ఏది? చెంచువాడైన తిన్నడు ఏ మంత్రాలు జపించాడు? లేదే? అయినా అవి మోక్షాన్ని పొందాయి కదా! కాబట్టి మోక్షానికి నీ పాద సేవే మూలం - ఈ చదువులు కాదు." అని శివ భక్తి తత్పరతను నవనీతంగా చెప్పాడు. అంతే గాకుండా భక్తి మానవులకే పరిమితం కాదు, భగవత్ సృష్టిలోని ప్రతి ప్రాణి భగవదంశ సంభూతమేనని, ధూర్జటి కవిత్వంలో మానవులే కాకుండా ఇతర ప్రాణులు భక్తులుగా రూపొందారు.

ఒకచోట కవిత్వానికి అలంకారాలకు అందని శివ తత్త్వాన్ని కవిత్వంలో వర్ణింపజూడడం మూర్ఖత్వమని పేర్కొంటాడు.

"ఏలీలన్నుతియింప వచ్చును పయోత్ప్రేక్ష్యధ్వని వ్యంగ్య శ
బ్దాలంకార విశేష భాషల కలభ్యంబైన నీ రూపమున్
చాలుంజాలు కవిత్వముల్ నిలుచునే సత్యంబు వర్ణించుచో
చీ లజ్జింపరుగాక మాదృశకవుల్ శ్రీకాళహస్తీశ్వరా!

శ్రీ కాళహస్తీశ్వరా నీ రూపు వర్ణించుటకు ఉపమ, ఉత్ప్రేక్ష, ధ్వని, వ్యంగ్యము మొ॥ అర్థాలంకారములు, శబ్దాలంకరములు, విశేష వ్యాకరణాది సంజ్ఞలకు అలవి గాదు. ఇక వర్ణించుటకు ఎట్లు? సత్యపదార్థము వర్ణించుటకు కవిత్వము పనికి వచ్చునా? పనికిరాదు కావున నిన్ను వర్ణించలేని మా వంటి కవులు సిగ్గు పడవలయును అంటాడు ధూర్జటి.

కర్మ జగత్తును నమ్మి ఇహలోక విషయాలను స్థిరాలుగా భావించి అశాంతిని స్వీయంగా సృష్టించుకున్నాడు. ఈ అ శాంతిని దరి చేయనీయకుండా ఉండాలంటే మనిషి భగవంతునిపైన చింతాకంతా భక్తి కలిగి వుండాలని, ఉద్బోధిస్తూ రచించిన పద్యం

"అంతా మిథ్య తలంచి చూచిన నరుండట్లౌ టెరింగన్

....................

..................తాచింతా కంతము చింతనిల్పడు గదా!"

మానవుడు పుట్టుట, చచ్చుట మొ" చేష్టలచే ప్రపంచమంతయునూ, మిథ్యారూపమైన మాయ అని తెలిసి కూడా, అశాశ్వతమగు భార్యాపుత్రులయందు మోహమును విడనాడక సంచరించును. కాని ముక్తిని ఇచ్చే నీ యందు చింతాకు అంతయైననూ మనస్సును లగ్నము చేసి సంచరించడు కదా! అని ధూర్జటి ఆత్మ సంఘర్షణకు లోనైనాడు.

"సంతోషించితి చాలు చాలు రతిరాజ ద్వార సౌఖ్యంబులన్", "కాయల్గాచె వధూనఖాగ్రములచే గాయంబు వక్షోముల్ రాయన్ రాపడె రొమ్ము" మొదలైన పద్యాల వలన ధూర్జటి మొదట స్త్రీలోలుడని, తరువాత స్త్రీ సాంగత్యానికి విముఖుడై (భవంతునికి) కాళహస్తీశ్వరునికే జీవితం అంకితం చేసినట్లు కాళహస్తీశ్వర శతకం ద్వారా తెలియుచున్నది. "కామిగానివాడు మోక్షగామికాడు" అన్న వేమన మాటలు ధూర్జటి మహాకవికి అక్షరాలా సరిపోతాయి.

శ్రీ కృష్ణదేవరాయల మరణానంతరం పాలించిన రాజుల వలన ధూర్జటి కొంత ఇబ్బందుల పాలైనట్లు కన్పిస్తున్నది. ధూర్జటి శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో ఉన్నప్పటికి, తన గ్రంథాలను ఆయనకు అంకితం ఇవ్వలేదు. అంతటి అచంచల శివభక్తితత్పరుడు ధూర్జటి కనుకనే "నీకుంగాని కవిత్వ మెవర్వికి నేనీనంచు మీదెత్తితిన్" అను పద్యములో ఓ కాళహస్తీశ్వరా! నేను

నా కవిత్వము నీపైననే చెప్పెదను, ఇతరులపైన నేను ఏమాత్రము చెప్పనని ప్రతిజ్ఞ చేసితిని. అందుకు దీక్షాబద్ధుడైనాను. ప్రజలు మెచ్చుకొనునట్లుగా ఆ నియమమును పాటించు చున్నాను. కానీ ఎంత దౌర్భాగ్యము రోజులు మారి పోయినవి. అందుచే నా నియమమును పాటించగలనో లేదో తెలియదు. ఇది నీ దయయే గాని నా గొప్పతనము నైపుణ్యము ఏ మాత్రము కాదని ప్రకటించాడు. తన అచంచల విశ్వాసాన్ని, భక్తిని, శివునిపైనే తప్ప ఇతరులపై ప్రకటించలేనని కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు.

శివపూజ తప్పా, వ్యక్తి పూజ చేయలేనని ధూర్జటి స్వయంగా ప్రకటించుకొన్నాడు. ధూర్జటి రాజాస్థానమున ప్రవేశించినను, మనశ్శాంతి దొరకక "భవ దుఖంబులు రాజకీటములనే బ్రార్థించినం బాయునే" (ప.44) అని తలంచినాడు, "రాజులతమ్ములు వారి సేవ నరక ప్రాయంబు" (ప.18) అనియు, "రాజశ్రేణికి దాసుకై సిరులంగోరం జేరంగా సౌఖ్యమో" అనియు, "నా రాజ శబ్దంబు ఛీ ఛీ! జన్మాంతరమందు నొల్లనుజుమీ" అనియు "సత్య దాన దయాదుల్గల రాజు నా కొసగుము" అనియు "భూభృచ్చండాలురర గొల్చి" అని పెక్కు విధముల రాజ సభా వైముఖ్యమును, రాజుల దృష్ట ప్రవృత్తులను నిశితముగా విమర్శించినాడు. రాచరిక వ్యవస్థ మీద ఈ స్థాయి ధిక్కారాన్ని ప్రదర్శించిన కవి ధైర్యసాహసాలను చూసి ఆశ్చర్య పోవలసిందే. మహాకవి పోతన కంటే రాచరికాన్ని గట్టిగా నిందించిన కవి ధూర్జటి.

**ధూర్జటి జ్ఞాన వైరాగ్యతత్వం :**

ధూర్జటి భక్తి కవితా తత్పరత, (కాళహస్తీశ్వర శతకంలో) జ్ఞాన దృష్టి ఈ శతకంలో ఎల్లెడలా సాక్షాత్కరిస్తుంది. ఐహిక సంపదలు శాశ్వతం కావనే సార్వత్రికమైన సత్యం బోధ పడిన తరువాతే ధూర్జటి ఈ శతకాన్ని రాసినట్టుగా అవగాహన చేసుకోవచ్చు. ఈ శతకంలో సంపూర్ణమైన శివాద్వైత దృక్పథం దర్శనమిస్తుంది. జ్ఞానాన్ని అనుభవం ద్వారా సంపాదించుకోవాలనే నేర్పు ధూర్జటి కవిత్వసారంగా ద్యోతకమవుతుంది. ధూర్జటి తన జీవిత చరమాంకంలో ఏర్పరచుకున్న పరిపూర్ణ వేదాంత భావనకు కాళహస్తీశ్వర శతకంలోని పద్యాలు ఈ శతకంలోని ప్రతి పద్యం భగవంతుడికే అంకితం కావలని త్రికరణ శుద్ధిగా నమ్మిన కవితా తపస్వి, చిర యశస్వి ధూర్జటి తన హృదయమును పరమేశ్వరునకు నివేదించుకొనుటలో మొహమాటము గాని, భయముగాని, సిగ్గుగాని ఎరుగడు. ధూర్జటి చిత్తశుద్ధితో రచించిన పద్యాలు పాఠకుడు చదువుతుంటే తనకే తెలయకుండా ఆత్మ సంఘర్షణకు లోనవుతాడు. ఈ శతకంలోని ప్రతి పద్యంలో అనితర సాధ్యమైన ప్రత్యాక్షను భూతి జీవనాడివలె తొణికిసలాడుతూ ఉంటుందని సాహితీ విమర్శకుల అభిప్రాయం.

సామాన్య భక్తులు భగవంతుణ్ణి ప్రార్థించేటపుడు తమకంతా మంచే జరగాలని కోరుకుంటారు. ధూర్జటి తద్విరుద్ధంగా "నిను సేవింపగ నా పదల్పొడమని, నిత్యోత్సావంబబ్బనీ" అన్న ధీశాలి, భక్త శిఖామణి ధూర్జటి.

**ముగింపు :**

ముక్తి సాధనలోభక్తి, వైరాగ్యం జీవనంలో మానవుడు అలవరచుకోవాలని ఈ శతకం చెబుతుంది. శివభక్తితో పాటు ఐహిక విషయ విరక్తి, చిత్తశుద్ధితో కూడిన ఆత్మ నివేదనం, రాజధూషణ, లోక విమర్శ, యోగ విద్యా విశేషాలు మొదలైనవి చోటు చేసుకున్నా శివాద్వైతం వెల్లడి చేయడమే ఈ శతకం యొక్క పరమోద్ధేశంగా కనబడుతుంది. శివుని మీద గల భక్తిని, లౌకిక సుఖాల పట్ల తనకున్న విరక్తిని, అసహ్యాతను భావ తీవ్రతతో ప్రకటించిన కవి మరొకరు లేరంటే అతిశయోక్తి లేదు.

**ఉపయుక్త గ్రంధాలు :**

1. శ్రీకాళహస్తీశ్వర శతకం (ధూర్జటి) - విక్టరీ పబ్లిషర్స్
2. తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం) - ఆచార్య జి.నాగయ్య
3. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ద్వా.నా.శాస్త్రి 4. శ్రీకాళహస్తీశ్వర శతక వ్యాఖ్యాత - డా॥వల్లపురెడ్డి బుచ్చారెడ్డి
5. శతకమంజరి సంపాదకుడు - ఆవంచ శ్రీకంతుడు
6. శ్రీ నాగేశ్వర శతజయంతి సంచిక - ఆంధ్రపత్రిక 1967-1968 7. పెద్దబాల శిక్ష - గాజుల సత్యనారాయణ

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# మహిళా చైతన్యానికి 'దర్పం' పట్టిన కథలు



- డా॥. ఎ.ఎ. నాగేంద్ర

అకడమిక్ కన్సల్టెంట్, తెలుగు & తులనాత్మక సాహిత్యశాఖ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

**సంక్షిప్త పరిచయం:**

2025 అక్టోబర్ 13, 14, 15 తేదీలలో అనంతపురంలో జరిగిన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రశాఖ 16వ, మహాసభల సందర్భంగా నిర్వాహకుల పిలుపు మేరకు రాష్ట్రంలోని అనేకమంది రచయితలు, రచయిత్రులు స్పందించారు. 37 మంది కథలతో "ఆధునిక మహిళ చరిత్రను తిరిగి రచిస్తుంది' పేరుతో సంకలనం వెలువరించారు. ఈ కథా సంకలనంలో 18 మంది మహిళా రచయిత్రులు 19 మంది పురుష రచయితల కథలు ఉన్నాయి. ఈ రచయిత్రులలో, రచయితలలో కవులుగా, కథకులుగా ప్రసిద్ధి చెందిన వారు, ప్రసిద్ధి చెందుతున్న వారు, ఇంకా మొదటి అడుగు లోనే వున్న వారు ఈ కథా సంకలనంలో మూడుదశల వారు మనకు కన్పిస్తారు.

అయితే ఈ కథా సంకలనంలోని ప్రతి రచయిత తాను చెప్పదలచుకున్న అంశంపై పూర్తీ పట్టు సాధించి చెప్పినట్లు తెలుస్తుంది.

మహాకవి గురజాడ అప్పారావు గారు అన్నట్లు 'ఆధునిక మహిళ చరిత్రను తిరిగి రచిస్తుంది'. ఈ వాక్యాన్నే ఈ కథా సంకలనానికి నిర్వాహకులు పేరు పెట్టి మంచి కథలతో పుస్తకం మన ముందుకు తీసుకురావడం అభినందనీయం.

మొత్తం ఈ కథలలో స్త్రీలు ఎంత ఆధునికంగా ఉన్నారో, వారి ఆలోచనలు, వారి దృక్పథాలు. సమస్యల పరిష్కారం కోసం వారు వెతికే మార్గాలు అనేకం మనకు కన్పిస్తాయి.

స్త్రీ విద్యావంతురాలు కావడంతో పాటు మానసికంగా, దృఢంగా ఉండటం, సమస్యలకు బెదరని తత్త్వం ఈ సంకలనంలోని కథలు నిరూపిస్తున్నాయి.

**కథల విశ్లేషణ:**

ఇప్పటికీ అనేక గ్రామాలలో, పట్టణాలలో సైతం 'శానిటరీ నేప్‌కిన్'ల వాడకం గురిచి, మాట్లాడుకోవడానికి చాలామంది సందేహిస్తున్నారు. ఒకవైపు శాస్త్ర సాంకేతిక రంగాలలో దేశం ముందుకు దూసుకు పోతుంటే, మరోవైపు గ్రామీణ ప్రాంతాలలో, లంబాడీ తాండాలలోని ప్రజలు విద్యావంతులు కాకపోవడం, తమ శరీర శుభ్రతపై అవగాహన లేకపోవడం మనల్ని ఆలోచింపచేస్తుంది.

తెలంగాణ ప్రాంతంలోని ఓ మారుమూల తండాలలో నలభైశాతం మంది స్త్రీలకు గర్భసంచి లేకపోవడం అనే విషయాన్ని పత్రికల ద్వారా తెలుసుకొన్న జిల్లా వైద్య

ఆరోగ్యాధికారిని డా॥ కామేశ్వరి ఆ ప్రాంత తండాలలోని ప్రజలలో ఎలాంటి చైతన్యాన్ని కల్గించారో తెలియజేసే కథ 'అందరి ఇల్లు'.

'డిస్పోజబుల్ శానిటరీ నేప్‌కిన్' స్థానంలో 'రీయూజబుల్ ప్యాడ్' గురించి ప్రజలలో చైతన్యం తీసుకురావడం గొప్ప పరివర్తనగా చెప్పవచ్చు. 'నెలసరి సమస్యలు' గురించి తన కొడుకు, కూతుర్ల సంభాషణ విన్న డా॥ కామేశ్వరి. తను నిర్వహించే సమావేశానికి మహిళలతో పాటు, మగవారిని కూడా ఆహ్వానించి మహిళల నెలసరి సమస్యలపై అందరికీ అవగాహన కల్పించడం ముందు చూపు ఉన్న డాక్టర్‌గా కామేశ్వరి మనకు కన్పిస్తుంది.

విశ్వంలోని ప్రతి మహిళకీ గర్భసంచి ఆలయం లాంటిది. ఎందుకంటే గర్భసంచి మన 'అందరి ఇల్లు' అంటూ దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదీ అంటూ ఆమె చేసిన ప్రసంగం చాలా అర్థవంతమైనదిగా, విలువైనదిగా మనల్ని ఆకట్టుకుంటుంది.

ఈ కథా సంకలనంలో చిన్నదైన కథగా కన్పించినా మంచి ముగింపుతో ముగిసే కథ 'సుందరి' మనల్ని ఏకబిగియన చదివించే కథ. ఈ కథలో ప్రధాన పాత్ర 'సుందరి'. సుందరి తండ్రి రంగారావు గొప్ప వ్యాపారవేత్త. అమెరికా సంబంధం చూసి పెళ్ళిచేస్తాడు. అదనపు కట్నం వేధింపులకు గురైన సుందరి తిరిగి ఇంటికి వచ్చేస్తుంది. ఈ బాధతో తండ్రి మరణించడం జరుగుతుంది. మేనత్త సుభద్రమ్మ కొడుకు మోహన్ ఇచ్చిన సలహాతో 'లా' కోర్సు చదివి, తన కేసుతానే వాదించుకొని గెలిచి, భర్తకు గుణపాఠం చెప్పే కథ ఇది.

విద్య స్త్రీని ఎలా విజేతగా నిలబెడుతుందో చెప్పేకథ. స్త్రీలు విద్యావంతులైనప్పుడు తమకు ఎదరయ్యే సమస్యలకు భయపడకుండా, ధైర్యంగా ఎదుర్కొని తమ శక్తిసామర్థ్యాలు ఏమిటో లోకానికి రుజువు చేయగలరనే గొప్ప సందేశాన్ని ఇచ్చేకథగా 'సుందరి' కథ నిలుస్తుంది.

ఆడపిల్లలకు చదువులెందుకు, ఒక వేళ చదివించినా చాకలి పద్దు వ్రాసేటంత చదువు వస్తే చాలని అనుకునే రోజుల్లోనే 'సలీమా' ఎం.ఏ వరకూ చదువుకోవడం ఎందరికో స్ఫూర్తినిస్తుంది. అలాంటి కుటుంబంలో నుంచే 'సలీమా' మనుమరాలు రోషిణి ఏకంగా ఐ.ఎ.ఎస్ సాధించి కలెక్టర్ అవ్వడం వివక్షతను, అసమానతలను, ఆంక్షలను దాటుకుని నేటి స్త్రీలు అన్ని రంగాలలోనూ విజేతలుగా నిలుస్తున్నారనడానికి గొప్ప ఉదాహరణగా నిలిచే కథ 'విజేతలు వీళ్లు' రచయిత్రి పి. షహనాజ్ బేగం గారు రాసి ఈ కథ నిజ జీవిత సంఘటనల ఆధారంగా రాయబడ్డ కథగా మనకు అన్పిస్తుంది. మహిళలపై చెడు అభిప్రాయం కల్గివున్న కాంంతను 'సలీమా' తన మాటల ద్వారా మహిళల నిరంతర కృషిని, కష్టపడే స్వభావాన్ని, ప్రస్తుత అన్యాయాలను ఎదిరించి ఆత్మస్థైర్యంతో జీవిస్తున్న విధానాన్ని తెలియజేసి కాంతం ఆలోచనల్లో మార్పు తీసుకురావడం ఈ కథలో కన్పిస్తుంది.

మహిళ తన ధిక్కార స్వరాన్ని వినిపించే కథ. స్త్రీ, పురుషులు మంచి స్నేహితులుగా కలసి వుండటానికి లక్షలు, లక్షలు ఖర్చుపెట్టి 'పెళ్ళి' అనే తతంగాన్ని జరిపించడం అవసరమా? అని ఆలోచించే ఆధునిక మహిళ ఆలోచనా తీరుకు ప్రతిబింబంగా నిలిచే కథ 'ధిక్కారజ్యోతి' ఎన్ని సమస్యలు చుట్టుముట్టినా, ఆర్థిక పరిస్థితి అంతంతం మాత్రంగానే ఉన్నా తల్లిదండ్రులు తమ ఇద్దరు ఆడపిల్లల్ని చదివించడం, పెద్ద కూతురు జ్యోతికి వ్యాపారవేత్త మాధవ్‌తో ఘనంగా వివాహం చేసినా, అతని వ్యాపార నష్టానికి భార్యను అదనపు కట్నం తెమ్మనడం, జ్యోతి తన పుట్టింటికి వెళితే అక్కడ ఆమె తల్లిదండ్రుల పరిస్థితికి చలించి, తానే ఒక నిర్ణయానికి వస్తుంది. మంచిగా చదువుకొని, ఉద్యోగం చేసి నా నుదుటిరాతను నేను మళ్ళీ రాసుకుంటాను. రేపటి నా కోసం, నేను ఓ కొత్తవాక్యం ప్రారంభిస్తాను అంటూ తీర్మానం చేసుకొని ముందడుగు వేసే మహిళగా జ్యోతి పాత్ర నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తుంది. వరకట్న సమస్య అనేది వుండకూడదు, స్త్రీ, పురుషులు ఇద్దరూ చదువుకున్నప్పుడు మళ్ళీ అమ్మాయి అబ్బాయికి కట్నం ఎందుకు ఇవ్వాలి? అని ఆలోచించే ఆధునిక మహిళగా జ్యోతి పాత్ర స్ఫూర్తిగా నిలుస్తుంది.

ప్రతి మనిషి తాను కోరుకున్న స్థానానికి చేరుకోవాలంటే కష్టపడే తత్త్వం వుండాలి. 'కష్టేఫలి' అని నిరూపించిన

కథ, ప్రస్తుతకాలం ఎ.ఐ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) ద్వారా శాస్త్ర సాంకేతిక రంగాలలో గొప్పగా రాణించిన ఓ సాధారణ యువతి అసాధారణ యువతిగా రైతు నూతన వ్యవసాయం కోసం ఓ కొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందించే దశకు చేరిన యువతి కథే 'ఆమె పయనం ధృవం వైపుకి'. 'రంగి' అనే అమ్మాయి, 'వేద'గా ఎలా రూపాంతరం చెందిందో, కష్టాల నుండి బయటపడి సమాజానికి ఉపయోగపడే స్థాయికి చేరి ఐక్యరాజ్య సమితి నుండీ 'టెక్ ఫర్ హ్యూమానిటీ' అవార్డు పొందే దశకు 'వేద' అంచలంచల ప్రయాణం మనల్ని అబ్బుర పరుస్తుంది. రచయిత్రి యలమర్తి అనూరాధ వర్తమాన అంశమైన ఎ.ఐని వస్తువుగా తీసుకొని కథగా మలచిన తీరు పాఠకుల్ని ఆకర్షిస్తుంది.

ప్రతి పురుషుడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుంది అనే సత్యాన్ని ఆవిష్కరించే కథ 'నాలో ఉన్న మరో నేను' సుధీర్ సమాజ సేవ చేయడంలో ముందుంటూ, తన బ్లడ్ బ్యాంక్ ద్వారా ఎంతో మందికి రక్తాన్ని అందిస్తూ ప్రాణాలు నిలబెడుతుంటాడు. సుధీర్‌కు తగ్గ ఇల్లాలుగా సుజాత అతని ప్రతి పనిలోనూ వెన్నంటి వుంటూ సహాయ సహకారాలు అందిస్తూ వుంటుంది. సుధీర్ సభలలో స్త్రీల యొక్క గొప్పతనం గురించి ప్రస్తావిస్తూ అందరిచేత స్త్రీల పక్షపాతిగా పేరు పొందిన సుధీర్ తాను వెలువరించిన 'సావనీర్'లో తన భార్య గురించి రాయకపోవడం లక్ష్మీ ప్రశ్నించడంతో తన తప్పు తెలుసుకున్న సుధీర్ ఆత్మ పరిశీలన చేసుకోవడం గమనించవచ్చు.

నాలో కూడా ఒక మగ అహంకారి ఉన్నట్లే! వాడే 'సావనీర్'లో కూడా తన భార్య సుజాతకు చోటు లేకుండా చేశాడని తన తప్పుకు పశ్చాత్తాపం చెంది 'మమత సంస్థ' సావనీర్‌లో సుజాత ఫోటో మొదటి పేజీలో నిలువెత్తు కలర్ ఫోటోతో ముద్రించి భార్యకు సముచిత గౌరవం కల్పించే కథ.

ప్రతి పురుషుడూ తనలోకి తాను తొంగి చూసు కుంటూ, పురుష అహంకారాన్ని వదిలి మహిళను గౌర వించాలని మనందరికీ గుర్తుచేసే కథ ఇది. రచయిత ఉప్పరపాటి వెంకటేశులు మంచి చేయి తిరిగినరచయితగా ఈ కథ ద్వారా మనకు కన్పిస్తాడు. గతంలో తాను 'చిత్రావతి కథలు' ద్వారా ప్రాచుర్యంలోకి వచ్చారు.

భావ స్వాతంత్ర్యం, బానిస భావన నిర్మూలనకు ఆధునిక మహిళ కొత్త పేజీలను చరిత్రకు జోడించడం. మహిళ వ్యక్తిగా ఎదిగి, చెడును ఖండించే స్థాయికి ఆమె భావాలు ఎదగడం 'నేటిమహిళ' కథలో కనిపిస్తుంది. భర్తపై ఆధారపడి ప్రతి రూపాయికీ చేయిచాచడం, ఇంట్లోనే వుంటూ టి.వి. చూసుకుంటూ రోజుల గడపడం లాంటి సోమరి చాదస్తపు లక్షణాలకు ఫుల్‌స్టాప్ పెట్టి తన స్వయంకృషితో ఉద్యోగాన్ని సంపాదించి ఒకవైపు ఉద్యోగ ధర్మాన్ని, మరోవైపు కుటుంబ ధర్మాన్ని పాటించిన ఆధునిక మహిళగా అరుణపాత్ర పోషించిన తీరు మహిళలు అన్నిరంగాలలో స్వతంత్రంగా ఎదగాలనే తపన కనబడుతుంది.

ఈ సంపుటిలో మరో చిన్నకథగా కన్పించే కథే 'స్వరం'. మన భావాలు, ఆలోచనలు వేరే వారి ఆలోచనలు, భావాలకింద నలిగి పోకూడదు. మనిషి తనను తాను నిర్మించుకోవడానికి సొంత గొంతుక, చైతన్యం, ప్రశ్నించే తత్త్వం అవసరం అనే సత్యాన్ని ఆవిష్కరించే కథ. మహాకవి గుఱ్ఱం జాషువా గారు అన్నట్లు "ధనము, ధాన్యము ఒకరి పెత్తనం కింద పడి నలగరాదు' మాటలు గుర్తుకురాక మానవు. 'అన్వేష' ఒక సంప్రదాయ కర్నాటక సంగీత విద్వాంసురాలి కుమార్తె తండ్రి అదుపాజ్ఞలో వుంటూ, తనకు ఒక సొంత గొంతుక అనేది లేకుండా తండ్రి ఎలా చెబితే అలా పాటలు పాడుతున్న తనకు 'ప్రియదర్శిని' అనే స్నేహితురాలి ద్వారా తన స్వంత ప్రతిభతో మంచి గుర్తింపు తెచ్చుకున్న తీరు మనకు కథను చదవాలనే కుతూహలాన్ని కల్గిస్తుంది. స్త్రీ సాధికారత, స్త్రీ మానసిక ఆరోగ్యం, కలల సాకారం వంటి సమస్యలపై అద్భుతంగా పాటలుపాడి, తండ్రిని కూడా ఆధునికం వైపు ఆలోచించడానికి మార్గం వేసిన వనితగా 'అన్వేష' కన్పిస్తుంది.

"నాన్నా, సంగీతం ఒక నది లాంటింది. అది పురాతన మూలాల నుండి పుడుతుంది. కానీ అది ఎప్పుడూ నవీనమైన సముద్రంలోకి ప్రవహిస్తుంది" అంటూ 'అన్వేష'

తన గొంతుకతో, తన నిర్ణయాలతో చరిత్రను తిరిగి రాయడం, ఛాందసభావాలు కల్గిన తండ్రులకు కనువిప్పు కల్గించడం ఈ కథ ద్వారా తెలుస్తుంది.

ఆదర్శ రైతు అంటే కేవలం పంట పండించేవారు కాదు. ఆధునిక పద్ధతులు, సేంద్రీయ వ్యవసాయం, విలువ జోడింపు, వ్యాపార నైపుణ్యాలతో సవాళ్ళను ఎదుర్కొంటూ, తనతో పాటు సమాజానికి మేలు చేసే, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే వ్యక్తి అని చెప్పవచ్చు. ఆదర్శరైతు ప్రకృతిని గౌరవిస్తూ, సాంకేతికతను అందిపుచ్చుకొని, ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకుంటూ, స్థిరమైన వ్యయసాయాన్ని ప్రోత్సహించే మార్గదర్శకులే ఆదర్శరైతులు. ఇలాంటి లక్షణాలను పుణికి పుచ్చుకొన్న 'రోజా' అనే అమ్మాయి తాను బెంగుళూరులో ఐ.బి.యం. జాబ్ వదిలేసి, వ్యవసాయం రంగంలో నూతన విప్లవాలకు శ్రీకారం చుట్టిన సుభాష్‌పాలేకర్ పుస్తకాలు ప్రేరణతో సేంద్రియ నిపుణుల సలహాలతో వ్యవసాయ రంగంలో అద్భుతాలు సృష్టించి రాష్ట్రపతి చేతుల మీదుగా యువరైతు పురస్కారం అందుకునే స్థాయికి ఎదిగిన రోజా ఎంతోమంది మహిళలకు ఆదర్శ మహిళా రైతుగా స్ఫూర్తినివ్వడమే కాకుండా తన కింద దాదాపు యాభైమందికి ఉపాధి చూపించిన తీరు మనల్ని ఆశ్చర్యపరుస్తుంది. మహిళలు అన్ని రంగాలలోనూ ఎలా దూసుకువెళుతున్నారో విడమరచి చెప్పే కథే 'పడిలేచిన కెరటం'. స్వామి వివేకానందగారు చెప్పినట్లు 'కెరటం నాకు ఆదర్శం' పడినందుకు కాదు. 'పడినా లేచినందుకు' అన్నట్లు. మనం వేసే ప్రతి అడుగులో అవరోధాలు ఎదురవుతాయి అంత మాత్రాన వెనకడుగు వేయరాదు అని తెలియజేసే కథ.

మనిషికి కేవలం చదువు, డబ్బు మాత్రమే కాదు. సమస్యలను ఎదుర్కొనే తెలివి, తెగువ, సమయస్ఫూర్తి ఉండాలి అని తెలియజేసేకథ "స్ఫూర్తి ప్రదాత". చదువూ సంధ్యా లేని ఒక ముదుసలి దొంగలబారిన పడకుండా తనను తాను ఎలా తెలివిగా రక్షించుకున్నదో ఆమె జీవితం మనుమరాలకు ఎంతటి స్ఫూర్తిని ఇచ్చిందో చెప్పే కథ ఇది. ఈ కథలోని కాలేజీ అమ్మాయి 'మంగరత్నం'ను తన తాత నరేంద్ర ఏవిధంగా శక్తివంతులుగా మార్చాడో తేటతెల్లం అవుతుంది. స్త్రీలకు చదువుతోపాటు స్వీయ రక్షణ, ఆత్మరక్షణ లాంటివి అవసరం అని తెలియజేసే ఈ కథను చదువుతుంటే శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రి గారు రాసిన 'కొత్తచూపు' కథ గుర్తుకువస్తుంది. నేటి ఆధునిక మహిళలకు విద్యతోపాటు, తెలివితేటలు, సమస్యలను ఎదుర్కొనే ఆత్మస్థైర్యం, తనను తాను రక్షించుకునే పద్ధతులు తెలిసి వుండాలని వివరించిన కథ ఇది. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ గారు అన్నట్లు "ఎవరూ నీ పిలుపు విని తోడు రాకున్నా ఎవరూ నీ వెంట లేకున్నా ఒకడివే పదవోయ్ ఒకడివే పదవోయ్ ముందుకు" అన్నమాటలు నేటి మహిళలు ఆదర్శంగా తీసుకొని ముందుకు అడుగులు వేయాలి.

అనంతపురం జిల్లా 'మాండలికం'తో ఉన్న కథ 'పుట్టగతులు' రచయిత యాములపల్లి నరసిరెడ్డి తనదైన కోణంలో కథను ఆవిష్కరించినాడు. పాత్రల మధ్య జరిగే సంభాషణలు అనంతపురం మాండలికంలో సాగుతాయి. వంశం అభివృద్ధి చెందాలంటే పుత్రుడు ఉండాలనే ఒక అపోహను ఈ కథ ద్వారా చెరిపేస్తారు రచయిత. ఆడపిల్లలు కూడా ఇంటికి ఆణిముత్యాలు లాంటి వారేననే సత్యాన్ని బోధించే కథ 'పుట్టగతులు'. 'ఆడది ఏడిస్తే, ఆమెను ఏడ్పిస్తే ఏ మగాడికీ పుట్టగతులుండవు' అంటూ హెచ్చరిస్తాడు రచయిత.

"రాధమ్మ.... నువ్వు పిచ్చిముండవి కావు. నన్ను, పిల్లలను కంటికి రెప్పలా సాకిన మా అమ్మవి. ఇల్లాలివి. ఇన్నాళ్లూ నీకు ఏమీ తెలీదు అన్న నా అహంకారం వల్లనో, చులకన భావం వల్లనో... నిన్ను చులకను చేశాను, చాలా బాధ పెట్టాను. నీ పట్ల బండగా, మొండిగా మసిలాను. ఇప్పుడు మనసారా చెబుతున్నా ... సారీ రాధికా! ... ఇక నిన్ను కష్టపెట్టను. ఇక నీ ఇష్టం అంటూ మాధవరావు తన భార్య రాధిక విషయంలో పశ్చాత్తాపం చెంది తన తప్పులు తెలుసుకొని భార్యను గౌరవించాలి.

అగౌరవంగా మాట్లాడకూడదనే విషయం తెలుసుకొని సంస్కారవంతమైన వ్యక్తిగా మారడం ఎల్. శాంతి రచిం

చిన 'కోర్టు నోటీసు' కథలో కన్పిస్తుంది. అహంకారంతో ప్రవర్తించడం, భార్యకు సరైన గుర్తింపు, గౌరవం ఇవ్వని భర్త మాధవరావును రాధిక తన తెలివితేటలతో సంస్కరించుకోవడం చూస్తే గురజాడ అప్పారావు గారు రాసిన 'దిద్దుబాటు' కథానిక మన కళ్ళ ముందు కదులాడుతుంది. కమలిని గోపాలరావును ఎలా దిద్దుకుంటుందో అలాగే మాధవరావును రాధిక దిద్దుకోవడం రచయిత్రి ఎల్. శాంతిపై గురజాడ కథల ప్రభావం కన్పిస్తుంది.

**ఆధార గ్రంథాలు:**


1) ఆధునిక మహిళ చరిత్రను తిరిగి రచిస్తుంది - అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), ఆంధ్రప్రదేశ్ ప్రచురణలు.

2) గురజాడలు - ఎమెస్కో, మనసు ఫౌండేషన్ ప్రచురణలు

3) కొత్తచూపు - శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# దాశరథి కవిత - జాతీయత



- డా॥. ఆగపాటి రాజ్ కుమార్

అసిస్టెంట్ ప్రొఫెసర్ (పి), యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, హన్మకొండ.ల

దాశరథి కవిత్వాన్ని అంచనా వేసి చూస్తే అతడు తెలంగాణలో ప్రజ్వరిల్లిన సంఘర్షణకు, పునరుజ్జీవనానికి ప్రతీకగా రూపొందిన కవిగా నిరూపితమవుతాడు. దాశరథి కవితా రంగంలోకి వచ్చేదాకా తెలంగాణలో సాహిత్య సృష్టి 17,18వ శతాబ్దాల్లో తెలుగు సాహిత్యంలో సామాన్యంగా ప్రతిఫలించే క్షీణ కవితా యుగానికి ప్రతిధ్వనులుగా వచ్చిన రచనలే అధికంగా ఉన్నాయి. తెలంగాణలో పునరుజ్జీవనోద్యమం 1920 నాటికే స్పష్ట రూపం తాల్చింది నుకొంటే అంతకు పూర్వం కేవలం గ్రంథాలయోద్యమంగా ప్రారంభమైన ఈ ధోరణి ప్రజా జీవనంలోని అన్ని రంగాలను స్పృశించే స్థితి ఈనాటికి ఏర్పడింది. హైదరాబాద్ ఆంధ్ర జన సంఘం ఏర్పడటం, ఇనుగుర్తిలో “తెనుగు పత్రిక” ప్రారంభం కావడం, నల్గొండ నుండి “నీలగిరి” పత్రిక రావడం, లక్ష్మణరాయ పరిశోధన మండలి ఏర్పడటం, శ్రీకృష్ణదేవరాయ భాష నిలయం తెలుగు వారి కార్యకలాపాలకు కేంద్రం కావడం ఇప్పటికే సంభవించింది. మాడపాటి హనుమంతరావు, ఆదిరాజు వీరభద్రరావు, ఒద్దిరాజు సోదరులు, సురవరం ప్రతాపరెడ్డి మొదలైన వాళ్ళందరూ ఈ చైతన్య రథాన్ని ముందుకు తీసుకువెళ్లారు, వీళ్ళందరూ శాంతస్వరూపులు. అయితే నాల్గవ దశకం పూర్తియ్యే నాటికే రాజకీయోద్యమంగా కూడా దీనికి పరిణతి ఏర్పడింది. దీని ఫలితంగానే తీవ్రమవుతున్న ఈ చైతన్యాన్ని పలికించడం కోసం తెలంగాణ ఐదవ దశకం ప్రారంభంలోనే ఒక కవిని ఆవిష్కరించుకొన్నది. ఈ కవి బాల్యం, కవితా సాధన అంతా తెలుగువారి పరక్రమానికి, ఆవేశానికి,సృజన శీలానికి, సంస్కృతి ప్రసారణానికీ, కేంద్ర స్థానమైన వరంగల్ పరిసరాల్లో సాగింది. అయితే దశరథి కవిత్వంలో జాతీయత జాలువారిన విధానాన్ని పరిశోధనాత్మకంగా విశ్లేషణ చేయడమే ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం.

కొన్ని శతాబ్దాలుగా తెలంగాణ ప్రజల్లో సప్తభావం పొంది ఉన్న ఈ చైతన్యాన్ని తనలోకి ఆకర్షించుకొన్నాడీ కవి. ఆ కవి కవితా శరిధి “దాశరథి”. దాశరథి అన్న తమ ఇంటిపేరు తోనే ప్రసిద్ధులైన కృష్ణమాచార్యుల కవితా సాధనంతా ఈ చైతన్యాగ్ని విలసితమే.

దాశరథి కవిత్వాన్ని ప్రధానంగా రెండు దశలుగా విభజించవచ్చును. తొలిదశ “అగ్ని ధార”నుండి “మహాంధ్రోదయం” వరకు వ్యాపించి ఉంది.” పునర్నవం” నుండి చేసిన రచనలు రెండవ దశ. తొలి దశలో దాశరథి కవితా యోధుడు. కవిత్వానికి, విముక్తద్యమానికి అభేదాన్ని భావించి ఆచరణలో కొనసాగించిన తొలి తెలుగు కవి దాశరథి. ఇది తెలుగు కవితా చరిత్రలోనే ఒక అపూర్వ

మైన సన్నివేశం. ఈ కాలంలో చేసిన రచనంతా సమిష్టి ప్రజా చైతన్యాన్ని స్పందింపచేసేది. అందుకే కొందరు విమర్శకులు దాశరథికి తెలంగాణకు అభేదం చెప్పడం జరిగింది. ఈ ప్రతీకార్థంలో భావించినప్పుడు భారతదేశ సాహిత్య చరిత్రలో బంకించంద్రుడు "వందేమాతరం" గీత మాలాపించినప్పుడు జాతీయ చేతన్యంతో అభేదాన్ని పొందిన చైతన్యం స్మరణకు వస్తుంది.

దాశరథి అభ్యుదయ భావనలో జాతీయత, దేశభక్తి ఇమిడి ఉంటాయి. దాశరథి అభ్యుదయ కవుల్లో జాతీయ తత్త్వాన్ని అన్వయింప చేసే ప్రయత్నం చేశాడు. ఆ ఉద్యమాన్ని దేశ సంస్కృతికి, పరిస్థితులకు, ఆలోచనా విధానాలకు అనుగుణంగా పరివర్తింప చేసే ప్రయత్నం దాశరథి కవితల్లో సాగింది. "ఇన్ సైక్లో పీడియా ఆఫ్ అమెరికా"లో జాతీయత గూర్చి ఈ విధంగా నిర్వచన ముంది. "ఒకే సంస్కృతి కలిగి, ఒక నిర్దిష్టమైన ప్రాంతంలో నివసిస్తూ తమ ప్రత్యేక అస్తిత్వం పై విశ్వాసం కలిగి ఉండి, సన్నిహిత సంబంధం కలిగిన ప్రజల యొక్క ఒకానొక మానసిక స్థితిని జాతీయత అనవచ్చును".

ఈ జాతీయత వల్లనే తమ జాతీయ యొక్క అభ్యు దయం పై అభిమానం పెరుగుతుంది. మన దేశంలో నివసిస్తున్న ప్రజలందరికీ మనం భారతీయులం అన్న జాతీయ భావం ఉంటుంది. ఈ జాతీయ భావం జాతి నంతటికి ఏక సూత్రంతో బంధిస్తుంది. ఈ దేశంలో విభిన్న మతాలు, విభిన్న భాషలు, విభిన్న కులాలు ఉన్నప్పటికీ అందరూ భారతీయులే అన్న కుటుంబ భావన భారతీయ జాతీయత వల్లనే ఏర్పడుతుంది. ఆనాది నుండి మన దేశంలో "భిన్నత్వంలో ఏకత్వం గా భారతజాతి సమైక్యతా భావంతో ఉంటూ వచ్చింది. ఈ ఏక కుటుంబ భావనకి కారణం భాషా, సంస్కృతి, సంప్రదాయాలలో ఏదైనా కావచ్చు". జాతి కంతటికి ఇది అంత స్సూత్రంలా ఉం టుంది. జాతీయోద్యమ కవితలో భారతదేశాన్ని భారత మాతగా, ఆంధ్రదేశాన్ని (తెలుగు నేలను) ఆంధ్రమాతగా భావించి స్తుతించారు కవులు. బంకించంద్రునికి మాతృదేశం మాతృదేవీ రూపంలో దర్శనమైనట్లు ఆ ప్రేరణ వీరందరిపై కూడా ప్రసరించింది. ఈ లక్షణమే దాశరథి చేత తెలంగాణను కన్నతల్లిగా భావింప చేసింది, తెలంగామంటే అతనికి వల్ల మాలిన ప్రేమ. అతని దృష్టిలో కన్నతల్లికి, కన్న భూమికి అభేదం. కన్నతల్లి కన్నా మిన్నగా జన్మభూమిని భావించారు. ప్రాచీనులకు జన్మభూమి మీద, నదీ నదాల మీద, పర్వతాల మీద, ప్రకృతి మీద ప్రేమ, భక్తి ఉన్న మాట వాస్తవం. ఇందుకు వేదాలలో పృథ్వీ సూక్తం, ప్రకృతి సూక్తం మొదలైనవి నిదర్శనాలు. ప్రాచీనుల కావ్యాల్లో దేశ వైభవ వర్ణన సందర్భంలో జాతీయతా భావాలు దర్శనమిస్తాయి. ఆధునిక కాలంలో ఆంగ్లేయుల దాస్య శృంఖలాల్లో మగ్గిపోతున్న భారత ప్రజానికానికి స్వేచ్ఛ వాయువుల్ని ప్రసరింప చేయడానికి భారత నేతలు చేసిన ఉపన్యాసాల్లో, కవుల రచనల్లో జాతీయతా భావాలు పెల్లుబికాయి. ముఖ్యంగా 1905లో బెంగాల్ విభజన మూలంగా భారతదేశమంతటా ఈ భావం ప్రబలింది. తమదంతా ఒకే జాతి, అదే భారతజాతి అని, తమదంతా ఒకే భావమని అదే భారతీయత అని భావించి తమ దేశ రక్షణ కోసం ప్రజలు ఉద్యమాలు సాగించారు. ప్రజా ఉద్యమాలకు ఊపునదించడానికి రచయితలు తమదైన పాత్రను నిర్వహించారు. ఈ సమయంలో చిలకమర్తి, రాయప్రోలు, దువ్వూరి, గురజాడ, జాషువా మొదలైన కవులు తమ రచనలతో ప్రజల్ని వీరరస పూరితుల్ని గావించారు.

భారత జాతి ఔన్నత్యాన్ని చాటుతూ భారతీయుల శౌర్య పరాక్రమాలను ప్రకటిస్తూ దాశరథి రాసిన కవిత్వంలో భారతీయత ప్రతిఫలిస్తుంది. అయితే దాశరథి కవిత త్రేతాగ్నులచే ప్రభావితం చేయబడి జాతీయత, సామ్యమాదం, ప్రణయతత్వం అనే మూడు పాయలుగా వచ్చి త్రివేణి సంగమం లాగా ఏకమై ప్రవహించింది. దాశరధి కవిత్వంలోని జాతీయతను పరిశీలిద్దాం:

దాశరథి నిజమైన ప్రజాకవి. ప్రజల కష్ట నిష్టూరాలలో తానొకడుగా కలిసిపోయాడు. దాశరధిపై అభ్యుదయ కవితా ముద్ర ఉంది, అగ్నిధార, రుద్రవీణ కావ్యాలు తెలంగాణలోని దారుణ విషాద పరిస్థితులను కళ్ళ ముందు నిలుపుతాయి. ఆ రోజుల్లో "మా నిజాం రాజు జన్మజన్మల బూజు" అనడానికి ఎన్ని గుండెలు కావాలి?

దాశరధి కవిత్వం తెలంగాణ ప్రజల స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రతిబింబం అంటారు దేవులపల్లి రామానుజ రావు.

''అనాదిగా సాగుతోంది అనంత సంగ్రామం అనాథుడికి అగర్భ శ్రీమంతుడికీ మధ్య'' అనే అగ్ని ధారలోని చరణాలు అభ్యుదయ కవితా లక్షణమైన వర్గ సంఘర్షణను సూచిస్తున్నాయి. ఉద్యమ కవిత్వాన్ని పద్యంలో నడపడం దాశరధి ప్రత్యేకత. దాశరధి తెలంగాణలో నవ్య కవికుల గురువు అన్నారు జి.వి సుబ్రహ్మణ్యం. జననీ "జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అన్న వాల్మీకి సూక్తి ఈ భావనకి మూలం. దాశరధి "రుద్రవీణ" కావ్యాన్ని తన కన్న భూమి అయిన తెలంగాణకు అంకిత మిచ్చారు. అంకిత పద్యం ఆరంభంలో "నను గని పెంచి నట్టి కరుణామయి నా తెలంగాణ" అని ప్రారంభించారు. ఇరవై సంవత్సరాల తర్వాత తన "తిమిరంతో సమరం" కావ్యాన్ని తన మాతృమూర్తికి అంకితం ఇస్తూ "నను గని పెంచి నా రుధిర రుద్ర నావములన్ కవితా మరంద వాహిని ప్రవహింపజేసి రసహీన మనో మరుభూమి నందనందనములు నాటినట్టి కరుణామయి''.. అని పేర్కొన్నారు. ఈ రెండు పద్యాల రచనకు మధ్య చాలా కాలం అంతరం ఉన్నా భావ భూమిక ఒక్కటే, రెండు పద్యాల ఎత్తుగడ, వాడిన విశేషణాలను బట్టి చూస్తే కవికి ఇరువురి పట్ల అభేదం కనిపిస్తుంది." కరుణామయి" అన్నది రెంటిలోనూ సమానంగా వాడిన విశేషణం. దాశరథి తెలంగాణను తల్లిగా భావన చేసినట్లు మొదట్లో అనిపించినా అది సంకుచితమైన భావం కాదు. దానిని కేంద్రంగా చేసుకొని అందులో తెలుగు దేశాన్ని, భారత దేశాన్ని మాతృ స్థానంలో భావన చేశారు. అగ్నిధార ఆరంభ పద్యం లోనే భారతదేశాన్ని తల్లిగా భావించి ఆరాధించారు. "ఓ జనతానతాంజలి...అంటూ జెండా ఒక్కటి మూన్నెలది .. దేసం బొక్కటే భారతాఖండా సేతు హిమాచలోర్వర.. తల్లీ మహా భారతీ'' అని జాతీయ సూక్తాన్ని కీర్తించి దేశం మొక్కటే అన్న భావాన్ని వ్యక్తం చేశారు. ప్రగతివాద కవులలో ఇతరులకూ దాశరధికి ఉన్న భేదం ఇక్కడే కన బడుతుంది. మిగిలిన ప్రగతివాద కవుల కవితల్లో సామాన్యమైన వర్గ పోరాటము ,సమసమాజ నిర్మాణ కాంక్ష మొదలగు సిద్ధాంతపరమైన కవితే కనబడుతుంది. కానీ దాశరధి కూడా ప్రగతి వాద తరహా రచనలు చేసినప్పటికీ, ఉద్యమంలో స్వయంగా పాల్గొన్నప్పటికీ మిగిలిన ప్రగతివాద కవుల కంటే భిన్నమైంది, ప్రత్యేకత కనబడుతుంది. అదే ప్రగతి భావనతో పాటు జాతీయోద్యమ వీరావేశం మిన్నెత్తుగా కనబడడం "నా తెలంగాణ కోటి రత్నాల వీణా", "నా తెలంగాణ తల్లి కంజాతవల్లి" "తెలుగు రేగడిలోజిగిమెండు మాతరో" మొదలైన పద్యాల్లో ఈ జాతీయాభిమాన ధోరణి వెల్లడవుతుంది.

ఆధునికులలో జాతీయోద్యమ కవులలో ఉత్కట భావవేశముగల వారిలో విశ్వనాథ తర్వాత దాశరధిని పేర్కొనాలని రామకోటి శాస్త్రి పేర్కొన్నారు. జాతీయోద్యమ కవితలో గత వైభవ స్మరణం అన్నది ప్రధానంగా ఉంటుంది. ''పరధ్యానములో చిక్కుపడిన జాతిని మేల్కొల్పటానికి వారిలో శౌర్యము, పౌరుషము రేకత్తించటానికి జాతి యొక్క పూర్వ వైభవాన్ని జ్ఞప్తికి తెచ్చి ప్రబోధించటానికి వచ్చినవి ఈ దేశాభిమానోద్దీపర కృతులని జాతీయోద్యమ కవితల ఆవశ్యకతను తెలిపాడు మల్లంపల్లి సోమశేఖర శర్మ (మహెూంధ్రోదయము-పీఠిక). పూర్వ వైభవ వర్ణన జాతి యొక్క ఆత్మవిశ్వాసాన్ని పెంచడా నికి అవసరం. ఆత్మ విస్మృతిలోనున్న జాతికి స్వదర్శనం చేయించాలి. అందుకే ఈ కవులు పూర్వపు వీరుల్ని, వారి పౌరుషాన్ని కీర్తించి చారిత్రిక వైభవాన్ని వర్ణించి జాతిని జాగృతం చేశారు. దాశరధి కవితలో ఈ లక్షణం ప్రధానంగా ఉంది. కాపయ నాయకుని ప్రతాపాన్ని వర్ణించి జాతిలో ఉన్న అలసత్వాన్ని పోగొట్టి చురుకుదనాన్ని తట్టి లేపేలా "ఆంధ్ర సురత్రాణుడై ఢిల్లీ సుల్తాన్

వీపు చిట్లించిన వీర మూర్తి వైవిధ్యమున గుండె పగిలి పోయిన జాతి నేకీ కరించిన ఇర్థ కీర్తి"(మహాంధ్రోదయము) అని జాతీయ నాయకుడైన కాపయ నాయకుని వీర మూర్తిని సాక్షా త్కరింపచేశారు. తన దేశంలోని నదీ నదాల్ని, ప్రకృతిని వర్ణించడం కూడా దేశభక్తి కవితకు చిహ్నమే. దాశరథి కవితలో కృష్ణమ్మ పరుగులు,గోదావరి ఉరుకులు, తుంగభద్ర వయ్యారాలు వర్ణించారు.

ఎవరి గజ్జెల రవళివే నీవు మంజీరా
ఎవరి గజ్జెల భాష్పధారవే నీవు మంజీరా
నీవు పారిన దారిలో ఇక్షు దండాలు
నీవు జారిన జాగలో అమృత బాండాలు

అంటూ మంజీరా నదిని వర్ణించారు. గజ్జెల రవళి అనడంలో తరంగ ధ్వనిని ,భాష్పాధార అన్నప్పుడు ప్రవాహ వేగాన్ని ధ్వనింపచేశారు. దేశనాయక స్తుతి అనేది కూడా జాతీయతలో ఒక భాగం. ఇందులో రెండు అంశాలు ఉంటాయి. పూర్వ నాయకులైన శివాజీ, ప్రతాపరుద్రుడు, రుద్రమదేవి మొదలైన వీరుల శౌర్యాన్ని వర్ణించడం ఒకటి. వర్తమానంలోని ఉద్యమాన్ని నడుపుతూ నాయకత్వం వహించిన గాంధీ, నెహ్రూ లాంటి నాయకులను వర్ణించడంతోపాటు, మాతృ దేశ రక్షణకై పోరాడే వీరుల్ని కీర్తించడం లాంటి రచనలు రెండో అంశం లోకి వస్తాయి. దాశరధి రచనల్లో పూర్వ చారిత్రక వీరులైన ప్రతాప రుద్రుడు, కాపయ్య నాయకుడు, రుద్రమదేవి మొదలైన తెలుగు వీరుల పౌరుషాన్ని వర్ణించడం కనిపిస్తుంది. గాంధీ, నెహ్రూ లాంటి జాతీయ నాయకుల స్తుతితో పాటు యుద్ధ రంగంలో ప్రాణాల్ని లెక్కచేయక పోరాడే యోధుల్ని కీర్తించే రచనలు ఉన్నాయి. 1962లో చైనా మన దేశంపై దాడి జరిపినప్పుడు శత్రువులను తరిమికొట్టి భరత మాతను రక్షించుకోవాలని ప్రబోదిస్తాడు. "శ్రీరామచంద్రుణ్ణి రావణాసురుడు యుద్ధంలోకి లాగాడు. కార్తవీర్యుడు పరశురామున్ని కవ్వించాడు". కార్మిక, కర్షక కష్టాలు పోగొడుతుందన్న కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని గద్దె నెక్కించిన చైనా, కర్షక కార్మికుల యోగ క్షేమాల కోసము పాటు పాడే ప్రజాస్వామిక సామ్యవాద శాంతికాముక దేశమైన భారతం మీద దాడి చేసింది. ఇప్పుడు పాకిస్తాన్ లాంటి సామ్యవాద వ్యతిరేక మత దురహంకార నిరంకుశ దేశంతో చేయి కలిపింది. చైనా దాడిలోని కుట్రను బయట పెట్టాడు. మన దేశంపై శత్రువులు దాడి జరిపినప్పుడు యుద్ధ సమయాల్లో కవి దృక్పథం ఎలా ఉంటుందో వివరించారు. "జాతి యుద్ధం చేస్తుంటే కవి ముద్దులను వర్ణిస్తాడా? కవి దేశభక్తుడు రాయడంతో పాటు యుద్ధము చేయడమూ కవిని కదిలిస్తుంది. కవి తుపాకి పుచ్చుకొని సైనికుడై శత్రువు మీదకు దూకుతాడు. దేశపు సరిహద్దుల్ని కాపాడుతాడు. కాపాడుతున్న వారిని కొనియాడుతాడు. ప్రజల్లో, సైనికుల్లో ఉత్సాహాన్ని కలిగిస్తాడు.నరాల్లో రక్తాన్ని పొంగిస్తాడు. తుపాకి రవ్వలను పువ్వులుగా భావించి ఆనందిస్తాడు. భారత మాతృ పాదాలను కవోష్ణ రక్తంతో పూజిస్తాడు. ప్రయోజనం లేని ప్రణయ కవిత కన్నా ప్రయోజనకరమైన ప్రళయ కవితకు స్వాగతం అంటాడు. పై వాక్యాల వల్ల దాశరథి దేశభక్తి, జాతీయాభిమానంతో పాటు సాహసం, జాతీయ వీరావేశం స్పష్టమవుతాయి. యుద్ధం చేస్తూ శత్రువుల నెదుర్కొన్న' 'వీర మూర్తిని'

భరత వీర సైనికుడు
ప్రళయ కాల శంకరుడై
ఢమరువు మ్రోగించినాడు
త్రిశూలమును విసిరినాడు
త్రి నేత్రాగ్ని కురిసినాడు
ఇక భరత జాతి నెవరు ఎదిరింపగ లేదు లెమ్ము
ఇక భరతమాత నెవడు జడపింపగా లేదు లెమ్ము

అని భరత వీరుల్ని కీర్తించారు. 1977 ఆగస్టు 15న నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు గారు దాశరధిని ఆంధ్ర ప్రదేశ్ ఆస్థాన కవిగా నియమించారు. ఇతడే చివరి ఆస్థాన కవి.. వీరు 1948 జనవరి 3వ తేదీన జైలులో శిక్ష అనుభవిస్తున్నప్పుడు నాటి నిజాం నిరంకుశ పాలనను నిరసిస్తూ ఈ విధంగా రాశాడు.

"చేతులారగ నీవు పెంచిన
స్వతంత్ర నాగవల్లికయె విషనాగమయ్యె
నీ గళము చుట్టి ప్రాణాలు లాగివేసే
భారతీయుల గౌరవ ప్రతిభ మాసే"

ఎందరో వీరులు పోరాడితే,త్యాగమూర్తుల ఆత్మార్పణ ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. నిజాం పాలనలో హైదరాబాద్ రాష్ట్రంలో ప్రజలకు స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు లేవు. దేశమంతటా సంబురాలు జరుపుకుంటుంటే తెలంగాణ ప్రాంతంలో ఎదిరించిన వారి బతుకు జైలు పాలు అవుతూ భారతదేశ గౌరవ ప్రతిభౌన్నత్యాలకు మచ్చపడుతున్నదని దాశరధి ఆవేదన చెందాడు. దాశరధి గారు 1981 లో రచించిన ఖండకావ్యం

“ధ్వజమెత్తిన ప్రజ” ద్వారా ప్రజలను ఉత్తేజితులను చేసి మరో ప్రపంచం వైపు తీసుకువెళ్లారు.

“జాతి అంతా శ్రమిస్తేనే
సాహసంతో చర్చిస్తేనే
దరిద్రాన్ని రూపుమాపి
చరిత్రను సృష్టించగలము
నేను శ్రామిక జనార్ధనుణ్ణి
నేను కార్మిక వ్యతిరేకి కాళియ మర్దనుణ్ణి
నేను సామాన్య ప్రపంచ పౌరుణ్ణి
అయినా నేను అసమాన్య ప్రజా వీరుణ్ణి “ అంటాడు.

శ్రీ శ్రీ మహాప్రస్థానం అంటే దాశరథి మరో ప్రపంచం వైపుకు ప్రజావళి కదలాలి అని పిలుపునిచ్చారు. సోమరి తనం మాని శ్రమైక జీవన సౌందర్యం విలువను తెలుసు కోవాలని అప్పుడే దేశ సంపద పెరిగి ఆర్థికాభివృద్ధి జరిగి తద్వారా సమాజాభివృద్ధిని సాధించవచ్చన్నారు దాశరథి. తాను శ్రమైక జీవితాల నాయకుడినని, కార్మిక వర్గ విధానాలను సంహారించేవాడినని సామాన్య పౌరుడినే అయినా ఆ సామాన్య ప్రజల కోసం అసామాన్య ధైర్య సాహసాలతో పోరాడతానన్న ప్రజాకవితా వీరుడు దాశరథి. ఆనాటి ఓరుగల్లు చరిత్రను, రుద్రమదేవి శౌర్యాన్ని గురించి తన రుద్రవీణలో ఇలా పేర్కొన్నారు.

“వేయి స్తంభముల గుడి వ్రాయించుకొన్నది
నా చేత ఏకశిలా చరిత్ర
వీర రుద్రమదేవి వినిపించుకొన్నది
నా చేత జన్మజన్మల కథలు
పోతన్న కవి కలబోయించుకొన్నాడు
నా చేత నేటి ఆనాటి కవిత
ముసునూరి కాపన్న మ్రోయించుకొన్నాడు
నా చేత క్రాంతి వీణాచయము”

ఈ అన్నింటిలోనూ జాతీయత జాలువారిన తీరును గమనించవచ్చు.

“వీరంగం వేస్తుంటే రాదు విప్లవం
తారంగం పాడుతుంటే రాదు సమరథం
అందుకోసమే నేనంటాను
ఏ లేహ్యం తిన్నా గాని రాదు యౌవనం
రక్తం నదులై పారకపోతే రాదా రెవల్యూషన్!
శాంతి ఒక్కటే మానవజాతికి సరియగు సాల్వేషన్”
ఇది దాశరథి దృక్పథం.

వీర తాండవం చేస్తూ జబ్బలు చరుచుకుంటే విప్లవం రాదన్నారు దాశరథి. చిన్న పిల్లల ఆట కాదు సమసమాజ స్థాపనకై చేసే పోరాటమంటే,జరిగిన ప్రజా చారిత్రక నష్టం తిరిగిరానిది. అయితే నూతన సమాజం సిద్ధింపబడాలంటే హింసయే మార్గం కాదు, శాంతి, అహింస లే సరియైన మార్గ దర్శకత్వం వహిస్తాయని స్పష్టంగా ప్రకటించిన ప్రజాశ్రేయాభిలాషి దాశరథి. తెలుగు తనానికీ, భారతీ యతకు దాశరథి త్రికరణశుద్ధిగా ప్రతినిధిగా నిలిచారు. ఒక్క భారతదేశంలోనే కాదు బంగ్లాదేశ్, వియత్నాం వంటి దేశాల్లో ఎక్కడ ఏ ప్రజా ఉద్యమాలు బయలుదేరిన ఉద్విగ్న హృదయంతో, ఉత్తుంగ చైతన్యంతో తన కలం నడిపారు, గళం విప్పారు.ప్రపంచ ప్రజా ఉద్యమాలు ఆయనను కవిగా నడిపించాయి. స్వాతంత్ర్యం, సమానత్వం సౌభ్రాతృత్వం విలువల కోసం నిరంతరం పోరాడిన కవిగా దాశరధికి తెలుగు సాహితీ ప్రపంచంలో సమున్నత స్థానం ఉంది. మొత్తంగా దాశరథి కవిత్వ ప్రవాహంలో ఒక ముఖ్యమైన పాయ జాతీయాభిమానం.

**ఉపయుక్త గ్రంథాలు :**


1. సాహిత్య ప్రపంచంలో దాశరథి - గంటా జలంధర్ రెడ్డి
2. దాశరథి కవితా సమాలోచనం - మాదిరాజు రంగారావు
3. అగ్నిధార ( ఖండకావ్యం), దాశరథి సాహిత్యం (కవిత్వం-2) - దాశరథి కృష్ణమాచార్య
4. దేశభక్తి గీతాలు- సేకరణ పి.నారాయణరెడ్డి
5. పాలపిట్ట (మాసపత్రిక) - తెలంగాణ ప్రత్యేక సంచిక


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# దాశరథి సాహిత్యం సామాజిక స్పృహ



- డా॥. ఉకర వెంకటరమణ

టీజీటి, తెలుగు విభాగం, ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, తామాడ, శ్రీకాకుళం జిల్లా.

అభ్యుదయ కవితా చక్రవర్తి దాశరథి కృష్ణమాచార్య 1925 జులై 22న మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరు గ్రామంలో జన్మించారు. ప్రస్తుతం ఈ గ్రామం మహబూబా బాద్ జిల్లాలో ఉంది. బాల్యం ఖమ్మం జిల్లా మధిరలో గడిచింది. ఉర్దూలో మెట్రిక్యులేషన్‌ను పూర్తిచేసి తర్వాత ఇంటర్మీడియట్, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఇంగ్లీషు సాహిత్యంలో బి.ఏ చదివారు. సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో మంచి పండితుడు. చిన్నతనం లోనే పద్యం అల్లటంలో ప్రావీణ్యం సంపాదించాడు. ప్రారంభంలో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా ఉండి రెండో ప్రపంచయుద్ధం సమయంలో ఆ పార్టీ వైఖరి నచ్చక ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి హైదరాబాదు సంస్థానంలో నిజాం అరాచక ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో పాలుపంచుకున్నాడు. దాశరథి మహాకవి, బహుభాషావేత్త, పండితుడు, ఆచంచల దేశభక్తుడు, మహావక్త, అన్నింటిని మించి గొప్ప మనవతామూర్తి. దాశరథిని గురించి కాని, వారి రచనలను గురించి కాని తెలియని వారు అరుదు. అతడు సాహిత్యంలో చేసిన కృషి అలాంటిది. అతడు చేసిన సాహిత్య సృష్టి అనితర సాధ్యం. తెలంగాణాను సాహిత్యంలో ప్రవేశపెట్టిన తొలి యోధుడు దాశరథి అని చెప్పవచ్చు. దాశరథి జీవితంలో దాపరికాలు లేవు. అతని జీవితం తెరచిన పుస్తకం.

**రచనలు :**

అగ్నిధార, అమృతాభిషేకం, దాశరథి శతకం, రుద్ర వీణ, కవితా పుష్పకం, తిమిరంతో సమరం, మహాంధ్రో దయం, నవమి, ఆలోచనాలోచనాలు, పునర్నవం, నవమంజరి, గాలిబ్ గీతాలు మొదలగునవి రాశారు.

పాశ్చాత్య సాహిత్యం అప్పుడే ఆకళించుకున్నాడు. వాటి పుణ్యమా అని "మనం జనం, జనం మనం, జనం లేంది మనం లేదు" అనే జ్ఞానం ఉదయించి ప్రజలతో పాటు పోరాటంలోకి ఉరికాడు. పీడిత ప్రజావాణికి మైక్ అమర్చి అభివాదులకున్ వినపింపచేసిదన్ అని ప్రతిజ్ఞ చేశాడు. 'నాది ఈ దేశం, నేను దీనిని పాలించాలి' అనగలగాలంటే చాలా దమ్ములుండాలి. "నా తెలంగాణ కోటి రత్నాల వీణ" అనుకోవడం ప్రాంతీయాభిమాన దుర్విలసితం కాదనీ, ఆత్మగౌరవ ప్రబోధన ప్రచురణం అనీ తనకు సులువగానే తెలిసిపోయింది. ముప్పై ఏళ్లకు పైగా, ఎక్కిడిన విల్లును దించకుండా శరపరంపరంగా కవితలను తెలుగు గుండెలకు సూటిగా గురి చూచి పూ బానాలను వదులిన కవి దాశరథి. "తమసో మాజ్యోతిర్గమయ" అన్న

వేదర్షి వాక్కే నేటికీ కవుల ధ్యేయం. అక్షయ తూణీరం ప్రతి కవిదీ కావాలి. ప్రతి మనిషి ఎదులోనూ చైతన్యం చిమ్ముకొని వచ్చేలా చేయాలి.

"నీవు రావన్నాయి మ్రోళ్ళు /నీవు లేవన్నాయి ముళ్ళు
నిజం, నిజమన్నాయి రాళ్ళు / నమ్మ లేకున్నాయి నా కళ్ళు"

అనే ఈ కవితా యనికలోని తొలి నాలుగు పంక్తులు చాలు.

"తిమిరంతో ఘన సమరం / జరిపిన బ్రతుకే అమరం
కవితా తోజో వలయం / అవని శాంతికది నిలయం"

కవితా శరథియైన దాశరథి కలం నుండి వెలువడ్డ కవితా తరంగం ఇది. 'తమ సోమా జ్యోతిర్గమయా' అని ఆలపించిన అర్షకంఠం నాటి నుండి నేటి దాశరథి దాక ప్రపంచంలో అవిశ్రాంతంగా సాగుతున్న పోరాటం ఈ తిమిరంతో సమరం. మానవ జీవితం సాధించే చివరి మెట్టు అమరత్వం. అమరత్వం అనవరత సమర సంకేతం. చీకటితో చేసిందే సమరం. తిమిరమంటే అజ్ఞానం కావచ్చు. అహంకారం కావచ్చు. నిర్దయ కావచ్చు! పరులను దోచు కోవటం కావచ్చు, శత్రు వ్యూహం కావచ్చు, మిత్రద్రోహం కావచ్చు. స్వార్థం కావచ్చు. 'మానవత్వం గెలుస్తున్నది దానవత్వం ఓడుతున్నది - ఆవనిలో హృదయాలలో గల అంధకారం వీడుతున్నది' - దాశరథి.

'మా కర్తవ్యం మీరు నిర్వహించండి, లోకానికి నిజం తెలియచెప్పండి' అని ధర్మగీతను ఉద్భోధిస్తాడు. "హంస నుండి సమసమాజ హంస ఉద్భవించుననే. అసత్యాన్ని నమ్మకు హంతకుడవుకాబో కవి హెచ్చరిస్తాడు. యువ శక్తిని 'నిన్నునీవు తెలుసుకొని, నీ కన్నులు తెరుచుకొని, విజృంభించినప్పుడే విప్లవమని నేనంటా'ని తాను నమ్మిన సత్యాన్ని నిర్మాగమాటంగా ఉద్ఘాటించాడు. నిరాశా దురాశలు నిరంతరం దాడి చేస్తున్న ఈనాడు దాశరథి నిస్సందేహంగా నిలిచిన ఆశావాది.

"వీరంగం వేస్తుంటే రాదు విప్లవం / తారంగం పాడుతుంటే రాదు సమరథం
అందుకోసమే నేనంటాను / ఏ లేహ్యం తిన్నాగాని రాదు యౌవనం"

"రక్తం నదులై పారకపోతే రాదా రెవల్యూషన్?/
బుర్రలు బుర్రలు పగులక సమస్యకు లేదా సొల్యూషన్?
హింసా, యుద్ధం ఔడేటెడ్ అనినేంటాను, /
శాంతి ఒక్కటే మానవ జాతికి సరియగు సాల్వేషన్!"

దాశరథి "పునర్నవం" కావ్యంలో "జ్యోతిశ్చక్రం" ఖండికను 'ఓపెరా' విధానంతో రచించేరు. ఇందులో తూర్పు, శరథి, దక్షిణం, కాలం, భవిష్యత్తు, పడమర, ఉత్తరం, స్వస్తి అనే విభాగాలున్నాయి. వీరు ప్రారంభంలో ప్రపంచానికి శుభం పలికి, మమా ప్రభాతాన్ని వర్ణించేరు. స్వాతంత్ర్య సాధనకు ప్రాణాలు త్యజించిన మహావీరుల త్యాగమార్గమే దివ్యజనావళికి పురోగమన మార్గమని వీరు సూచించేవారు.

"పూలు పూయాలి, పూచి తీరాలి / వెలుగు రావాలి, వచ్చి తీరాలి
జయం కలగాలి, కలగి తీరాలి / జనం బ్రతకాలి, బ్రతికి తీరాలి"

పూలు పూయడం, వెలుగు రావడం, జయం కలగడం, జనం బ్రతకడం అన్నవి దాశరథిలోని అభ్యుదయ భావాలు. ప్రతీ ప్రగతికామికి, ప్రగతిగామికి జయం కలుగుతుందన్నది ఆయన విశ్వాసం.

'నాలో త్రేతాగ్ని, జ్వలిస్తుంది. చైతన్యాన్ని వరిస్తుంది' దాశరథి ఆత్మిక జీవితంలో ప్రజ్వరిల్లిన త్రేతాగ్ని సమాజ శ్రేయస్సుకై వెలిగి వెలికి వచ్చింది. 'నియంతల మీద, నియంతృతత్వం మీద, హింసమీద, హింసావాదుల మీద, శుష్క రాజకీయ వాదుల మీద, మాట బుడుగల మీద, అసత్య ప్రమాణాల మీద, సంకుచిత భావాల మీద, అజ్ఞానం మీద, పెన్నె గన్నుగ తిమిరింతో సమరానికి దిగాడు. కాని ఈ సమరంలో పెన్ను జేబులో పెట్టి, గన్ను చేపట్టడానికి సిద్ధమేనని వ్యక్తపరిచారు. దాశరథీ నాటికీ, నేటికీ చైతన్య సారథి".

1947లో ఈయనను ప్రభుత్వం అరెస్టు చేసింది. అప్పుడాయనకు ఇరవైయేళ్ళు నిండనేలేదు. వరంగల్, నిజామాబాద్, హైదరాబాద్ జైళ్ళు తిప్పారు. నాజీ జైళ్ళను విలాచిన నైజాం జైళ్ళవి. "వెన్నెలలు లేవు. పున్నమి

కన్నెలేదు. పైడి వెన్నెల నెలవంక జాడలేదు. చుక్కలే లేవు. ఆకాశశోకవీధి, ధూలు రామము దుఃఖ సంగ్రామ భూమి" అన్నాడు. జైలులో, హంతలు, నియంతలు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా తన కవితా కత్తివాదరకు గురిచేశారు దాశరథి.

"మానవత్వం గెలుస్తున్నది / దానవత్వం ఓడుతున్నది
అవనిలో హృదయాలలో గల / అంధకారం వీడు
తున్నది' అని అంటారు.

ప్రపంచంలో వర్గ భేదం, వర్ణ బేధం, మతోన్మాదం, ధనికవాదంపై ఆయన స్పందించి అనేక రచనలు చేశారు.

"తెలంగాణ రైతుఏ ముసలి నక్కకు రాచరికమ్ము
దక్కునే"

"మా నిజాం రాజు జన్మ జన్మాల బూజు" నా తెలంగాణ కోటి రతనాల వీణ అని తెలంగాణ చైతన్య ప్రదీప్తిని కోటి కిరణాలతో వెలయించినవారు దాశరథి. "నా పేరు పూజాకోటి - నా ఊరు ప్రజావాటి" కవిత్వమంటేనే తిమిరంతో సమరం "తమసోమా జ్యోతిర్గమయ" అనే ఉపనిషద్వాక్యానికి సాభిప్రాయం తిమిరంతో సరం మొదటి ఉపదేశ ప్రాయమైన సత్యం. రెండవది కార్య చరణ రూపమైన సత్యం. మొదటి ఆశయం. రెండవది ఆచరణ. పైకి ధరణిలా కనబడతాను. లోన జలధిలా పెరుడెతాను. నేను గన్ను పట్టాలంటాను. కాని పెన్నుతో కలలు కంటాను".

"నా నరాల్లో అగ్ని చల్లారలేదు. త్రేతాగ్ని జ్వలిస్తోంది.
చైతన్యాన్ని వరిస్తోంది".
"మనశ్శాంతి లేనినాడు మనిషి మనకి దేనికి?
స్నేహ సుధలు లేనినాడు జీవితమది ఎందుకు?"
అని వాపోతారు.

"నాకు కావలసింది రెండు కళ్లు. కరగగల కళ్లు. వెలగ గల కళ్లు. ఆ కళ్లు కోసం లక్ష దీపావళులు దాటి వెళతాను" అని భంగ్యంతరంగా శాంతి, అభ్యుదయములనే ఆకాంక్షిస్తారు. నమ్మిన సిద్ధాంతాలకు వమ్మాయి - పోయిన అజ్ఞాత యోధునిపై కవికి సానుభూతి ఉంది. "డబ్బు రుబ్బురాయి కింద నలిగేడాబు సరీ సమాజం కన్న రెక్కాడితే డొక్కాడే నిరుపేదల నిండుగుండె మిన్న" అని కవి శ్రమజీవుల పక్షంవైపే మొగ్గు చూపారు.

"గడియారం నడవని పాతకోట గోడకన్న / సూర్యుణ్ణి
ఉరికించే ఫ్యాక్టరీ కూత మిన్న"

అని కాలం చెల్లిన వ్యవస్థపై పారిశ్రామిక విప్లవం తీసుకువచ్చిన అభ్యుదయాన్ని హర్షించారు. కోటి కిరణాలన్ను సూర్యుణ్ణి గుటుక్కున మింగేసే చీకటి మనిషిలోని అజ్ఞానపు చీకటి మనసులోని అహంకారపు చీకటి నీ ముందు నిజాన్ని నీకే కనపడనివ్వదు. నీలోని లోపాన్ని నిన్నే చూసుకోనివ్వడు అని చీకటి తత్వాన్ని చెబుతూ దాన్ని మటుమాయం చేసే ఆశాజ్యోతి. మానవతావాదం మీద మునివి. నీతి అని చీకటిని పారద్రోలే ఉపాయమూ కనుగొన్నారు. దాశరథి స్నేహశీలి, దయార్ధ హృదయుడు. ఆయన స్నేమం గురించి ఇలా గానం చేశారు.

"దోస్తీని మించింది లేదు లోకాన / రత్నాలకంటే అది
మిన్న తుకాన
మిత్రుడే కావాలి సుఖమున శోకాన / అతడు
లేకున్నచో నగరమే కాన

ఈ విధంగా తన ఆశయాన్ని, ఆదర్శాన్ని అన్ని సందర్భాలలోను ధైర్యంగా ప్రకటించాడు. కాంతి పతకాలు ఎత్తి, కాంతి బకాలూది, అందమైన పదాలు పాడి చైతన్యపు దారుల్లో లక్ష్యసాధన కోసం మనల్ని వడివడిగా నడిపించిన ఘనుడు మన దాశరథి.

"తుపాకీ హతం చేసే కృపాకేల వెలగించు / మర తుపాకి మాటను మరచిపో మధురమైన చెరకు గడను / చేత బూని కదలిరా" "విప్లవ మంటే మృత్యువు / విలయ తాండవ కాదు. విప్లవ మంటే బాంబుల / వికటాట్టహాసం కాదు" అంటూ గానం చేసిన దాశరథి ఎంతటి శాంతి కాముకుడో తెలుస్తుంది. హృదయాల్లో విప్లవాలు ఎదగాలని ఎలుగెత్తి చాటాడు.

**దాశరథి సినిమా గేయం :**

మూగవోయిన కోటి తమ్ముల గళాల / పాట పలికించి
కవితా జవమ్ము కూర్చి
నా కలానకు బలమిచ్చి నడిపినట్టి / ఈ తెలంగాణ
కోటి రత్నాలవీణ...

జోతలివే దాశరథి... కవితా మృత వార్నిథి / బడుగు జీవి కళ్ళలోని బడు బాగ్నుల ప్రతినిధి నిజాం రాజు పాలనపై శిమెత్తిన రుద్రవీణ / నిజామాబాద్ జైలులోన అక్షరాల అగ్గివాన భూస్వామ్యం బూడిదపై నర్తించిన కవనహేళ / విమోచన ద్యోమ గళాన వికసించిన పద్యమా గడ్డిపోచలకు సైతం నేర్పినావు ఖడ్గ గుణం / గర్జించే పద్యాలతో తీర్చినావు తల్లిరుణం తెలంగాణ మీడియాపై నువు పలికిన చరణాలు / చారిత్రక సంధ్యలలో దారిచూపు కిరణాలు.

**భావం :**

మూగబోయిన తెలంగాణ తమ్ముల గళాల పాటను పలికించినది దాశరథి. తన కలాలకు బలమిచ్చి నా తెలంగాణ కోటి రత్నాల వీణ బడుగు ప్రజల జీవితంలో బడబాబులున్నారు. నిజామాబాద్ జైల్లో అక్షరాల అగ్నివాన కురిపించారు. తల్లిరుణం తీర్చిన తెలంగాణ చారిత్రక సంధ్యలలో వెలుగు కిరాణాలున్నాయి.

**తెలంగాణ కవితలో..**

నా తెలంగాణ తల్లి కంజాతవల్లి / నా తెలంగాణ కోటి అందాల జాణ
నా తెలంగాణ వేమ సౌందర్య సీమ / అంటూ పరవశించాడు.

“పునర్నవం” దాశరథి అభ్యుదయ కవితా ఖండికల సమాహారం. తన రచనల ద్వారా తెలంగాణను మేల్కొల్పిన వైతాళికుడు దాశరథి. ‘మహాబోధి’ కావ్యాన్ని మిత్రులు, బహుబాషా కోవిదుడు. సాహిత్య బంధువు అయిన బూర్గుల రామకృష్ణారావు గారికి అంకితమిచ్చారు. ప్రముఖ ఉర్దూకవి గాలిబ్ గజళ్ళను ఆటవెలది, తేటగీతి, ద్వీపదలలో ‘గాలిబ్ గీతాలుగా రచించిన ప్రముఖుల నుండి, సామాన్యుల నుండి ప్రశంసలు పొందారు దాశరథి. ‘అమృతాభిషేకం కవితలా సంపుటిని 1959లో బెజవాడ గోపాల్రెడ్డికి అంకితమిచ్చారు. నంద కద వాప్రస్తుకంలో భాష గురించి చెప్పారు. మరి బెజవాడ గోపాల్రెడ్డికి అంకితముద్రం మంచి కవి ఎవరైతే అతడు నా మిత్రుడు నిజమైన నాగరికునిక్ భాషాభేదాలుండవు భేదాలను అతీతమైంది నిజమైన భాష నాకు ఉర్దూ, తెలుగు రెండు కళ్లు, హృదయం ఒకటైతే లోకమంతా ఒకటేనన్నారు. ‘కవితా పుష్పకం’ ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డును అందుకుంది.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. సాహిత్య ప్రపంచంలో దాశరథి - డా॥. గంటా జలంధర్రెడ్డి.
2. దాశరథి కవితా సమాలోచనం - ముదిరాజు రంగారావు.
3. అగ్నిధార - (ఖండకావ్యం), దాశరథి సాహిత్యం (కవిత - 2), రుద్రవీణ, పునర్నవం, అమృతాభిషేకము, తిమిరంతో సమరం కవితా పుస్తకం, పూలపాటలు - లిలితా గీతాలు - దాశరథి కృష్ణమాచార్య.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# పదార్థం వ్యాసాల్లో బెల్లి యాదయ్య విమర్శా దృక్పథం



- డా॥. బి. నర్సింహ

- డా॥. జి. మహేందర్



'All great poets naturally and fatally become critics'

*- Charles Baudelaire*

రచన సాహిత్యకారుడి హృదయం. విమర్శ క్రియాశీల పాఠకుడి మేధస్సు, సారస్వత క్షేత్రానికి కాలానుగుణంగా రచయితలు, కవులు జత అవుతుంటారు. సాహిత్య విమర్శా రంగానికి విమర్శకులు చేర్పు అవుతుంటారు. గొప్ప కవులందరూ సహజాతి సహజంగా విమర్శకులు అనే బోదలైర్ మాటకు నిదర్శనంగా డా. బెల్లి యాదయ్య సృజనకే పరిమితం కాకుండా ఏక కాలంలో విమర్శనూ రాస్తూ వస్తున్నారు. ఈయన ప్రగతిశీల భావుకుడు. బహుజన సిద్ధాంత నిబద్ధుడు. వీరు తమ సాహిత్య విమర్శ వ్యాసాలను 'పదార్థం' పేరుతో సంకలనం చేశారు. నేను గొర్రెల్ని కాస్తుంటాను, బోధి వృక్షం, మా ఊరు అట్లా లేదు, విభాజకం, తర్జుమా, కల వస్తే బాగుండును కవితా సంపుటాలు, రెక్కల మనిషి (డ్రైవర్ మల్లయ్య - జీవిత చరిత్ర), పిల్లలకేం కావాలి - పిల్లలేం కావాలి, చదువులకల (అభ్యసన వ్యాసాలు) డా. బెల్లి యాదయ్య గారి ఇతర రచనలు. 2017 సంవత్సరంలో నవ తెలంగాణ దిన పత్రికలోనూ దక్కన్ ల్యాండ్ మాస పత్రికలోనూ 'పదార్థం' కాలమ్ నిర్వహించి తెలుగు సాహిత్య విమర్శకు, దృక్పథానికి కొత్తపుంతను జోడించారు. పదార్థం కాలమ్ వ్యాసాలే కాకుండా గత ఇరవై ఏండ్లుగా పత్రికలకు రాసిన వ్యాసాలు, వివిధ గోష్ఠులలో సమర్పించిన పరిశోధన పత్రాలు, సాహిత్య సమావేశాల్లో మాట్లాడిన ప్రసంగ వ్యాసాలు, వివిధ భాషల్లోని కవులు రచయితలను గురించి పేర్కొన్న విషయాలు పలువురి పుస్తకాలకు రాసిన ముందుమాటలు, స్వీయ కవితా సంపుటాలకు రాసుకున్న ఇంట్రోలు వేటికవే ప్రత్యేకమైనవి. వీటినన్నింటిని ఒక గుచ్ఛంగా కూర్చిన 'పదార్థం' పుస్తకంలోని డా. బెల్లి యాదయ్య విమర్శనా దృష్టి, పరిశోధనా దృక్పథం సాహిత్య ప్రపంచానికి, పరిశోధకులకు ఉపయోగ పడుతుంది.

క్రీశ. 6వ శతాబ్ది ఆలంకారికుడైన భామహుడు శబ్దార్థౌ సహితౌ కావ్యమ్' అని సాహిత్య స్వరూపాన్ని నిర్వచించారు. 17వ శతాబ్దానికి చెందిన జగన్నాథుడు "రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యమ్" అన్నారు. భారతీయ అలంకార శాస్త్రంలో కావ్య స్వరూప చర్చ ధ్వని సిద్ధాంత చర్చ అంతా పదం - అర్థం రెండింటి కేంద్రీకృతంగానే కొనసాగింది. 'కవిత్వ శాస్త్రమైన అలంకార శాస్త్రం ఎప్పటికప్పుడు పూరణలు, సవరణలు చేసుకుంటూ అభివృద్ధి చెంద వలసిన శాస్త్రం" అంటారు డా. బెల్లి యాదయ్య సాహిత్య

సిద్ధాంతానికి, అనువర్తిత విమర్శకు చేర్పులను ప్రతి పాదిస్తున్న ఈ వ్యాసాలను పదార్థం అన్నారు. "పదార్థం అంటే తెలుగు వాళ్లందరికీ తెలిసిన అర్థం 'వస్తువు' అని. కానీ, తెలంగాణాలో ప్రత్యేకించి కుటుంబ వ్యవహారాల్లో మీ వాళ్లు ఏం పదార్థం పెట్టిండ్రు? ఏం బంగారం తింటిని?' అని వ్యంజనార్థంలో ప్రయోగం ఉంది. ఈ వ్యంజనార్థాన్ని నేను రాస్తున్న సాహిత్య విమర్శలో ఆయా రచనల 'sense and essense & positive meaning'లో 'పదార్థం' అని నిర్ణయించాను. పత్రికల్లో కాలమ్ నిర్వహించాను. సంక్షిప్తంగా చెప్పాలంటే 'పదార్థం' అంటే 'Great matter' అని నా మనసులోని అర్థం" అంటారు బెల్లి యాదయ్య. సమాజం, రచయిత, పాఠకుడు, కేంద్రంగా చర్చను కొనసాగించే ఒక్కో వ్యాసం ఒక్కో విలువను పొదిగున్నది. అందుకనే ఈ సంపుటికి పదార్థం అనే పేరు సముచితమూ సార్థకమూ అని చెప్పవచ్చు.

ఆంగ్లంలో ప్రాక్టికల్ క్రిటిసిజానికి ప్రసిద్ధుడైన ఐ.ఏ. రిచర్డ్స్ లాగా బెల్లి యాదయ్య కూడా అధ్యాపకుడు, విమర్శకుడు. తనకు ఇష్టమైన స్థలాలు పొలం, బడి అని చెప్పుకున్నారు. తరగతి గదిలో సాహిత్య విమర్శ బోధించే క్రమంలో, పరిశోధకులకు మార్గదర్శకత్వం వహిస్తున్న నేపథ్యంలో విమర్శ వ్యాసాలు రచించారు. టెక్స్ట్ అండ్ కాంటెక్స్ట్ వీరి పాఠానికి రెండు వైవిధ్యాలు. సాహిత్య విద్యార్థులకు కొత్త విషయాలను నేర్పాలనే తపనతోనే పఠనం, సాహిత్య అధ్యయనం, శాస్త్రీయ స్పృహ, కథా వాచకం, పఠనీయతా నియమాలు' లాంటి వ్యాసాలు రాశారు. పరిశోధక విద్యార్థి విషయ సేకరణలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇష్టా గోష్టిలో జర జాగ్రత్త వ్యాసంలో వివరించారు. కేవలం పరిశోధకులకు, విద్యార్థులకు మాత్రమే కాకుండా సృజన కారులకు బోధించే పాఠాలుగా 'పాఠకాదరణ, అభ్యుదయ సృజన, రచనా మెరుగుదల, సాహిత్యంలో మూస వల్ల నష్టాలు, మనోహరత, పఠనీయతామితి' వ్యాసాలు రాశారు.

సాహిత్య విమర్శ గొప్ప సామాజిక బాధ్యత. ఆ బాధ్యత నిర్వర్తించడానికి విమర్శకుడికి పాండిత్యం అవసరం. తెలుగు, ఆంగ్లం, సంస్కృతం, హిందీ భాషా సాహిత్యాల్లో బెల్లి యాదయ్య సాధికారికమైన పాండిత్యం మనకు ఈ వ్యాసాల్లో కనిపిస్తుంది. సంస్కృత సాహిత్యం, అలంకార శాస్త్రం నుండి శ్లోకాలను, సూక్తులను ఉటంకిస్తూ వర్తమానానికి అన్వయించి ప్రతిపాదించ తలచిన సిద్ధాంతానికి తగిన ఉపపత్తులను చూపించారు. ఆంగ్ల సాహిత్య విమర్శా పద్ధతులు లోతులు తెలిసినందువల్లే తెలుగుసాహిత్య విమర్శకు అంతకు ముందు పరిచయం లేని "విమోచనవాదం, విజ్ఞాన వాదం" లాంటి నూతన సిద్ధాంతాలను పరిచయం చేశారు. 'భాషా సమున్నతే మాండలికం, మన భాషకు గిట్ల వ్యాకరణం రాయొచ్చు' వ్యాసాలు యాదయ్య గారికి భాషాశాస్త్రంలో గల వైదుష్యాన్ని నిరూపిస్తాయి.

తెలుగు సాహిత్య విమర్శ పాటను విస్మరించింది అని తెలియచేస్తూ "పాట సాహిత్యం మీద గాని, దానిని విశిష్ట ప్రక్రియగా గుర్తించే విషయంలో సాహిత్యంలో చర్చనే లేదు. పండిత సంప్రదాయం నుంచి పరికరాలను తెచ్చుకోవటం వలన సాహిత్య విమర్శ ఈ పరిమితికి గురైంది. పాటను తూచే స్థాయికి సదరు పాండిత్యం చేరుకోలేదు" (ఏ.కె.ప్రభాకర్ (సం) బహుళ. పుట. 306) అని తెలుగు సాహిత్య విమర్శ పరిమితిని ఆచార్య చింతకింది కాశీం వివరించారు. సాహిత్య విమర్శలో గల ఈ వెలితిని పదార్థం పూరిస్తుంది. చింతల యాదగిరి 'తీగోనాగో ఎన్నియలో' పుస్తకానికి రాసిన ముందు మాటలో పాట విమర్శకు కావాల్సిన పరికరాలను అందించారు. కవిత్వ నిర్మాణం కన్నా పాట అల్లిక ఎలా భిన్నమైందో వివరించారు. పాటకు ఉన్న సామాజిక ప్రయోజనాన్ని, ప్రజా వాగ్గేయకారుల విశిష్టతను వివరిస్తూ గద్దర్‌ను 'నిరుపేదల సమర గీతం'గా నిలబెట్టారు. బహుజన అస్తిత్వ వాదానికి పాట దోహద పడిన విధానాన్ని తెలియ చేస్తూ 'తెలుగు పాట బి.సి. అస్తిత్వం 'వ్యాసం వెలువరించారు. 'పోరు బాట - నేటి మాహా నాటకం' వ్యాసంలో పాట కళా రూపాల సామాజిక ప్రయోజనాన్ని వివరించారు. 'పాట వయస్సు భూగోళం వయస్సు ఒకటే అని పాట చరిత్రను, నేపథ్యాన్ని వివరిస్తూ 'గజ్జె కట్టడం కోసం ఎదురు చూస్తున్న పాట' ఆత్మను

పట్టుకున్నారు. బతుకమ్మ పండుగను సామాజిక శాస్త్ర కోణంలో చర్చిస్తూ బతుకమ్మ పాటలో స్త్రీల మనస్తత్వాన్ని, తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి బతుకమ్మ పాట అందించిన పోరాట బలాన్ని 'బతికించే చైతన్యం బతుకమ్మ' వ్యాసంలో విశ్లేషించారు. పాల్కురికి సోమన ద్విపదను స్మరిస్తూ "మధ్య మధ్య యతి మైత్రి పాటింప బడే పామర జనగేయ రీతిని సోమన ద్విపదకు అద్దినాడు" అని ద్విపద గాన ఫణతిలో వివరించారు. కొమురం భీముడో పాటను విశ్లేషిస్తూ సినీ గేయ రచయిత ప్రేక్షకుడి అనుభూతి స్థాయిని విజువలైజ్ చేసుకోవాలంటూ, సుద్దాల అశోక్ తేజ అగ్నికి అక్షరాభిషేకం చేసిన పాట గాడని, దేశభక్తి- ప్రాదేశిక స్ఫూర్తి కేటగిరీలో ఈ పాట తెలుగు పాటల్లోనే ఆణిముత్యమని విలువకట్టారు. 'పాట-ప్రజా రాజకీయాలు' వ్యాసంలో పాటను మానవుని పురాకృతకళా రూపంగా నిర్ధారించారు. జాతీయోద్యమం, అభ్యుదయ, విప్లవోద్యమం, దళిత, స్త్రీ వాద, తెలంగాణ వాదాలకు, ప్రపంచీకరణ వ్యతిరేక ఉద్యమాలకు పాట అందించిన జవసత్వాలను విశదీకరించారు. "పాట ఎప్పుడు ప్రతి పక్షమే, ప్రజల పక్షమే" అని వివరిస్తూ పాట సామాన్యుని ఉన్నతిని, సమాజ అభ్యున్నితిని ఎలా స్వప్నిస్తుందో తెలియజేశారు. యువకవి తగుళ్ళ గోపాల్ 'దండ కడియం' కవితా సంపుటిని పరిచయం చేస్తూ "కొత్తతరం కవులు సబాల్టన్ వాదాన్ని ప్రధాన స్రవంతి సాహిత్యంగా మార్చేసే పనిలో ఉన్నారు" అని, సాహిత్య విమర్శలో కూడా సబాల్టన్ వాదాన్ని ప్రధాన దృక్పథంగా మారుస్తూ సమకాలీన సాహిత్యాన్ని, పూర్వపు సాహిత్యాన్ని కూడా ఆ దృక్పథంతో విమర్శించడానికి కావల్సిన సూత్రీ కరణలను అందించారు. తెలుగు సాహిత్య విమర్శకు ఇది ఒక పూరణగా చెప్పవచ్చు. తగుళ్ళ గోపాల్ ' దండ కడియం' కవితా సంపుటిని గోవర్ధన గిరిలా ఓ సబాల్టన్ ఎత్తిపట్టుకున్న భూమండలంతో మనం పోల్చుకోవచ్చు" అంటారు. దివంగత పెండెం జగదీశ్వర్ సేకరించిన బాల సాహిత్యాన్ని వివేచిస్తూ 'సబాల్టన్ వర్గాలను బుద్ధి హీనులుగా చిత్రించే కథలు వాటిల్లో ఎంత మెలిక (Twist) ఉన్నా సేకర్తలు పక్కన పెట్టాల్సిందే, లేదంటే సవరించాల్సిందే, కాదంటే కాన్షియస్ గా చేసిన సృజ నాత్మక తప్పిదం అవుతుంది" అని హెచ్చరించారు. 'వేప కాయంత నిజం' కథల విశ్లేషణలో, జాంబ పురాణ సమీక్షలో, సిద్ధార్థ బొమ్మల బాయి గురించి రాసిన వ్యాసంలో, బహుజనం దరికి నాటకం వివేచనలో, యాదవ శాస్త్రాలను తాళ పత్రాలుగా లిఖించిన చేగొండి కాశయ్య గురించి రాసిన వ్యాసంలోనూ, ప్రజా వాగ్గేయ కారుల పాటల గురించి రాసిన వ్యాసాల్లోనూ, జూకంటి జగన్నాథం కవిత్వాన్ని విశ్లేషిస్తూ రాసిన వ్యాసం, విమోచన వాదానికి ఆదికావ్యంగా 'మెద'ను విలువకడుతూ రాసిన వ్యాసం, స్వర కర్త చరణ్ అర్జున్ రాసిన "నువ్వో రాయి నేనో శిల్పి" పాటను విశ్లేషిస్తూ రాసిన వ్యాసంలోనూ, ప్రాంతీయ అస్తిత్వం తెలంగాణ చైతన్యం అనే వ్యాసంలో ప్రాంతం శబ్దాన్ని ఉత్పత్తి కులాల డిక్షనరీ నుండి విశ్లేషించడంలో పాఠకులకు సబాల్టర్న్ దృక్పథం బోధపడ గలదని సూచించారు.

సిద్ధాంత విస్తృతితో పాటు ప్రక్రియా విస్తృతి కూడా ఈ వ్యాసాల్లో ఉంది. పాట, వచన కవిత, పద్య కవిత్వం, జానపద సాహిత్యం-వస్తు సంస్కృతి, నాటకం, నవల, ద్విపద, యాత్రా రచన, సినిమా పాట, వ్యక్తిత్వ వికాస రచనలు, ప్రజా కళారూపం, చరిత్ర రచన వంటి భిన్నమైన ప్రక్రియలకు సంబంధించి విపులమైన వ్యాసాలు ఇందులో ఉన్నాయి. ప్రక్రియా విమర్శ రచనా తత్త్వ నిరూపణకు ఈ వ్యాసాలు జ్ఞానవాహికలు. బెల్లి యాదయ్య ఏ ప్రక్రియ గురించి విమర్శ రాసినాఆయా ప్రక్రియా నిర్మాణ సూత్రాలను ముందుగా వివరిస్తారు. ప్రక్రియా నిర్మాణ సూత్రాల వెలుగులో రచనను విశ్లేషిస్తారు. తెలుగు సాహిత్య విమర్శలో ప్రక్రియా విమర్శకు చేర్పుగా బెల్లి యాదయ్య నవనవోన్మేషంగా నిలబడ్డారని చెప్పడం ఎంతమాత్రం అతిశయోక్తి కాదు.

సాహిత్యాన్ని విలువ కట్టే విమర్శ రచనలో భాషా పరంగా విమర్శకుని భాష ఒక అంశం అయితే విమర్శలో వినియోగించే పారిభాషిక పదజాలం రెండో అంశం. తెలుగు సాహిత్య విమర్శకు శాస్త్ర ప్రతిపత్తిని కల్పించే

పరిభాష ఈ వ్యాసాల నిండా తొణికిసలాడుతుంది. స్థానీయతతో పాటు, అంతర్జాతీయ సిద్ధాంతాలను అన్వయిస్తూ తెలుగు భాషలో విమర్శ రచనకు కావాల్సిన పారిభాషిక పదజాలం రూపొందించటం ద్వారా తెలుగు సాహిత్య విమర్శను పరిపుష్టం చేశారు. 'మా ఊరు అట్లా లేదు' కవితా సంకలనానికి రాసుకున్న ఇంట్రోలో "నాకు తెలిసినంతలో నేను రచనలో శైలికి అధిక ప్రాధాన్యతను ఇస్తాను. వశీకరింపజేసుకునే శక్తి శైలికి ఉండటమే దీనికి కారణం" అన్నారు. సాహిత్య విమర్శ రచనలో క్లిష్టమైన సాహిత్య సిద్ధాంతాలను కూడా అందరికీ అర్థమయ్యే రీతిలో, ఆసక్తి కలిగించే శైలిలో చెప్పడం బెల్లి యాదయ్య ప్రత్యేకత.

పాఠకుడు రచనలోకి ప్రవేశించడానికి ఒక దారిలా తోడ్పడే ముందుమాటలు, పరిచయ వ్యాసాలు ఈ గ్రంథానికి వన్నె తెచ్చాయి. 'బేగరి కథలు, తారుమారు కథలు, తీగో నాగో ఎన్నియలో, కావడి కుండలు, శిబ్బి, వేపకాయంత కథలు, పోరుబాట, బొమ్మలబాయి, మెద, చందమామలు, ప్రయాణం, బ్లూ స్కార్ఫ్, దోస్తులు చెప్పిన కథలు, మొలక, తెలంగాణ సాయుధ పోరాట పతాక దొడ్డి కొమురయ్య' పుస్తకాలపై విలువైన విమర్శ అందించారు. ఉదాహరణకు బ్లూస్కార్ఫ్ నవలను రాజకీయ విద్యా నవలగాను, మెద కావ్యాన్ని విమోచన వాదానికి ఆది కావ్యంగానూ నిర్ధారించారు. నూతనంగా వస్తున్న సాహిత్యంలో ఆయా రచనల్ని పాఠకులు అంచనా వేయడానికి, అర్థం చేసుకోవడానికి కావల్సిన సూత్రాలను ముందుమాటలు అందించాయి. సాహిత్య విమర్శలో బెల్లి యాదయ్యది ప్రధానంగా అభ్యుదయ దృక్పథమే అయినప్పటికీ కవిత్వ సౌందర్యాన్ని పాఠకులకు బోధించటంలో కవిత్వాన్ని కవిత్వం లాగే ఆస్వాదించే విమర్శ వెలువరించారు. ఇందుకు మునాస వెంకట్ చంద మామలు' కవితా సంపుటిపై సమీక్ష మంచి ఉదాహరణ. గురజాడ, గద్దర్, యు.ఆర్.అనంతమూర్తి, రష్కిన్ బాండ్, జూకంటి జగన్నాథం, సి.నా.రె. వట్టికోట ఆళ్వారు స్వామి, సుద్దాల అశోక్ తేజ , సిద్ధార్థ, మునాస వెంకట్, చింతల యాదగిరి, బండి సత్తెన్న వంటి సాహిత్యకారులపై రాసిన విమర్శల్లో నూతన సాహిత్య సిద్ధాంతాలను వారి సాహిత్య కృషికి అన్వయిస్తూ సాహిత్యంలో ఆయా రచయితల విశిష్టతను ఆవిష్కరించారు. సి.నా.రె. గురించి రాసిన వ్యాసంలో విజ్ఞానవాదాన్ని సాహిత్యానికి అన్వయిస్తూ "కవితలో తత్త్వానికి, ఎరుకకు విజ్ఞానవాదానికి ప్రాధాన్యత నిచ్చాడు" అని పేర్కొన్నారు.

ఈ వ్యాసాలు నిడివితో పాటు ఎంతో సారమతిని కలిగి ఉన్నాయి. 'కలవస్తే బాగుండును' కవితా సంపుటికి రాసుకున్న ముందుమాటలో "కవిత్వం పరిధిలో నేను రాయగలిగిన ఇతివృత్తాలను, రాయగలిగిన సందర్భాల నుండి అనివార్యంగా రాస్తున్నాను" అన్నారు. వారి విమర్శ రచనలకు కూడా ఈ మాటలే సరిగ్గా సరిపోతాయి. అనివార్యంగా రాయవలిసిన సందర్భం, విషయం, అవసరం నుండి తనదైన సామాజిక దృక్పథంతో నూతన సాహిత్య సిద్ధాంతాలను, విమర్శలో అనేక అనువర్తిత విషయాలను ఈ పదార్థం పుస్తకం ద్వారా అందించారు. బెల్లి యాదయ్య తనదైన విమర్శా పటిమ ద్వారా అందించిన సూత్రీకరణల వెలుగులో విమర్శకులు. అధ్యాపకులు, పరిశోధక విద్యార్థుల నూతన విషయాన్వేషణకు దోహదం చేస్తాయి.

**ఉపయుక్త గ్రంథ సూచి :**


1. టెర్రీ ఈగల్ టన్. మార్క్సిజము- సాహిత్య విమర్శ. (అనువాదం) గుడిపూడి విజయరావు, ప్రథమ ముద్రణ., హైదరాబాద్,నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్, 2021.
2. ప్రభాకర్, ఎ.కె.,(సంపా). బహుళ సాహిత్య విమర్శ సిద్ధాంతాలు ప్రమేయాలు పరికరాలు. ప్రథమ ముద్రణ., పర్ స్పెక్టివ్స్ , హైదరాబాద్, 2018.
3. యాకూబ్. ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ. ప్రథమ ముద్రణ నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్ , హైదారాబాద్, 2018.

4. యాదయ్య, బెల్లి. కల వస్తే బాగుండును. నల్గొండ, పదం ప్రచురణలు, 2025.
5. యాదయ్య, బెల్లి. పదార్థం (సాహిత్య వ్యాసాలు). జుఒత్వఒ ఎఎ బకరం నర్సింహ ఒ గండు మహేందర్, నల్గొండ, పదం ప్రచురణలు, 2024.
6. రామారావు, ఎస్వీ. తెలుగులో సాహిత్య విమర్శ అవతరణ - వికాసములు. పసిడి ప్రచురణలు, హైదరాబాద్, 2007.
7. వీరభద్రయ్య, ముదిగొండ. విమర్శ, కళాతత్వ శాస్త్రాలు. ప్రథమ ముద్రణ, హైదరాబాద్, తెలుగు అకాడమి, 2012.
8. సుబ్రహ్మణ్యం, జి.వి. ఆంధ్ర సాహిత్య విమర్శ : ఆంగ్ల ప్రభావం. ఆచార్య జి. వి సుబ్రహ్మణ్యం షష్టిపూర్తి ప్రచ్రణాలు, హైదారాబాద్, 1996.

★★★

Vol. 23 | Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# పెరుగుపల్లి బలరామ్ 'వర్తమాన భారతి' – సమీక్ష



– డా॥. దాసరి రమేష్

తెలుగు ఉపాధ్యాయుడు, లొయోల పబ్లిక్ స్కూల్, గుంటూరు.

**వ్యాస సంగ్రహం :**

అనంతమైన తెలుగు సాహిత్యానికి వన్నెతెచ్చిన కవులు రచయితలు, రచయిత్రులు ఎందరో ఉన్నారు. నేటి ఆధునిక కాలంలో కూడా ఎందరో రచయితలు ఉద్భవిస్తున్నారు. తమ రచనలతో సాహితీ క్షేత్రంలో తమదైన ముద్రను వేసుకుంటున్నారు. నేటి ఆధునిక కాలంలో నవ్యతతో కూడిన సాహిత్య ప్రక్రియల్లో ముఖ్యమైనది వచన కవిత్వమని చెప్పవచ్చు. సమాజంలో జరిగే వాస్తవిక సంఘటనలు, పరిస్థితులు, సగటు మానవుడే వచన కవిత్వానికి వస్తువు.''నిగూఢతను కలిగి సాధారణ వాక్యానికి భిన్నంగా ఉండి, మనసును రంజింపజేసే, ఆలోచింపజేసే రచనను కవిత్వం అంటారు.''[1] (ఆధునికాంధ్ర సాంప్రదాయాలు - ప్రయోగాలు - పుట : 126) అటువంటి కవిత్వంలో రచనలు చేసిన ఆధునిక రచయితలు ఉన్నారు. వారిలో ఒకడు, నవ యువకుడు అయిన డాక్టర్ పెరుగుపల్లి బలరామ్ ముఖ్యుడు. అతని వచన కవిత్వం గురించి పరిచయం చేయడం ఈ వ్యాసం ఉద్దేశం.

**కీలక పదాలు** : ఆధునిక సాహిత్యం, వచన కవిత్వం, డా. పెరుగుపల్లి బలరామ్, వర్తమాన భారతి, విశ్లేషణ

**పరిచయం :**

నేటి ఆధునిక కాలంలో తన రచన కౌశలాలతో తమదైన ముద్రనివేసుకుంటున్న రచయితలు ఎందరో ఉన్నారు. వారిలో గుంటూరు వాసి అయిన డాక్టర్ పెరుగుపల్లి బలరాం సుప్రసిద్ధుడు. వారి కవిత్వంలో వారి వయసు ప్రతిఫలిస్తుంది. వారి కవిత్వ పంక్తులలో వారి హృదయం ప్రతిధ్వనిస్తుంది. చూసిన సంఘటనకు ప్రతిస్పందించే మనసు ఉండటమే కాక, ఆ దృశ్యాన్ని కవిత్వీకరించి, పాఠకుల హృదయాల్లోకి చొప్పించగల కవిత్వావేశంకలవాడుగా కనిపిస్తాడు.''జీవితాన్ని ఉన్నది ఉన్నట్లుగా స్వీకరిస్తే అది కవిత్వం కాదు. జీవితం నుండి ఉద్భవించే ఒకానొక ప్రతిబింబ సదృశ్య ధ్వని కవిత్వం''[2] (వర్ధమాన భారతి - పెరుగుపల్లి బలరామ్ - పుట : ముందుమాట) అని భూసురుపల్లి గారు అన్నట్లు ఆ ధ్వనిని ఒడిసి పట్టుకోగల నేర్పు, ఓర్పు ఉన్నవాడు బలరాం. అందుకే వీరి కవిత్వంలో ఆలోచన తెలుస్తుంది, ఆవేశం కనబడుతుంది. వారి కలం నుండి జాలువారిన ఒక వచన కవితా సంపుటి 'వర్తమానభారతి.' గురించి విశ్లేషించడమే ఈ వ్యాసం ఉద్దేశం.

**జననం :**

నవతరం కవి అయిన బలరామ్ గుంటూరు జిల్లాలోని

తాడికొండ మండలంలో గల లాం(తాతిరెడ్డి పాలెం) అనే గ్రామంలో 1989 మార్చి 3 వ తారీఖున పెరుగుపల్లి సుబ్బారావు, లక్ష్మీదేవి దంపతులకు ద్వితీయ సంతానంగా జన్మించారు.

**విద్యాభ్యాసం :**

పెరుగుపల్లి బలరామ్ ప్రాథమిక విద్యాభ్యాసం గుంటూరు జిల్లాలో గల జొన్నలగడ్డఅనే గ్రామంలోని మధుర మీనాక్షి విద్యాలయం, ఉన్నత పాఠశాల విద్య కూడా జొన్నలగడ్డలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లోను, కళాశాల విద్య శ్రీ గోగినేని కనకయ్య ప్రాచ్య కళాశాల లోనూ, స్నాతకోత్తర విద్యను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోనూ పూర్తి చేశారు. యు. జి. సి. వారి ఫెలోషిప్ ను సాధించిన వీరు 'తెనాలి రామకృష్ణుడి కావ్యాలు - పాత్రలు' అనే అంశంపై పరిశోధన చేసి 2019లో డాక్టరేట్ పట్టా అందుకున్నారు.

**వైవాహిక జీవితం :**

2019వ సంవత్సరంలో మే 11వ తారీఖున వంగపాటి కళ్యాణిని వివాహం చేసుకొని, గృహస్థ జీవనంలోకి అడుగు పెట్టిన వీరికి బాల భవిష్య అనే కూతురు, లవ్ నీత్ అనే కుమారుడు జన్మించారు.

**ఉద్యోగ ప్రస్థానం :**

వీరు 2010 నుండి నేటి వరకు వివిధ కళాశాలల్లో, పాఠశాలలో పనిచేశారు. ముఖ్యంగా శ్రీ సత్య సాయి డిగ్రీ కళాశాలల, తాడికొండలో అధ్యాపకుడిగా కొంతకాలం, ఒక కార్పొరేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా కొంత కాలంగా పనిచేస్తూ వస్తున్నారు.

**రచనారంగం :**

వీరి కలం నుండి జాలు వారిన రచనల్లో 'పెరుగుపల్లి శతకం', 'వర్తమాన భారతి' (వచన కవిత్వం), 'పరిశోధన వ్యాసావళి' అనేవి ముద్రితాలు కాగా 'లాం గ్రామ చరిత్ర' అనేది ఆముద్రితం. ఇంకా వీరి రచనలు కొనసాగుతూనే ఉన్నాయి.

**వర్తమాన భారతి – విశ్లేషణ :**

డాక్టర్ పెరుగుపల్లి బలరామ్ రచించిన 'వర్తమాన భారతి' కవితా సంపుటి 2019వ సంవత్సరంలో ప్రచురించ బడింది. ఈ కవితా సంపటిలో మొత్తం 37 కవితలు ఉన్నాయి. ఇందులోని ప్రతి కవితలో సామాజిక స్పృహ తేటతెల్లమవుతుంది. అందులో ప్రధానంగా కనిపించే అంశాల్లో కొన్ని ఇవి:

**1. విద్యా ప్రాశస్త్యం :**

వీరి కవిత్వంలో విద్యకు పెద్దపీట వేశారు. పలు కవిత లలో విద్య యొక్క గొప్పతనాన్ని చాటారు. విద్య మనిషికి జ్ఞానాన్ని ఇస్తుంది. సంస్కారాన్ని అందిస్తుంది. అందుకే కవి ఇలా అన్నాడు-

"కటిక చీకటిని పారద్రోలు
వేయిసూర్యుల వెలుగే విద్య
తొలకరి జల్లు వంటి చల్లని విద్య
తేనె వంటి తీయని విద్య" (పుట : 23)

విద్య మూర్ఖుడైన మనిషిని సైతం మార్చగలదు. రామబాణం వంటి తిరుగులేనిదని, అక్షయపాత్ర వంటిదని పేర్కొన్నారు. మరి ఇటువంటి విద్యనందించే ఆలయాలు విద్యాలయాలు. నేటి కాలంలో విద్యాల యాలంటే మార్కుల కోసం, ర్యాంకుల కోసం ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ మోజులో పడి పరిగెడుతున్న నేటి సమాజ స్థితిని కూడా తెలియజేశారు. ఒకప్పుడు బడంటే అది ఎలా ఉండేదో తన అనుభవాలను ఇలా పంచు కున్నారు-

"ముద్దమద్దకి అమ్మ పొట్ట తడిమినట్లు
ఏటికేడాది మా జ్ఞానాన్ని పట్టి చూసేది
ఏమైతేనేం అంతా ఆమె చలవే
ఇవాళ తలోదిక్కున స్థిరంగా ఉన్నాం
కానీ అమ్మే అందరికీ తెలిసి అనాథలా మిగిలింది
కాన్వెంటులనేకల్తీ తల్లులొచ్చిన తర్వాత
డబ్బా పీకకి తల్లి రొమ్ముకి తేడా కరువైంది"(పుట:49)

అంటూ ఒకనాటి బడుల్లో ఉపాధ్యాయుల చేసిన బోధనకు, వారు చూపిన మమకారానికి నేటి కాలంలో మార్కుల కోసం మనిషి పడుతున్న ఆరాటానికి మధ్య నలిగిపోతున్న విద్యార్థుల భవిత గురించి ఎవరూ పట్టించు

కోవడం లేదని విమర్శించారు. ఇక్కడ కాన్వెంట్ అంటే రచయిత ఉద్దేశంలో ప్రైవేట్ పాఠశాలలని గ్రహిం చాలి. అటువంటి పాఠశాలల్లో సగటు విద్యార్థి చదువు కోవటం గగనం అయిపోతుంది.

**లంచగొండితనం పై నిరసన :**

'వర్తమాన భారతి' వచన కవితా సంపుటిలో సామాజిక సమస్యల మీద కూడా ప్రతిస్పందించిన తీరుని గమనించ వచ్చు. భారతదేశాన్ని పట్టి పీడించే సామాజిక రుగ్మతల్లో ఒకటైన లంచగొండితనం పైన కూడా తన కలాన్ని ప్రయోగించారు.

"ఇక్కడ మాటతో పనిలేదు నోటుతోనే
మనిషితో పనిలేదు మనీతోనే
ఇక్కడ మాటకి నోటు కొట్టాలి
సంతకానికోసంచి సర్దాల్సిందే
నిజాయితీ అనే మాటకు తావే లేదు
అయినా జాతే గతి తప్పినప్పుడు నిజాయితీతో
పనేముంది" (పుట : 60)

నేటి కాలంలో లంచగొండితనం విపరీతంగా పెరిగి పోయి ఒక మహమ్మారిగా మారిపోయింది. ప్రతి సగటు మానవుడు కూడా లంచం తీసుకుంటున్నాడు. తమ ఓటును డబ్బు కోసమో, మద్యం సీసాల కోసమో అమ్ము కుంటున్నారు. ఆటుకొందరు ప్రభుత్వ ఉద్యోగస్థులైనా, రాజకీయ నాయకులైనా, ఎవరైనా సరే లంచం లేనిదే పనిచేసే స్థితిలో లేరు. అందుకే పచ్చ నోటు కాస్త పింక్ రంగుపులుముకుంటుందని తన ఆవేదన తెలియజేశారు రచయిత.

**స్త్రీ సమస్యల చిత్రణ :**

భారతీయ సమాజంలో స్త్రీకి చాలా ప్రాధాన్యత ఇవ్వ బడింది. స్త్రీని ఆది దేవతగా భావించి పూజించే సంస్కృతి మనది. కానీ కాలం మారే కొద్ది పురుషాధిక్యత ప్రపంచం స్త్రీని చులకనగా చూస్తూ, హేళన చేస్తూ వారి ఉనికిని కూడా ప్రశ్నార్థకంగా మార్చే స్థితికి దిగజార్చారు. అంటే అంగడి సరుకుగా, శృంగార వస్తువుగా మార్చి అవమాన పరిచారు. ఎక్కడ చూసినా వారిపై జరిగే దారుణాలు, అకృత్యాలు ఇందుకు తార్కాణాలు. నవభారత సమాజంలో కూడా స్త్రీకి రక్షణ లేదని వాపోయారు రచయిత.

"నవభారతంలో
కీచక పర్వం సాగుతోంది
అమ్మలకే అపహాస్యం జరుగుతుంది
మదమెక్కిన మృగాళ్లు
మతితప్పిమారణ హోమం సృష్టిస్తున్నారు"
-------------------------------------------
-------------------------------------------
వావి వరసలు మరిచి
ఉచ్చ నీచాలు విడిచి
వాంఛలు తీర్చుకుంటున్నారు" (పుట:42)

స్త్రీలను అవమానపరిచే ముందు ఆమెలో తల్లిని, చెల్లిని, కూతురిని చూడాలని ప్రబోధించారు. రచయిత పురుషులలో ఉండే పురుషహంకార పొరలను తొలగించు కోవాలని, స్త్రీని సాటి మనిషిగా గౌరవించాలని నినదిం చారు.

**ముగింపు :**

ఈ విధంగా ప్రతి కవితలోనూ ఆవేశం, ఆవేదన కలగ లసిన హృదయ వేదన ప్రతిధ్వనిస్తుంది. పైన పేర్కొన బడిన విషయాలే గాక ఇంకా అనేకమైన సామాజిక రుగ్మతల మీద కూడా ధ్వజమెత్తిన తీరు మనం చూడ వచ్చు. అస్తవ్యస్తమైగతితప్పుతున్న సమాజం మీద వీరు కలం యుద్ధం చేస్తున్నారని అనుకోవచ్చు. విశేషమైన కవిత్వాసక్తి, సమాజం మీద బాధ్యత ఉన్న కవిగా వీరు మరిన్ని రచనలతో సమాజంపై తనదైన ముద్ర వేయాలని కాంక్షించడం పాఠకుల అభిమానానికి నిదర్శనం.

**ఆధార గ్రంథాలు :**

1. నారాయణరెడ్డి. సింగిరెడ్డి, 1998, ఆధునికాంధ్ర సాంప్రదాయాలు -- ప్రయోగాలు, విశాలాంధ్ర పబ్లిషర్స్, హైదరాబాద్.

2. బలరామ్. పెరుగుపల్లి - 2019, వర్తమాన భారతి, మెట్రో ప్రింటర్స్, విజయవాడ
3. శ్రీరామ మూర్తి. కొర్లపాటి - 1991,తెలుగు సాహిత్య చరిత్ర - ప్రథమ భాగము, రమణశ్రీ ప్రచురణలు, విజయవాడ
4. ఆంధ్ర జ్యోతి దిన పత్రిక - తేది:29-05-2017
5. ఈనాడు దిన పత్రిక - తేది: 30-03-2025
6. తెలుగు సాహిత్య వేదిక (సంచిక) - తేది:28-07-2024

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# భారతీయ జర్నలిజం – జ్ఞాన వ్యవస్థల సమ్మేళనం : పరిశీలన



– జీకేడీ ప్రసాదరావు

ఫ్యాకల్టీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం

**వ్యాస సంగ్రహం**

విద్యావ్యవస్థలో జ్ఞానన్యాయం (Epistemic Justice) అనేది వివిధ జ్ఞాన సంప్రదాయాలకు సమాన గుర్తింపు, ప్రాతినిధ్యం, సమన్వయాన్ని కల్పించాల్సిన అవసరాన్ని సూచిస్తుంది (Fricker, 2007). అయితే నేడు భారత దేశంలోని పత్రికా రచన, ప్రసారమాధ్యమాల (Journalism and Mass Communication – JMC) విద్య ప్రధానంగా పాశ్చాత్య జ్ఞాన దృక్పథాల ఆధీనంలో కొనసాగుతోంది. అదే సమయంలో స్వదేశీ, సముదాయాధారిత, సాంస్కృతికంగా పాతుకుపోయిన జ్ఞాన విధానాలను పక్కన పెడుతోంది (Christians etal., 2009; Sen, 2005). ఈ పరిశోధన భారతీయ జ్ఞాన వ్యవస్థలు (Indian Knowledge Systems – IKS) పత్రికా విద్యలోని జ్ఞాన అన్యాయాన్ని ఎలా పరిష్కరించగలవో విశ్లేషిస్తుంది. 'జ్ఞానం' (jñana), 'సత్యం' (satya), 'ధర్మం' (ఎష్ట్రఖుతీమ్ఖు) సామాజిక బాధ్యతతో కూడిన నైతికచర్యగా సంభాషణ వంటి ప్రత్యామ్నాయ భావనలను IKS ఎలా ప్రతిపాదిస్తుందో వివరిస్తుంది. (Bhattacharya, 2020 (భగవద్గీత). తులనాత్మక, భావనాత్మక విశ్లేషణతో IKS, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ రెండింటికీ సత్యం, ప్రజాహితం, నైతిక బాధ్యత వంటి మూలభూత లక్ష్యాలు కలిగివున్నాయి. కాని అవి వేర్వేరు జ్ఞానసంప్రదాయాలతో వ్యక్తమవుతున్నాయని ఈ అధ్యయనం నిరూపిస్తుంది. నైతికత, బోధన, భాష, కమ్యూనిటీ మీడియా, విధాన పరమైన అంశాల్లో, పత్రికాపాఠ్యాంశాల్లో భారతీయ జ్ఞాన వ్యవస్థలను సమన్వయం జరగాలి. దీంతో అనాదిగా సాంస్కృతికంగా, జ్ఞానపరంగా, బహుళత్వాన్ని గౌరవించే రూపాంతరాత్మక పత్రికా విద్య సాధ్యమవుతుందని ఈ పత్రం సమర్థిస్తుంది. భారత ప్రభుత్వ జాతీయ విద్యా విధానం - 2020 (NEP 2020) అనుగుణంగా ఈ సమన్వయం జరగాలి. అప్పుడే పత్రికావృత్తి మార్కెట్ కేంద్రంగా సామాజిక స్పందన కలిగిన శాస్త్రంగా నిలుస్తుంది. మీడియా సంస్థల పట్ల ప్రజావిశ్వాసాన్ని పునరుద్ధరించగలదని నిరూపిస్తుంది. జ్ఞాన మీమాంస న్యాయానికి ఒక్క ప్రత్యక్ష పర్యాయపదం లేదు. ఎందుకంటే ఇది ఒక నిర్దిష్ట తాత్త్విక భావన. కానీ సంబంధిత ఆలోచనల్లో జ్ఞానసమానత్వం, న్యాయబద్ధత కలిగిన జ్ఞానమీమాంస, సమ్మిళిత జ్ఞానసృష్టి, అణగారిన స్వరాల విశ్వసనీయతను నిర్ధారించడం కూడా ఈ పరిశోధనాపత్రం ఉద్దేశ్యం.

**కీలక పదాలు :**

భగవద్గీత, జ్ఞానన్యాయం, పత్రికావిద్య, భారతీయ జ్ఞానవ్యవస్థలు (IKS), మీడియా, నైతికత, స్వదేశీ,

సంభాషణ, జ్ఞాన బహుళత్వం, ధర్మం, పత్రికావృత్తి, ప్రజావిశ్వాసం, NEP 2020.

## 1. పరిచయం – జ్ఞానాత్మకభావన (Epistemic) పరిణామం

ఎపిస్టెమిక్ (Epistemic) అనే భావన మొదట తాత్విక శాస్త్రం, భాషాశాస్త్రం, వాక్ప్రయోగ శాస్త్రం వంటి క్లిష్టమైన విద్యారంగాలకు పరిమితమై ఉండేది. అయితే కాల క్రమేణా ఇది అనేక రంగాల్లోకి విస్తరించింది. ఎక్కడ ఉపయోగించినా, ఎపిస్టెమిక్ అనే పదం మూలాలు ప్రాచీన గ్రీకు జ్ఞాన సంప్రదాయంలోనే ఉన్నాయి. ఇది గ్రీకు పదమైన 'ఎపిస్టిమే' (episteme) నుంచి ఉద్భ వించింది. దీని అర్థం 'జ్ఞానం'. ఈ పదం మళ్లీ 'ఎపిస్టానై' (epistanai) అనే క్రియ నుంచి ఏర్పడింది. దాని అర్థం 'తెలుసుకోవడం' లేదా 'అర్థం చేసుకోవడం'. ఈ క్రియ రెండు భాగాల సమ్మేళనంగా వుంటుంది.

'ఎపి' (epi-) అంటే "పైగా", 'అంటుకొని ఉండడం' అనే అర్థం, 'హిస్టనై' (histanai) అంటే 'నిలబడేలా చేయడం' అనే అర్థం. జ్ఞానం స్వభావం దాని ఆధారాలను అధ్యయనం చేసే శాస్త్రాన్ని జ్ఞానతత్వశాస్త్రం (Epistemology) అంటారు. ఆ అధ్యయనంలో నిమగ్నమయ్యే వ్యక్తిని జ్ఞానతత్వవేత్త (Epistemologist)గా పిలుస్తారు. (webster.com 2025).

1.1 మీమాంస అంటే సంస్కృతంలో లోతుగా ఆలోచించడం, విశ్లేషించడం అని అర్థం. లేదా విచారణ, పరిగణన, పరిశోధన, చర్చ అనే అర్థాలు వున్నాయి. ఇది హిందూతత్వశాస్త్రంలోని ఆరు దర్శనాల్లో ఒకటి. వేదాల వెనుక ఉన్న ధర్మం (విధి) తార్కిక వివరణకు నియమా లను అందిస్తుంది. (Encyclopedia Britannica 2025). సంస్కృత ఆస్తిక విద్యా విధానంలో మీమాంస ఒక పద్ధతి. వైదిక శాస్త్ర పద్ధతులలో ధర్మాన్ని విశ్లేషించే ముఖ్యపద్ధతి మీమాంస. ఇది రెండు విధాలుగా వుంటుంది. మొదటిది పూర్వ మీమాంస. దీనినే కర్మ మీమాంస అంటారు. రెండోది ఉత్తర మీమాంస. దీనినే 'జ్ఞాన మీమాంస' అని పిలుస్తారు. హేతువాదానికి, వైదిక పాఠ హేతుబద్ధతకు మీమాంస అతి ముఖ్యమైనది. (Chris Bartley - 2013).

1.2 భారతీయ జ్ఞానమీమాంస మూలసూత్రాలు భారతీయ జ్ఞానవ్యవస్థ జ్ఞానాన్ని ప్రమాణాల ద్వారా నిర్ధారిస్తాయి. ప్రత్యక్షం (అనుభవం), అనుమానం (తర్కం), ఉపమానం, శబ్దం (ఆప్తవాక్యం). జర్న లిజంలో ఇవి ఫీల్డ్ రిపోర్టింగ్, విశ్లేషణ, పోలిక, నమ్మకమైన వనరుల వినియోగంగా అనువర్తించ వచ్చు. సత్యం (సత్యం), ధర్మం (న్యాయం), అహింస (హానిరాహిత్యం), లోకసంగ్రహం (ప్రజాహితం) వంటి విలువలు వార్తా నిర్మాణానికి మార్గదర్శకాలు అవుతాయి.

## 2. పరిశోధనా విధానం

భారతీయ జ్ఞాన వ్యవస్థల (IKS) రూపకల్పన ద్వారా పత్రికా విద్యలో జ్ఞాన న్యాయాన్ని విశ్లేషించేందుకు గుణాత్మక, భావనాత్మక, అంతరశాస్త్రీయ పరిశోధనా విధానాన్ని ఈ అధ్యయనం అనుసరిస్తుంది. ఇది అనుభవాధారిత (empirical) డేటా సేకరణపై ఆధారపడకుండా, సైద్ధాంతికంగా, విశ్లేషణాత్మక స్వభావాన్ని కలిగి ఉంటుంది. భారతీయ జ్ఞానవ్యవస్థ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ (JMC) రూపురేఖల మధ్య తులనాత్మక జ్ఞాన విశ్లేషణను నిర్వహిస్తుంది. జ్ఞానం, సత్యం, నైతికత, సామాజిక బాధ్యతపై వీటి అవగాహనల్లోని అను కూలతల్ని, వ్యతిరేకతలను గుర్తిస్తుంది. సనాతన భారతీయతాత్విక గ్రంథాలు, ఆధునిక మీడియా నైతికత, సంభాషణ సిద్ధాంతాలపై గ్రంథపరిశీలన చేస్తుంది. పత్రికా విద్యకు అనువైన స్వదేశీ నైతిక సూత్రాలను వివరించింది. అలాగే జాతీయ విద్యా విధానం - 2020 (NEP 2020) పై విధాన విశ్లేషణ చేసి, పత్రికా పాఠ్యాంశాల్లో IKS సమన్వయానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తుంది. నైతిక భావనల అర్థ వివరణకు హెర్మెన్యూటిక్ (hermeneutic) విధానం, పత్రికాబోధన మూల్యాంకనానికి నార్మేటివ్ దృక్పథం వినియోగం దీనిలో వుంది. ఇది పత్రికావిద్య,

మీడియా అధ్యయనాల్లో భావనాత్మక పరిశోధనకు అనుకూలమైనది.

**3. భావనాత్మక పునాదులు : జ్ఞానం, సత్యం, జ్ఞానన్యాయం**

విద్యారంగంలో జ్ఞానన్యాయం అనేది వివిధ జ్ఞాన సంప్రదాయాలకు న్యాయమైన గుర్తింపు, ప్రాతినిధ్యం, విలువనివ్వడాన్ని సూచిస్తుంది (hermeneutic) భారతదేశంలోని పత్రికా, సామూహిక సంభాషణ విద్యలో, పాశ్చాత్య జ్ఞాన విధానాలకు ప్రాధాన్యం ఇచ్చి, స్వదేశీ, అనుభవాత్మక, సాంస్కృతికంగా పాతుకుపోయిన జ్ఞాన విధానాలను పక్కన పెట్టడం ద్వారా జ్ఞాన అన్యాయం స్పష్టంగా కనిపిస్తుంది (Bhattacharya, 2020). భారతీయ జ్ఞాన వ్యవస్థ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ (JMC) విద్యల తులనాత్మక పరిశీలనలో, సత్యం, నైతికత, సామాజిక బాధ్యత, ప్రజాహితం పట్ల రెండింటికీ సామాన్య ఆందోళన ఉన్నప్పటికీ, అవి వేర్వేరు జ్ఞాన సంప్రదాయాల ద్వారా వ్యక్తమవుతున్నాయని తెలుస్తుంది (Christians et al., 2009). IKSలో 'జ్ఞానం' (jñana) అనేది విలువలతో ఉన్నత లక్ష్యంతో, సమగ్ర భావనతో వుంటుంది. ఇక్కడ సంభాషణ అనేది కేవలం సమాచార మార్పిడి కాకుండా 'లోకసంగ్రహం' కోసం చేసే నైతిక, సామాజికచర్యగా భావించవచ్చు. (భగవద్గీత 3.20; Sen, 2005). ఇతరవైపు, ఆధునిక జర్నలిజం విద్య ప్రధానంగా పాశ్చాత్య జ్ఞానదృక్పథాల ప్రభావంలో లక్ష్యంతో (Objectivity), తటస్థతంగా (Neutrality), అనుభవపూర్వకంగా (Empirisism), ఖచ్చితత్వం (Accuracy), సమతుల్యత (Balance), సమయపాలన వంటి సంస్థాగత ప్రమాణాలపై దృష్టిపెడుతుంది. (McQuail, 2010).

మరోవైపు ఇవి వృత్తిపరమైన క్రమశిక్షణను నిర్ధారించినప్పటికీ, ప్రత్యామ్నాయ జ్ఞానాల్ని అణచివేయడంతో జ్ఞానవిస్మరణ జరుగుతుంది. జ్ఞానన్యాయం దృష్టిలో IKS, మార్కెట్ ఆధారిత పత్రికా నమూనాలకు సవాల్ విసురుతూ, నార్మేటివ్ సంభాషణ తత్వాన్ని ప్రతిపాదిస్తుంది (Couldry, 2012).

3.1. **జ్ఞాన అన్యాయం (Epistemic Injustice) :** ఈ భావనలో మిరాండా ఫ్రికర్ సామాజిక జ్ఞానతత్వం (Social Epistemology), న్యాయ సిద్ధాంతాల (Theories of Justice) మధ్య అనుసంధానాన్ని సైద్ధాంతికంగా వివరించడంలో కృషి చేశారు. సాధారణంగా న్యాయ సిద్ధాంతాలు తమ పరిశీలనకు రెండు ప్రధాన అంశాలను ఆధారంగా తీసుకుంటాయి. ఒకటి వ్యక్తుల మధ్య జరిగే పరస్పర లావాదేవీలు, రెండవది ప్రత్యేకమైన సంస్థలు. ఇవి కొన్నిసార్లు మరింత విస్తృత దృక్పథాన్ని స్వీకరిస్తాయి. ఇవి అనేక సంస్థలతో కూడిన వ్యవస్థలను సమగ్రంగా మూల్యాంకనం చేస్తాయి. ఈ వ్యవస్థాత్మక దృష్టికోణం, వ్యక్తిగతస్థాయిలో గానీ లేదా సంస్థాగత స్థాయిలో గానీ నియంత్రించలేని లక్షలాది వ్యక్తిగత లావాదేవీల సమష్టి ప్రభావాలను నియంత్రించడానికి అవకాశాన్ని ఇస్తుంది. ఇది కేవలం ఆదాయం, సంపద వంటి భౌతిక వనరుల పంపిణీ విషయంలోనే కాకుండా, సాక్ష్యన్యాయం (testimonial justice), వ్యాఖ్యానాత్మక న్యాయం (hermeneutical justice) వంటి జ్ఞాన సంబంధిత న్యాయాల విషయంలో కూడా వర్తిస్తుంది.

3.2 **జ్ఞానాత్మక పక్షపాతాలు (cognitive biases) :** సాక్ష్యాలను సేకరించడం, వాటిని మూల్యాంకనం చేసే వ్యవస్థలను ఏ సూత్రాలు నియంత్రించాలి అనే దానిపై మన దృష్టి కేంద్రీకరిస్తే, మరింత సులభంగా సవరించబడే అవకాశముంది. అందువల్ల, ఫ్రికర్ వ్యక్తిగత జ్ఞాన నైతిక గుణాలపై (individual epistemic virtue) పెట్టిన దృష్టి ఎంతో ముఖ్యమైనదైనప్పటికీ, సామాజిక వ్యవస్థల లక్షణంగా జ్ఞానన్యాయం ఎలా ఉండాలనే అంశాన్ని కూడా మనం పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో జ్ఞానన్యాయం సామాజిక వ్యవస్థల గుణంగా ఎలా అమలులోకి రావాలనే దిశగా కొన్ని పరిశోధనలు జరిగాయి. ముఖ్యంగా, జ్ఞాన అన్వేషణలో పాల్గొనే విభిన్న సంస్థలు, వ్యక్తుల మధ్య సమగ్ర సమన్వయం అవసరమని ఇది ప్రధానంగా ప్రస్తావిస్తుంది.

### 4. సంభాషణ సంప్రదాయాలు – జ్ఞాన బహుళత్వం

మౌఖిక, లిఖిత, డిజిటల్ రూపాలు IKSలో 'శ్రుతి', 'కథ', 'ఇతిహాసం', 'పురాణం', 'శాస్త్రార్థం' (తర్కవాదం), 'గురు, శిష్య సంవాదం' వంటి సంపన్నమైన మౌఖిక, సంవాద సంప్రదాయాలు ఉన్నాయి (Bhattacharya, 2020). ఇవి సందర్భం, నైతిక వ్యాఖ్యానం, సముదాయ భాగస్వామ్యాన్ని ప్రాధాన్యంగా ఉంచి, సామూహిక, అనుభవాత్మక జ్ఞానాన్ని చెల్లుబాటు చేస్తాయి (రావఅ, 2005). మరోవైపు జర్నలిజం విద్య ముద్రణ, ప్రసారం, డిజిటల్ మీడియాలపై దృష్టి సారించి, వేగం, వ్యాప్తి, సాంకేతిక మాధ్యమాలకే ప్రాధాన్యం ఇస్తుంది (McQuail, 2010). మౌఖిక సంప్రదాయాలు 'ప్రత్యామ్నాయ' మీడియాగా పక్కన పెట్టబడతాయి. జ్ఞానన్యాయం కోణంలో IKS, వీధి నాటకం, భజనలు, కథాకాలక్షేపం, జానపద కథనాలను సంభాషణ వ్యవస్థలుగా గుర్తించి మీడియా నిర్వచనాన్ని విస్తరిస్తుంది (జశీబశ్రీఎతీఎ, 2012).

### 5. నైతికత, ధర్మం – జ్ఞాన బాధ్యత

పత్రికావిద్యలో జ్ఞానన్యాయానికి నైతిక బాధ్యత కీలకాంశం (Fricker, 2007). IKSలో నైతికత 'ధర్మం'పై ఆధారపడి, 'సత్యం', 'నియమం', 'కరుణ', సామాజిక బాధ్యతలను ప్రాధాన్యంగా ఉంచుతుంది (భగవద్గీత, కౌటిల్యుడు, అర్థశాస్త్రం). జర్నలిజం విద్యలో నైతికతను ప్రధానంగా వృత్తిపరమైన నియమావళి, మీడియాచట్టాలు, నియంత్రణా వ్యవస్థలతో బోధిస్తారు (Christians et al., 2009). ఇవి బాధ్యతను పెంపొందించినప్పటికీ, లోతైన తాత్విక, సాంస్కృతికత కొరవడతాయి. డిజిటల్ యుగంలో తప్పుడు సంచలనాత్మక సమాచారాన్ని ఎదుర్కొనేందుకు IKS ఒక నాగరిక నైతిక సంభాషణ దృక్పథాన్ని అందిస్తుంది (UNESCO, 2023).

### 6. జ్ఞాన ఉత్పత్తి – జ్ఞాన సమానత్వం :

భారతీయ జ్ఞానవ్యవస్థలలో జ్ఞానం సామూహికంగా, తరతరాలుగా సంక్రమించే, సమాజంలో పాతుకుపోయిన సంపదగా భావించబడుతుంది (Bhattacharya, 2020). ఇక్కడ జ్ఞాన ఉత్పత్తి వ్యక్తిగత లేదా కార్పొరేట్ లాభాలకన్నా ప్రజాహితానికి ప్రాముఖ్యతనిస్తుంది. ఆధునిక జర్నలిజం విద్య మాత్రం కార్పొరేట్ యాజమాన్యం, డేటా ఆధారిత మూలధనవాదం ప్రభావంతో మార్కెట్ వ్యూహాలకు లోబడి ఉంటుంది (Couldry & Mejias, 2019). జ్ఞానన్యాయం దృష్టిలో IKS, పౌర పాత్రికేయం, సామాజిక మాధ్యమాలు, భాగస్వామ్య సంభాషణ, అభివృద్ధి సంభాషణ, గాంధేయ పత్రికావృత్తి వంటి ప్రత్యామ్నాయ నమూనాలను ప్రతిపాదిస్తుంది (Sen,2005).

### 7. బోధనావిధానాలు – జ్ఞానసాధికారత

భారతీయ జ్ఞానవ్యవస్థల బోధనావిధానం అనుభవాత్మక అభ్యాసం, శిష్యవృత్తి, ఆత్మపరిశీలన ప్రాధాన్యంగా ఉంచుతుంది (NEP 2020). జ్ఞానన్యాయంతో కూడిన సమన్వయంతో, 'ఆత్మపరిశీలన' ఆధారిత ప్రతిబింబాత్మక రచనలు, భారతీయతత్వంపై ఆధారపడి నైతిక కేస్ స్టడీలు, 'ఇతిహాస పురాణ' సంప్రదాయాల నుంచి ప్రేరణ పొందిన కథనాత్మక పత్రికావృత్తి వంటి విధానాలు పత్రికాబోధనను సమృద్ధి చేస్తాయి (Bhattacharya, 2020).

### 8. భాష, ప్రాతినిధ్యం – జ్ఞాన న్యాయం

భారతీయ జ్ఞాన వ్యవస్థల స్వభావం, భాషా బహుళత్వాన్ని, జ్ఞాన వైవిధ్యాన్ని సమర్థిస్తుంది. సంస్కృతం, ప్రాకృతం, తమిళం, తెలుగు, గిరిజన భాషలు, ప్రాంతీయ మాండలికాలు, మౌఖిక సంప్రదాయాల్లో జ్ఞాన ఉత్పత్తిని గుర్తిస్తుంది (Sen, 2005). భాష ఇక్కడ కేవలం సంభాషణ సాధనం కాకుండా, సాంస్కృతిక జ్ఞాపకం, నైతిక విలువలు, జీవానుభవాల వాహకంగా వ్యవహరిస్తుంది. ప్రధాన స్రవంతి పత్రికావిద్యలో ఉన్న ఆంగ్ల కేంద్రిత, పట్టణ పక్షపాత ధోరణికి ఇది విరుద్ధం. భారత న్యాయ వ్యవస్థ సమన్వయంతో ప్రాంతీయ భాషా పత్రికావృత్తికి న్యాయబద్ధత లభించి, స్వదేశీ కథనాలు ప్రాథమిక జ్ఞానమూలాలుగా గుర్తింపబడతాయి. ఇది మహిళలు, గ్రామీణులు, ఆదివాసీలు బలహీనవర్గాల సమగ్ర ప్రాతినిధ్యానికి దోహదపడుతుంది. జాతీయ నూతన విద్యావిధానానికి అనుగుణంగా, బహుభాషా బోధన,

వలసాధిపత్య ప్రభావాల నుంచి విముక్తమైన పాఠ్య ప్రణాళిక, ప్రజాస్వామ్యాత్మక జ్ఞానఉత్పత్తి సాధ్యమవుతుంది.

### 9. నూతన జాతీయ విద్యావిధానం (NEP 2020) సమన్వయం – జ్ఞాన సంస్కరణ

జాతీయ విద్యావిధానం - 2020 (NEP 2020) ఉన్నత, వృత్తిపరమైన విద్యలో భారతీయ జ్ఞాన వ్యవస్థల సమన్వయాన్ని స్పష్టంగా ప్రోత్సహిస్తూ జ్ఞానసంస్కరణకు దారితీస్తుంది. ఇది బహుశాఖా అధ్యయనం. అంతేగాక విలువల ఆధారితవిద్యతో పాటు స్వదేశీ మేధో సంప్రదాయాల పునరుద్ధరణపై దృష్టి సారిస్తుంది. ఈ నేపథ్యంలో పత్రికావిద్యలో ధర్మ, సత్య ఆధారిత మీడియా నైతికత, స్వదేశీ భాగస్వామ్య పద్ధతులపై ఆధారపడ్డ అభివృద్ధి సంభాషణ, 'రస' వంటి భారతీయ సౌందర్య సిద్ధాంతాలపై ఆధారిత సాంస్కృతిక పత్రికావృత్తి, 'వివేకం' ఆధారిత మీడియా సాక్షరత వంటి అంశాలను చేర్చవచ్చు. ఇది పత్రికా విద్యను వలసాధిపత్య ప్రభావాల నుంచి విముక్తం చేసి, సామాజిక బాధ్యతను బలపరుస్తుంది.

### 10. ఆధునిక సమాచార రచనాసవాళ్ళు

జ్ఞాన విశ్వాస సంక్షోభానికి కారణం నేటి మీడియా ప్రపంచంలో ప్రవహిస్తున్న తప్పుడు సమాచారం. దీనితో పాటు అనైతిక రాజకీయాలు, అల్గోరిథమిక్ ప్రభావాలు, ప్రజావిశ్వాస లోపంతో జ్ఞానవిశ్వాసం సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. (UNESCO, 2023). ఇవి కేవలం విధివిధానాలపై ఆధారపడిన పత్రికా నమూనాల పరిమితులను మాత్రమే వెల్లడిస్తున్నాయి. ఈ సందర్భంలోనే ఇటువంటి భారతీయ జ్ఞానవ్యవస్థ సంక్షోభాన్ని ఎదుర్కొనే నైతిక, వ్యాఖ్యాత్మక వనరులను అందిస్తుంది. వాటిలో 'వివేకం' సమాచారం మూల్యాంకనానికి, 'మధ్యమమార్గం' సమతుల్యతకు, 'లోకహితం' ప్రజాహిత దృష్టికి దోహదపడతాయి. ఇవి పత్రికావిద్యలో మిళిత మైతేనే నైతికబాధ్యత పెరిగి, ప్రజావిశ్వాసం బలపడుతుంది.

### 11. తెలుగు జర్నలిజం వికాసంలో భారతీయ జ్ఞానవ్యవస్థలు

తెలుగు జర్నలిజం ఆవిర్భావం కేవలం ముద్రణా సాంకేతికత ఫలితం మాత్రమే కాదు. అది భారతీయ జ్ఞాన వ్యవస్థలు (Indian Knowledge Systems – IKS) అందించిన నైతికత, సత్యాన్వేషణ, లోకహితం, ధర్మబద్ధ సంభాషణ వంటి విలువల సజీవ ప్రతిఫలనం. వేదకాలం నుంచి భాషా, సాహిత్యతత్వ పరంపరతో అభివృద్ధి చెందిన జ్ఞాన సంప్రదాయాలు, ఆధునిక పత్రికావ్యవస్థ రూపుదిద్దుకునే దశలో మూల్యాధారాలుగా నిలిచాయి. సత్యం (సత్యం వద), ధర్మం (ధర్మం చర), లోక సంగ్రహం, వివేకం, సమాజహితం ప్రధాన భావనలు. ఉపనిషత్తుల జ్ఞానచర్చలు, ఇతిహాస, పురాణాల కథన సంప్రదాయం, బౌద్ధ, జైన వాదవివాద పద్ధతులు ఇవి ప్రజలతో సంభాషించడంలో స్పష్టత, నైతిక బాధ్యత, సామాజిక న్యాయం వంటి విలువలను పెంపొందించాయి. ఇవే జర్నలిజానికి మూలస్థంభాలు. కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు వంటి సంస్కర్తలు పత్రికలను సామాజిక సంస్కరణకు వేదికలుగా మలిచారు. వారి రచనల్లో వేదాంతతర్కం, ధర్మసూత్రాలు, మానవ విలువలు స్పష్టంగా కనిపిస్తాయి . ఇవి భారతీయ జ్ఞానవ్యవస్థల ప్రభావానికి ఆధారాలు. కథనశైలి, జ్ఞానపరంపర, భారతీయ కథన సంప్రదాయంలో కథ, ఉపాఖ్యాన, నాట్య రూపకాలు, వ్యవహారిక భాష, ఉపమానాలు సోదాహరణంగా కథనం రూపంలో ప్రతిఫలిస్తుంది. ప్రజల దైనందిన జీవితం, నైతిక ప్రశ్నలు, సామాజిక అసమానతలు, ఇవన్నీ కథనాత్మకంగా, అనుభవజ్ఞానంతో చెప్పడం భారతీయ జ్ఞానవ్యవస్థల ప్రభావమే. ధర్మనిర్ణయం, అహింస, సత్యనిష్ఠ విలువలు జర్నలిజం నియమావళిగా రూపాంతరం చెందాయి. వార్తలో సంయమనం, సమతుల్యత, పక్షపాత రహితంగా భారతీయ నీతితత్త్వానికి సమీపంగా వుంటాయి. ప్రజాహితం ప్రథమలక్ష్యంగా చూడడం తెలుగు జర్నలిజం ప్రత్యేకత. ఇది బ్రిటీష్‌పాలన నుంచి ఆధునిక దశ వరకు వికాసం చెందింది. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పత్రికలు జాతీయ చైతన్యానికి వాహికలయ్యాయి. స్వాతంత్రోద్యమంలో స్వదేశీ భావన, సాంస్కృతికంగా, స్వాభిమానం బలపడటానికి భారతీయ జ్ఞానవ్యవస్థల భావనలు తోడ్పడ్డాయి. డిజిటల్ యుగంలో వేగం,

వ్యాపారతత్త్వం పెరిగినప్పటికీ, జ్ఞానవ్యవస్థల ఆధారిత విలువలు, జర్నలిజాన్ని నైతికంగా దిశానిర్దేశం చేస్తాయి. స్థానిక జ్ఞానం, ప్రజానుభవాలు, భాషా వైవిధ్యం మొదలైనవన్నీ భారతీయ జ్ఞానవ్యవస్థల పునఃకేంద్రీకరణకు ఉపకరిస్తాయి. తెలుగు జర్నలిజం ఆవిర్భావం నుంచి వికాసం వరకూ భారతీయ జ్ఞానవ్యవస్థలు అంతర్భాగంగా వున్నాయి. భారతీయ జర్నలిజం పటిష్టతకు ఈ కొనసాగింపు ఎంతో అవసరం.

## 12. భారతీయ జ్ఞానవ్యవస్థలు – జర్నలిజం సమన్వయం

భారతీయ జర్నలిజం జ్ఞాన వ్యవస్థల ఆధారితంగా కొనసాగవలసిన అవసరాన్ని గుర్తించవలసి వుంది. సత్యాన్వేషణలో సంచలనానికి బదులుగా సత్యానికి ప్రాధాన్యతనివ్వాలి. ధర్మబద్ధంగా వార్తా సేకరణ జరగాలి. బాధ్యతాయుత భాష వినియోగించాలి. న్యాయ సూత్రాలకు, నియమావళికి అనుగుణంగా జరిగిన పాత్రికేయమే చరిత్రలో నిలుస్తుందనే విషయాన్ని పూర్వ అధ్యయనాలతో గుర్తించాలి. సామాజిక న్యాయాన్ని అనుసరించి సముచిత సమూహాల గొంతుకలకు స్థానం (Epistemic justice) కల్పించాలి. సాంస్కృతిక సున్నితత్వం, ప్రాంతీయ విజ్ఞానం, మౌఖిక సంప్రదాయాల పట్ల గౌరవంతో మెలగవలసి వుంటుంది. ఇటువంటి నియమాళి పాటించడంతో పాటు జ్ఞానవ్యవస్థలతో జర్నలిజాన్ని సమన్వయం చేసి సత్ఫలితాలను సాధిస్తుంది. అటువంటప్పుడే అంతర్జాతీయంగా అస్తిత్వాన్ని చాటుకోగలుగుతుంది.

## ముగింపు

భారతీయ జర్నలిజం జ్ఞానమీమాంసలో భారతీయ జ్ఞానవ్యవస్థల సమన్వయం జర్నలిజం సామర్థ్యాన్ని, విలువల్ని పెంచుతుంది. సత్య, ధర్మ, లోకహితం అనే త్రివేణితో పునర్నిర్మిస్తుంది. ఇది జర్నలిజం మీద విశ్వ సనీయతను పెంచి, ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తుంది. నైతికంగా, సాంస్కృతికంగా స్థిరమైన జర్నలిజానికి దారి చూపుతుంది. భారతీయ జ్ఞానవ్యవస్థలను పత్రికావిద్యలో సమన్వయం చేయవలసిన అవసరాన్ని గుర్తించారు. జాతీయ నూతన విద్యావిధానం - 2020కి అనుగుణంగా ఈ సమన్వయం వృత్తిపరమైన క్రమశిక్షణను సాంస్కృతిక జ్ఞానంతో సమన్వయపరుస్తుంది. పత్రికావృత్తి, వ్యవస్థలను బలోపేతం చేస్తుంది. అలాగే తెలుగు జర్నలిజం పరివర్తన దశను ఎదుర్కొంటుంది. డిజిటల్ మీడియా విస్తరణ జరుగుతుంది. సోషల్ మీడియా ప్రభావం సమతుల్యత సాధిస్తుంది. 24/7 వార్తా సంస్కృతి, అల్గారిథమ్ ఆధారిత కంటెంట్ సమాచార ప్రసారాన్ని వేగవంతం చేసినప్పటికీ, జర్నలిజంలో సత్యనిష్ఠ, ప్రజాహితం వృద్ధి చెందుతుంది. దీనికి పునాదిగా నిలిచేది భారతీయ జ్ఞానవ్యవస్థలు (IKS) అనే విషయం స్పష్టంగా తెలుస్తుంది.

**ఆధార గ్రంథాలు :**


1. నార్ల వెంకటేశ్వరరావు, తెలుగు పత్రికా రంగ వికాసం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ.
2. భగవద్గీత విమర్శాత్మక మరియు అనువాద సంచికలు.
3. వి.లక్ష్మణరెడ్డి, తెలుగు జర్నలిజం - ఆవిర్భావ వికాసాలు. 1991.
4. Bhattacharya, S. (2020). Indian Knowledge Systems: Concepts and Applications. PHI Learning.
5. Christians, C. G., et al. (2009). Normative Theories of the Media. University of Illinois Press.
6. Couldry, N. (2012). Media, Society, World. Polity Press. Couldry, N., & Mejias, U. (2019).
7. Chris Bartley (2013), Purva Mimamsa, in Encyclopaedia of Asian Philosophy (Editor: Oliver Leaman), Routledge.
8. Definition of MIMAMSA. www.merriam-webster.com 2025-10-20.
9. McQuail, D. (2010). Mass Communication Theory. Sage. Sen, A. (2005). The Argumentative

10. Indian. Penguin. UNESCO. (2023). Journalism, Trust and Digital Platforms.
11. Mimamsa | Indian philosophy". Encyclopedia Britannica 2025-10-20.
12. Oxford University Press. Government of India. (2020). National Education Policy 2020.
13. Oliver Leaman (2006), Shruti, in Encyclopaedia of Asian Philosophy, Routledge.
14. The Costs of Connection. Stanford University Press. Fricker, M. (2007). Epistemic Injustice.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# నన్నయ భారతంలో మానవీయ దృక్పథాలు

- మేడసాని శ్రీనివాసరావు

తెలుగు శాఖాధ్యక్షులు, సర్ సి.ఆర్. రెడ్డి కళాశాల, ఏలూరు.

కవిత్వ మొక సృష్టి. ఈ సృష్టి రెండు విధములు. ఒకటి బహిః సృష్టి, రెండు అంతః సృష్టి. కవి బహి,అంతః సృష్టి రెండింటిని సమన్వయంగా కవిత్వాన్ని రచిస్తాడు. కవిత్వము తత్త్వ ప్రధానమని ఆర్యులు చెప్పారు. కవిత్వమునకు తత్త్వమునకు సంబంధమ్యూశ్రీవిశీ ఇట్లా చెప్పాడు.

Poetry is three remarks from the truth being but an imitation by the artist of the imitation in life of an idea in the minal of god. ఈ సృష్టి భగవత్సంకల్పము. ఈ సృష్టికి కావ్యము అనుకరణము. వ్యక్తము కాని భగవత్సంకల్పము కావ్యము ద్వారా వ్యక్తమవుతుంది. కావ్య రూపమున వ్యక్తమైన భావమును ప్రతిభావంతులు గుర్తించగలరు. కవి ఊహాత్మకతను, దానిలో దాగి వున్న తత్త్వమును గ్రహించి ముగ్ధులౌతారు. మీఛ్ష్త్రవషాాతీఅశీశ్రీస అనే మహాశయుడు Poetry is the criticism of life అని వివరించాడు. ఇక్కడ life అనగా ప్రకృతి అని కొందరు వ్యాఖ్యానించారు. సృష్టికి వేదములు చేసినంత సత్యముగా తరువాత కావ్యములు వ్యాఖ్యానము చేయలేకపోయినవి. కావ్యము గొప్పతనం కవి ఋషిత్వము మీద ఆధారపడి వున్నది. కవి భావనా పటిమను బట్టి ఆ కావ్యాలు రాణిస్తున్నవి. కవి ఋషిత్వము పొందిన కొలది కావ్యము సత్య సన్నిహితముగా మారుతుంది. అందుకే మన వారు "నా నృషీః కురుతే కావ్యం" అని చెప్పారు.

సృష్టిలో మానవునకెంత విలువున్నదో కావ్య ప్రపంచంలో పఠితకు అంత విలువున్నది. సృష్టి రహస్యాలు విప్పి చెప్పుటకు కవి సృష్టికర్తతో సమానమైనవాడు కావలయును. కావ్య రహస్యము గ్రహించుటకు పాఠకుడుకవి అంత కావలయును. A critoe is one who has failed in original work అని Kallet అన్నాడు. పాఠకుడికి కవిని అర్థం చేసుకోవడానికి కవి అంత కాకపోయినా పాండిత్యము అవసరం. కావ్య సృష్టికి శబ్ద సామాగ్రి ఎంతవసరమో పఠితకు కూడా కావ్య రహస్యాలను గ్రహించడానికి అంత సామాగ్రి అవసరం.

కావ్య మూలలలో భావనా శక్తి పింగళి సూరన "కళాపూర్ణోదయం" చక్కటి ఉదాహరణ. ఇందులో కథకేవలం అమోఘమని పండితులు ప్రస్తుతించారు. కావ్య పాత్రలను బట్టి మనం లోకంలో వ్యక్తుల మనో వైఖరులను తెలుసుకోగలము.

మహాభారతములోని పాత్రలు మనకు లోకంలో కన్పిస్తున్నాయి. అప్పజోడు వెంకట సుబ్బయ్యగారు మహాభారత పాత్రలపై మంచి పరిశోధన చేశారు. భారతంలో

అర్జునుడు యుద్ధ నాయకుడనుకుంటే కర్ణుడు ప్రతి నాయకుడు. నాయకుడు గుణాలు ప్రకాశింప చేయుటకు ప్రతినాయకునికి కళంకములను పూయుట కవి చేయు ధర్మము.

యదార్థ విషయమున కర్ణుడు మహా పురుషుడు. కాని అతను ఆశ్రయించిన వ్యక్తులను బట్టి అతనికి మనం ప్రతినాయకుడి లక్షణాలనే ఆపాదిస్తున్నాం. లోకములో వ్యక్తి మంచితనము ప్రతీతర వ్యక్తి మనస్తత్వం మీద ఆధారపడి వుంటుంది. కావ్యము నందు వ్యక్తుల సంఖ్య పరిమితము. ఒక వ్యక్తి చర్యలకు మూల కారణం మనం నిరూపించగలము. కర్ణుడు నాయకుడైతే కావ్యము నందు అతని ఉత్తమ గుణములు భాసిల్లును. ఇక్కడ మంచి చెడ్డలు అనేవి ప్రతి యోగరూఢములే కాని వ్యక్తికి కేవలం నిసర్గములని తెలియచున్నది. కవి పాత్రల చిత్త వృత్తుల కంటే లోక వృత్తమునకే ప్రాధాన్యత ఇస్తాడు. మానవ మనో ప్రవృత్తిని అర్థం చేసుకోవడానికి మహాభారతం మనకి చక్కగా తోడ్పడుతుంది.

Poetry aims at the reality of an internal probability అని అరిస్టాటిల్ చెప్పినది ఇదే మరి. భారతం లోని యయాతి చరిత్రలో మానవ నైజము ప్రస్ఫుటముగా చూడవచ్చు. యయాతి శుక్రుడి శాప వశమున వృద్ధుడై నాడు. కొడుకులను పిలిచాడు. వారిలో ఎవరైన తన ముదిమిని గ్రహించి, వారి యౌవనమును తనకీయమని కోరిన సందర్భంలో

నరలు గల కాము నైనను!
దరుణులు రోయుదురు డాయః ధనపతి యయ్యుం
బురుషుఁడు దుర్వారజరా!
పరిభూతి నభీష్టభోగబాహ్యుఁడ కాఁడే

(ఆది - 3 - 194)

నెరసిన వెంట్రుకలు గల మన్మధునైనను యువ్వనులు సమీపించుటకు అసహ్య పడుదురు. కుబేరుడయ్యును పురుషుడు వారింప శక్యము గాని ముదిమి వలన పరాభవము చేకోరిన భోగములు అనుభవించలేడని వాడు కదా! లోక సామాన్య విషయాలు పాత్రల మనో గతమును నన్నయ చక్కగా వివరించాడు.

శకుంతలో పాఖ్యానంలో కూడా నన్నయ చక్కగా వివరించాడు.

ఎట్టి సాధ్యులకును బుట్టిన యిండ్లను
బెద్దకాల మునికి తద్ద తగదు
పతలకడన యునికి సతులకు ధర్మువు
సతుల కేడుగడయుఁ బతుల చూవె

(ఆది - 4 - 66)

భరతుడు పెద్దవాడగుట గమనించి, పతివ్రతయైన స్త్రీ వివాహానంతరము భర్త యింటనే ఉండాలి. పుట్టింట్లో ఎక్కువ కాలం ఉండడం లోక మర్యాద కాదు అని చెప్పాడు. భార్య పతి దగ్గర ఉండుటే ధర్మము. భార్యకు ఏడు దిక్కులు భర్తలే అవశ్యమని చెప్పాడు. మూల భారతంలో కణ్వ మహర్షి ఈ శ్లోకం శిష్యులతో చెప్పి నట్లుండగా నన్నయ భారతంలో కణ్వ మహర్షి శకుంతలకే స్వయంగా చెప్పినట్లు రాశాడు. ఈ విషయం ఎంత ప్రధానమైనదో కణ్వ మహర్షి నొక్కి చెప్పాడు.

శకుంతలను దుష్యంతుడు నిరాకరించినప్పుడు నన్నయ గారి భార్య, భర్త, కుమారుడు కుటుంబ ప్రాధాన్యత చక్కగా వివరించాడు. ఇది నేటి ఆధునిక సమాజానికి ఎంతో అవసరం. భార్యా భర్తల మధ్య బంధాన్ని ఆయన సుస్పష్టముగా ఇలా అన్నాడు.

విపరీత ప్రతిభాషలేమిటికి నుర్వీనాథా! యీ పుత్రగా
త్ర పరిష్వంగ సుఖమ్ము చేకొనుము ముక్తాహార కర్పూరసాం
ద్రపరాగ ప్రసరంబు జందనము జంద్రజ్యోత్స్నయుం బుత్రగా
త్ర పరిష్వంగమునట్లు జీవులకు హృద్యంబే కడున్ శీతమే

(ఆది - 4 - 66)

లోకంలో సత్యానికి అధిక ప్రాధాన్యత ఉంది. సత్య వాక్య పరిపాలన రాజులకు అవశ్యము. మంచినీటితో కూడిన నూఱు నూతులకంటే ఒక బావి మేలు. నూరు బావుల కంటే ఒక్క సత్క్రతువది మేలు. నూరు క్రతువుల కంటే ఒక సుతుడు మేలు. నూర్గురు సుతుల కంటే ఒక సూనృత వాక్యము మేలు. ఇక్కడ మానవునికి సత్యము ఎంత పవిత్రమైనదో చెప్పారు.

నుతజల పూరితంబులగు నూతులు నూరిటి కంటే సూనృత
వ్రత! యొక బావి మేలు, మరి బావులు నూరింటి కంటే ఒక్క స
త్క్రతువది మేలు తత్కృత శతంబు కంటే సుతుండు మేలు త
త్సుత శతకంబు కంటే నొక్క సూనృత వాక్యము మేలు సూడగన్ (ఆది - 4 - 24)

గంగా శంతనుల కథలో బ్రహ్మదేవుని కొలువులో శాపగ్రస్తమైన గంగాదేవి భూలోకంలో జన్మించినది.అష్ట వసువుల శాపము తీర్చి మరల దేవలోకమునకేగు సందర్భము భారతము సందేశాత్మకముగా మాతృప్రేమ ఔన్నత్యాన్ని చెప్పింది. గంగాదేవి భూలోకమునకు మొదటగా దివ్యాంగనా రూపమున ప్రతీప మహర్షి కుడితొడ మీద కూర్చుంది. కుడితొడ పుత్రారోహణమైనది. ఎడమ తొడ స్త్రీ భాగము కావున నీవు నా పుత్రునకు భార్యగా ఉండమని ప్రతీప మహారాజు చెప్పడం ఇందులో మర్యాద.

అంగములలోన మేలుత్తమాంగ మందు
నుత్తమంబులు గన్నుల యుర్విజనుల
కట్టి కన్నులు లేవను నదియు గాక
యుత్తముడుగాడె సద్గుణ యుక్తి నతడు
(ఆది - 5 - 11)

సర్వస్య గాత్రస్య శిరః ప్రధానమను నానుడి బట్టి అవయవములన్నింటి కంటే ప్రధానమైనది శిరస్సు. ఆ శిరస్సులో ప్రధానమైనది కన్నులు. అటువంటి కన్నులే లేని దృతరాష్ట్రునికి పిల్లనెవరిస్తారు. అతడు సద్గుణ సంపన్నుడైనా అటువంటి వాడికి పిల్లనివ్వటానికి ఎవరూ ముందుకు రారు. ఇక్కడ లోకం పోకడ గురించి నన్నయ వివరించాడు.

కుమారాస్త్ర విద్యా ప్రదర్శనలో కూడా మనం మానవీయ విలువలను చూడవచ్చు. వేదిక మీద రాజ కుమారులందరూ ఒకొక్కరూ వారి విద్యా ప్రదర్శన చేస్తున్నారు. అర్జునుడి వంతు వచ్చినది. అతనితో విలు విద్య నైపుణ్యము గల యోధుడు కురు పక్షమున కర్ణుడు దుర్యోధనుని అనుమతితో ఆ విద్యా ప్రదర్శనలో పాల్గొనడానికి వచ్చాడు.

కృపాచార్యుడు ద్వంద యుద్ధ రహస్యములు తెలిసిన వాడు. అతని ఆచార్యత్వమున ఈ ప్రదర్శన జరుగుతుంది. కర్ణుడిని ఉద్దేశించి ఓ కర్ణా నీ వంశం, కులం, గోత్రం చెప్పు. ఈ అర్జునుడు కుంతి, పాండురాజుల పుత్రుడు. పాండవ మధ్యముడు. మరి నీ వెవరివి అని అడిగినప్పుడు అతను భిన్నుడైనాడు. సభ అంతయు స్తబ్దుగా వున్నది. కర్ణుడికి మాట పెగల లేదు. కర్ణుడు అంతరంగంలో ఎంత క్షోభకు గురైనాడు. యుద్ధ ప్రదర్శన నియమంప్రకారం ఇద్దరి సమాచారం ఇక్కడ చెప్పాలి అని సభలో కృపాచార్యుడు పలికాడు.

కురు కులజుడు పాండునకు కుంతికి పుత్రుడు రాజధర్మ బం
ధురచరితుండు, నీ వితనితోడ రణం బొనరించెదేని వి
స్తరముగ నీదు వంశమును దల్లిని దండ్రిని జెప్పు, చెప్పినన్
దొరయగుదేని నీ కెదిరి దోర్బలశక్తి నితండు సూపెడిన్
(ఆది - 6 - 45)

ఇక్కడ నన్నయ ప్రయోగించిన దొర శబ్ధము అర్థ గంభీరంగా వున్నది. ఇది రాజకుమార విద్యా ప్రదర్శన సభ మధ్యలో నీవెవడివి. ఎందుకిక్కడకు వచ్చావు. నీ వంశము చెప్పు. నీవు పాండు కుమారులలో సమానమైన వాడినైతేనే ఇక్కడ పాల్గొనే అర్హత వుంటుంది అంటాడు. కర్ణుడి మానసిక పరిస్థితి మనం అర్థం చేసుకోగలగాలి. (ఈ విధంగా అనేక సందర్భాలలో భారతంలో మానవీయ విలువలు మనం గమనించవచ్చు)

ధర్మరాజుకి యువరాజ్య పట్టాభిషేకం జరిగింది. ధుర్యోధనుడి మనసులో క్లేశము కల్గినది. అటు కర్ణ, శకుని, దుశ్శాసనులతో సమావేశమైనాడు. మనకు తెలిసిందే కదా. నలుగురు కలిస్తే ఏ విధమైన ఆలోచనలు చేస్తారో, వెంటనే దృతరాష్ట్రుడి సలహా వినే శకున్ని పిలిచారు. రాజుకి ఆత్మరక్షణ ఎంత గొప్పదో మంత్రాలోచన కూడా అంతే గొప్పదని శకుని కూడా చెప్పాడు. మంత్రము రక్షిస్తే అన్ని పనులు సాధ్యమౌతాయి. ఆ

మంత్ర రక్షణ విఫలమైతే ఆ కార్యము నెరవేర్చడం. బృహస్పతి అంతటి వాడికి కూడా సాధ్యం కాదని కూడా అంటాడు. రాజు చేయాలనుకున్న మంత్రాలోచన చాలా రహస్యముగా చేయాలి. ఏ మాత్రం బయటపడిన ఆ కార్యము చెడిపోతుందని ఇక్కడ వివరించాడు. మన రహస్యాలను మరొకరికి చెప్పినప్పుడు ఆ వ్యక్తి ఆ రహస్యాన్ని ఎంత వరకు దాయగలడో మనం గమనించాక మాత్రమే చెప్పాలి. కార్యాలోచన చాలా జాగ్రత్తగా చేయాలని భారతమే మనకు చెప్పింది.

పాండవులు ఏకచక్రపురంలో ఒక బ్రాహ్మణుని ఇంట్లో తల దాచుకున్నారు. బకాసురునికి భోజనము ఒక బ్రాహ్మణుని వంతు వచ్చింది. అప్పుడు బ్రాహ్మణుడు, అతని భార్య, అతని కూతురు ముగ్గురు "నేను బోయెద, నేను బోయెద" అని పలుకుచూ ఏడుస్తున్నారు. అప్పుడొక చిన్న బాలుడు వారి కన్నీళ్ళు తుడుస్తూ ఓదార్చెను. అతని చేతిలో చిన్న కర్ర పట్టుకుని నేనే ఆ రాక్షసుని సమీపించి వాడిని చంపి వస్తానని మీరెవరు వెళ్ళక్కర్లేదని పలికెను. వారిని ఓదార్చెను. బాలకుడి మానసిక స్థితి మనకు తెలియదు. ఆ బకాసురుడెంతటి బలవంతుడో ఈ బాలకుడు ఈ చిన్నకర్రతో అతడిని ఎలా చంపుతాడో మనం ఊహించలేము. తల్లి, తండ్రి, కుమార్తెల ఏడుపు విని ఆ బాలకుడు ధైర్యంగా ముందుకు వచ్చి ఈ మాటలన్నాడు.

బాలకుడు కొండుక కోల చేత
బట్టికొని యేన రక్కసు గిట్టి చంపి
చులుక వత్తు మీ రేడ్వగా వలవ దనుచు
గలయ నూరార్చె దన తొక్కుబలుకు లొప్ప
(ఆది - 6 - 263)

శివు మనస్తత్త్వానికి సమస్య పట్ల తీవ్రతకు ఈ పద్యం చక్కటి ఉదాహరణ. ఇటువంటి ఎన్నో సంఘటనలు మానసిక పరిస్థితులను మనం భారతంలో చూడవచ్చు.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# రావి నూతల ప్రేమ కిషోర్ సాంఘిక నాటకాలు - సామాజిక దృక్పథం



- చెరుకూరి వేణు

పరిశోధకులు, ఆచార్య ఎస్. చిన్న రెడ్డయ్య, ద్రవిడ విశ్వవిద్యాలయం.

**ప్రవేశిక :**

రావి నూతల ప్రేమ కిషోర్ సమకాలీన సమాజాన్ని బాగా పరిశీలించి అధ్యయనం చేసిన గొప్ప రచయిత. ఈయన కలం నుంచి నాటకాలు, వచన కవితలు, హైకూలు, నవలలు విరివిగా వెలువడ్డాయి. వీరి ప్రతి రచనలోనూ సామాజిక స్పృహ కనిపిస్తుంది. ఏ ప్రక్రియలో రాసినా అందులో తాను చెప్పదలచిన అంశాన్ని స్పష్టంగా, సూటిగా, ఆలోచింపదగిన విధంగా చెబుతాడు. ఈ దృక్కోణంతో వీరి నాటకాలను పరిశీలిస్తే కొమరం భీం, కాల్‌మనీ, సెజ్‌లు, ఆందోళనలు, ఎయిడ్స్ వ్యాధి వంటి అంశాలు బయట పడ్డాయి. వాటిని ఈ వ్యాసంలో విశ్లేషించడం జరిగింది.

**కొమరం భీం :**

కొమరం భీం గోండు గిరిజన నాయకుడు. విశాఖ పట్టణం ఏజన్సీలో అల్లూరి సీతారామ రాజు గిరిజనుల కోసం ఎలా తెల్ల దొరలపై పోరాటం సాగించాడో, అదే విధంగా తెలంగాణలో కొమరం భీం కూడా పోరాటం చేశాడు. ఇద్దరూ గిరిజనుల మనుగడ కోసం పోరాటం చేసి తెల్లదొరల తుపాకి గుళ్ళకు బలయ్యారు. అయితే అల్లూరికి వచ్చినంత ఖ్యాతి భీం కు రాలేదు. ఇలా ఎందుకు జరిగిందో ఎవ్వరూ సమాధానం చెప్పలేక పోతున్నారు. ఈ విషయాన్ని ఒక అవ్వ తన మనవడితో చెప్పి ఆవేదన చెందుతుంది. ఈ విషయమై అవ్వ మనవడుల మధ్య జరిగిన సంభాషణ ఇలా ఉంది.

"అవ్వ : చదువుకునే పోరగాండ్లు గదా!... నా బిడ్డ కొమరం భీం గురించి చాలా చెబుతార్లే అని ఎంతో ఆశపడ్డా. కానీ వాళ్ళు తెలియదనేసరికి నాగుండె చెరువౌతుంది.

రాజేష్ : అప్పుడైనా చెప్పిండ్రా!

అవ్వ : నువ్వే చెప్పు బిడ్డా! అల్లూరి సీతారామరాజు గొప్పవాడే. కానీ నా బిడ్డ కొమరం భీముడు ఏం తక్కువ.... సీతారామరాజు పేరు తెలిసిన పిలగాండ్లకు కొమరం భీం గురించి తెలవకుండా చేసిన వాళ్ళెవరు? మన్యం వీరుడితో నా బోడే ఘాట్ పోరడు సాటి రాజా" (అనలం - పు : 23) అంటూ అవ్వ మనవడుల సంభాషణ ద్వారా భీంకు తగినంత గుర్తింపు రాలేదని నాటక కర్త రావి నూతల ప్రేమ కిషోర్ అంటాడు.

**అప్పు కట్టనందుకు స్త్రీని తీసికెళ్ళుట :**

అప్పు చేయడం సహజం. ఎంతటి ధనవంతుడైనా

ఏదోక సందర్భంలో కొద్దో గొప్పో అయినా అప్పు చేయక తప్పదు. ఒక్కోసారి ఆ అప్పును ఒప్పందం ప్రకారం సకాలంలో తీర్చలేకపోతారు. ఇక పేదలు ఏదేదో అవసరాల కోసం అప్పులు చేస్తారు. వాటిని సకాలంలో తీర్చలేకపోతారు. అప్పుడు డబ్బులు ఇచ్చిన వడ్డీ వ్యాపారులు బాకీ ఉన్న వ్యక్తి భార్యను దౌర్జన్యంగా తీసి కెళతారు. ఆమెను బంధించి అనుభవిస్తుంటారు. అప్పు చెల్లించగానే ఆ స్త్రీకి విముక్తి కలుగుతుంది. దీనినే 'కాల్ మనీ' అంటారు. ఇలా అప్పు ఇచ్చిన వారు బౌన్సర్లను పెంచి పోషిస్తుంటారు. కాబట్టి అప్పు తీసికున్న వాడు వారిని ఎదిరించలేడు. ఒక వేళ ఎదిరిస్తే వారి చేత దాడులకు గురవుతాడు. ఈ విషయాన్ని నాటక కర్త రావి నూతల ప్రేమ కిషోర్ ఇలా తెలిపాడు.

"రామ చంద్రయ్య : అయ్యా! ఒక్క వారం సమయ మివ్వండి. మీ అప్పు తీరుస్తా! లేని వక్షంలో ఆ ఐదెకరాలూ అమ్మేస్తాం..! ఇంటి ఆడోళ్ళని తీసకపోయి మాపరువు వీధిలో పెట్టకండి. (కాళ్ళు వట్టు కుంటాడు)

సహదేవుడు : తగ్గసె.... ఈ సహదేవుడితో పెట్టు కోవద్దు... ఎంతకైనా తెగిస్తాను" (కాడి - పు : 29) అంటూ అప్పు ఇచ్చిన వాడు ఎంత దుర్మార్గంగా మాట్లాడతాడో నాటక కర్త రావి నూతల ప్రేమ కిషోర్ తెలిపాడు.

ఈ కాల్ మనీ బండారం 2014-15లో బయట పడింది. విజయవాడ నగరంలో ఈ తరహా వ్యాపారం, దౌర్జన్యం, లైంగిక దాడులు జరుగుతున్నట్లు తెలియగానే సభ్య సమాజం నివ్వెరపోయింది. ఇందులో తెలుగుదేశం, వైసిపి, సిపిఎం పార్టీలకు చెందిన వారున్నట్లు ఆయా పార్టీల వాళ్ళు ఎంతమంది ఉన్నారో కూడా మీడియా బయట పెట్టింది. అయితే సిపిఎం పార్టీ మాత్రం వెంటనే స్పందించి వారి పార్టీ వారిని పార్టీ నుంచి తొలగించింది. ఈ కాల్‌మనీ విషయమై శాసనసభలో పెద్ద దుమారం, చర్చ జరిగింది. అయితే వారిపైన సరైన చర్యలు తీసికున్న దాఖలాలు లేవని సామాజిక వేత్తలన్నారు. కానీ పేదలు మాత్రం మానసికంగా, శారీరకంగా నరకాన్ని చవిచూశారని చెప్పవచ్చు.

ఇది చాలా అమానుషమైన, అమానవీయమైన చర్య. అప్పు చెల్లించకుంటే చట్ట ప్రకారం వసూలు చేసుకోవాలి గానీ ఇలా స్త్రీల శరీరంతో ఆడుకోరాదు. స్త్రీ అంటే తల్లి, సోదరి, వదిన, కూతురు, భార్య - ఇలా అనేక పాత్రలు పోషించేది. అందులోనూ పర స్త్రీని తల్లితో సమానంగా చూడమంటున్నాయి మన గ్రంథాలు. వాటిని బాగా చదివినవారు, అందులోని విషయాలు తెలుసుకున్నవారు ఇలాంటి హీనమైన, నీచమైన, దుర్మార్గాలను సహించరు. కాబట్టి చట్టం చట్టబద్ధంగా పని చేస్తే ప్రజలు సంతోషంగా జీవిస్తారు. అందుకు అన్ని వర్గాల ప్రజల సహకారం అవసరం.

**సెజ్‌లు వద్దన్నందుకు కాల్పులు :**

ప్రత్యేక ఆర్థిక మండళ్ళను బహుళ జాతి కంపెనీల వారు ఏర్పాటు చేయుటకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యధేచ్ఛగా అనుమతులిస్తున్నాయి. రైతుల ఆందోళనను లెక్క చేయకుండా ప్రభుత్వం పచ్చటి పంట పొలాలను సెజ్‌లకు అప్ప జెప్పుతున్నది. రైతులు అంగీకరించినా, అంగీకరించక పోయినా పొలాలను స్వాధీనం చేసు కుంటున్నది. ఆ సందర్భంలో కొందరు రైతులు పొలాలు పోతే తమ బతుకులు పాడై పోతాయని ఆందోళనలు చేస్తున్నారు. వాటిని అణచి వేయడానికి ప్రభుత్వం పోలీసులను రంగంలోకి దింపుతుంది. ఈ నేపథ్యంలో ఘర్షణ, తోపులాట, పోలీసుల కాల్పులు కూడా జరుగు తాయి. కొందరు ప్రాణాలు కూడా కోల్పోతారు. అలా ఆందోళనలో చనిపోయిన ఒక యువకున్ని అతని తండ్రి ఎత్తుకొని సెజ్‌కు శంకు స్థాపన చేసేచోట పూడ్చి పెట్టాలని పట్టు బడతాడు. ఈ విషయాన్ని నాటక కర్త రావి నూతల ప్రేమ కిషోర్ ఇలా తెలిపాడు.

"రాంప్రసాదు : బాపూ! ఆనాడు ఇదే రోజున గాడ్సే, నిన్ను హతమార్చి దేశానికి ద్రోహం చేశాడు. ఈనాడు ఎంతోమంది

గాడ్జేలు పచ్చటి పంట పొలాల్ని, పొగ గొట్టాలుగా మార్చి నీ ఆశయాల్ని కూడా పాతిపెట్టి రైతు ద్రోహులవుతున్నారు. అన్న దాతల ఆక్రందనలకు కారకులవుతున్నారు.

పోలీస్ : ఆగండి.... ఎవ్వరూ రావడానికి వీల్లేదు... 144 సెక్షన్ అమల్లో ఉంది. ముందుకు రాకండి. ప్రాణాల మీదకు తెచ్చుకోకండి.

జానకమ్మ : ఉద్యమ సూర్యుడు నేల కొరిగి నాడు రా! (కిరణ్ తండ్రి శవాన్ని భుజం మీద వేసుకుంటాడు)

కిరణ్ : ఈ పుణ్య మూర్తిని మన పొలం కాడికే తీసుకు వెళదాం. శంకు స్థాపన చేస్తున్న చోటనే అంత్య క్రియలు చేద్దాం" (రెక్కల పుడమి - పు : 42) అంటాడు.

ఈ సెజ్‌లకు పచ్చటి పంట పొలాలను ప్రభుత్వం కేటాయిస్తుంది. ఇక వ్యవసాయం చేస్తూ ముక్కారు పంటలు పండిస్తూ రాజుగా బతికే రైతులు తమ పొలంలో ఏర్పాటు చేసిన కర్మా గారంలోకి కూలి పనికి వెళ్ళేంతటి దౌర్భాగ్య పరిస్థితుల్లోకి నెట్టబడతారు. నలుగురికి తిండి పెట్టిన రైతు తన తిండికి ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితి వస్తుంది. ఆ రైతుల పిల్లలు చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ జీవితాలను గడపాల్సిన గడ్డు పరిస్థితి వస్తుంది. ఒక వైపు పొలాలు పోయాయనే బాధ, జీవితాంతం కూలీలుగా బతకాల్సి రావడం, రైతు దర్పాన్ని కోల్పోయామన్న వేదన సెజ్ బాధితులను నిత్యం కలచి వేస్తుంటుంది. అయినా ఏమీ చేయలేని నిస్సహాయత. ఏ సెజ్ కూడా ప్రశాంతంగా ఏర్పాటు కాలేదు. ధర్నాలు, ఘర్షణలు, బంద్‌లూ, పోలీసు కాల్పులు ఖచ్చితంగా జరుగుతాయి. ప్రాణాలు కోల్పోయిన రైతులు కూడా ఉన్నారు. అయినా ఏ సెజ్ ఏర్పాటు నిలిచిపోలేదు. ప్రతి చోట రైతులే ఓడి పోతున్నారు. వ్యవసాయం ప్రధాన వృత్తిగాగల దేశంలో సెజ్‌ల ఏర్పాటు ద్వారా రైతుల నడ్డి విరుస్తున్నారు. ఇలా ఏర్పాటు చేయబడిన సెజ్‌లు మన దేశంలో సుమారుగా 600 వరకు ఉన్నాయని తెలుస్తున్నది.

**అమానవీయ చర్యలు :**

సమాజంలో కొందరు అమానవీయ చర్యలకు పాల్పడుతుంటారు. తామొక్కరే గొప్ప వారమని, పరిశుద్ధులమని భావిస్తుంటారు. అలాంటి వారు చేసిన ఒక అమానవీయ చర్యను నాటక కర్త రావి నూతల ప్రేమ కిషోర్ ప్రస్తావించాడు. సీతారాం అనే వ్యక్తి ఆగ్రామ పెద్ద. ఆ ఊరిలోని ఒక కుటుంబం వారికి ఎయిడ్స్ ఉందన్న నెపంతో వారి కుటుంబాన్ని మొత్తాన్ని గ్రామంనుంచి వెలివేస్తాడు. అదే విధంగా వారి పిల్లలను బడికి దూరం చేస్తాడు. ఈ దుర్మార్గపు చర్యలను సమాజానికి తెలుపుటకు సీతారాం, ఆనంద్ అనే పాత్రలను సృజించాడు నాటక కర్త. రచయిత ఆసన్నివేశాన్ని ఇలా తెలిపాడు.

"సీతారాం : పూరన్నాక కొన్ని పద్ధతులు, కట్టుబాట్లు ఉంటాయి. ఎప్పుడైనా ఆటికి కట్టుబడి ఉండాల్సిందే....

ఆనంద్ : ఏ పద్ధతి ఏ కట్టుబాటైనా మనిషిని సంస్కరించే విధంగా ఉండాలి. అనాగరిక చర్యల్ని కట్టుబాట్లంటే ఏ సమాజమూ ఒప్పుకోదు.

చంద్రమ్మకు ఎయిడ్స్ ఉందని కుటుంబాన్ని మొత్తాన్ని వెలివేసేవారిని దిక్కు లేకుండా చేయడం అనాగరీకం కాదా? ఎంతో భవి,ష్యత్ ఉన్న సూరిని బడికి రానీయకుండా చేయడం ఆటవికం కాదా?" - అంటూ (నిశ్శబ్ద గాయం - పు : 33) ఎయిడ్స్ రోగుల పట్ల కొందరు దుర్మార్గంగా వ్యవహరిస్తున్న తీరును రచయిత పేర్కొన్నాడు. ఎయిడ్స్ ఉన్నవారి బట్టలు వేసుకున్నా, వారితో కలిసి భుజించినా ఎయిడ్స్ రాదు. వారితో శారీరక సంబంధం పెట్టుకుంటేనే ఎయిడ్స్ వస్తుంది. ఈ విషయం తెలిసినా కొందరు ఆ రోగులను సమాజానికి దూరంగా ఉంచుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే మానవ సమూహం నుంచి బహిష్కరిస్తున్నారు. 2004లో చిత్తూరు

జిల్లా కుప్పంలో వృద్ధురాలైన ఎయిడ్స్ రోగిని సజీవంగానే కాల్చి వేశారనే వార్త వెలువడింది. ఈ విషయం మీడియా ద్వారా - బయట ప్రపంచానికి తెలిసింది. మానవ హక్కుల సంఘం రంగంలోకి దిగింది. సమగ్రంగా విచారణ జరిపింది. చివరికి చనిపోయిన తర్వాతనే కాల్చి అంత్యక్రియలు జరిపారని నిర్ధారించారు. ఇందులోని వాస్తవాస్తవాలు కుటుంబ సభ్యులకే తెలియాలి. ఏ విషయాన్ని వారు ఆనాడు బయట పెట్టలేదు.

ఈ ఎయిడ్స్ నియంత్రణకు ప్రభుత్వం కఠిన నిబంధనలు అమలు జరిపింది. దీని కోసం మీడియాను చక్కగా ఉపయోగించుకున్నది. మేధావులు, స్వచ్ఛంద సంస్థలు త్రికరణ శుద్ధిగా కృషి చేశాయి. దీని కోసం వందల కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. చివరికి దీనిని అదుపు చేయగలిగింది.

**ముగింపు :**

రావినూతల ప్రేమ కిషోర్ గారు సమాజంలోని కుళ్ళును, ఇతర సామాజికాంశాలను తన రచనల్లో పేర్కొన్నాడు. అదేవిధంగా సమాజంలో జరుగుతున్న ప్రతి అంశాన్ని తన రచనల్లో పేర్కొన్నాడు. ఇలా రావినూతల ప్రేమ కిషోర్‌గారు తన నాటకాల్లో అనేక సమకాలీ నాంశాలను చిత్రించి ప్రజల్లో చైతన్యం తెచ్చుటకు తన వంతు కృషి చేశాడనవచ్చు.

**ఉపయుక్త గ్రంథాలు :**


1. రావి నూతల ప్రేమ కిషోర్ నాటకాలు
2. కొమరం భీం
3. సాహిత్య భావలహరి - ఆచార్య యస్వీ జోగారావు
4. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
5. తెలుగు నాటక వికాసం - పిఎస్ఆర్ అప్పారావు.
6. కన్యా శుల్కం - గురజాడ అప్పారావు
7. వర విక్రయం - కాళ్ళకూరి నారాయణరావు
8. నాటికా పంచ వింశతి - కొర్ర పాటి గంగాధరరావు.


★★★

Vol. 23 | Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# బీసీ ఉద్యమంతో బీసీ కవిత్వం – పరిశీలన



– పెందోట వీణ
పరిశోధన విద్యార్థి, కాకతీయ యూనివర్సిటీ.

"బీసీలు అంటే బహుళ జాతి కులాలు అనగా వెనుక బడిన తరగతులు" అని అర్థం. ఇది ఒక కులం కాదు, ఒక సమూహం (వర్గం) అని చెప్పాలి. భారత రాజ్యాంగం ఆర్టికల్ 15(4) కింద బీసీలు సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలుగా నిర్వచించబడ్డాయి. బీసీలకు (OBCs - Other Backward Classes) కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్రాల ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పిస్తుంది. ఉదాహరణకు తెలంగాణలో బీసీలను గ్రూపు (A, B, C, D, E)లుగా విభజించి, సంబంధించి రిజర్వేషన్లు మొదలైనవి అమలుచేస్తారు. ఇవి అన్ని వృత్తుల, మతాల ఆధారంగా విభాగీకృతం. బీసీ కులాలు సాధారణంగా సామాజిక, ఆర్థికంగా వెనుకబడి ఉండి, అధిక తోడ్పాట్లు అవసరం ఉన్నవారు. చాలా బీసీ కులాలు వివిధ వృత్తులలో ఉండి, జీవనాధారం పొందు తారు. కమిషన్ 3,743 కులాలను దేశవ్యాప్తంగా బీసీలుగా గుర్తించి, దాదాపు 52% జనాభా బీసీలలో ఉందని గుర్తించింది. కేంద్రం 2,479 కులాలను ఓబీసీ జాబితాలో పెట్టి 27% రిజర్వేషన్లు ఇవ్వగా, రాష్ట్రాలు భిన్నంగా రిజర్వేషన్ కేటాయిస్తాయి. బీసీలకు పార్లమెంట్లో ప్రత్యేక రిజర్వేషన్ లభ్యం లేదు, కాని స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ ఉంటుంది. తెలంగాణలో ఉదాహరణగా, బీసీలు గ్రూపులు : గ్రూప్ A : సంచార తెగలు గ్రూప్ B : వృత్తిపరమైన సమూహాలు గ్రూప్ C : క్రైస్తవమతంలోకి మారిన ఎస్సీలు గ్రూప్ D : ఇతర కులాలు గ్రూప్ E : సామాజికంగా వెనకబడిన ముస్లిం కులాలుఈ కులాల కోసం ప్రత్యేకంగా ఆర్థిక సాయం, వృత్తి సహాయం, విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు ఉంటాయి. బీసీలు తమ సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం ఒక ఐక్య శక్తిగా మారడం అవసరం కూడా ఉన్నట్లు పరిశీలించబడింది.

బీసీ అంటే ఒక నిర్దిష్ట కులం కాదు, అనేక కులాలు దీనిలో భాగమవుతాయి. బీసీ ఉద్యమంలో తెలుగు కవిత్వం ప్రాధాన్యమైన పాత్ర నిర్వహించింది. బీసీ ఉద్యమ భావజాలాన్ని, ఆవేదనలను, సమాజంలోని అన్యాయాలకు వ్యతిరేకంగా సంక్షోభ భావాలను తెలుగు కవిత్వం తీవ్రంగా ప్రతిబింబించింది. బీసీ కులాల మధ్య ఐక్యత కోసం, వారి స్వరాన్ని సమాజానికి, ప్రభుత్వం ముందు చెప్పేందుకు కవిత్వం ఒక గొప్ప వాయిస్?గా నిలిచింది. బీసీ ఉద్యమంలో తెలుగు కవిత్వం ద్వారా బీసీ సమాజం స్వయంగా ఆ అభ్యంతరాలను, ఆశయా లను వ్యక్తం చేసింది. అంతేకాదు, బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేసిన తెలుగు కవిత బీసీ ఉద్యమంలో బీసీ సమాజ అనుభూతులను, నిరసనలను యువత, ప్రజల

దృష్టికి తీసుకువచ్చింది.బీసీ ఐక్యతకు, ఆందోళన ఉద్యమానికి మైత్రి, బలం సమకూర్చింది.బీసీ హక్కుల సాధన కోసం ప్రజలను చైతన్యం చేశారు.బీసీ ఉద్యమానికి భావపూర్వక స్ఫూర్తిని అందించింది.ఈ భావాలతో రాష్ట్ర రాజకీయాల్లో, సామాజిక చైతన్యంలో ముఖ్య పాత్ర పోషించినది.

బీసీలకు అన్యాయం అనేది ప్రధానంగా వారు రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాల నుండి సమంజసమైన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ అవకాశాలు, రిజర్వేషన్లు మరియు రాజకీయ ప్రాతినిధ్యం అందించడంలో దెబ్బతినడం వల్ల జరుగుతోంది. బీసీలకు అధికారికంగా కుల గణన పూర్తి కాకపోవటం, తద్వారా వారి జనాభా, వారసత్వం, ఆర్థిక పరిస్థితుల వివరాలు ప్రభుత్వాలకు స్పష్టంగా లభించకుండా ఉండటం. ఇది బీసీ కులాలకు రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల వివరణలో అవరోధం కలిగిస్తోంది. రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు బీసీల హక్కుల పరిరక్షణలో వ్యతిరేక మరియు విభజనాత్మక విధానాలు అవలంబించడం వల్ల బీసీలు తమ సముచిత భాగాన్ని అందుకోలేక పోతున్నారు. బీసీ కులాల మధ్య లో అంతర్గత విపక్షలు, కొన్ని కులాలను జాబితాలో చేర్చడం లేదా తీసివేయడంలో వివాదాలు ఉండటం, తద్వారా అవకాశాల పంపిణీలో సమానత్వం నిలకడగా ఉండడం లేదని భావిస్తున్నారు. ఏ ప్రాముఖ్యత కలిగిన బీసీ సంఘాల స్పష్టమైన ఐక్యత లేకపోవటం, ఇతర ప్రాముఖ రాజకీయ ప్రమాణాలు, హక్కుల కోసం సమర్పిత పోరాటంలో తేడాలు ఉండటం, కొన్ని బీసీ కులాలను ఎస్టీ లేదా ఇతర జాబితాలకు చేర్చాలని కోరడం వల్ల ఇప్పటికే ఉన్న బీసీలు తమ రిజర్వేషన్లలోకి నష్టాన్ని చూడాల్సి వస్తోంది.అది శాసనసభల అసెంబ్లీ లెక్కలలో సరైన ప్రాతినిధ్యం లేకపోవడం, కోర్టులు, కమిషన్ల నిర్లక్ష్యం కూడా అన్యాయాలకు దారితీస్తుండటం ఒక ప్రధాన కారణం. ముఖ్యంగా, పాలక కులాల అధిక ప్రభావంతో బీసీ కులాలు ఇతరులకు పోటీతరగతిగా నిలబడటం, వారి అధికార స్వీకరణను నిరోధించడం ముఖ్య తీవ్రమైన అన్యాయం. ఇవి అన్నీ కలిపి బీసీల కోసం సరిగ్గా న్యాయం జరగలేకపోవటం, వారి హక్కులు, రిజర్వేషన్లు సరిగా అమలవ్వడం లేదనేది నిజం కనుక బీసీల ఐక్యత, కుల గణన, రాజకీయ హక్కుల అమలు, సమానత్వ భాధ్యత అవసరం అన్న ఉద్దేశ్యంతో బీసి సమాజం పోరాడుతోంది.

**బీసీ రిజర్వేషన్ నిబంధనల ముఖ్యాంశాలు :**

బీసీలకు (Other Backward Classes - OBC) భారత రాజ్యాంగం కింద రిజర్వేషన్లు కల్పించబడతాయి. 50% రిజర్వేషన్ పరిమితి ఉంది, కానీ ఆర్థికంగా బలహీన వర్గాల (EWS) కోసం 10% రిజర్వేషన్లు పెరగడంతో మొత్తం రిజర్వేషన్లు 50% పైకి వెళ్లాయి. రాష్ట్ర ప్రభుత్వాలు, ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం, 42% రిజర్వేషన్లు స్థానిక సంస్థలలో బీసీలకు ప్రకటించాయి. రాష్ట్రాల్లో పంచాయతీ, మునిసిపల్ స్థాయిల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించడంలో రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 243ఊ(6) మరియు 243ఖ(6) కీలక పాత్ర వహిస్తాయి. వీటి ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారమివ్వబడింది.తెలంగాణలో బీసీల స్థానిక సంస్థలలో రిజర్వేషన్ల కోసం ప్రత్యేక బీసీ కమిషన్ ఏర్పాటై, బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల విశ్లేషణ చేసి 42% రిజర్వేషన్ సిఫారసు చేసింది. ఇది చట్టబద్ధంగా అమలు అవుతోంది.హైకోర్టులు, సుప్రీంకోర్టు రిజర్వేషన్ల పరిమితి 50% వరకు ఉండాలని కొన్ని తీర్పులు ఇచ్చినప్పటికీ, బీసీల స్వార్థాల పరిరక్షణ కోసం సందర్భానుసారం రాష్ట్రాలకి మరింత రిజర్వేషన్లకు ఆమోదం వచ్చేసింది. అయితే 50% మించి రిజర్వేషన్లు ఇచ్చే పద్ధతి చట్టపరంగా కష్టమవుతుంది కాబట్టి దీనిపై చట్టసవరణలు మరియు న్యాయ పరిణామాలు జరుగుతూనే ఉన్నాయి. బీసీ రిజర్వేషన్ జీవితంలోని విద్య, ఉద్యోగం, రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక సహాయం వంటి విభాగాల్లో ఉంటాయి. చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు (GO) ప్రకారం దశలవారిగా అమలు జరుగుతుంటాయి. తాజాగా తెలంగాణలో 42% బీసీ రిజర్వేషన్లు ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల ద్వారా అమలవుతున్నాయి. కానీ గవర్నర్ వద్ద బీసీ రిజర్వేషన్ బిల్లు ఇంకా పెండింగ్?లో ఉన్న పరిస్థితుల్లో ఈ జీవోలు చెలామణిలోరావడంపై

హైకోర్టు వివాదాలు కూడా జరిగాయి.ఈ నిబంధనలు బీసీలకు సామాజిక, విద్య, ఉద్యోగ రంగాల్లో ఉన్న వెనుకబాటును తగ్గించడానికి, నీతిసమ్మత సామాజిక సమవాటాని సాధించడానికి ముఖ్యమైనవి.

తెలంగాణలో జారీ చేసిన GO 9 ప్రస్తుత ఆర్టికల్స్ 243ఙ(6) మరియు 243T(6)తో సంబంధించి ఈ విధంగా సరిపోల్చవచ్చు: తెలంగాణ ప్రభుత్వ ఉత్తర్వు (GO) 9 ప్రధానంగా బీసీలకు స్థానిక సంస్థల (పంచాయతీలు, మునిసిపాలిటీలు)లో 42% రిజర్వేషన్లు కేటాయించడానికి సంబంధించినది. ఇది బీసీల సామాజిక, ఆర్థిక అభివృద్ధి, రాజకీయ ప్రాతినిధ్యం కోసం తీసుకున్న కీలక నిర్ణయం.

**బీసీ వాదంపై విడుదలైన ముఖ్యమైన తెలుగు సాహిత్య గ్రంథాలు :**

1. తెలంగాణ బీ.సీ వాద సాహిత్యం - రచన : డా. అట్టెం దత్తయ్య, సంవత్సరం: 2021.

ఈ గ్రంథం పద్య, వచన, కథ, నవల, విమర్శ వంటి బహుజన సాహిత్య ప్రక్రియల్లో బీసీల జీవత సంబంధ సాహిత్యాన్ని విశ్లేషిస్తుంది.

2. వెంటాడే కలాలు - వెనకబడిన కులాలు (కవితా సంకలనము) - సంపాదకులు : జూలూరు గౌరీ శంకర్, సంవత్సరం: 2002

బీసీ వాదానికి పునాది వేసిన సంకలనంగా భావిస్తారు. ఇందులో బహుజన కవితా గొంతుకలు, వృత్తి ఆధారిత జీవనానుభూతులు, కుల ఆత్మగౌరవ అంశాలు ప్రతిబింబిస్థాయి

3. బహువచనం (కవితా సంకలనము) - సంపాదకులు: సుంకిరెడ్డి నారాయణ రెడ్డి (నీలగిరి సాహితీ), సంవత్సరం: 1996.

ఈ గ్రంథంలో తెలంగాణ ప్రాంత బహుజన కవిత్వం, బీసీ వాద, ప్రాంతీయత అంశాలు పొందుపరచారు

4. బి.సి. కథలు - ఒక విశ్లేషణ 2000--2010 - రచయిత : బి. ఎస్. రాములు, సంవత్సరం: 2011

2000-2010 మధ్య వచ్చిన బీసీ కథలను విశ్లేషించిన కృషిగా దీనిని గుర్తించవచ్చు.

5. బిసి వాద సూర్యోదయం --- సంపాదకత్వం: జూలూరి గౌరీ శంకర్, సంవత్సరం: 2015

నవ్య బీసీ కవిత్వానికి సాహిత్య దిశ చూపిన కృషిగా ఉంది

6. ప్రవాహం (విమర్శనా వ్యాస సంకలనం) - సంపాదకత : చింతం ప్రవీణ్, సంవత్సరం: 2017.

**ప్రత్యేక బీసీ కవులకు సంబంధించిన ప్రసిద్ధ బీసీ కవితా శీర్షికలు :**

1. జూలూరి గౌరీ శంకర్ : "జూలూరు పథం" (దీర్ఘ కవిత)
2. మునస వెంకట్ : "గంగమ్మ" (వచన కవిత)
3. ప్రసాదమూర్తి : "తాతకో నూలుపోగు
4. డాక్టర్ ఎం గోపి : "ఓ రాజయ్య కథ"
5. సీతారాం : "రెజ్యూమ్"
6. ప్రసేన్ : "కన్నీటి నది దోచుకెళ్లిన నావ నా పద్యం"
7. పగడాల నాగేందర్ : "సుద్ధి"
8. బెల్లి యాదయ్య : (ప్రఖ్యాత బీసీ వాద వచన కవితలను రచించారు. వ్యక్తిగతఈ కవితా శీర్షికలు బీసీ హక్కుల పోరాటంలో, వారి వృత్తుల బాధలను, సామాజిక అసమానతల మీద కవిత్వ రూపంలో వ్యక్తం చేయడంలో కీలక పాత్ర పోషించాయి. వేర్వేరు కవులు బీసీ సమస్యలను తమ అనుభవాలతో బాల్యం, జీవిత కథలు, బాధల రూపంలో సమర్థంగా వ్యక్తం చేశారు.

"బహువచనం, మేమే, మొగి" దళిత బహుజన కవిత్వం దీన్ని బీసీలు వెలువరించారు.

సతీష్ చందర్ బీసీలు ఆకలితో చచ్చిపోతుంటే ఎస్సీలు అవమానాలతో చనిపోతున్నారని చెబుతూ తమ అనుభవాన్ని రాయాల్సిన బీసీలు ఎస్సే అనుభవాలు రాసి తమ అనుభవాలను దాచి పెట్టారని ఆరోపించారు.

- ప్రసాదమూర్తి తాతకోనూలుపోగు అనే కవితలో" తాతా తాత వెండి వెన్నెల జరిగే చీరల నేతగాడా బతకంతా బాధల బస్తాల మోతగాడా పద్మశాలి

నువ్వు ప్రతిభాశాలవి నువ్వు అగ్గిపెట్టెలో ఆరున్నర గజాల పద్యాన్ని పద్యాన్ని మడతపెట్టిన గజనేత గాడా"

- సీతారాం రెజ్యూమ్ కవితలో " మేము ఎవరో చాకల్లం మంగళ్ళం చౌడు సున్నాళం సన్నాసులం గాడిద బరువులం ముట్టుమూటలం ఇస్త్రీ పెట్టెలం ఆదరణ అంతగా లేని పౌరులం సానరాల్లం చాకిరేవులం "
- ప్రసీన్ రాసిన కన్నీటి నదిని దోచుకెళ్లిన నావా నా పద్యం " ఐ లవ్ మై క్యాస్ట్ " దేవాలయం నా వాడ గజ్జ కట్టిన దేవతలందరూ నా తల్లులే.. "
- బాణాల శ్రీనివాస్ "కుంపటి" కవితలో కుంపటి మా ఇంటి తోటలో పూసే సూర్యపుష్పం అందులో మెరుపుల్ని మేఘాల్ని చూస్తాం ఉరుములై వింటం రకరకాల రంగుల్ని చూస్తాం ఆఖరు పాలపుంతల్ని చూస్తాం.."
- జూలరి గౌరీ శంకర్ "నీ కొలిమితిత్తి గొంతుకనై ఊది ఊది మంటకు మాటలు నేర్పాకే చరిత్ర ప్రసవం.."
- బెల్లి యాదయ్య "నేను గొర్రెల్ని కాస్తుంటాను మంద నా గురుకులం, తాత తండ్రులు నా ఉపాధ్యాయులు, కొండకోన నా తరగతి గది, తడి దుక్కి నా ముద్దు పలక, దుడ్డుకొన నా సుద్ద ముక్క, బోడోబీ డు నా ఆట స్థలం.."
- కొంపెల్లి వెంకటగౌడ్ - "ముస్తాదులు కదులు తున్నాయి" కల్లుగీత కారుల జీవితాన్ని, మునాస వెంకట్- గంగమ్మ కవిత బెస్తవారి వ్యదలని వివరించారు.

ఇలా ఎందరో కవులు బిసి వృత్తి పనుల్లోని కష్ట సుఖాలను సమస్యలను సాహిత్య పరంగా సమాజానికి తెలియజేస్తూ వస్తున్నారు. బీసీ వాద కవిత్వ పరిశోధన సమాజానికి మరియు సాహిత్యానికి ఎన్నో విధాల మేలు చేసింది. సమాజపరంగా బీసీవాద కవిత్వం ద్వారా బీసీకులాల జీవన వాస్తవాలు, బాధలు, సామాజిక అన్యాయాలు వెలుగు చూసాయి. ఈ కవిత్వం సమాజంలోని వెనుకబడ్డ వర్గాల చైతన్యాన్ని ఉద్యమ రూపు కట్టేలా చేసింది. ఇది బీసీసమాజంలో ఐక్యతను, ఆత్మగౌరవాన్ని పెంపొందించి, వారి హక్కుల కోసం సంక్లిష్టమైన సమాజిక పోరాటాశక్తికి నిఖార్సైన మద్దతును అందించింది. బీసీ సమస్యలు, ఆశయాలు మరియు ఆకాంక్షలను ఎక్కువ మందికి తెలియజెప్పి యువతను, ప్రజలను సంఘటితం అయ్యేలా ప్రేరేపిం చింది. బీసీ ఉద్యమాలు, వారి హక్కుల సేకరణలో బీసీవాద కవిత్వం ఒక సామాజిక ముద్రగా నిలిచింది.

సాహిత్యపరంగా తెలుగులో బీసీవాద కవిత్వం కొత్త భావోద్వేగాలు, కొత్త ధోరణులను తీసుకువచ్చింది. బీసీ కవులు తమ అనుభవాలను, భావాలను సాంఘిక, రాజకీయ సందర్భంలో అర్థవంతంగా వ్యక్తం చేశారు.ఈ కవిత్వం దళిత, బహుజన సాహిత్య ప్రక్రియల్లో వేరొక ముఖ్య విభాగంగా వస్తూ సాహిత్య విషయంలో కొత్త దిశానిర్దేశాలుగా నిలిచింది.

సామాజిక, రాజకీయ అంశాలపై సాహిత్యం సాధారణ పాఠకులకు, సాహిత్య విమర్శకులకు కొత్త అభిప్రాయాలను, ప్రశ్నోద్వేగాలను ఇస్తోంది.విభిన్న వృత్తుల, కుల సంఘాల బాధలను, జీవిత కథలను సాహిత్య వేదికపై ప్రదర్శించడం ద్వారా బలమైన సామాజిక సంకేతాలు సృష్టించవచ్చు.

ఈ కవిత్వ పరిశోధనలు భవిష్యత్ తెలుగు సాహిత్యంలో దళిత, బహుజనాంధ్ర సాహిత్య అభివృద్ధికి దోహదపడతాయి. సాంఘిక, సాంస్కృతిక చైతన్యంలో, అభ్యంతరాలపై పోరాటంలో బీసీవాద కవిత్వ పరిశోధన ముఖ్య పాత్ర వహించింది. దీని వల్ల అధ్యయనానికి, అధ్యాపనానికి ప్రత్యక్షంగా, సమగ్రంగా అవకాశాలు లభించి, బీసీ ఆచారాల, అనుభవాలు వెలుగులోకి వస్థాయి.

**ఆధార గ్రంథాలు :**


1. అడ్డం దత్తయ్య- తెలంగాణ బీసీ వాద సాహిత్యం., బహువచనం 1996
2. వెంటాడే కళలు వెనుకబడిన కులాలు 2021 జూలరీ గౌరీ శంకర్.


★

Vol. 23 | Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# వాడ్రేవు వీరలక్ష్మీ దేవి గిరిజన కథలు - జీవన విధానం సమస్యలు - పరిష్కారాలు



- హిమబిందు వేదుల
పరిశోధక విధ్యార్థిని, తెలుగుశాఖ,
ఆంధ్ర విశ్వవిద్యాలయం,
విశాఖపట్టణం.

- ఆచార్య జర్రా అప్పారావు
తెలుగు శాఖ,
ఆంధ్రవిశ్వకళాపరిషత్,
విశాఖపట్టణం.



**ఉపోద్ఘాతం:**

ఆదివాసీలు లేదా గిరిజనుల జాతి అతి ప్రాచీనమైనది. భారతీయ సాహిత్యంలోని పురాణాలు, ఇతిహాసాల్లో, ప్రబందాల్లో గిరిజనుల ప్రస్తావన కనిపిస్తుంది. రామయణంలో గుహుడు , శబరి పాత్రలు మనకి కనిపిస్తాయి. భారతంలో ఏకలవ్యుడు , కాళహస్తీశ్వర మాహాత్యంలోని తిన్నడు (భక్త కన్నప్ప) కూడా గిరిజన జాతికి చెందినవారే. అంతేందుకు చాలా మంది కవులు వారి కావ్యాల్లో గిరిజన జాతిని గురించి ప్రస్తావించారు. ప్రాచీన కాలంలో రామయణాన్ని రచించిన వాల్మీకి, పట్టుదలతో ద్రోణుని పరోక్ష శిష్యుడుగా నిలిచిన ఏకలవ్యుడు, గిరిజనుల నిర్మలభక్తికి నిదర్శనంగా శబరి, తిన్నడు పాత్రలు కనిపిస్తాయి.

భారతదేశ చరిత్రలో గిరిజనుల పాత్ర ఎంతో ముఖ్యమైనది. మన దేశ జనాభాలో ఏడు శాతం ప్రజలు గిరిజనులే ఉన్నారు. మన భారత రాజ్యంగం వీరిని షెడ్యూల్డ్ తెగలుగా గుర్తించింది. మన రాష్ట్రంలో కోస్తా,తెలంగాణా, రాయలసీమ ప్రాంతంలో ఎక్కువ మంది గిరిజనులే ఉన్నారు.

గిరిజనుల ముఖ్య వృత్తి వేట. వీరు అడవి జంతువులను వేటాడి జీవిస్తారు. అటవీ వస్తువులను సేకరించి, జీవిస్తారు. వచ్చిన డబ్బులతో కాలం గడుపుతారు. గునుగు బియ్యం, ఒడిపిళ్ళు ఆహారంగా ఉపయోగిస్తారు. వ్యవసాయం, పశుపోషణ, చేపలు పట్టడం,తోటల పెంపకం వీరి ప్రధాన వృత్తులు. గిరిజనులు చేసే వ్యవసాయాన్ని పోడు వ్యవసాయం అంటారు. కొండలను చదును చేసుకొని వీరు అక్కడ వ్యవసాయం చేస్తారు. అలా రెండు, మూడు పంటల తరువాత వేరే చోటికి వెళ్ళిపోతారు. ఇలా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించేవారు గిరిజనేతరులతో సంబంధాలు కలిగి ఉంటారు.

రచయిత్రి వాడ్రేవు వీరలక్ష్మీ దేవి తూర్పు గోదావరి జిల్లా శరభవరం అనే గిరిజన గ్రామంలో పెరిగింది. ఆమెకి ఆ ఊరిలో ప్రతి పుట్ట, చెట్టు, కొండా, కోనా ఇలా అన్ని ఇష్టమైనవే. ఆ గిరిజన గ్రామంలో ఆదివాసీలు పరిస్థితులు చూస్తూ పెరిగింది. వారి శ్రమ, కష్టం, బాధలు అన్ని ఎరుగుదునామే. అందుకే ఆమె రచనలో గిరిజన జీవితాలను మన కళ్ళ ముందు నిలబెట్టారు. ఈమె ఎన్నో కథలను రాసారు. వాటిలో గిరిజన కథలు కొన్ని వాటిలో గిరిజన జాతి జీవన విధానం, వారి ఇబ్బందులు అనేవి తెలుస్తాయి. గిరిజనేతరులతో వారి సంబంధాలు అనేవి తెలుసుకోవచ్చు. ఈ కథలలో ముఖ్యంగా గిరిజనులపై

జరిగే ఆర్థిక,సామాజిక దోపిడిలు, స్త్రీలపై జరుగుతున్న, అన్యాయాలు గమనించవచ్చు.

**గిరిజనులపై జరిగే శ్రమ మరియు ఆర్థిక దోపిడి ;**

వీరలక్ష్మీ దేవి రాసిన 'కొండఫలం' అనే కథను గమనించినట్లయితే,ఈ కథలో ముఖ్యంగా ఆదివాసీల భూములను గిరిజనేతరులు ఎలా స్వాధీనం చేసుకుంటున్నారు, స్త్రీలను ఏ విధంగా లోబర్చుకుంటున్నారనే విషయాలు తెలుస్తాయి. గిరిజనుల అమాయకత్వం, నిరక్షరాస్యతలను ఆసరాగా తీసుకోని వారిని ఎలా మోసం చేస్తున్నారు అనేది కథాంశం.

'గిరిజన స్త్రీలపై జరుగుతున్న అజ్ఞాతమైన దోపిడి'[1]

రచయిత ఉద్దేశ్యంలో వారికి అన్యాయం జరుగుతుంది. ఎందుకంటే వారికి చదువుండదు, తెలివితేటలు ఉండవు. అందువలన వారిని ఎవరు ఏం చేసిన అడగరు అనే ధీమాతో,అహంకారంతో వారి శ్రమను, శరీరాన్ని దోచుకుంటున్నారు. వారికి మాయమాటలు చెప్పి వారిని వంచిస్తున్నారు. ఆనాదిగా సాగుతున్న ఈ దుశ్చర్యలకు పాడాలి చరమ గీతం. ఇక మీదట ఏ స్త్రీ లేదా ఏ గిరిజనులకు అన్యాయం జరగకుండా చూడాలి. అంటే అందరికీ చదువు ఉండాలి. వారికి జరుగుతున్న అన్యాయలపై అవగాహన ఏర్పరచాలి.

'ఇక్కడ గిరిజనేతరులు గిరిజన భూములను
ఆక్రమించుకొని వారిని
దిక్కులేని వారిని చేయటం'[2]

రచయిత్రి చెప్పింది అక్షర సత్యం. అక్షర జ్ఞానం లేకపోవటం వలన వారిపై జరిగే మోసాలు వారికి తెలియవు. ప్రభుత్వాలు వారికి భూములను ఇచ్చి వ్యవసాయం చేసుకోమని పట్టాలు కూడా ఇస్తే ఆ విషయం కూడా తెలియని అమాయకులు. వారికి ప్రభుత్వం అందించే సౌకర్యాలు సైతం వారికి తెలియకపోవడం అనేది గమనార్హం. అందుకే మధ్యవర్తులు, దళారీలు, ఆ ఊరి పెద్దలు వీరికి తెలియకుండా వారి పేర్ల మీద భూములను తీసుకొని వారిచే పంటలు పండించి, వారి కష్టాన్ని దోచుకొని వీరు ధనవంతులు అవుతున్నారు. వారికి ఉండే బ్రతుకు తెరువు ఈభూమి. దానిని వేరే వాళ్ళు అది మాది అని తీసుకుంటే ఆ గిరిజనుల పరిస్థితి ఏమిటి? వారికి జరుగుతున్న అన్యాయానికి ఇదే నిదర్శనం. అసలు ఈ భూములు వారివే అనే విషయం వారికి తెలియదు. తెలిసిన తాత ముత్తాతలు వారి ఆర్థిక పరిస్థితి సహకరించక వేరే వారికి అమ్మేస్తారు. కొంతమంది గిరిజనేతరులు కొండకాపు స్త్రీలతో సంబంధాలు పెట్టుకొని వారి భూములను వీరి సొంతం చేసుకుంటారు. ఇలా మోసపోయిన స్త్రీలు ఎంతోమంది. ఇలా ఒకే భూమి కోసం నాదంటే నాదని అజ్ఞానంతో ఆలోచించి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

'మాకెవ్వరికీ చదువుల్లేవు.మా మొగాళ్ళకి కూడా చదువులు లేవు. ఓ కాయితమ్ముక్క చదువుకోవడం రాదు. అలాగని చెప్పి మమ్మల్నిలా మోసగించడం న్యాయమా![3]

రచయిత్రి మాటల ప్రకారం ఈ కొండల్లో నివసించే వారికి చదువులు తక్కువ. వారు పుట్టిన నేలని నమ్ముకొని అక్కడే స్థిర నివాసం ఏర్పరచుకొని అక్కడ చెట్లను, పుట్లను ప్రేమిస్తూ అక్కడే ఉండిపోతారు. ఇలా మోసపోయేవారికి కోర్టులు,చట్టాలు ఎవరు కూడా సహాయం చేయరు. వీరి కష్టాలపై వారు బంగళాలు నిర్మించుకుంటున్నారు.ఇది ప్రస్తుతం వారి దౌర్భాగ్యపు స్థితి. దీనికి ప్రధాన కారణం చదువులేకపోవడమే. దానివల్ల సామాజికంగా నలిగిపోయి, ఆర్థికంగా చితికిపోయి వారిపై జరిగే దోపిడీని అర్థం చేసుకోలేక, ఆ కష్టాల ఊబిలోనే కూరుకుపోతున్నారు.

'పేరెంట్' అనే కథను గమనించినట్లయితే బాలమ్మా అనే ఒక గిరిజన యువతి తన తల్లితో కలసి హరిజన పేటలో నివసిస్తుంది. ఆమెకు కొంత కాలం క్రితమే వి.ఎ.ఒ గా ఎస్.టి కోటాలో ఉద్యోగం వచ్చింది. కానీ ఈ కథలో ముఖ్య విషయం ఏంటంటే భూషయ్య అనే కామంధు చేతిలో తన తల్లి జీవితం నలిగిపోతుంది. తన తల్లే కాదు అలా ఇంకెంత మంది జీవితాలు నాశనం అయ్యాయో. తన తండ్రిలాగే భూషయ్య కూడా గిరిజనుల భూములను లాక్కొని వారిపై పెత్తందారీతనం చేస్తున్నాడు. వి.ఎ.ఒ గా బాలమ్మా తన తండ్రి కానీ తండ్రికి ఎలా బుద్ధి చెప్పింది అనేది కథాంశం.

'అమ్మని భూషయ్య రేప్ చేశాడు. ఒకసారి కాదు ఎన్నోసార్లు. ఒక రేప్ లో నేను పుట్టి ఉంటాను. అలా అమ్మ ఎన్నో రేప్‌లకు గురి అయిందో పాపం'[4]

ఇది ఆడదాని దయనీయ స్థితి. వారిపై అత్యాచారలకు పాల్పడితే అడిగే దిక్కు కూడా లేదు. ఒక స్త్రీని మానసికంగా, శారీరకంగా హింసించి, వారి బ్రతుకులను నాశనం చేస్తున్నారు. ఇలా ఎందుకు జరుగుతుందంటే వారికి జరిగే అన్యాయాలపై అవగాహన లేకపోవడమే। గిరిజనేతరులు అందరూ చెడ్డవారు కాదు. ఒక్క గంజాయి మొక్క చాలు తులసి వనం పాడైపోవడానికి, ఆవిధంగానే కామాంధుల వలన ఎంతోమంది ఆడపిల్లలు పద్నాలుగు, పదిహేనేళ్ళకే గర్భవతులై, వారిని ఆదరించేవారు లేక సరైన పోషకాహారం అందక పురిట్లోనే ప్రాణాలు విడిచి పెడుతున్నారు. మరి కొంతమందయితే బిడ్డని కని వారి కష్టం మీద పెంచుతున్నారు. ఇంకొంత మంది ఒక్క అడుగు ముందుకేసి వారి పిల్లలను చదివించుకుంటున్నారు. వారికి జరిగిన అన్యాయం సైతం మరిచిపోయి వారి అభివృద్ధికి బాటలు వేసుకుంటున్నారు. అదే మన కథలోని బాలమ్మ తల్లిలా.

'మా అమ్మ వాల్మీకి కుటుంబానికి చెందింది. మా నాన్న గిరిజనేతరుడు. నేను ఆయనికి పుట్టినదాన్ని అని ఆయన ఒప్పుకోడు కనుక నాకు ఎస్.టి. కోటాలో ఈ ఉద్యోగం వచ్చింది. ఇదంతా మా అమ్మ దయ'[5]

తను కొండజాతి అమ్మాయి అవ్వడం వలన ఆ కుల దృవీకరణ పత్రం ద్వారా తనకి ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. చదువుకున్న అమ్మాయి కనుక ఉద్యోగంలో చేరి తన తండ్రి చేస్తున్న అన్యాయాలను బయటపెట్టి ఆయనకి బుద్ధి చెప్పింది. ఎందుకంత సాహసం చేయగలిగిందంటే, సమాధానం ఒక్కటే చదువు.ఆపిల్ల చదువుకుంది. కనుక మంచి, చెడుల అవగాహన ఉంది.మరి చదువు లేని వారి పరిస్థితి ఏంటి? ఈ కథలో గిరిజన అమ్మాయి తన తల్లి ప్రోత్సాహంతో చదువుకొని గిరిజనులకు జరిగే అన్యాయాలను ఎదిరించింది.

'బినామీ' అనే కథలో ముఖ్యాంశం ప్రభుత్వం గిరిజనులకు కొంత భూమిని వారి బ్రతుకు తెరువుకు సాగు చేసుకోటానికి ఇస్తుంది. ప్రభుత్వం ఇచ్చే పథకాలపై అవగాహన లేకపోవడం వలన ఆ ఊరి పెద్దలు వారినే బినామీలుగా మార్చి వారి భూములను వారికే కౌలుకి ఇస్తారు. ఇలా ఎన్నో భూములను బినామీ పేర్లతో దోచేసుకుంటున్నారు. అదే కాకుండా గిరిజనుల పేర్ల మీద బ్యాంకుల్లో ఋణాలు తెచ్చి, అప్పు వారి నెత్తిన రుద్దుతున్నారు. బ్యాంకులకి అప్పు ఎవరు తీర్చాలి? పాపం ఆ గిరిజనులు అప్పులకి వడ్డీలు కట్టలేక కాళ్ళరిగేలా కోర్టుల చుట్టూ, బ్యాంకుల చుట్టూ తిరుగుతూ ఇబ్బంది పడుతున్నారు.

'బాలయ్యయినా,తమ్మయ్య అయినా ఎవడయినా సరే భూమి ప్రెసిడెంటు చేతిలోకి వెళ్ళవలసిందే,మరి బ్యాంకు లోన్ ఎవరు తీసుకున్నట్టు? ఇంకెవరు? ప్రెసిడెంటే తీసుకుంటాడు. ఆ కొండ వాడు వేలిముద్ర వేస్తాడు. వాడికి అక్షరంముక్క రాదు కదా.'[6]

వారికి చదువు రాదు కనుకే వారి జీవితాలతో ఆడుకుంటున్నారు. పాపం ఆ గిరిజనుల అమాయకత్వం వీరికి ఐశ్వర్యాన్ని తెచ్చిపెడుతుంది. వీరు మాత్రం బానిసలుగా, కూలీలుగా వారి క్రింద బతుకుని ఈడుస్తున్నారు.చదువు విలువ తెలియకపోవడం వలన ఇన్ని అనర్ధాలు జరుగుతున్నాయి. ప్రాచీన కాలంతో పోలిస్తే ఇప్పుడు కొంతమంది గిరిజనులలో చదువుపై అవగాహన ఏర్పడింది. మంచి, చెడుల తారతమ్యం తెలుస్తుంది. సమాజం మొత్తం మోసగించే ధోరణిలోనే ఉన్నప్పుడు, మనమే జాగ్రత్త పడవలసిన అవసరం ఎంతైనా ఉంది.

'జాతిని సాంస్కృతికంగా అభివృద్ధి చెయ్యడంలో చూపించవలసిన శ్రద్ధ సమాజంలో తగినంతగా లేదు. విద్యారంగం వ్యాపార రంగంగా పరిణమించడంలోనే కనిపించని విలయం ఉంది. ఆ విషపు విత్తుని పెకలించకుండా పైపైని ఎన్ని చట్టాలు చేసి ఉపయోగం లేదు.'[7]

మన భారతదేశం ఎన్నో రకాలుగా అభివృద్ధి చెందుతున్నాది. విద్యారంగం, వ్యాపారరంగంగా మారిపోవడం వలన ఎంతోమంది బలి పశువులు అవుతున్నారు. విద్యను వ్యాపారంగా మార్చేస్తే, ప్రభుత్వం అందించే సౌకర్యాలపై అవగాహన లేక ప్రైవేటు వారు అందించే

విద్యను కొనలేక చదువులు ఆపేసి పనులకు పోతున్నారు. అందువల్లే మన దేశంలో నిరక్షరాస్యత పెరిగిపోతుంది. గిరిజనులకు అందవలసిన సౌకర్యాలు నిజంగానే వారికి అందుతున్నాయా లేదా అనే అంశం పై శ్రద్ధ పెట్టాల్సిన అవసరం మనపై ఉంది.

**ముగింపు :**

మొదటి కథ కొండఫలంలో సీతాలు భూమిని ఫకీర్రావు ఆక్రమించుకొని అది తనదే అని కోర్టు నుండి స్టే తెచ్చుకొని వారిని బయటకి వెళ్ళగొడతాడు. వారిరువురి గొడవ తేలటానికి సంవత్సరాలు పడుతుంది. ఈ గొడవల్లో పడి పిల్లల చదువులు మరిచిపోతున్నారు. దీనివల్ల వారి భవిష్యత్తు అంధకారంలోకి వెళ్ళిపోతుంది. ఇందులో ఎవరికి న్యాయం జరగదు. మధ్యవర్తులు లాభం పొందు తున్నారు.

రెండవ కథ 'పేరెంట్'లో గిరిజన స్త్రీలపై జరిగే అన్యాయాలు గమనించవచ్చు. డబ్బున్న వారు అమాయ కపు స్త్రీలను లొంగదీసుకొని వారిని గర్భవతులను చేసి వదిలేస్తున్నారు. మరికొంతమంది పాచిపనులను చేసుకొనే వారిని నిత్యం శారీరకంగా హింసిస్తూనే ఉన్నారు. వారిపై దాడులు చేస్తున్నారు. ఈ అన్యాయాలు ఆగాలంటే చదువు ఒక్కటే మార్గం.

మూడవ కథ 'బినామీ' తమ పేర్ల మీద ఉన్న భూములపై ఆ ఊరి పెద్దలు ఎవరో ఒకరు బ్యాంకులో ఋణాలు తీసుకుంటారు. మరి అప్పు ఎవరు తీర్చాలి? ఎవరు తీసుకున్నారో వారు కట్టరు. అయితే వీరు చదువు కోకపోయిన మంచివారైనా పెద్ద మనుషుల దగ్గరకు వెళ్ళి విషయం తెలుసుకొని దానికోసం చివరివరకు పోరాడ తారు. ఆ భూములు వారి పేరున ఉన్నాయి అనే సంగతి వారికి తెలియదు. వారితో వేలిముద్రలు వేయించి వారికి తెలియకుండానే భూములను స్వాధీనం చేసుకుంటు న్నారు. ఇది గిరిజనుల పరిస్థితి. ఈ పద్ధతి మారాలంటే వారిలో ఖచ్చితంగా చైతన్యం రావాలి. అందుకు వారు చదువుకోవటం ఒక్కటే మార్గం గిరిజనులు చాలా నిర్మల హృదయం కలవారు. కష్టజీవులు, పేదరికం, మూఢా చారాలు, నిరక్షరాస్యత, అనారోగ్యం, రవాణా సౌకర్యాల లోపం మొదలగు సమస్యలతో భాదపడుతూ జీవిస్తున్న కష్టజీవులు. ప్రభుత్వాలు ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టినప్పటికి వాటిని గురించి తెలియక నేటికి ఎన్నో సమస్యలు ఎదుర్కోంటున్నారు. చదువు సరిగా లేక పోవడం వలన, బయటి ప్రపంచంలో ఏం జరుగుతుందో తెలియకపోవటం, పరిపాలనా లోపం మొదలైనవి వీరి ప్రధాన సమస్యలు. ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన లేకపోవడం అనేది ప్రధాన కారణం. గ్రామాల్లో కొండలకు అతి దగ్గరగా చిన్న చిన్న ఆవాసాలు ఏర్పరుచు కొని అక్కడే వారి వారి జీవితాన్ని కొనసాగిస్తారు.వారికి కల్మషం తెలీదు. అమాయకత్వంతో మోసపోవడం తెలుసు. గిరిజనేతరులు వారి శ్రమను, కష్టాన్ని దోచు కుంటారు. స్త్రీలను అయితే మానసికంగా, శారీరకంగా కూడా దోచుకుంటున్నారు. వడ్డీ వ్యాపారులు, దళారీలు, కాంట్రాక్టర్ల దోపిడి కూడా గిరిజనుల కష్టాలకు కారణాలు ఎందుకిలా జరుగుతుంది? ఎందుకంటే వారు అనా గరికులు, నిరక్షరాస్యులు. వారిలో చైతన్యం రావాలి.

ఆదివాసీలు అడవులకు, కొండలకు దగ్గరగా నివసిం చడం వలన వారికి బయటి ప్రపంచం అంటే తెలీదు. వారు అమాయకులు, అజ్ఞానవంతులు. ఇది పెద్ద పెద్ద శక్తులు, సంస్థలు అన్ని బలహీనులైన గిరిజనుల పై విరుచుకుపడుతుంటే వారు మాత్రం ఏం చేస్తారు? అందుకే గిరిజనులకు చదువు ఉండాలి. చదువొక్కటే వీరి సమస్యలకు పరిష్కారం. ప్రస్తుత పరిస్థితి ఒకప్పటిలా లేదు. ఆదివాసీలు కూడా చదువుకుంటున్నారు. ప్రభుత్వం అందించే పథకాలపై పూర్తి అవగాహన ఉంది. కానీ ఎంత శాతం మందికి ఆ అవగాహన ఉంది అనేది సంహిం చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఫలాలు అందేలా చూడాలి.

**పాదసూచికలు:**

1. కొండఫలం - పుట - 22 - వాడ్రేవు వీరలక్ష్మీ దేవి

2. కొండఫలం - పుట - 22 - వాడ్రేవు వీరలక్ష్మీ దేవి
3. కొండఫలం - పుట - 22 - వాడ్రేవు వీరలక్ష్మీ దేవి
4. పేరెంట్ - పుట - 22 - వాడ్రేవు వీరలక్ష్మీ దేవి
5. బీనామి - పుట - 22 - వాడ్రేవు వీరలక్ష్మీ దేవి
6. బీనామి - పుట - 22 - వాడ్రేవు వీరలక్ష్మీ దేవి

**ఆధార గ్రంధాలు:**

1. రామయణం - వాల్మీకి
2. కొండఫలం - వాడ్రేవు వీరలక్ష్మీ దేవి
3. పేరెంట్ - వాడ్రేవు వీరలక్ష్మీ దేవి
4. బినామీ - వాడ్రేవు వీరలక్ష్మీ దేవి
5. భగవద్గీత
6. మనుస్మృతి

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# పెద్దీటి యోహాను - క్రైస్తవ బుర్రకథల పరిచయం



- సుజిత రెడ్డి
పరిశోధకురాలు, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

- వై. సుభాషిణి
పర్యవేక్షకులు, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.



బుర్రకథ అనేది ఒక జానపద కళారూపం. ఇందులో పల్లెపదాలు, వంత హాస్యాలు, బిగువైన కథనాలు, పద్యాలు, పాటలు అన్నిటినీ కలుపుకొంటూ సరదా సరదాగా సాగిపోయే కళారూపం. పరిమితమైన ఆహార్యంతో, ఆడుతూ పాడుతూ హాస్యోక్తులు పలుకుతూ జన సామాన్యానికి చేరువగా వెళ్లే కళారూపాలలో హరికథ మొదటిది అయితే బుర్రకథ రెండవది. హరికథలో కొంత సంప్రదాయ ముద్ర ఉంటే బుర్రకథ పూర్తిగా జానపద కళారూపం.

తెలుగునాట జానపద వినోదగాన ప్రక్రియలలో ప్రబోధానికీ, ప్రచారానికీ సాధనంగా ఈనాటికీ విస్తృతంగా ఉపయోగపడే కళారూపం బుర్రకథ. కథకుని చేతిప్రక్రియ ఇది. ప్రదర్శన సౌలభ్యాన్ని బట్టి, వీర గాథలు, త్యాగ మూర్తుల కథలు బుర్రకథల ఇతివృత్తాలుగా బాగా పేర్కొన్నాయి. ఈ ప్రక్రియ ప్రచార సాధనంగా ఎంతగానో ఉపకరిస్తోంది. కుటుంబ నియంత్రణ, రాజకీయ ప్రచారము, ప్రజలను విజ్ఞానవంతులను చేయడము వంటి కార్యక్రమాలలో దీన్ని బాగా వాడుకున్నారు. జంగంకథ, పంబల కథ, జముకులకథ, పిచ్చుకుంట్లకథ తరువాత వచ్చింది. డాలు, కత్తితో పాడే ప్రధాన కథకుడికి పిచ్చిగుంట్ల కథలో ఇద్దరు వంతలున్నట్లే బుర్రకథలో కూడా ఉంటారు.

దీనికి మాన్యత కల్పించి పద్మశ్రీ బిరుదు సంపాదించుకున్నవారు షేక్ నాజర్. పేరునుబట్టి వీరు ఇస్లాం మతానికి చెందిన వారైనా చెప్పిన కథలలో ఎక్కువ భాగం హిందూ దేవీదేవతలకు చెందినవే. శ్రీకాకుళం పర్యటించినప్పుడు శ్రోతలు బొబ్బిలియుద్ధం కథ కోరారు. దానితో నాజర్ తానే కథా రచనకూ నడుంబిగించాడు. అంతేకాదు సామ్యవాద దృక్పథం గల వీరిని 1940వ దశకంలో కమ్యూనిస్టు పార్టీ నెల జీతం మీద కథలు చెప్పించి పల్లెలలో తమ పార్టీ ప్రచారానికి ఉపయోగించుకున్నది.

నాజర్ బొబ్బిలియుద్ధం, అల్లూరి సీతారామరాజు ప్రహ్లాద, క్రీస్తు, పల్నాటియుద్ధం, బెంగాల్ కరువు వంటి వస్తు వైవిధ్యం గల కథలను చెప్పి రక్తి కట్టించారు. తెనాలిలోని బాలరత్న నాటక సమాజంలో ప్రారంభమైన నాజర్ కథాకథన ప్రస్థానం నాలుగు దశాబ్దాలు అవిచ్ఛిన్నంగా సాగింది.

క్రైస్తవ సాహిత్యంలో బుర్రకథకు కూడా ప్రత్యేక స్థానము కలదు. క్రీస్తు జీవిత విశేషాలు, బుర్రకథ ద్వారా సాహితీ జత్తుకు పరిచయం చేసిన రచయితులలో పెద్దీటి యోహాను ఒకరు. యోహాను కళాతపస్విగా పేరు గాంచారు. వీరు పద్మ భూషణ్ గుఱ్ఱం జాషువా స్మారక కళా పరిషత్‌ను స్థాపించి దానికి వ్యవస్థాపక అధ్యక్షులుగా

కొనసాగుతున్నారు. పెద్దీటి యోహాను రోశమ్మ, ముస లయ్య పుణ్య దంపతులకు పానకాలపాలెం, వినుకొండ మండలంలో జన్మించారు. ప్రస్తుతం దుగ్గిరాల తెనాలిలో నివాసం ఉంటున్నారు.

పెద్దీటి యోహాను వృత్తిరిత్యా పశువైద్యుడుగా కొన సాపుతున్నప్పటకీ ప్రవృత్తి రిత్యా సాహితీ పిపాసకులు. వీరు బుర్రకథలే కాకుండా రారాజురాక, కృపామయుడు, సిలువ దొంగలు, ఆదర్శం అనే నాటికలు రాశారు. అంతే కాకుండా కొన్ని కథలు కథానికలు, వ్యాసాలు రాసి సాహితీ జగత్తుకు అందించారు. వీరి బుర్ర కథలలో 'క్రైస్తవ బుర్రకథలు' అనే పుస్తకాన్ని 2005లో ముద్రించడం జరిగింది. యక్షగాన కళారూపకములో ఒకటైన జానపద కళారూపం బుర్రకథను క్రైస్తవ లోకానికి అందించారు.

'క్రైస్తవ బుర్రకథలు'' పుస్తకం ఇరవై ఐదు పేజీల చిన్న పుస్తకం. ఇందులో మూడు బుర్రకథలు కలవు. భక్త విజయం, సమ్సోను - దెలీలా, యేసుక్రీస్తు జననం.

**యేసుక్రీస్తు జననం :**

ప్రభువైన యేసుక్రీస్తు ఈ లోకానికి పాపుల రక్షకుడుగా దివి నుండి భువికి ఏతెంచెను. యేసుక్రీస్తు జననం బుర్రకథ ప్రారంభంలో సృష్టి క్రమాన్ని గూర్చి వర్ణిస్తూ...

వినరా భారత క్రైస్తవ సోదర యేసు జన్మ చరిత
॥వినరా॥
ఆదియందున సర్వేశ్వరుడు అంధకారమీడా ॥వినరా॥
సూర్య చంద్రులను మింట వెల్గుడని సృష్టిజేసినండి
॥వినరా॥
జలమయమగు భువినీ విభజన చేసెను మంట భాగమొకటి
॥వినరా॥
వింటి భావములు మదిలో మెదలెను విశ్వనాథకపుడు
॥వినరా॥
ప్రకృతి మాతను జీవరాసులను పరగ సృష్టి జేసే
॥వినరా॥
ఏడు జనములలో సృష్టినంతటిన్ జేసెన్ సర్వేసు
॥వినరా॥

ఈ విధంగా ప్రపంచమంతా అంధకారంగా ఉన్న దానిని సూర్యచంద్రులతో వెలుగు కలుగజేసెను. ఫలాలను, భూభాగాన్ని, ప్రకృతిని, జీవరాసులను సృష్టించి అందంగా చేశాడు. దేవుడు ఒక చక్కని ఉద్యానవనమును సృష్టించి దానికి ఏదేను అను పేరు పెట్టి ఆవనంలో ఆది దంపతులైన ఆదాము, హవ్వలనుంచెను. అంతట వారు ప్రభువు చిత్తానుసారంగా నడుచుకుంటూ ఆయన యందు సదాకాలము గడుపుచుండిరి. ఈ విషయాన్ని సాతానుడు(పాము) గమనించి ఆదాము భార్యయైన హవ్వను సమీపించి మిమ్ములను దేవుడు నమ్మించి మోసం చేశాడు అని, ఉద్యాన వనంలోని దైవశక్తిగల ఫలములు అరగించితే అమరులై అతనితో సమాన మగునని చెప్పెను. సాతాను మాటలకు మోసపోయిన హవ్వ సాతాను మాటలు నిజమని నమ్మి ప్రభువుని నిషేధించిన పండును కోసుకొని తాను సగం తిని, మిగిలినది తన భర్త ఆదామునకు ఇచ్చెను. ఆదాము కూడ ఆ పండును తినగా వెంటనే వారిరువురు సిగ్గు నొందినవారై చెట్లమాటునకు వెళ్ళి ఆకులతో తమ శరీరమును కప్పుకుంటారు. ఆదాము తన భార్య మాటలు నమ్మి ప్రభువు తినవద్దన్న ఫలములను తిని శాపమును కొనితెచ్చుకొన్నారు.

యేసుక్రీస్తును ఈ లోకానికి తీసుకు రావడానికిగల కారణాన్ని ఇలా వివరిస్తాడు కవి. దేవుడు ఆజ్ఞను మీరి నందున హవ్వతో ప్రసవ వేదన పడి పిల్లల్ని కంటావని శపిస్తాడు. సాతానుతో నీవు నాబిడ్డలను చెరిపితివి, నీవు పాముపై మన్ను తిందువు అని శపించెను. అంతలో వారు చేసేదేమిలేక దుఃఖించుచు, ప్రభువు పాదాలపై పడగా భగవంతునికి వారిపై కొంత జాలికలిగి, మానవ సంతతి రక్షణార్థమై ఏకైక కుమారుని సకాలంలో పంపెదనెను. అంతటవారు భూలోకమున సంసారము పెట్టగా వారి సంతతి బహుగా విస్తరించెను. తరువాతి సంతానమంతా దేవునికి దూరస్తులై ఉన్న విషయాన్ని ఇలా వివరిస్తారు.

మధ్యలోకమున - మానవులంతా ॥చందమామరాజా॥
పాపకూపమున - పరుగులెత్తిరి ॥చందమామరాజా॥
ఆశాబంధపు - యఘముల రొంపిలో
॥చందమామరాజా॥

దైవ భయమును - త్రోసిపుచ్చియు॥చందమామరాజా॥
కూరుకు పోయిరి - కూలిపోయిరన్నా
॥చందమామరాజా॥

ఈ విధంగా అనేక విధాలైన నిదర్శనాలు చూపిన మానవుల నరక ద్వారము చెంతనే ప్రయానిస్తూ ఉండే వారు. అంతట సర్వేశ్వరుడైన దేవుడు జాలినొంది తనకుమారుని మానవులలో, మానవునిగా జన్మించటానికి ఆజ్ఞ ఇచ్చెను. ఆయన ఎవరి గర్భమున జన్మించు చున్నాడనగా ! నజరేతనే ఊరిలో మరియ అనే కన్యకకు యోసేపుతో ప్రదానము చేయబడినదేగాని, వారికి వివాహము జరుగలేదు.

గాబ్రియేలను దేవదూత మరియ దగ్గరకు వచ్చి - దయాప్రాప్తురాలా నీకు శుభమగుగాక - నీతి సూర్యుడు నీ గర్భమున ఉదయించనైయున్నాడు. పాపులను రక్షించుటకు ఆయన భూలోకమునకు అరుదెంచు చున్నాడు. నువ్వు సంశయింపగలదు. యోసేపు యూదా గోత్రమునక చెందినవాడు కనుక తన భార్యాయైన మరియను వెంటబెట్టుకొని నజరేతు నుండి తన స్వస్థల మైన యూదా దేశంలోని బెత్లేహేమునకు ప్రయాణం సాగించారు. మరియమ్మ నిండు చూలాలు. ప్రయాణ సౌకర్యములు ఈ కాలంలో వున్నట్లుగా ఆకాలంలో లేవు. కష్టపడి ఎట్టకేలకు వారు బెత్లేహేము చేరిరి. బెత్లేహేమంతా జనాభా లెక్కలు వ్రాయించుకొనుటకు వచ్చిన వారిలో కిక్కిరిసి పోయెను.

జూదకుల మోదంబున ॥తందాన॥
కన్యమరియ గర్భమందున ॥తందాన॥
బెత్లేహేము పురము నందున ॥తందాన॥
సాధు పశువుల శాలయందున ॥తందాన॥
సర్వేశ్వరుడే జననమొందెరా ॥తందాన॥
స్వాతి వెల్లు విరిసెరా ॥తందాన॥
దూత కోటి సంతసించెరా ॥తందాన॥
శ్రోత లెల్ల ప్రణమిల్లిరిగా ॥తందనా దేవనందనాన॥

లేఖనముల ప్రకారం క్రీస్తేసు లోకమున జన్మించెను. ఆదేశంలో రాత్రివేళ కొందరు గొర్రెల కాపరులు తమ మందను కాచుకొనుచుండగా దేవదూత వారికి ప్రత్యక్షం కాగా భయంతో వణకుచూ ఉండగా అంతలో దేవదూత వారికి ప్రత్యక్షమై గొర్రెల కాపరులారా భయపడకండి. దావీదు పట్టణంలో నేడు మీ కొరకు రక్షకుడు పుట్టిన్నాడు. మీరు వెళ్ళి దర్శించి రండని చెప్పి దూత అదృశ్య మయ్యేను. జ్ఞానులు వెళ్ళి ఆబాలుడను దర్శించి బంగారు, సాంబ్రాణి, బోళమును సమర్పించారు. యోహాను అనే వ్యక్తి ప్రభువు మార్గము సరాళం చేయుడని ఆ ప్రాంతంలో ప్రకటించుచుండెను. బాలునికి వారు యెరూషలేము దేవాలయంలో యేసు అని పేరు పెట్టారు. బాలుడు పెరిగి పెద్దవాడవుచూ యోహానుచే బాప్తిస్మము (నీళ్ళల్లో మునగడం) తీసుకొనెను. యేసు లోకానికి సందేశాన్ని ఇస్తూ ఇలా అంటాడు.

ఆత్మ విషయమై - దీనులైనవారు- ధన్యులన్నాడా
॥తందాన॥
నీతి కొరకు ఆకలిదప్పులు గలవారే- నీతిమంతు లనియె
॥తందాన॥
యేసు నేనే మార్గము, సత్యము, జీవము అన్నాడా
॥తందాన॥

నాద్వారానే తప్ప ఎవడు పరలోక రాజ్యం చేరడని చేరడని చెప్పెను.

అనే సందేశాన్ని కవి పెద్దీటి యోహాను గారు యేసుక్రీస్తు నేనే మార్గం సత్యం జీతం నాద్వారా తప్ప పరలోకం చేరలేరన్న సత్యాన్ని వెల్లిడించారు.

**భక్త విజయం :**

క్రైస్తవుల ఆరాధ్య గ్రంథం బైబిల్‌లో క్రొత్త నిబంధన గ్రంథంలోని లూకా సువార్తలో 16, 19 నుండి 31 అధ్యాయం వరకు ఉన్న సారాంశాన్ని మొత్తం 'భక్త విజయంలో బుర్రకథా రూవంగా మలిచారు. ధనవంతుడు, లాజరు కథ క్రైస్తవలోకానికి సుపరిచితమే. ఈ చరిత్రను అత్యంత రమణీయంగా తీర్చిదిద్దారు. ప్రారంభంలో స్తుతిగీతంతో ప్రారంభిస్తూ......

'సదమల హృదయా - సర్వేశ్వరా సన్నుతించెదము
పరుగునరావా ఓ దేవా, మా దేవా

1. నిర్మల హృదయా నీతి సూర్యుడ
నిత్యజ్యోతివి - సత్యశీలుడా మిము
భజియింతము, భక్త వత్సల ఓ దేవా, మాదేవా!

2. కరుణా భరణా కరుణించు దేవా
మము మహిని బ్రోచెడి మహనీయుడవే
పరమున చోటు దయచేయుమయ్య - ఓ దేవా, మా దేవా!

అని నిర్మల హృదయుడా, నీతి సూర్యుడా, సత్య శీలుడా, నిత్యజ్యోతిని, భూమండలాన్ని కాచికాపాడే మహనీయుడా పరలోకము నీ భక్తులకు చోటు దయచేయమని వేడుకుంటారు రచయిత.

యూదయ దేశమున ఒక ధనవంతుడు అను వ్యక్తి ధనము, ధాన్యమును సమకూర్చుకొని సంపన్నుడుగా కీర్తి గడించాడు. ధనరాజుగా ప్రఖ్యాతిని పొందాడు. సామాన్యులను లెక్కచేయక పేదవారి యెడల కరుణ చూపించక, దైవ భీతి లేకుండా ఉండేవాడు. అదే ప్రాంతములో లాజరు అను ఒక దరిద్రుడు ఉండెను. అతడు దైవభక్తి కలిగి ప్రతి నిత్యము దైవ ప్రార్థనలు చేస్తూ నిత్య దారిద్రంతో అల్లాడుతున్నాడు.

వినరా ఆంధ్రకుమారా, ధీరా భక్త విజయ చరితా!
॥వినరా॥
కావుమదేవా కరుణతోడను లేవగ రావయ్యా ॥వినరా॥
నిత్య దరిద్రుడ, నన్ను గావుమ, నీతి సూర్యుడవుగ
॥వినరా॥
అనయము మిమ్మే వేడుచుంటిని, ఆదుకొనగ రాజా
॥వినరా॥
తినుట కన్నము కట్టగ భట్ట కరువాయెను దేవా॥వినరా॥
కురుపులతోడ బాధనొందుచు కుమిలిపోవుచుంటి
॥వినరా॥

అని లాజరు యొక్క దీన స్థితిని గానం చెస్తారు. లాజరు తినుటకు అన్నము, కట్టుటకు బట్ట లేక కరుణామయుడైన యేసుక్రీస్తును ధ్యానించుచు కురుపులతో కుమిలిపోవుచు సర్వేశ్వరుని ఎల్లప్పుడు ధ్యానిస్తూ ఆకటి బాధలకు తాళలేక వీధివీధి తిరుగుతూ అమ్మా ఆకలి, అయ్యా అకలి, అయ్యా ఆకలి, నా బాధను తీర్చమని ధనవంతుని పంచన చేరి వారు భుజించగా బల్లక్రింద పడిన రొట్టెముక్కలతో కడుపునింపుకొన ప్రయత్నించగా ధనరాజు యొక్క అనుచరులు దీన లాజరును చూచి ఉక్రోషంతో మాట్లాడుచుండగా ధనరాజు అంతలోనే ప్రవేశించి, దీన లాజరును గాంచి ఈ దౌర్భాగ్యున్ని అవతలకు గెంటివేయుడని చెప్పెను.

వినరా ఆంధ్ర కుమారా, వీరా భక్త విజయ చరితా.!
॥వినరా॥
ఎందుకు పుట్టితివి ఇహమందున ఎవరినుద్దరించ
॥వినరా॥
పుట్టియు నెవరిని ఉద్దరింతువు పుడమిలోన నీవు
॥వినరా॥
ఎప్పుడు వేడెడి దేవుడు నిన్ను కాపాడగలేడా.. ॥వినరా॥
పోరా పోరా, పొమ్మనచున్ నానా హింసలు పెట్టెనుగా
॥వినరా॥

అంటూ లాజరు అయ్యా నేను నీకేమి అపకారము చేసితిని? ఎందుకు నన్నీరీతిగా హింసించుచున్నారు, మీ బల్ల, క్రింద పడిన రొట్టె ముక్కలను మాత్రమే నేనాశించితిని, వాటి కొరకు నన్ను హింసించనేల అని దేవున్ని పార్థిస్తూ ఉండేవాడు. ఇలా భక్తుడైన లాజరు వేడుచున్ననూ, ఎన్నో హింసలపాలు చేసే ధనరాజు. అంతలో జమ్మీతాత లాజరును ఓదార్చెను. ధనరాజు కన్నుమిన్ను గానక మద్యమును సేవించి వేశ్యాలోలుడై జీవించ సాగెను. అయితే భక్తుడైన లాజరు ఆకలికి తాళలేక ఒకనాడు ధనరాజు ఇంటిలో విందు ఏర్పాటు చేయు విషయమును గ్రహించిన లాజరు ఎంగిలి మెతుకులతో కడుపునింపుకొనుట కోసం ధనవంతుడి భవనము సమీపించెను.

వేడుకలెన్నో జరుపుచుండెరా ధనరాజునాడ
॥చందమామ॥
ధనరాజు యింట ధాత్రిలోనాడు ॥చందమామ॥
విందు భోజనము డెందమలరగా ॥చందమామ॥
వంక సన్నపు బియ్యము తోడ ॥చందమామ॥
గారెల్, బూరెల్, బూంది లడ్డులే ॥చందమామ॥
బంధువులెందరో సంతసించగా ॥చందమామ॥
బహు వేడుకతో జరిగె ఈ విందునాడు॥చందమామ॥

ఈ రీతిగా ధనరాజు ఇంట బంధు, మిత్ర సమేతముగా విందారగించిరి. భక్త లాజరు బయటపడిన ఎంగిలి మెతుకులనాశించి ధనవంతుని భవనమును సమీపించగా ధనవంతుని అనుచరులు లాజరును మాటలలో, చేతలతో హింసించిరి.

భక్తుడైన లాజరు పట్టరాని ఆవేదనతో సర్వేశ్వరా! ఎందులకు యింకానన్ను ఈ భూమిపై నుంచితివి, నా ఆత్మను నీ చెంతకు తీసుకో. ఈ లోకంలో జీవించి నేను సాధించేది ఏమి లేదు అని భగవంతుని వేడుకొంటూ ఉండేవారు. అలా కొంత కాలం బాధలను, హింసలను పొందిన పిమ్మట లాజరు మృతినొందెను. మరణానంతరం అతని ఆత్మ దేవుని వద్దకు చేరెను.

ప్రతి ఒక్క మానవుడు తన జీవితంలో ఎంత ధనాన్ని సంపాదించినా, చివరకు మరణాన్ని పొందక తప్పదు. పుట్టినవాడు గిట్టక తప్పదు. ఆ మాత్రానికి ధనం ఉందన్న అహంకారంతో వ్యవహరించకూడదన్న సత్యాన్ని రచయిత తెలియజేశారు.

భక్తుడైన లాజరు మరణించిన విషయం ధనవంతునికి తెలుస్తుంది. దౌర్భాగ్యుడైన లాజరు మరణించిన వార్త విన్న ధనరాజు సంతోషించాడు. ఇది ఇట్లుండగా అష్టైశ్వ రములతో తులతూగిన ధనరాజు కూడా కొంత కాలానికి మరణించాడు. అతని ఆత్మ నరకములోనికి కొని పోబడెను. ధనరాజు పాతాళంలో పలు వేదనలు పొందెను.

తందాన తందాన తందాన తానేతందాన ॥తందాన॥
ధనమువున్నదని గర్వించితిని - ధాత్రిలోన నాడు ॥తందాన॥
దైవభీతియు లేకను నేను - ధరణి విర్రవీగ ॥తందాన॥
పేదల ఎడల జాలిచూపక - పెడత్రోవననడిచి ॥తందాన॥
పేద లాజరును హింసించితిని - పేర్మిజూపకుండ ॥తందాన॥
అహములో ఇలను విర్రవీగితి - అందుకా ఈ శిక్ష ॥తందాన॥
ఆదరించువారే లేరా - ఆహ! ఇది ఏమి శిక్ష ॥తందాన॥

ధనరాజు పేద లాజరు పట్ల జాలి, దయ, కరుణ చూపక క్రూరంగా ప్రవర్తించినందుకు, మానవత్వం చూప నందుకు నాకు ఈ శిక్ష పడిందన్న వాస్తవాన్ని ధనరాజు గ్రహిస్తాడు. అంతేకాక ధనరాజు అగ్ని గుండంలో కాలుతూ రేయింబగళ్ళు ఆవేదన చెందుతూ భూమి మీద ఎన్నో సుఖాలను పొందాను, ఈ అగ్ని గుండంలో అనేక బాధల్ని అనుభవిస్తున్నాను. ఈ బాధల్ని నేను భరించలేను. డబ్బును చూచి చాలా గర్వపడ్డాను. ధన వ్యామోహంలో చెడుమార్గమున సంచరించాను. హితవాక్కులను పెడ చెవిని పెట్టితినని వాపోతాడు.

ఇక ధనరాజుతో అబ్రాహాము ఓ ధనరాజా దైవభక్తుడైన ఈ లాజరు కురుపులతో అలమటించుచు నీ పంచ చేరినను నీవు అతని ఎడల దయచూపక నిర్దాక్షిణ్యంగా ఎన్నో హింసలు పెట్టితివి అయినను అతడు వాటన్నిటిని ఓర్చుకొని బ్రతికినంత కాలము భుక్తిలేకున్నను భక్తితో జీవించి తాను మృతినొంది ప్రభువు రొమ్మున అనుకొని మృతినొంది పరలోకమునకు ఎత్తబడెను. నీకు ఏడ్పును, పండ్లుకొరుకుటయు, ఎల్లకాలమును అగ్ని ఆరదు, పురుగు చావదని అబ్రాహాము పల్కెను. ధనవంతుడు మరియు లాజరు ఇతివృత్తాన్ని తీసుకొని బుర్రకథగా వ్రాసి అందరినీ అలరించారు.

**సమ్సోను – దెలీలా :**

సమ్సోను ఇశ్రాయేలీయుల న్యాయాధిపతి. వీరుడు, శూరుడు, దెలీలా వలన పతనమైన విధానమును సమ్సోను -దెలీలా బుర్రకథాగానంతో ఇందులో వివరిస్తారు. జోర్యా నగరంలో మనోహ అనుభక్తుడు కలడు. ఆయన భార్య గుణవతి. సంతానం లేక ఎంతో వేదన చెందేవారు. పట్టు వదలక యెహోవాను ప్రార్థించగా దేవుడు వారికి సంతానము ఇచ్చుటకు సందేశంగా దైవదూతను వారియొద్దకు పంపుతాడు. ఆదూత వారితో ఇశ్రాయేలీయులను రక్షింపబోవు వీరుడు మీకు జన్మిస్తారు. పుట్టినది మొదలుకొని అతని తలపై కత్తి వేయ రాదు. దేవునికి నాజీరు చేయబడి యుండెను. మనోహ భార్యతో దైవదూత గర్భము ధరించిన మొదలు శిశువు జన్మించు వరకు మద్యం, దాక్షారసం గాని త్రాగరాదని

చెప్పెను. ఆమె గర్భం దాల్చి నవమాసాలు నిండగా అంద మైన బాలుడు జన్మిస్తాడు. అలాపెరిగి పెద్ద వాడైన సమ్సోను తిమ్నాతు పట్టణమునకు వెళ్ళి ఫిలిష్తీయుల కుమార్తెలలోని ఒక యువతిని చూచి ఆమెను మోహించి, ఆయువతిని ప్రేమిస్తాడు. ఆ విషయం తన తల్లి దండ్రులతో చెప్తాడు. మన బంధువుల్లో చాలామంది ఉన్నారు. మనము వారికి బానిసలన్నమాట మరిచావా? అన్న మాటలకు సమ్సోను తల్లిదండ్రులకు నచ్చ జెప్పి ఫిలిష్తీయుల కుమార్తెను వివాహమాడుటకు నిశ్చయించు కొని తన తల్లిదండ్రులతో, పెద్దలతో పెండ్లికై తిమ్నాతుకు బయలుదేరి వెళ్తుండగా ద్రాక్షతోటను సమీపించగా ' నరవాసన పసిగట్టిన సింహము గాండ్రించుచు అటు వచ్చుచుండగా చూచి ఇలా అంటాడు.

దీరుడ సమ్సోను నాయన ॥సై॥
వీరావేశము తోడను ॥సై॥
సింహము పైకి దూకియు ॥సై॥
దాని దవడలను బట్టియు ॥సై॥
రెండుగ చీల్చెను సింహమును ॥సై॥
వీరుడ సమ్సోను ఆనాడే ధరుండాయెరా ॥భలానంటి॥

ఆ సింహము గిలగిల తన్నుకొని ప్రాణం విడుస్తుంది. సమ్సోను తిమ్నాతునకు వెళ్ళగా వెళ్ళికూతురుని అలం కరించి తీసుకొని వస్తు తన చెలికత్తెలు సమ్సోనును చూచి ఆమెతో నీక్కాబోయేవాడు చుక్కల్లో చంద్రుడమ్మా - చూడచక్కని వాడమ్మా అని పొగడుతారు. సమ్సోను వివాహాన్ని కవి వర్ణిస్తూ ....

పచ్చపచ్చని పసిడితోరణాలే ॥ తందాన॥
ఉత్సవాలు పలు వీధులు వూరేగగా ॥ తందాన॥
వన్నె చిన్నెల వధూవరుల పెండ్లి ॥ తందాన॥
విందు భోజనము డెందమలరగాను ॥ తందాన॥
బంధు మిత్రులే బహుమతుల్వింగాను ॥ తందాన॥
వైభవంబుగా జరిగెను నా పెండ్లి ॥ తందాన॥

అని అద్భుతంగా వర్ణిస్తారు.

సమ్సోను వివాహం చేసుకొని భార్యను, తల్లిదండ్రు లను, బంధుమిత్రులను వెంటబెట్టుకొని తిరిగి జోర్యాకు వచ్చు సమయంలో తాను చంపిన సింహము కళేబరము నందు ఆసమోను జుంటి తేనె పెట్టగా దానిని తీసుకోని వచ్చి సమ్సోను తిని తన తల్లిదండ్రులకివ్వగా వారును తినిరి. సమ్సోను ఇంటికి వచ్చినప్పుడు విడిదిలో తనతో నుండుటకు ముప్పది మంది స్నేహితులను ఇవ్వగా వారితో ఒక పొడుపు కథను వేసి దాన్ని చిప్పినచో ముప్పది సన్ననార బట్టలు, దుస్తులను మీకిస్తాను లేని యెడల మీరు నాకివ్వాలి అని చెప్పగా స్నేహితులకు ఈ కథ భావము తెలియక సమ్సోను భార్య యొద్దకు వెళ్ళి ఆమెతో నీవు లాలనచేసి నీ భర్తతో విప్పుడు కథ భావము తెలుసుకొని మాకు తెలుపుము లేకపోతే నిన్ను, నీయింటి వారిని అగ్నికి ఆహుతి చేస్తామని బెదిరించారు. ఆమె భయపడి భర్తను లాలించి, కథ భావము తెలుసుకొని వాళ్ళకు చెప్పగా పొడుపు కథ భావమును విప్పి సమ్సోను చేత బహుమానాన్ని పొందుతారు. ఈ భావము తెలియు టకు కారణం తన భార్య అని తెలుసుకొని ఆమెను విడిచి పెడతాడు. కొంతకాలం తర్వాత తిమ్నాతునకు వెళ్ళి తన మామతో నా భార్యను పంపమని అడగగా ఆమెను మరోకరికి ఇచ్చి వివాహము చేశానకి ఆమె చెల్లెలిని వివాహమాడమనగా ఆగ్రహించిన సమ్సోను ఫిలిష్తీయుల పంటచేలలోని కుప్పలను, ద్రాక్షతోటను తగులబెట్టెను. తర్వాత ఏతాము బండ సందులో నివసించెను. యూదా జనులు మూడువేల మంది ఏతాము నొద్దకు వెళ్ళి నీవు మాకు పట్టుబడకున్న ఫిలిష్తీయులు మమ్ము హింసిం చెదరని చెప్పగా సమ్సోను వారిచే ప్రమాణము చేయించు కొని, యూదా జనులు సమ్సోనును బంధించి తీసుకు పోగా పిలిష్తీయులు వారిని చుట్టుముట్టిరి. వెంటనే యెహోవా ఆత్మ సమ్సోనుపై బలంగా ఉన్నందున కట్టిన త్రాళ్ళను తెంచుకొని గాడిద దవడ యెముకను పట్టుకొని ఆవేశము తోడ ఇలా అంటాడు...

పటపట పండ్లను కొరుకుచు వీరుడ - పట్టుతర వేగంగాలి ॥వినరా॥
వీరావేశముతో వీరుడ - విజృంభించెనుగా ॥వినరా॥
పచ్చి గాడిద యెముకను - చేతను బూనియున్ ॥వినరా॥

వచ్చిన వారిని వచ్చినట్లుగా - మట్టుపెట్టగాను
॥వినరా॥
ప్రాణాలను దక్కించుక కొందరు - పెరగెత్తినారా
॥వినరా॥
వేయిమందినీ మట్టుబెట్టె శూరుడ - శూరుడ సమ్సోను
॥వినరా॥

ఈ రీతిగా వేయి మందిని చంపి తదుపరి గాజాకు వెళ్ళి దెలీలా అను వేశ్య యొద్దకు చేరెను. అక్కడున్న సర్కారులు దెలీలా యొద్దకు వచ్చి నీవు లాలన చేసి అతని బలమెందున్నదో తెలుసుకొనిన నీకు మంచి బహుమతి ఇస్తామని చెప్తారు. దెలీలా సంసోను బల రహస్యం అడుగగా రెండు మూడు సార్లు దెలీలా చెసిన ప్రయత్నం విఫలము కాగా తుదకు సమ్సోను అసలు రహస్యం ఇలా చెప్పెను.

తల్లి గర్భమున పుట్టినది ॥తందాన॥
తల క్షౌరము చేయగలేదు ॥తందాన॥
ఆ రీతిగా చేసిన యెడల ॥తందాన॥
శక్తి అంతయు తగ్గి చోవునని తెల్పెను సమ్సోను
॥తందాన॥

సమ్సోను వేశ్య పొందుకోరి దేవుని మరచి దేవుడు తనకిచ్చిన శక్తినంతటిని పోగుట్టుకొనెను. ఫిలిప్పీయ సర్కారులు సమ్సోనును పట్టుకొని దెలీలాకు ఇవ్వాల్సిన బహుమతి నిచ్చి సమ్సోను కన్నులు ఊడదీసి సంకెళ్ళతో బంధించి చెరసాలలో తిరుగలి విసురువానిగా చేసిరి. అంతట సమ్సోను తన తప్పును తెలిసికొని సర్వేశ్వరునితో వేడిన సందర్భం ప్రేక్షకులను కంటతడి పెట్టేలా కడు రమ్యంగా కవి చిత్రించారు.

కనులుదీసినారు ప్రభువ కానరాదు
గ్రుడ్డివాడనునే ప్రభువా! శక్తి లేదు
మీదు హితవును మంచియు నేను నాడు
బంధినై యుంటి ప్రభువా! ఆజ్ఞమీరి

సమ్సోనును బంధీ గృహం నుండి దాగొను అనే దేవతాలయమునకు తోడ్కొని వచ్చిరి. అనేకులు హేళన చేయుచుండిరి. స్త్రీ, పురుషులు మూడువేల మంది వరకు అక్కడ ఉన్నారు. అంతట సమ్సోను పాశ్చాత్తాప హృదయుడై దేవునితో దేవా! నాప్రభువా! దయతో నన్ను ఒక్క సారి జ్ఞాపకము చేసికొని శక్తి దయచేయమని వేడగ, దేవుని శక్తిని పొందిన సమ్సోను మూడు వేల మందిని చంపిన శూరుడైనను దేవుని ఆజ్ఞను మీరినందున ఆ దేవాలయపు గుడి స్తంభములు సమ్సోనుపై పడగా సమ్సోను రక్తసిక్త హృదయుడై నేల కొరిగెను. ఈ విధంగా సమ్సోను చరిత్రను బుర్రకథగా ప్రేక్షకులను మంత్ర ముగ్ధుల్ని చెస్తారు కవి. ఇలా అనేక బుర్రకథలను క్రైస్తవ లోకానికి అందించారు.

**ఆధార గ్రంథాలు :**

1. పెద్దీటి యోహాను జీవితం
2. క్రైస్తవ బుర్రకథలు - పెద్దీటి యోహాను
3. యేసుక్రీస్తు జననం - పెద్దీటి యోహాను
4. క్రైస్తవ జీవితం

★★★

Vol. 23 | Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# నీటికి కులం, మతమున్న దేశమిదన్న 'మహారు'డు ఆచార్య ఎండ్లూరి సుధాకర్



- చీరబోయి తిరుపతి

పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

కులం అన్ని రంగాలలో మన అస్తిత్వాన్ని నిర్ధారిస్తుంది. దానికి ఎవరూ అతీతులు కారు. 'కొత్త గబ్బిలం'లో నా విన్నవీ, నే కన్నవీ, నాకున్నవి కవితాత్మకంగా వివరించే ప్రయత్నం చేశాను. కొందరూ ఆదరించారు. కొందరు అవమానించారు. కొందరు హత్తుకున్నారు. కొందరు మొత్తుకుఆన్నరు. ఎవరేమన్నా నా అభివ్యక్తిని అరికట్టలేక పోయారు. నాకు ఏ ప్రాంతాల మీద పెద్ద మోజు లేదు. నన్నూ నా జాతిని అంటరానితనంతో చూసిన ఈ వ్యవవస్థ మీద అసహనం ఉంది. లోలోపల కవితాజ్వలనం రగులుతుంది. (కొత్త గబ్బిలం - కొంత నేపథ్యం - పుట : 9), "కొత్త గబ్బిలం ఒక ప్రతీక. నగర జీవన చిత్రిక. ఇది ఒక ప్రయోగం. ఆత్మకథనాత్మక కావ్యం. దీర్ఘకావ్య నిర్మాణానికి నిర్దిష్ట ప్రణాళికలూ లక్షనాలూ, కావ్య హేతువులూ ఇప్పటి దాకా ఏమీ లేవు" (కొత్త గబ్బిలం - కొంత నేపథ్యం, పుట : 11) అని ఎండ్లూరి సుధాకర్ చెప్పుకున్నారు తన కావ్యత్రయం ముందుమాటలో.

దళిత కవిత్వంలో ఎన్నో దీర్ఘకవితులు వెలవడ్డాయి. దళిత దీర్ఘకవితలకు ఒక రకంగా జాషువా గబ్బిలం, అనాధ వంటి కావ్య ఖండికలు ప్రేరణ అని చెప్పవచ్చు. దీర్ఘ కవిత లక్షణం గురించి ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి గారు ఇలా వివరణ చేశారు. 'దీర్ఘ కవిత దీర్ఘ కావ్యానికి ప్రనాది, భూమిక, ఒక ఉద్యమం, ఒక సమస్య, ఒక భావన, ఒక సంఘటన తీసుకొని ఒక తాత్విక నేపథ్యంలో దాని పరిణామాన్ని దృక్పథాన్ని వివరించి, కవి తన తీర్పునివ్వడమే దీర్ఘకవతా లక్షణం"

మహాకవి గుఱ్ఱం జాషువా సాహిత్యాన్ని ఆసాంతం చదివిన ఆచార్య ఎండ్లూరి సుధాకర్, మహాకవి చూపిన మార్గాన్నే ఎంచుకున్నాడు. గుఱ్ఱం జాషువా రచించిన "గబ్బిలం" కావ్య స్ఫూర్తితో ఆచార్య ఎండ్లూరి 'కొత్త గబ్బిలం' అనే దీర్ఘకావ్యం రచించి ఆధునిక కవిత్వంలో కొత్త ఒరవడి సృష్టించారు.

1962 ప్రాంతంలో హైదరాబాద్‌లోని కృపానందం వీధిబడిలో ఆచార్య ఎండ్లూరి సుధాకర్ తెలుగు అక్షరాలు దిద్దాడు.. అక్కడే ఆయన చదివిన బాలశిక్ష 'తెలుగు సాహిత్యం వైపు అడుగులు వేయడానికి కారణమైంది. బాలశిక్షలోని అందమైన అక్షరాలు, గుండ్రటి గుణింతాలు, ప్రాసలు, లయాత్మక వాక్యాలు, సామెతలు, నుడికారాలు తెలుగు భాషపై ఇష్టం ఏర్పడటానికి కారణమయ్యాయని చెప్పుకొన్నారు. అదే ఇష్టంతో నల్లకుంటలోని ఆంధ్రప్రాచ్య కళాశాలలో ఓరియంటల్ డిగ్రీ పూర్తి చేసి ఉస్మానియా యూనివర్శిటీ నుంచి తెలుగు సాహిత్యంలో ఎం.ఎ., ఎం.ఫిల్., పిహెచ్.డి పట్టాలు పొందాడు. ఆచార్య

ఎండ్లూరి సుధాకర్ పిహెచ్.డి సిద్ధాంత గ్రంథం "జాషువా సాహిత్యం, దృక్పథం, పరిణామం" ఆయనకు మంచి గుర్తింపు తెచ్చింది. చదువు పూర్తయిన తర్వాత 85 నుంచి 90 వరకు హైదరాబాద్‌లో తెలుగు పండిట్‌గా ఉద్యోగం చేసి 1990లో తెలుగు విశ్వవిద్యాలయ అధ్యాపకుడిగా రాజమండ్రి ప్రాంగణంలో చేరి ముప్పై రెండేళ్ళపాటు విశ్వవిద్యాలయ అధ్యాపకుడిగా, సాహిత్య పీఠాధిపతిగా ఎందరో తెలుగు సాహిత్య విద్యార్థులను మేధావులుగా తీర్చిదిద్దారు.

అంబేడ్కర్ మాదిరి కుల వ్యతిరేక పోరాటానికి జాషువా రాజకీయాలను ఆశ్రయించలేదు. అలానే అంబేడ్కర్ మాదిరి పోరాట నిర్మాత కాదు. కానీ పోరాట యోధుడు. తన పోరాటానికి కలాన్ని ఆయుధంగా ఎంచుకొన్నాడు. కవిత ఆయనకు వాహికయ్యింది. కులతత్వం మీద, అంటరానితనం మీద కవితాత్మకంగా, కళాత్మకంగా దాడి చేశారు. ఆ విధానం ఎండ్లూరి సుధాకర్ కవిత్వంలో గమనించవచ్చు. కాకపోతే జాషువాది పద్యశైలి అయితే సుధాకర్ గారిది వచన కవితాశైలి.

నలభైల నాటి గబ్బిలాన్ని అర్ధ శతాబ్ది తరువాత వర్తమాన అవసరాలరీత్యా నవీకరించాడు. నడుస్తున్న మాదిగ దండోరా ఉద్యమానికి 'కొత్త గబ్బిలం'తో సుధాకర్ మద్దతు పలికాడు. అయితే జాషువా గబ్బిలం కావ్య ఖండిక రాసే నాటికి నిమ్న కులస్తులు అనుభవించిన సామాజిక, అసమానతలు, అవమానాలు తగ్గినప్పటికీ నేటికీ అన్ని రంగాల్లో దళితులు, ఎదుర్కొంటున్న అవే పరిస్థితులను ఎండ్లూరి తమ "కొత్త గబ్బిలం"లో ఆవిష్కరించిన తీరును పరిశీలన చేయడం ప్రధానాంశంగా ఈ వ్యాసం వుంటుంది. తెల్లని ట్యూబులైటు గదిలోకి నల్లబ్యాడ్జీల్లా వచ్చిన కుర్ర గబ్బిలం తనను (కవిని) జైభీం అంటూ పలుకరిస్తుంది. దండోరా ముట్టడికి నగరానికెళ్తున్నానని సగర్వంగా ప్రకటించినప్పుడు గబ్బిలాన్ని ప్రేమగా వాటేసుకొని తన (కవి) గుండె గోడును వినిపించటంగా ప్రారంభమైన కొత్త గబ్బిలం దీర్ఘకవిత, రాబోయే రాజ్యరుతువు గబ్బిలానిదేనని (దళితులదేనని) మతాతీత, కులాతీత సమతా సందేశాన్ని విన్పించాలంటూ,

"మనిషి మనిషిగా బతికే
సాంఘిక సమానత్వ గౌరవాన్ని ప్రతిష్ఠించాలి
ఇప్పుడు అన్ని కులాలు
ఏకోన్ముకంగా కులీనం కావాలి
ఆర్థికంగా విలీనం కావాలి
ఇది నా సందేశం గబ్బిలమా"! అంటూ ముగియటాన్ని గమనిస్తే ఎండ్లూరి సమతావాద దృక్పథం స్పష్టంగా గోచరిస్తుంది.

ఒకే రకం వస్తువు ముట్టలేననడం ఒకే విధమైన బానిసతనమైన బతుకును సహించలేననడే గబ్బిలం పాదాలకు కొత్త జోళ్ళు తొడుగుతనంటాడు కవి, అవి కన్నీళ్ళు కుట్టిన తన గుండె జోళ్ళు. కళంకిత అలంకారాలంటూ వేదన చెందుతాడు.

ఇప్పుడు చెప్పులు ఆకలి యుద్ధాలకు ప్రతిరూపాలవుతున్నాయి. అందుకనే అంటులని ఆకాశం లోకి, నిర్భయమైన నివాసంలోకి, తన బాల్యానుభవాల నగరంలో విహరించమంటున్నాడు. ఆ హైదరాబాద్ నగరంలో ఏయే ప్రదేశాలను ఏ విధంగా దర్శించాలో వివరించడానికి ముందు తను నివసిస్తున్న (నివసించిన) రాజమండ్రిని కులం కలుగులోంచి బయటకు రానీ ఎండ్రిగా భావన చేశాడు. ఇక్కడి గోదావరి వేదంలా కాక, పచ్చి అవాకాశ వాదంలా, సల సలకాగిన సీసంలా దళితుల చెవుల్లో ప్రవహిస్తుందనడమంటే విద్యకు తరతరాల దళితుల చెవుల్లో ప్రవహిస్తుందనడమంటే విద్యకు తరతరాల దళితులను దూరం చేసిన గుట్టును విప్పటమే.

"ఇక్కడి నీళ్ళలో
రకరకాల జల గుణాలున్నాయి
ఈ రక్తంలో
శతాబ్దాల మనుకణాలున్నాయి
ఇక్కడి కోనసీమ గండు చీమ కూడా
చాలా గౌరవంగా కుడుతుంది
ఇక్కడి యాసలో
ఫక్తు వ్యాపరా భాష వినబడుతుంది
రావణాసురుడి తలకాయల్లా
ఎటు చూసినా కొబ్బరి కాయలే కనబడతాయి"

అనడం ద్వారా ఈ వ్యవస్థలో మనువు సృష్టించిన భయం కరమైన వర్ణ అంచె కుల వ్యవస్థను, బ్రాహ్మణాధిక్యతను తెలియచేశారని నేను స్పష్టంగా చెప్పగలను. మరింత పరిశీలన అవసరంలేని ఎండ్లూరి కవితా వాక్యాలు మరింతగా ఆ విషయాన్ని ఈ విధంగా బజావు చేస్తాయి.

"నీళ్ళు మమ్మల్ని చూసినప్పుడలా/కన్నీళ్ళు పెట్టుకునేవి / మేము తమని తాకడం లేదని / దిగులు పడేవి. తనివి తీరా తాగడం లేదని దిక్కులు చూసేవి / నీటికి మతమున్న దేశంలో / మేము పుట్టడం / నేటికీ గొప్ప విషాదం" ఆచార్య ఎండ్లూరి సుధాకర్ బతికివుంటే ఇటువంటి దళిత ఆవేదనలను ఎంతెంతగానో సృజన చేసి వుండేవారు. జ్ఞానపీఠ అవార్డు వారిని వరించి వచ్చేదన్నది నా నిశ్చితాభిప్రాయం.

కొత్త గబ్బిలం వెళ్ళేదారిలో పోరాటాల గుమ్మం ఖమ్మం ఎదురవుతుంది. కవీరాజుమూర్తినీ, హిరాలాల్ మోరియానీ, దాశరథిలకు విప్లవ గోహర్లర్పిస్తూ, రుద్రమదేవీ, ఏలమ్మ, బందగీని స్మరిస్తూ, తెలంగాణ పోరుగల్లును కీర్తిస్తూ, పాల్కురికి కిప్రణమిల్లమన్నా, వేయిస్తంభాల గుడిని దర్శించుకోమన్నా, తిరగబడు కవులను గుర్తు చేసినా, పెద్దపీటపై కూర్చున్న విశ్వనాథ భక్తులు, చేతనావర్త (నూతన) కవలతో చేయి కలపమన్నా చివరి "అక్కడి దళిత కవులకు మన మద్దతు తెలుపు" అనడంలో ఎండ్లూరి దళిత స్పృహ తేట తెల్లమవుతుంది.

"గబ్బిలమా!

నా మనో బలమా!

నువ్వీ దేశపు శ్వేతపత్రం మీద నల్ల సంతకానివి.

నా స్వప్న దేశబహుజన వసంతానివి" అంటూ దళిత ఆత్మ విశ్వాసాన్నీ, దళిత చైతన్యాన్ని, ఇంత ప్రగాఢంగా వ్యక్తం చేయడం ఎండ్లూరికే సాధ్యమని నేను భావిస్తు న్నాను.

హైందవ సమాజంలోని దారుణమైన అస్పృశ్యతా సమస్యను చిత్రించిన జాషువా కవీ దళితుల్లోని అంతర్భే దల్ని ఎండగట్టాడు.

"కలదమ్మా వ్రణమంటరాని తను మాకర్ణింపుమీ యిండియా

పోలమందుంగల మాల మాదిగలకున్ భూతేశుడే కాదు కృ

షుణలు, కృష్ణున్నిరసించు దైవములు క్రీస్తుల్, మస్తుగా బట్టినన్

కలు ప్పేరరు రెండు జాతులను వక్కాణింప సిగ్గయ్యెడిన్" అని

వ్యథ చెందాడు. అగ్రవర్ణాల దౌష్ట్యాన్ని ఎంత నిర్భయంగా ఖండించాడో, అంతిమ వర్గాల అజ్ఞానాన్ని అంత నిష్పాక్షికంగా నిరసించాడు జాషువా. ఒకవైపు సవర్ణ హిందువుల దౌష్ట్యం దావానలమై విజృంభిస్తుంటే మాలల మనీ, మాదిగలమనీ ఐక్యమత్యాన్ని మరిచి కుమ్ములాగలో మునిగితేలే వారిని కలపటం ఎవరికీ సాధ్యం కాదని హెచ్చ రిస్తాడు అది నిజమే! కవి రాసిన ఎనిమిది దశాబ్దాల తర్వాత కూడా ఆ స్థితిలో ముందుకు వెళ్ళలేకపోవటాన్ని ప్రస్తుతం చూస్తూనే వున్నాం.

"మన రెండు జాతుల కాకులు

విభేధాలు విడిచి పిండాన్నం మరిచి

కవి కోకిల పద్యాలకు

ఉత్సాహంగా చప్పట్లు కొడతాయి

ఎగిరే నల్లపూల గుత్తులై

శతజయంతి ఉత్సవాలు జరిపిస్తాయి" (కావ్యత్రయం పుట : 20) అని ఆశించటం ఎండ్లూరి సుధాకర్ మాదిగ, మాల కులాల ఐక్యతా కాంక్షను సూచిస్తుంది.

విద్యానగర్ వంతెన మలుపు నుంచో, కాచీగూడా పెట్రోల్ బంకు సందులోనుంచో అటు సాగే వాక్యాలలో హైందవ వర్ణ వ్యవస్థను నిరసిస్తూ కవి ప్రశ్నించటాన్ని చూస్తాం. "హఠాత్తుగా కాషాయ పతకాలతో / భజరంగ దళం ఎదురుపడి / మనమంతా హిందువులం / గంగా జల బిందువులం / మనమంతా బిందువులం" అని ఎలుగెత్తి నారింజ బోట్లతో నినదిస్తూ వుంటే అర్యులారా! ఎలా మీకు బందువులం మీకు బందువులం? ఎప్పటి నుంచి మేం హిందువులం అంటూ ఎదురు నిలబడి బెదరకుండా తర్కించుకుని "జై భీమ్" అని గర్జించి అంబేడ్కరవాలం ఝుళిపించుమని జగజ్జీవనబాబు ఉజ్జీవనాన్ని సర్మించమనడమాటే స్పష్టంగా దళిత వాదాన్ని

విస్తృత పరచడంలో భాగమేనన్నది తేలికగా తెలిసి పోతుంది.

"ముషీరాబాద్ చౌరస్తా మీదుగా / బన్సీలాల్ పేట బొందల గడ్డకు వెళ్ళు / ఎంత ఆరోగ్యానికైనా కొంత వైరాగ్యం అవసరం / అక్కడ నీ గబ్బిలం తండా / నగర కాలుష్యాన్ని నిరసిస్తూ రావి చెట్ల మీద తలకిందులుగా ధర్నా చేస్తుంటుంది / అక్కడే చెవులూ ముక్కులూ / విరిగిన కల్లుముంతలు / పగిలిన పుర్రెల కథలెన్నో పూస గుచ్చినట్లు వినిపిస్తాయి / ఏ కూలిన సమాధి మీదో కూర్చుని బీడి పీలుస్తున్న కాటి కాపరి భిక్షపతి / వీర బాహుడై నీకెదురౌతాడు / అక్కకడ చావుపుట్టుకల చర్చ లేపావో / చెట్టుతొర్రలోని చిలుకవైపు చూస్తూ / అది శంకరుడి మాడు పగిలేలా / అసలు తత్వం చిటికెడు మట్టిలో చూపిస్తాడు / బుక్కా చల్లుకుంటూ ఏ శవమైనా ఎదురుపడితే / పాడె ముందు ప్రణమిల్లు / వర్ణభేదం లేకుండా చివరి చూపు చూడు / డప్పుల దరువులకు కప్పల్లా ఎగురుతూ / పీనుగు మీదుగా విసిరేసే చిల్లర పైసల్ని ఏరుకునే / మసి బుగ్గల పసి పిల్లలు / నీ కళ్ళల్లో ఆకలి ముళ్ళై గుచ్చుకుంటారు" అంటూ ఇక ఇప్పుడు ఇందిరాపార్కు దళిత సోదరుల ఉద్యమాలకు, ధర్నాలకు అడ్డాగా మారిందని రూఢి చేశారు.

కారంచేడులు, చుండూరు దాడులూ విలయ తాండవం చేసిన వేంపెంట నెత్తుటి మంటలూ ఇకపై జరగడానికి వీల్లేదంటూ ఖండితంగా చాటించమని గబ్బిలానికి దిశానిర్దేశం చేశారు ఆచార్య ఎండ్లూరి సుధాకర్. ఇకపై తలగొరిగింపులూ, తల నరికింపులూ జరిగితే చండాల జాతి జెండాలు పాతుతుందని, మొండాలతోనైనా పోరు చేస్తుందని హెచ్చరించమన్నారు. ఇవాళ హక్కుల కోసం దళితులు రెండు చెక్కలైనా ఎవరిమీద కత్తి పడినా ఒక్కటవుతారని ప్రకటించిమంటూ దిశను సూచించారు.

వేల సంవత్సరాల అవమానాల నిషిద్ధ భూమిలో మనం ఇప్పుడిప్పుడే మనుషులమవుతున్నామంటూ, వాడల్ని, పేటల్ని రక్తక్షేత్రాలుగా కబేళాలుగా మార్చొద్దని అగ్రపెత్తం దారి గుండెల్లో దండోరా వేయించమన్న ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారి దళిత దృక్పథానికి మేము (బీసిలం) మద్దతు ప్రకటిస్తున్నాం. ఎండ్లూరి సుధాకర్ గారికి ఇదే మా నివాళి.

**ఆధార గ్రంథాలు :**


1. కావ్యత్రయం - ఎండ్లూరి సుధాకర్ - మానస & మనోజ్ఞ ప్రచురణలు, రాజమహేంద్రవరం, 28 సెప్టెంబర్, 2016.
2. దళిత సాహిత్యోద్యమం - డా॥. శిఖామణి - పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, మండలి కృష్ణారావు, అంతర్జాతీయ తెలుగు కేంద్రం, హైదరాబాద్ - 2012.
3. ప్రజాసాహితి (సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక), విజయవాడ - 1995.


★★★

Vol. 23 | Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# బోయి భీమన్న కూలిరాజు నాటకం - సామాజికత



- యం. శైలజ

పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

**ఉపోద్ఘాతం:**

బోయి భీమన్న సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసినకవి, రచయిత. మారుమూల పల్లెలో దళిత పాలేరు ఇంట పుట్టి, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు, పద్మభూషణ్‌తో పాటు లెక్కకు మిక్కిలిగా గౌరవ సన్మానాలందుకున్న కవి, బోయిభీమన్న. పేదరికంతోపాటు అంటరానితనం వంటి దురాచారాలు చిన్నప్పటినుండి భీమన్నకు అనుభవమే. సహజంగానే అతను వీటిని నిరసించాడు. అంబేద్కర్ వ్రాసిన కులనిర్మూలన పుస్తకాన్ని తెలుగులోకి తర్జుమా చేశాడు.

**రచయిత పరిచయం:**

భీమన్న 1911 సెప్టెంబరు 19న తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో ఓ హరిజన కుటుంబంలో పుట్టాడు. నాగమ్మ పుల్లయ్య ఇతని తల్లిదండ్రులు. ఈయన సుమారు 70 పుస్తకాలు రాశాడు. పద్య, గేయ, వచన రచనలతోపాటు, నాటకాలను కూడా వ్రాశాడు. వివిధ పుస్తకాలకు వ్రాసుకున్న పీఠికల్లో పరిశోధనాత్మక దృష్టి కనిపిస్తుంది. వాటిలో కొన్ని, కొత్త ప్రతిపాదనల్ని, కొత్త సిద్ధాంతాల్నీ చెప్తున్నట్లుంటుంది. ఆకాశవాణిలో ప్రసారం కోసం అనేక భావగీతాలను రాశాడు. వీటన్నింటితోపాటు అంబేద్కర్ వ్రాసిన కొన్ని రచనల్ని తెలుగులోకి అనువదించారు. ఆయన జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని కీర్తిస్తూ రాశాడు. వీరు రాసిన 'జయ జయ జయ అంబేడ్కర!' దళితులను జాతీయ గేయమై నేటికీ ఊరూరా ప్రార్థనాగీతంగా మారుమోగుతోందని డా॥ దార్ల వేంకటేశ్వరరావు వ్యాఖ్యానించారు.

**వ్యాస సంగ్రహం:**

తెలుగు సాహిత్యంలో సామాజిక స్పృహతో కూడిన నాటకాలకు విశిష్టస్థానం వుంది. అటువంటి నాటకాలలో బోయిభీమన్న రచించిన 'కూలిరాజు' ఒక ప్రముఖమైన సామాజిక నాటకం. ఈ నాటకం ద్వారా రచయిత పేదల జీవితం, కూలీల కష్టాలు, సామాజిక అసమానతలు, శ్రామిక వర్గాలపై జరుగుతున్న అణచివేతను అత్యంత హృదయస్పర్శిగా చిత్రించారు. 'కూలిరాజు' నాటకం కేవలం ఒక వ్యక్తి కథ కాదు. అది ఒక వర్గపు చైతన్యానికి ప్రతీక. శ్రమే సంపదగా భావించే కూలీల జీవితాలను రాజుల కంటే గొప్పవిగా చూపించడమే ఈ నాటక ప్రధాన లక్ష్యం.

బోయిభీమన్న ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రముఖ కవి, నాటక కర్త, సామాజిక తత్త్వవేత్త. ఆయన రచనలన్నీ సామాజిక న్యాయం, సమానత్వం, మానవ

గౌరవం వంటి అంశాలపై ఆధారపడి వుంటాయి. శ్రమ జీవుల పక్షపాతిగా నిలిచారు. దళిత, పేద వర్గాల బాధలను తన రచనలలో ప్రతిబింబించారు.

**నాటక నేపథ్యం:**

సాంప్రదాయ కులవ్యవస్థ కారణంగా సమాజంలో ఏర్పడిన అన్యాయాలు, అణచివేతలు, మానవ అవమానాలు ఈ నాటకానికి ప్రధాన నేపథ్యం. కులం పేరుతో మనిషిని చిన్నచూపు చూడటం, హక్కులను హరించటం ఎంత అమానుషమో రచయిత ఈ నాటకంలో స్పష్టంగా చూపిస్తాడు. 1942లో కూలిరాజు నాటకం వ్రాశాడు. మొదట ఈ నాటకం పేరు 'కష్టజీవి'. తరువాత కొన్ని మార్పులతో 'ధన్యజీవి' అయింది. 1947లో 'నవజీవన' పత్రికలో సీరియల్‌గా ప్రచురించబడింది. వ్యవసాయ కూలి ఉద్యమాన్ని బలపరచడం లక్ష్యంగా మరికొన్ని మార్పులు చేసిన తరువాత సిద్ధమైన ప్రతి, కూలిరాజు పేరుతో 1948లో ప్రచురించబడింది. ఇది అనేక ప్రదర్శనలు, ప్రచురణలు పొందింది. భీమన్న కూలిరాజు నాటకాన్ని వేముల కూర్మయ్యకు అంకితం ఇచ్చాడు.

**కూలిరాజు నాటకం:**

కూలిరాజు నాటకంలో సమానతా సూత్రమే కీలకం. కుల సమానతకన్నా ఆర్థిక సమానతపై దృష్టి ఎక్కువ. అది కూడా ఎన్నికలలో నిలబడి ఓటు ద్వారా సంపాదించే రాజ్యాధికారంతో ముడిపడిన సమానత్వం. దాని మూలం రైతుకూలి ఉద్యమంలో వుంది. కుల, మత వర్గ రహితమైన ప్రజాస్వామ్య సమాజాన్ని గాంధేయ కార్యక్రమం ద్వారా సాధించటం ఇతివృత్తంగా 12 రంగాల మీద విస్తరించిన నాటకం ఇది. ఇందులో వస్తువు రైతుకూలీల జీవితంలోని కన్నీళ్ళను, కడగండ్లను వివరిస్తుంది. ఈ నాటకంలో కూలీలంతా కలసికట్టుగా వుండి, శ్రమకు తగిన ఫలితాన్ని ఇవ్వమని, కనీస కూలీరేట్లు కోసం ఉద్యమించాల్సిన అవసరాన్ని ఊరువాడల్లో ప్రసారం చేస్తూ సభలు, సమావేశాలు నిర్వహిస్తుంటారు. నిష్కలయోగి నిర్వహించే సభకు ఆ గ్రామానికి చెందిన మిత్ర, పరంజ్యోతి జన సమీకరణలో నిమగ్నమౌతారు. అదే సమయంలో కూలీ పేటకే చెందిన మధుమూర్తి కాలేజి చదువులు పూర్తి చేసుకుని ఇంటికి తిరిగివస్తాడు. కూలి ఉద్యమంతో అంతకు ముందునుండే సంబంధాలున్న మధుమూర్తికి ఉద్యోగం వచ్చినా పరంజ్యోతి, మిత్రల సలహా మేరకు కూలి ఉద్యమంలో చేరి ప్రముఖపాత్ర వహిస్తుంటాడు. విశ్వనాథరావు కూలియూనియన్ సభను గ్రామంలో జరుపుకోవడానికి అనుమతివ్వని కారణంగా ఆ సభ స్మశానంలో జరుగుతుంది. ప్రెసిడెంట్‌గా మధుమూర్తి, సెక్రటరిగా పరంజ్యోతి, వైస్ సెక్రటరిగా భయంకరరావు. తదితరులు కూలి యూనియన్ నాయకులవుతారు. తాలూకా స్థాయిలో కూడా ఆ యూనియన్‌ను విస్తరించాలని ఆ సభ తీర్మానిస్తుంది. కూలీలంతా ఏకమైతే రైతు మనుగడకు ముప్పు వస్తుందని విశ్వనాథరావు కలత చెంది, కూలి ఉద్యమాన్ని అణచివేయాలని ఆలోచిస్తాడు. అంతేకాకుండా రైతులు, కూలీలు సంఘటితశక్తిగా మారకూడదని అనుకుంటాడు. ఇస్తున్న కూలీకి అడ్డెడు ధాన్యం అదనంగా ఇవ్వమని అడగడానికి వెళ్ళిన సంఘ నాయకులకు మొండిచెయ్యి చూపిస్తాడు విశ్వనాథరావు. కాయకష్టం చేసుకునే వారి మీద కారుణ్యం చూపమని పరంజ్యోతి అన్నందుకు "నీ మీద చూపగలను నీ వుండి తక్కిన వాళ్ళని పంపెయ్యమని అశ్లీలంగా మాట్లాడతాడు విశ్వనాథరావు. కార్మికులు, శ్రామికులు ఏకంగా పోరాడిన రోజే అభ్యుదయాన్ని సాధిస్తామని, హెచ్చుతగ్గులు తగ్గితే మానవజాతి మహోన్నత స్థాయికి చేరుకుంటుందని నిష్కలయోగి ప్రచారం చేస్తుంటాడు. పెట్టుబడిదారితనం, భూస్వామ్యం అనే రెండు ముఖాల రాక్షసిని మానవ సంఘం ఎంతోకాలం భరించలేదని పేర్కొంటాడు. భయంకరరావు కూలి యూనియన్ ఉపకార్యదర్శి పదవికి రాజీనామా చేస్తాడు. విశ్వనాథరావు గుమాస్తా అయిన శివరామకృష్ణ బ్రహ్మతో కలసి కూలి ఉద్యమాన్ని అణచడం కోసం ఆ నాయకులపై దొంగకేసులు పెట్టి, జైళ్ళకు నెట్టాలని కుట్ర పన్నుతారు. భయంకరరావు, విశ్వనాథరావు ఒక్కటి అవుతారు.

కూలి పెంచనందుకు నిరసనగా సత్యాగ్రహం చేస్తున్నట్లు కూలిసంఘం రైతులకు నోటీసు ఇస్తుంది. విశ్వనాథరావు పాలేరు జోగులు ఆకలితోటి పస్తులున్నాడని

పరంజ్యోతి తన ఉంగరాన్నిచ్చి అమ్మిన సొమ్ముతో వంట చేసుకోమని చెప్తుంది. పరంజ్యోతి ఉంగరాన్ని ప్రేమ్ కుమార్ తీసుకొని, తన ఉంగరం జోగులుకిస్తాడు. పరంజ్యోతి ప్రేమకుమార్‌ల మధ్య అంకురించిన ప్రణయం దినదినం ప్రవర్థమానమవుతూ వున్నా కూలి ఉద్యమానికి అంకితమై నిర్విరామ కృషి సల్పడం విశేషం. దయానందరావు కూలి సంఘానికి సహకారం అందిస్తున్నాడని, అతన్ని చంపి ఆస్తిని దోచుకోవడానికి, విశ్వనాథరావు భయంకరరావును పంపినా అది విఫలమవుతుంది. కూలి యూనియన్ ఎన్నికలు దగ్గర పడ్డాయని రాజకీయం పట్ల శ్రద్ధ పెట్టి, కూలి ఉద్యమాన్ని ఆపుతుంది. కూలి యూనియన్ పార్టీని అన్ని రాష్ట్రాలకు విస్తరించి ప్రచారాన్ని తీవ్రం చేస్తారు. దేశవ్యాప్తంగా కూలి యూనియన్ తరపున మంచి అభ్యర్థులు నిలబడ్డానికి ఎంపిక చేస్తారు. ఆర్థిక, సాంఘిక అసమానతలను రూపుమాపడానికి, మత స్వేచ్ఛను కాపాడడం తమ పార్టీ సిద్ధాతంగా ఎన్నికల ప్రచారం సాగుతుంది. కర్షకులు, కార్మికులులాంటి పేదలంతా పోలింగు కేంద్రాల్ని తీర్థయాత్రా స్థలాలుగా భావించాలని మధుమూర్తి, పరంజ్యోతి, నిష్కలయోగి, మిత్ర మొదలైన వారు దేశమంతటా తిరిగి ప్రచారం చేస్తారు. మిత్ర, జోగులు ఎన్నికలు దగ్గరవడంతో పాటలు పాడుతూ కూలి యూనియన్‌ను గెలిపించాల్సిందిగా విస్తృత ప్రచారం చేస్తారు. కూలి యూనియన్ గెలుపుకు రైతు అయిన దయానందరావు, ప్రేమకుమార్ అవిశ్రాంతంగా కృషి చేస్తారు. మధుమూర్తి, పరంజ్యోతి, నిష్కలయోగి మొదలైనవారు దేశవ్యాప్తంగా తిరిగి, కూలి యూనియన్ గెలుపుకు కృషి చేస్తారు. క్రైస్తవ, ముస్లిం, మైనారిటీవారు, పేద వర్గాలవారు కార్మిక కర్షకులు మితిమీరిన ఉత్సాహంతో కూలి యూనియన్‌కు మద్దతు పలికారు. దేశవ్యాప్తంగా కూలి యూనియన్ ఎన్నికల్లో విజయం సాధించింది. పరంజ్యోతి స్వతంత్ర భారత అధ్యక్షురాలుగా ఎన్నికవుతుంది. మధుమూర్తి - మిత్రలకు, పరంజ్యోతి - ప్రేమకుమార్‌లకు వివాహాలు నిశ్చయమవుతాయి. వీరందరి కృషి ఫలితంగా కూలిరాజ్యం ఏర్పడడంతో నిత్యం శ్రమ దోపిడికి గురయ్యే గ్రామీణ నిరుపేద కూలీల ఆనందానికి అవధులుండవు. ఇలాగ నిరుపేద కూలి కుటుంబం నుంచి వచ్చి ఒక ఆశయ సాధన కోసం అవిశ్రాంతంగా పోరాడి దేశ అధ్యక్షపదవిని అలంకరించడమే కూలి, రాజు కావడం.

**సామాజికత :**

బోయి భీమన్న సాహిత్యం చదువుతుంటే మనకు కేవలం కథ కాదు, ఒక సామాజిక పోరాట స్వరం విని పిస్తుంది. కూలిరాజు నాటకం కూడా ఆ స్వరానికి ఒక స్పష్టమైన ఉదాహరణ. స్వాతంత్ర్యం వచ్చినా, రాజ్యాలు మారినా కూలీల జీవితాల్లో మార్పు రాలేదన్న వాస్తవాన్ని రచయిత ఈ నాటకం ద్వారా బయటపెట్టాడు. కూలీలలో చైతన్య ప్రయాణమే 'కూలిరాజు' నాటకానికి ఆత్మ.

1. శ్రమ, గౌరవం: శ్రమే సంపదకు మూలం అని నాటకం స్పష్టం చేస్తుంది.
2. సామాజిక అసమానత: కులం, వర్గం ఆధారంగా మనుషులను విభజించే వ్యవస్థపై తీవ్ర విమర్శ.
3. దోపిడి వ్యవస్థ: కూలీల శ్రమ ఫలితాన్ని అధికార వర్గాలు స్వాధీనం చేసుకోవడం.
4. చైతన్యం - ప్రతిఘటన: మౌనంగా భరించడం కాదు. ప్రశ్నించడమే మార్పుకు మార్గం.
5. ఆత్మగౌరవం : పేదవాడు అయినా గౌరవంగా బతకాలన్న సందేశం బలంగా ప్రతిధ్వనిస్తుంది. సమాజం మారాలంటే కూలీలు తమ శక్తిని గుర్తించాలి అనే సందేశాన్ని ఇచ్చాడు. సమాజంలో నెలకొని వున్న సాంఘిక, ఆర్థిక అసమానతలు తొలగిపోవాలని, పేదలందరూ ఏకం కావాలని భీమన్న ఈ నాటకం చెప్పడమేకాక సాధ్యమని నిరూపించారు.

**ముగింపు:**

కులరహిత సమాజం బోయిభీమన్న ఆదర్శం. దానికి ఆయన ప్రచారం చేసే మార్గం కులాంతర వివాహాలే. కూలిరాజు నాటకంలోనూ ఆయన దానిని వాస్తవీకరించే ఉత్సాహం చూపాడు. కూలిరాజు నాటకంలో కులంతో పాటు ఆర్థికాంశాల్ని కూడా స్పర్శించారు. 'ధర్మం కోసం పోరాటం'తో బహుజనులంతా రాజ్యాధికారదిశగా పయ

నించడానికి సూచనలు చేశారు. వర్గపోరాటాలు జరుగుతున్న తీరును విమర్శిస్తూ 'నాయకులంతా దేశీయ స్థితిగతులను గుర్తించకుండా ప్రపంచ కార్మిక దృష్టి మాత్రమే కలిగిన ధనిక సవర్ణులు' అని ప్రకటించాడు. శ్రమజీవులైన కూలీలే అసలైన రాజులని, సమాజ నిర్మాణంలో వారి పాత్ర ఎంతో కీలకమని ఈ నాటకం చాటి చెబుతుంది. దోపిడీకి గురవుతున్న కార్మికులు తమ హక్కుల కోసం పోరాడిన తీరును అత్యద్భుతంగా చిత్రించారు. బోయి భీమన్న 'కూలిరాజు' నాటకం ఒక నాటకం మాత్రమే కాదు. ఇది సామాజిక ఉద్యమం. ఈ నాటకం ద్వారా "శ్రమే రాజ్యం, శ్రామికుడే రాజు" అనే సత్యాన్ని చిరస్థాయిగా నిలిపారు. ఈ నాటకం నాటక సాహిత్యంలో ఒక మైలు రాయి అనడంలో ఎటువంటి సందేహం లేదు. నేటికి 'కూలిరాజు' నాటకం ఎంతో ప్రాసంగికం. కార్మికుల సమస్యలు, కాంట్రాక్టు ఉద్యోగాలు, తక్కువ వేతనాలు, కార్మిక హక్కుల ఉల్లంఘనలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. అందుచేత 'కూలిరాజు' నాటకం నేటి సమాజానికి దర్పణం.

**ఆధార గ్రంథాలు :**


1. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం - సంపుటి - 4 - నాటకాలు - భాగం - 2
2. బోయి భీమన్న సాహిత్యం - జాతీయ దృక్పథం - డా॥ బూర్గుల కేశవులు


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# వేమన పద్యాలలో నాటి, నేటి సామాజిక వ్యవస్థ



– జి. ప్రేమలత

పరిశోధక విద్యార్థిని, తెలుగు అధ్యాపకురాలు, గురుకుల పాఠశాల, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ.

వేమన ఏ కాలం నాటి వాడో, ఏ ప్రాంతం వాడో, ఏ కులం వాడో ఎవరూ సరిగా చెప్పలేకపోతున్నారు. ఈ విషయంలో పండితులలో అనేక భిన్నాభిప్రాయా లున్నాయి. కొందరు పదిహేనవ శతాబ్దం వాడంటే, మరి కొందరు పదిహేడవ శతాబ్దం వాడంటున్నారు. కొందరు కొండవీడు ప్రాంతం వాడంటే, మరికొందరు కదిరి దగ్గర కటారుపల్లె వాడంటున్నారు. రెడ్డి కులస్థుడని కొందరు, కాదు కాపు కులస్తుడని మరికొందరంటున్నారు.

వేమన తన చుట్టూ వున్న జీవితాన్ని గమనిస్తూ దానిమీద వ్యాఖ్యానిస్తూ దేశ సంచారం చేసిన సన్యాసి. ఆయన తన భావాలను సరళమైన, అతి స్పష్టమైన శైలిలో కవితామయం కాకపోయినా, సాంప్రదాయకం కాక పోయినా మామూలు మనుషులకు ఉపయోగకరమైన శైలిలో వ్యక్తం చేశాడు. అతనికి మొగమాటమన్నది లేదు. మాయా మర్మాలు అసలే తెలియవు. తాను ఒప్పు అని నమ్మిన దానిని బటయపెట్టడంలో, తప్పు అనుకున్న దానిని నిందించడంలో వేమనకు జంకుబొంకులు లేవు. తాను చెప్పేది లోకానికి నిష్ఠూరంగా, అశ్లీలంగా తోస్తుందేమోనన్న అనుమాన విచారాలు అతనికి లేనేలేవు. అందుచేతనే తనకప్పటికప్పుడు తోచిన భావాన్ని ఉన్నదున్నట్లు నిర్భయంగా, స్వేచ్ఛగా అతడు పాడుతూ పోయాడు.

వేమన దృష్టిలో మనిషి దేవుడు. ఆయన తత్త్వం మానవతావాదం. మనుషుల మధ్య తాత్త్వికంగా భేదాలు లేవంటాడు. కులవర్గ భేదాలు మానవ కల్పితాలంటాడు. మనిషిలో మానవత్వాన్ని చంపే మతాన్ని గర్హిస్తాడు. ఉన్నత మానవతా గుణాలను ప్రబోధిస్తాడు. ప్రబోధ మెంత ప్రధానమో, సంస్కరణ అంత అవసరమంటాడు. స్నేహం, వివాహం, కృతజ్ఞత, చౌర్యం, ధర్మం, ధనం, దారిద్ర్యం, దుఃఖం, వ్యభిచారం, పరోక్షనింద మొదలైన అంశాలకు సంబంధించిన పద్యాలను సృష్టించాడు. వేమన చేసిన బోధనలు, చెప్పిన ధర్మాలు, నీతులు సత్య సమ్మతమవడం చేత ఒక్క భారతదేశానికే కాకుండా నేటి సమస్త ప్రపంచానికి సమాదరనీయమనే దానిలో సంశయం లేదు.

వేమన కీర్తి కోసం గానీ, ధనం కోసం గానీ కవిత అల్లినవాడు కాదు. కేవలం ఆత్మతృప్తి కోసం, లోకానికి మంచి తెలియజేయాలని మాత్రమే వేమన పద్యాలు అల్లాడు. ఒకరి మెప్పుకోసం ఎప్పుడూ తహతహలాడలేదు. విద్వాంసులెప్పుడూ విడివిడిగా తనకు తోచినప్పుడల్లా పద్యాలు చెప్పాడు. ఆ పద్యాలు కవితలు గణనకెక్కలేదు.

నిజానికి వేమన లోకకవి. ఆయన ప్రజల దృష్టిని దేవభాష అని చెప్పబడే సంస్కృతం నుంచి దేశభాష అయిన తెలుగు వైపుకు మళ్లించాడు. ప్రజలకోసం, ప్రజల భాషలో ఆ తర్వాతి సంస్కర్తలకు పురోగామి అయ్యాడు. ఛార్లెస్ ఫిలప్ బ్రౌన్ మాటలలో వేమన కడప జిల్లావాసి. గండికోట పరిసరాలలో జన్మించి ఉంటాడు. 708 పద్యాలలో వేమన తన జన్మను గురించి చెప్పుకున్నాడు. ఆయన 1653 ప్రాంతంలో జీవించి వుండవచ్చు.

కంద పద్యాలకు తిక్కన సీస పద్యాలకు శ్రీనాధుడు, ఆటవెలది పద్యాలకు వేమన ప్రసిద్ధి పొందిన కవులు. వేమన రచనా మార్గంలో మూడు అంశాలను గుర్తించాలి. మొదటిది ప్రజల భాషలో ప్రచారంలో వున్న పదాలను, మాండలికాలను ప్రయోగించి ప్రజలకు సన్నిహితమైన రచన చేయడం. రెండవది చెప్పదలచుకున్న భావాన్ని క్లుప్తంగా చెప్పడం. మూడవది ఊహలోనుంచి కాకుండా జీవితం నుంచి ఉపమానాలను ఏరుకోవడం. కవితా దృక్పధం విషయంలోనే కాకుండా రచనా విధానంలో కూడా వేమన ఆదర్శం నుంచి ఈనాటి కవులు నేర్చుకోవలసింది చాలా వుంది.

పామరులకు కూడా అర్ధమయ్యే భాషలో పద్యాలు చెప్పి ప్రజల్ని మెప్పించిన కవి వేమన. ఆటవెలదితో అద్భుతమైన కవిత్వము, అనంతమైన విలువగల సలహాలు, సూచనలు, విలువలు, తెలుగు సంగతులు ఇమిడ్చిన మహానుభావుడు యోగి వేమన.

వేమన పద్యాలు లోకనీతులు, సామాజిక చైతన్యం వేమన పద్యాల లక్షణం. వేమన స్పృశించని అంశం లేదు. సమాజంలోని అన్ని సమస్యలు భిన్న కోణాల్లోంచి దర్శించి ఆదర్శన వైశిష్ట్యాన్ని వేమన తన పద్యాలలో ప్రదర్శించాడు. కుటుంబ వ్యవస్థలోని లోటుపాట్లు, మతం పేరిట జరుగుతున్న దోపిడీలు ఒకటేమిటి ప్రతీ సామాజిక అస్థవ్యస్థత మీద వేమన కలం ఝుళిపించాడు.

పద్యాలన్నీ ఆటవెలది ఛందంలోని చెప్పాడు. ఎంతో లోతైన భావాన్ని కూడా సరళమైన భాషలో చక్కటి ఉదాహరణలతో హృదయానికి హత్తుకునేలా చెప్పాడు వేమన. స్పష్టమైన రీతిలో సూటిగా, తేటగా, శక్తివంతంగా వ్యక్తీకరరించడం, సామాన్యులైన వారిలో తనను ఒకనిగా భావించుకుని నీతి ఉపదేశం చేయడం వేమన నీతుల లోని ప్రధాన గునం. సునిశితమైన హాస్య, వ్యంగ్య, అధిక్షేప చమత్కృతులను ఉపదేశించిన రీతిని గమనించేటట్లు చేసే శైలిని ఆయన ప్రదర్శించాడు.

"విశ్వదాభిరామ వినురవేమ" మకుటానికి భిన్నవాదనలున్నాయి. అవి :

వేమన ఆలనాపాలనా చూసిన ఆయన వదిన విశ్వదరూ, ఆయన ఆప్తమిత్రుడు అభిరాముడినీ మకుటంలో చేర్చి వారికి శాశ్వతత్వాన్ని ఇచ్చాడని ఒక వాదన. విశ్వద అంటే విశ్వకారకుడికి, అభిరామ అంటే ప్రియమైనవాడని. అంటే సృష్టికర్తకు ప్రియమైన వేమా, వినుము, అని ఈ మకుటానికి మంచి అర్ధం చెప్పారు. పండితులు. బ్రౌను కూడా ఈ రెండో అర్ధాన్నే తీసుకుని పద్యాలను ఇంగ్లీషులోకి అనువదించాడు.

వేమన శతకం - కేవలం ఆ కాలమునకు సంబంధించినది కాక, ఏ కాలమునందయిననూ వర్తించు విధముగా ఉండును అనుట అతిశయోక్తి కాదు. వేమన శతకం "ఆటవెలది" ఛందస్సులో వ్రాయబడినది. నాటి, నేటి సామాజిక వ్యవస్థ, ధనస్వామ్య వ్యవస్థను పట్టిచూపే పద్యం.

"పుత్తడి గలవాని పుండు బాధైనను
మసుధలోన చాల వార్తకెక్కు
పేదవానియింటి పెండ్లైన యెరుగరు
విశ్వదాభిరామ వినురవేమ"

ఈ పద్యమును సమాలోచనం చేసినట్లయితే లోకంలో ఎప్పుడూ కాలంలో నిమిత్తం లేకుండా జరిగే విషయాన్ని చర్చించడం జరిగింది. "ధనం మూలం ఇదం జగత్" అని ఆర్యోక్తి. ఈ లోకంలో ధనవతులకు, పేదవారికి మధ్య ఉండే తారతమ్యాల్ని అద్భుతంగా ఈ పద్యము నందు వేమన చూపినాడు. బ్రహ్మమొక్కటే - పర బ్రహ్మమొక్కటే" అని చెప్పిన విధంగా - "వేమన దైవము ఒక్కటే" అని ఈ విధంగా వ్యక్తపరచిన తీరు ఆలోచింపదగినది.

"అనువుగాని చోట నధికులమనరాదు
కొంచెముండుటెల్ల కొదువగాదు
కొండయద్దమందు కొంచెమైయుండదా?
విశ్వదాభిరామ వినురవేమ"

అనుకూలత లేనప్పుడు గొప్పవాళ్ళమని చెప్పుకో కూడదు. అణిగిమణిగి పండి ఉండడం తక్కువ కాదు. పెద్ద ఎత్తు అయిన కొండను అద్దంలో చూస్తే అది చిన్నదిగానే ఉంటుంది కదా! అని వేమన నుడువుటలో జీవిత సత్యాన్ని మనం గమనించవచ్చు.

నిజంగా చంపడానికి తగిన శత్రువు, తన చేతికి చిక్కినా, అతనికి హాని చేయకూడదు. తగువిధంగా వాడికి మంచి చేసి, వెళ్ళిపొమ్మనడం సరిపోతుంది.

"తల్లి తండ్రి మీద దయలేని పుత్రుండు
పుట్టనేమివాడు గిట్టనేమి
పుట్టలోని చెదలు పుట్టవా గిట్టవా
విశ్వధాభిరామ వినురవేమ"

"మాతృదేవోభవ", "పితృదేవోభవ", "ఆచార్యదేవోభవ" అని ఆర్యోక్తి. కానీ ఎప్పుడూ తల్లిని, తండ్రిని, గురువును దైవములుగా భావించి, సేవ చేయాలి. అలాంటిది ఈనాడు తల్లిని, తండ్రిని వృద్ధాశ్రమంలో పెడుతున్నారు పిల్లలు. ఆ వృద్ధులు వీరికి భారంగా అనిపిస్తున్నారు. "నన్ను ఎంత కష్టపడి పెంచారో కదా" అనే భావన ఏ ఒక్క యువతీ యువకులకూ లేకుండా ఆదరాభిమానాలను మరిచిపోయి ఈ పోటీ ప్రపంచంలో ఒంటరి జీవితాన్ని గడుపుతూ తమతమ బాధ్యతలను మరచిపోతున్నారు. ఈ విషయాన్ని గురించి వేమన ఆనాడే తన పద్యంలో పొందుపరచినాడు.

ప్రజల నాల్కలపై నర్తించే తెలుగు కవులలో వేమన అగ్రశ్రేణి కవి. ప్రజానీకానికి సత్యప్రబోధ చేసిన సంస్కర్తగా వేమనది ఒక ప్రత్యేక స్థానం. అలతియలతి పదాలతో, ఆటవెలది పద్యాలతో ఈ కవి చెప్పిన జీవితసారం 'వేమనవాదం'గా ప్రశస్థి గాంచింది. అధిక్షేప దృక్పథం, హేతువాదకోణం, తాత్విక చింతన, శాస్త్రీయతాదృష్టికి పాదులు వేసిన తెలుగుకవిగా వేమనార్యునదిది ఒక ప్రత్యేక మార్గం. చాలా విషయాల్లో పరస్పర విరుద్ధ అభిప్రాయాలు వేమన పద్యాల్లో మనం గమనించగలం, వివేచించగలిగినప్పుడే మహనీయుడైన వేమనార్యుని స్ఫూర్తి మనకు అర్థమవుతుంది. వేమన ఒక నిస్వార్థయోగి. సమస్తమును వదిలివేసి సత్యాన్ని గుర్తించిన తత్త్వవేత్త.

స్త్రీలు సాక్షాత్తు దేవతా స్వరూపాలంటారు వేమన. వారి పిల్లల్ని సంస్కరిస్తూ, ఇంటిని చక్కదిద్దుతూ ధర్మాచరణ చేస్తూ తద్వారా ధార్మిక వారసత్వానికి బోధకులౌతూ ఒక సంస్కారవంతమైన సమాజానికి హేతుభూతాలౌతారని వేమన అభిమతం.

"గుణపతియుగు యువతి గృహము చక్కగనుండు
చీకటియున్న దివ్వె చెలగు రీతి
దేనియున్న యిల్లు దేవార్చన గృహంబు
విశ్వదాభిరామ వినురవేమ"

అజ్ఞానంధకారభూమయిష్టమైన సంసారాన్ని చక్కదిద్దే దీపం ఇల్లాలట - స్వయంగా జ్ఞాన స్వరూపుణియైన గణపతి తన ఇంటిని తద్వారా సమాజాన్ని తేజోవంతం చేస్తుందట. అందుకే గుణవంతురాలున్న గృహం సాక్షాత్తు దేవార్చన గృహం అంటారు వేమన.

"కామిగానివాడు కవిగాడు రవిగాడు
కామిగాక మోక్షగామిగాడు
కామియైనవాడు కవియగు, రవియగు
విశ్వదాభిరామ వినురవేమ"

స్త్రీలోలుడైన స్వరమూ కోల్పోయి ఆపై వేదాంతియైన వేమన అనుభవసారం ఈ పద్యం అంటూ చాలామంది ప్రచారం చేస్తుంటారు. గుణపరంగా కామము అంటే కోరిక అని అర్థం. శరీర వాంఛకాదు. ఒకవేళ శరీరవాంఛే గనుక కోరిక ఐతే ఆ కామము మరొక అంశం. ప్రస్తుత పద్యంలో వేమన చెప్పింది కేవల కోరికను గురించి మాత్రమే.

మన జన్మ సార్థకం చెందాలంటే పదుగురికి మంచివేసి, నిస్వార్థ జీవనంతో శ్రమిస్తూ, దానధర్మాలు చేస్తూ మనం మరణించాక కూడా జీవించి ఉండేలా మంచి పనులు చేయాలన్న కోరిక తపన ఉండాలంట. అట్టి మహనీయులు అక్షరం నిలచియున్నంతకాలం, సూర్యుడు వెలుగులీనినంతకాలం చిరయశస్కులై వెలుగొందుతారట, వేమన వేదాంతమిది.

స్త్రీల సుఖంకోసం అర్రులుచాస్తూ మనసును నిలకడపరచుకోలేక విచ్చలవిడిగా జీవించేవారు చరిత్ర హీనులై నశిస్తారని, యేటి గట్టున ఉండే చెట్టులాగా బ్రతుకు కుప్పకూలిపోతుందని హెచ్చరించారు. ఇవన్నీ స్త్రీలను భోగవస్తువుగానో, విలాస వస్తువుగానో చూడరాదని వేమన చెప్పిన హెచ్చరికలే.

"సతికి పతికినైన సంపదే సంపద
పుత్ర సంపదలును భువికి మేలు
సరస ముదిసి బ్రతుకు సంపదే సంపద
విశ్వదాభిరామ వినురవేమ"

భార్యకు భర్తపైన, భర్తకు భార్యపైన ఉండే నిష్కపట అనురాగమే నిజమైన సంపద అని, గుణవంతులైన బిడ్డలవల్ల కలిగే ఆనందమే నిజమైన ధనమని, వృద్ధాప్యంలో కూడా చింతలేకుండా గడపగల్గడమే అసలైన ఐశ్వర్యమని వేమన ప్రవచించారు. ధనం కోసం అర్రులు చాచకుండా ఆత్మీయ కుటుంబ జీవనాన్ని స్వంతం చేసుకుని ఆనందించమని వేమన ప్రవచించారు. స్త్రీలను గౌరవించాలని, అమ్మకు ఎదురాడడం పాతక మని వేమన ప్రబోధించారు.

"ఇంటియాలి విడిచి ఇనప కచ్చలు గట్టి
వంటకంబు రుచుల వాంఛలుడిగి
ఒంటినున్నయంత అంటునా తత్వంబు"

అనే పద్యం వేమనార్యుని వేదాంత భావనకు మకుటా యమానమైన ఉదాహరణ. ఈ అద్భుత తత్త్వవేత్త, జీవితసారాన్ని కాచి వడబోసిన యోగి తెలుగువారు కావడం తెలుగు వారిగా మనందరికీ గర్వకారణం.

వేమన స్త్రీవల్ల నష్టపోయి విరాగిగా మారారని, ఆయనకు మహిళలపట్ల వైరభావమున్నదని, సాంసారిక జీవితాన్ని ఆయన నిరసిస్తారని కొందరి భావన. వేమన సాహిత్యాన్ని లోతుగా అధ్యయనం చేసిన వారికి మాత్రమే ఆయన పరిపూర్ణత అవగతమౌతుంది. వేమన అరిషడ్వర్గ వికారాలను నిరసిస్తారేగాని మహిళల్ని తక్కువచేసిన ఆన వాళ్ళు ఎక్కడా కనిపించవు. పైగా గృహస్థ ధర్మాన్ని వేమన చాలా బలంగా సమర్థిస్తారు కూడా. మహిళల పట్ల చిన్నచూపు కూడదని, ప్రకృతి స్వరూపిణిగా గౌరవించా ల్సిన స్త్రీలను కట్టుబాట్ల నెపంతో వేధించడం సరికాదని వేమన సమాజానికి హితవు పలికారు. సంస్కరణ భావా లకు పాదులు వేస్తూ అనంతర కవులకు చక్కని మార్గం చూపిన మహాకవిగా తెలుగు సాహిత్యంలో వేమనది ఒక సువర్ణ అధ్యాయం.

నీతి గల జాతియే నిజమైన జాతి. అలాంటి నీతి వంతమైన సమాజాన్ని ఏర్పరచడానికి, నీతిగా జీవించ డానికి ప్రజాకవి వేమన చెప్పిన సామాజిక నీతులు సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయి.

'ఆలివంక వారు ఆత్మ బంధువులైరి
తల్లివంక వారు తగిన పాటి
తండ్రి వంక వారు దాయాది పగవాడు
విశ్వదాభిరామ! వినురవేమ!

ఎంతటి బంధువులైనా డబ్బు దగ్గరికి వచ్చేసరికి అంతే సంగతులు. నిత్యజీవితంలో మన సంబంధ బాంధవ్యాలు ఆర్థిక సూత్రాలను బట్టి నడుస్తున్నాయని నివురును ఊదేసి నిప్పును జూపినట్లు వేమన చెప్పాడు.

ఆత్మశుద్ధి లేని ఆచారమదియేల
భాండశుద్ధి లేని పాకమేల
చిత్తశుద్ధి లేని శివపూజలేలరా
విశ్వదాభిరామ ! వినురవేమ'

ఆచారాల పేరు మీద, సంప్రదాయాల పేరు మీద ఎన్నో పూజలు, వ్రతాలు చేస్తూ ఉంటారు. ఆత్మశుద్ధి, ఆచారం, భాండం అంటే కుండ. కుండ శుద్ధి లేకుండా పాకం ఒండితే ఎవరూ తినరు. అలాగే చిత్తశుద్ధి లేని శివపూజలు వలన ప్రయోజనం లేదని ఆధ్యాత్మిక చైతన్యస్ఫూర్తిని కలిగించారు. వేమన. ఆచారాలు సంప్ర దాయంగా వచ్చేవి. వాటిని గుడ్డిగా అనుకరించకూడదు. అవి ఏ పరమార్థంలో ఉపదేశించబడ్డాయో తెలుసుకొని నడవాలి. తెలుగు ప్రజల మస్తిష్కాలలో వేమన్నది మహాయోగిగా స్థిరమైన స్థానం. మట్టిలో పుట్టి మట్టిలో పెరిగిన మానవత్వంలోని మహోన్నత శిఖరాలను అందుకొన్న మహానుభావుడు ఆయన. మనుష్యుల మధ్య తిరుగుతూనే, నిత్యాన్వేషణ శీలంతో మానవ జీవితంలోని

సత్యాసత్యాలను దర్శించి విమర్శించిన వివేకవంతుడు వేమన. ఆయన యోగం అంతా అన్వేషణే. తెలుగుభాష ఉన్నంత వరకు వేమన పద్యాలు సజీవశక్తితో అందరినీ ఆకర్షిస్తూనే ఉంటాయి. వేమనకు తెలుగు కవితా క్షేత్రమునందే కాదు విశ్వసాహిత్య రంగంలోను సముచిత స్థానం ఉన్నది.

**ఆధార గ్రంథాలు :**

1. సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు ఆచార్య జీ.వి.యస్.
2. శతకమంజరి - విక్టరీ పబ్లికేషన్స్.
3. వేమన్న వెలుగలు - ఆచార్య యన్.గోపి.
4. తెలుగు సాహిత్య సమీక్ష - ఆచార్య వెలమల సిమ్మన్న.

★★★

★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# మల్లెసాల శతాధిక చేతివృత్తుల కథలు – జీవన చిత్రణ



- అఫ్రోజ్ రుక్సానా

పరిశోధక విద్యార్థిని, డా॥. బి.ఆర్. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

మల్లెసాల అంటే పరిముట్లు, వాయిద్య పరికరాలు ఉంచే ప్రదేశాన్ని మల్లెసాల అంటారు. పనిముట్ల అర్ర, సామాన్ల గది, సాయమాను, మలిసాల.. మొదలైన అర్థాలున్నాయి. నిఘంటువుల్లో ఉండే పదాలు కావివి. ఈ 'మల్లెసాల' శతాధిక చేతివృత్తి కథల సేకరణ, ప్రచురణ పనులకు పూనుకొన్నది.

జ్వలిత తాను ముందు, నడుస్తూ చుట్టూ సమాజాన్ని, సాహిత్య రంగాన్ని నడిపిస్తూ సాగుతున్న సంఘ సంస్కర్త. జ్వలిత కృషి బహుముఖీనమైనది. కథలు, కవితలు రాయడంతో పాటు ఎన్నో సామాజిక అంశాలపై గొంతెత్తారు. వ్యాసాలు రాశారు. ఆదర్శ ఉపాధ్యాయునిగా, ప్రధానోపాధ్యాయులుగా ఎనలేని కృషి చేసి రిటరయ్యారు. 139 మంది కథకులలో 88 మంది రచయితలు, 51 మంది కథయిత్రులు ఉన్నారు.

139 కథలలో పదమూడు చేనేత కథలు, ఎనిమిది చేపలు పట్టే వృత్తి, నాలుగు గొర్రెల పెంపకం కథలు, ఎరుకల కథలు రెండు, కుమ్మరి కథలు నాలుగు, మంగలివృత్తి ఐదు, పాకీ మూడు, వడ్రంగి ఎనిమిది, చాకలి ఏడు, చెప్పులు చేసే కథలు ఆరు. కుట్టుపని నాలుగు, కాటికాపరి రెండు, దొమ్మరి ఒకటి, యక్షగానం రెండు. బొమ్మలు చెయ్యడం, సైకిల్ రిపేర్, పూలు అల్లడం, భవన నిర్మాణం, బంజారా కుట్టుపని, సాధనా శూరులు వ్యవసాయం, పశువుల పెంపకం, సున్నం బట్టీ, పెయింటింగ్ పని, గానుగాడించే పని, సన్నాయి (తమ్మళ్ళ బాజా), బీడీలు చుట్టడం.. ఇంకా చాలా.. ఉన్నాయి.

జ్వలిత బోధనా రంగానికే పరిమితం కాకుండా, సాహిత్య, సామాజిక రంగాల్లో అవిశ్రాంతంగా కృషి చేస్తున్న రచయిత్రి, జ్వలిత చేతివృత్తులు, అవి పతనమవుతున్న తీరు, వారి జీవన పోరాటాలను చిత్రీకరిస్తూ వచ్చిన కథలను ఎంపిక చేసుకుని ఈ బృహత్ సంకలనాన్ని వెలువరించారు.

ప్రస్తుత కృతి 'చేతి వృత్తుల కథలు' కథా సంకలనం ఒకే రచయిత రచనలు కలది 'సంపుటం' వివిధ రచయితల రచలు కలిగినది 'సంకలనం'. తెలుగు సాహిత్యంలో ఓ కవితా సంకలనాలు, కథా సంకలనాలు, వ్యాస సంకలనాలు మొదలగునవి అనేకం వచ్చాయి, వస్తున్నాయి.

ఈ సంకలనంలోని ప్రతికథ చేతివృత్తికారుల తర తరాల జీవన సమరాన్ని చిత్రిస్తుంది. ఆధిపత్య కులాల అణచివేతల కింద నలిగిపోయిన బహుజనుల అస్తిత్వ

స్వరాలు వేదనా భరితంగా మదిలో మార్మోగుతాయి. మనుషులు కులాలుగా, వృత్తులుగా చీలిపోయి చెల్లా చెదురై తమ బతుకులను ఏ విధంగా మూటగట్టుకుని కాలాన్ని ఎలా ఎదుర్కున్నదో పోరాట పాఠాలుగా ఈ కథలు స్ఫూర్తినిస్తాయి. సంపాదకురాలిగా విభిన్నమైన పుస్తకాలను తీసుకువచ్చే జ్వలిత ఈసారి 139 కథలకులతో ఈ చేతివృత్తి కథలను తీసుకురావటం శుభపరిణామమే.

కథను నడిపించే వారూ, కథా వస్తువును భరించే వారూ, కథాంశాన్ని సూచించే వారు పాత్రలు. నవలలోని పాత్రల్లో కనిపించే విశాలత్వమూ, లోతూ కథల్లోని పాత్రల్లో కనిపించవు. నవలలో అనేక పాత్రలు ఉంటాయి. కాబట్టి విభిన్న మానవ వ్యక్తిత్వాలను ఒక దాంతో మరొకటి పోల్చి చూపవచ్చు. కథలో అలాంటి అవకాశం చాలా తక్కువ. నవలలోని పాత్ర పాఠకుని మనసులో రూపొం దుతుంది. అంటే నవతా రచయిత ఒక పాత్రకు సంబం ధించిన అనేక ముఖాలనుశ్రీ పాఠకుని ముందుంచితే పాఠకుడు వాటి సహాయంతో ఆ పాత్ర వ్యక్తిత్వాన్ని తన మనసులో నిర్మించుకుంటాడు. కథలో అలా కాకుండా రచయిత మనసులో రూపొందిన పాత్ర పాఠకుని ముందుకొస్తుంది. కథలోని పాత్ర కూడా సాధారణ మానవుడే కాబట్టి అతడికీ అనేక ముఖాలూ, అతనిలోనూ అనేక విభిన్న లక్షణాలు ఉండవచ్చు. కథా రచయిత వాటిలోంచే కథాంశానికి దోహదం చేసే లక్ష్యాన్నో, లక్షణాల్నో మాత్రమే ఎన్నుకోవలసి ఉంటుంది. ఈ ఎన్నికలోనే వృత్తి జీవన చిత్రణ కథల రచయిత జీవితాను భవమూ, శిల్ప సామర్థ్యమూ వ్యక్తమౌతాయి.

**లచ్చి – గూడూరి సీతారాం :**

లచ్చి, సంచార తెగకు చెందిన బిచ్చగాళ్ళ (పిచ్చు కుంట్లు) బతుకుదెరువును గూర్చి సమూలంగా పరిశీ లించి అక్షరచిత్రంగా నిర్మించారు గూడూరి సీతారం. చాపలు అల్లుకుంటూ, బిచ్చమెత్తుకుని బతికే బిచ్చగాళ్ళ గురించి వారి జీవన చిత్రణను చిత్రించిన కథ లచ్చి.

జీవితంలో అకస్మాత్తుగా కలిగిన ఆర్థిక ఎదుగుదల సామాజికంగా ఎదిగేందుకు ఉపకరించకపోగా, ఏ విధంగా నష్టపరిచిందో ఇంటులో చూస్తారు. అందరి లాగానే పట్నం జీవితం కోసం వెంపర్లాడి పరిగెత్తి, పరిగెత్తి జీవితం కోసం వెంపర్లాడి పరిగెత్తి, పరిగెత్తి అపార్థాలకు, అనుమానాలకు లోనై చతికిలపడి చివరికి అలసట చెంది పూర్వ జీవితాన్ని మళ్లీ గెలుచుకున్న క్రమంలో జరిగిన పరిణామాలు, పరిస్థితులు సామాన్యుని జీవితంలో మార్పులు ఎందుకు అనుకూల స్థితిని కలిగించలేక పోతాయో 'లచ్చి' కథ అందుకు మంచి తార్కాణం.

ఇంకా 'అందని ఆకాశం', 'అబ్బాయి అమ్మాయి', 'దెబ్బతిన్న అహంభావం', 'ఏ్రపువ్వు', 'బస్సచ్చింది', 'పిచ్చోడు' వంటి ఎనభైకి పైగా కథల్ని రాశారు గూడూరి. గూడూరి కథలన్నిటిలో పాత్రోచిత మాండలిక సంభాషణ లతో జీవకళ ఉట్టిపడుతుంది. ఈ కులవృత్తి కథలు ఆ తర్వాత గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన యువ రచయితలకు మాండలిక కథా నిర్మాణానికి ఒక దిక్సూచిగా పనిచేశాయి. కథా సాహిత్యంలోకి నిజాయితీగా, నిస్సం కోచంగా గ్రామీణ పేదల జీవితాలను, వాళ్ల వృత్తాలను ప్రవేశపెట్టేందుకు గూడూరి కథలు తోడ్పడ్డాయి. గూడూరి వాడిన మాండలికం ఆ తర్వాతి తరం రచయితలకు, పాఠకులకు కూడా ప్రీతిపాత్రంగా మారిందని చెప్పవచ్చు.

పాత్ర యొక్క సామాజిక స్థాయిని మరువకుండా సంభాషణలు రాసిన గూడూరి తన రచనల్లో జాతీయాలు పలుకుబళ్లను విరివిగా ఉపయోగిస్తారు. కథ నిడివిని పెంచే వర్ణనలను ఎక్కడా స్థానం కల్పించని ఆయన వస్తువు పట్ల తీసుకున్న శ్రద్ధ పాఠకుణ్ని తనవైపుకు మరలిస్తుంది.

జీవితంలోని అనుభవాల్ని, అనుభూతుల్ని చేదు జ్ఞాపకాల్ని నేపథ్యంగా చేసుకుని తనకున్న సజీవభాషా సంపత్తితో చక్కని, చిక్కని ప్రయోగాలతో పల్లె జీవనాన్ని చిత్రించారు గూడూరి. తెలంగాణా మాండలికానికి సాహిత్య గౌరవాన్ని, వ్యక్తిత్వాన్ని సీతారాం కలిగించారు. అంతేగాక అప్పటి సామాజిక పరిణామక్రమాన్ని అధ్య యనం చేయడానికి గూడూరి సీతారాం కథలు వాహకా లుగా నిలుస్తాయి.

**గోస–పెద్దింటి అశోక్ కుమార్ :**

పెద్దింటి అశోక్ కుమార్ రాసిన 'గోస' కథ పద్మశాలీల

ఆశ్రిత కులం వారైన సాధన శూరుల గురించి తెలియ జేస్తుంది. ''ఒకవైపు కులవృత్తులే నాశనమైపోతుంటే ఇక ఆశ్రిత జాతులను పట్టించుకునేవారెవరు? పద్మశాలీలకే పనులు లేక, వస్తులుంటుంటే వారినాశ్రయించుకొని బతికే సాధన శూరులు దిక్కులేక గారడీ చేసుకు బతికే వీలు కూడా లేక చివరకు బిచ్చగాళ్ళుగా మారిపోతున్న దయ నీయ కథనమే ''గోస''. వ్యవసాయ రంగం తర్వాత అత్య ధిక ప్రజానీకానికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న చేనేత రంగం అభివృద్ధి ద్వారా భారతీయ చేనేత కారులు నైపుణ్యా లను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవచ్చు.

ప్రత్యక్షంగా పరోక్షంగా నేటికీ కోటిమందికి పైగా చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ రంగాన్ని మరింతగా ప్రోత్సహించి అభివృద్ధిపరిస్తే అదనంగా మరో కోటిమందికి ఉపాధి లభిస్తుంది. పద్మశాలీయుల సునిశిత కౌశల్యానికీ, సూక్ష్మ కులవృత్తి చేనేత పరిశ్రమ, తరతరాలుగా భారతీయ సామాజిక - ఆర్థిక - రాజకీయ వ్యవస్థకు పట్టుగొమ్మగా నిలిచి ఎన్నో ఇతర కులాలకు తాను తింటూ పట్టెడన్నం పెట్టింది.

**త్రిభుజపు నాల్గోకోణం – ఆడెపు లక్ష్మీపతి :**

ఆడెపు లక్ష్మీపతి 'త్రిభుజపు నాల్గోకోణం' కథలో పద్మ శాలి జీవితాల్లో కులవృత్తులు కోల్పోయి. అనేక ఇతర వృత్తులు, వ్యాపారాలు చేపట్టి, నష్టాలు సంభవించి జీవితాలు, కుటుంబాలు ఎలా శిథిలమవుతూ వస్తు న్నాయో చిత్రించారు. బీసీ కులాల నుండి మధ్య తరగతిగా ఎదుగుతున్న జీవితాలలోని సంఘర్షణను, సంక్లిష్టతను శిల్ప వైవిధ్యంతో చిత్రిస్తున్నారు. పద్మశాలీ లకు నష్టాలు వచ్చి జీవితాలు ఎలా శిథిలమయ్యాయో తెలిపే కథ 'త్రిభుజపు నాల్గో కోణం'. రచయిత ఆడెపు లక్ష్మీపతి. ఈ రచయితదే మరోటి 'ముసల్దానిముషా' అనే కథ కూడా పద్మశాలీల జీవితాన్ని చిత్రిస్తుంది.

**వైపని – జూకంటి జగన్నాథం :**

అందమైన వస్త్రాలు తీయారు చేసే సమర్థత గల చేనేత పరిశ్రమ వారు పవర్‌లూమ్స్ వచ్చాక తాము నేస్తున్న బట్టలకు ప్రతిఫలం దొరక్క ఆత్మహత్యలకు పాల్పడు తున్న నిజాన్ని 'వైపని' కథలో జూకంటి జగన్నాథం వివరించాడు.

రచయిత 'వైపని'లో ఒక కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకుని చనిపోయిన తీరును తెలియ పరుస్తాడు. భర్త బొంబాయిలో చనిపోగా ఇద్దరు పిల్లలతో సక్కుబాయి పడ్డ కష్టాల్ని చూపిస్తాడు. కూతురు పెళ్ళి చేసిన తర్వాత ఏ పనిచేసుకున్నా పొట్టనిండక ఆత్మహత్య చేసుకుని కుటుంబం పూర్తిగా మరణించిన తీరు పాఠకు లందరిని ఆలోచింప చేస్తుంది. కులవృత్తిని కోల్పోయిన పద్మశాలీలు వ్యాపారం చేయడం ప్రారంభిస్తారు.

ఒకనాడు వృత్తిపరమైన, సమాజపరమైన వివక్షలు ఏకమై మాదిగలను శ్రమదోపిడీకి, అవమానాలకు గురి చేశాయి. కానీ ఆధునిక కాలంలో ఏర్పడిన చైతన్యం, అంది వచ్చిన అవకాశాలు, సామాజిక పరిణామాలు మాదిగల వృత్తిజీవితంలో మార్పు తెచ్చాయి.

పోగులను ఏనెకు ఎక్కించేపనిని వైపని అంటారు. పోగులు తెగిపోకుండా జాగ్రత్తగా పనిచేసే ఓపిక, ఏకాగ్రత, నిబద్ధత వైపని అవసరం. చేనేత కార్మికుల జీవితం విడివడలేని చిక్కుపడిన దారంలా మారిందని చెప్పటం శీర్షిక ఉద్దేశ్యం. వైపని కథ చేనేత కార్మిక కుటుంబపు విషాద గాథ. వేల చేనేత కుటుంబాలకు వైపనిలోని సక్కుబాయి పాత్ర, ఆమె కుటుంబం ప్రతినిధి. పద్మశాలి కుటుంబాల్లోని శతాబ్దాల విషాదాన్ని, వలసలను, దారిద్ర్యాన్ని, త్యాగాన్ని విడమరిచి చెప్పిన కథయిది.

కోడలువైనా నా ఆరుగురు బిడ్డల్ల బిడ్డ సొంటిదానివి. గోచారం మంచిగలేక తులసిని పొమ్మంటున్నగని యేరే విధంగా గాదు, నువ్వు జెప్పినసూడుబిడ్డా అని అత్త సక్కుబాయిని ప్రాధేయపడింది. కొత్తక భార్యను విడిచి వుండలేక, ఇక్కడ బతుకుతెరువలేక తులసీరాం బొంబాయి బస్సు ఎక్కాడు.

పోషించలేని కులవృత్తి కారణంగా వలసలకు కొత్త దంపతులు తమ ప్రాయాన్ని, జీవితాన్ని ఎట్లా బలిదానం ఇవ్వవలసివస్తుందో పై సన్నివేశం ద్వారా తెలుస్తుది. ఆర్థికపరమైన అవసరాలు కుటుంబాన్ని ఎట్లా విచ్ఛిన్నం

చేస్తాయో చిన్నతనంలోనే సంసారం బరువువెూసే పరిస్థితులెట్లాంటివో ఈ సందర్భం చెప్పగలిగింది.

**ప్రశాంతం, రాత్రిపూలు – బి.ఎస్.రాములు :**

పరిణామాలు సమాజంలో, సంస్కృతిలో, మానవ సంబంధాల్లో, చేనేత కార్మికులు బహుజన జీవితాల్లో తెచ్చిన మంచి, చెడులను చాలా కథల్లో చిత్రిస్తూ, చర్చిస్తూ విశ్లేషించి చూపాను. 'రాత్రిపూలు' కథలు గ్లోబలైజేషన్ తెచ్చిన విషాదాలను విశ్లేషించాయి. సమాజంలో దెబ్బతిన్న మరో కులవృత్తి చాకలి వృత్తి గ్రామంలో ప్రతి కులానికి కొన్ని సామూహిక జీవనంపై హక్కులుంటాయి. మరీ ముఖ్యంగా ఊరి చాకలికి. పరస్పరాధారిత వ్యవస్థలో ఈ హక్కులు ఆయా కుటుంబాల ఉదర పోషణకు హామి నిస్తాయి. అయితే కొందరు ఈ హక్కుల్ని దురుపయోగ పరుచుకుంటారు. ఫలితంగా ఇతరుల ఆగ్రహానికి గురౌతారు. తత్ఫలితంగా పని కోల్పోతారు. అపుడు ఈ పరస్పరాధారిత వ్యవస్థ కుంటుపడుతుంది. వర్గ వైషమ్యాలు పెరిగిపోతాయి. ఆత్మహత్యలు చేసుకోక పోదురు అన్నారు కొందరు. అవన్ని విన్నంక నిజమే అనుకున్నడు ఎల్లయ్య. ఇంకోబోట పని ఎతికిండు ఎల్లయ్య సిరిసిల్లలో ఎవరిదగ్గరైనా ఇదే స్థితి. బి.యస్. రాములు గారి ఈ వ్యాక్యాలు నేటి ప్రభుత్వాల హ్రస్వ దృష్టిని మన ముందుకు తెస్తున్నాయి.

**పలాయనం – ముదిగంటి సుజాతారెడ్డి :**

'పలాయనం' చాకలి ముదిగంటి సుజాతారెడ్డి పలాయనం కథలో చాకలి వారి జీవితాన్ని, ఒకే కులంలో, ఒకే వృత్తిలో వుండే పని విభజనను స్త్రీలకు, పురుషులకు మధ్య అవగాహనలో వుండే తేడాను చిత్రించారు. శ్రమంతా చాకలి స్త్రీలది కాగా మగవాళ్లు పెత్తనం చేయడం, వ్యవసనాలకు లోనుకావడం, చాకలి మహిళల కోణంలో చిత్రించారు.

**ప్రయాస – శిరంశెట్టి కాంతారావు :**

శిరంశెట్టి కాంతారావు 'ప్రయాస' (2007) కథలో కుమ్మరి కులానికి ఇప్పుడున్న ఆదరణలేక వారి వృత్తిని వదలి మరో వృత్తిని చేపట్టి ఎటువంటి కష్టాలు సమస్యలు అనుభవిస్తున్నారో వాటన్నింటిని చిత్రించాడు.

**'కొలిమి' – మేరెడ్డి యాదగిరిరెడ్డి :**

'కొలిమి' (2009) కథలో ప్రపంచీకరణ ముందు జీవితాలను, ప్రపంచీకరణ తదనంతర జీవితాలను చిత్రించాడు. "వడ్ల వీరబ్రహ్మం యింటి ముందు తెల్లవారే సరికి జనం సంతలా వచ్చి పడ్డారు. పాత నాగండ్లు, గుంటకలు, దంతెలు, నాగలి మొద్దులు, కర్లు, మేడి తోకలు అన్నీ తీసుకుని వచ్చి కూర్చున్న రైతులు.." (కొలిమి, పు. 50) ఈ స్థితినుంచి పెట్టుబడిదారులు పెద్ద పెద్ద మిషన్లు తీసుకురావడంతో వారి అస్తిత్వాన్ని చూసి వారే ఈసడించు కునే పరిస్థితిని కల్పించింది. "కళ దప్పిన కొలిమి ముందు దయ్యాలు నాట్యం చేస్తున్నాయి. మండే సూర్యుడిలా ఎప్పుడూ రాజుకునే కొలిమి చల్లారిపోయింది. అమావాస్యకో పున్నానికో కత్తులు, కొడవళ్లు, గొడ్డళ్లు సరిపిచ్చు కోవడానికి ఎవరైనా వస్తే అదే పదివేలు..." (కొలిమి, పు. 61) వంటి వాక్యాలు గ్రామాలలో వడ్లకమ్మర్ల జీవితాలను వ్యక్తీకరిస్తారు.

**విధ్వంసం – జాతశ్రీ :**

'విధ్వంసం' కథలో దొమ్మరాటలను నమ్ముకొని జీవనం గడిపే వృత్తిదారుల గురించి రాసి సర్కస్ ద్వారా ఎంత కష్టపడి అన్నం అడుక్కుంటారో జాతశ్రీ 'విధ్వంసం' కథని అద్భుతంగా చిత్రీకరించారు.

ఈ కతలో దొమ్మరిపోశం మరియు గురవ్వ భార్య భర్తలు. వీరికి పోలి అనే కుమారి ఉంటుంది. అలాగే కొండాలు అనే కుమారుడు కూడా ఉంటాడు. సంకలో పాము బుట్టను, తలపై తట్టెడు బరువుతో ఊరూరా తిరుగుతూ సంచార జీవితం గడుపుతాడని జాతశ్రీ దొమ్మరిపోశం ద్వారా కథని చక్కగా చిత్రీకరించాడు. పాముతో అద్భుతాలు, మ్యాజిక్లు చేయించి ధాన్యం గింజలను ఎలా అడుక్కొని కడుపునింపుకుంటారో ఈ కథలో చూపించాడు. ఎర్రటి ఎండలో దారిలో నడుస్తూ, భుజాల మీద తమ వస్తువులను మోసుకుంటూ, మరొకిన్న బరువైన సామాగ్రిని గాడిద మీద ఎక్కించి దొమ్మరోల్లు ఊరూరా తిరుగుతారని జాతశ్రీ చెప్పిన తీరుని పరిశీలిస్తే అనేకాంశాలు గోచరిస్తాయి. ఆకలిని లెక్క చేయకుండా కాలినడకన ఛలో పాదయాత్ర అన్నట్లు దొమ్మరోల్లు

ఊరూరా తిరిగి ప్రదర్శనలు ఇస్తుంటారు. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో ఈ వృత్తిని నమ్ముకున్నవారు సజీవంగానే ఉన్నారని చెప్పొచ్చు.

కాలువ మల్లయ్య బి.ఎస్. రాములు, మేరెడ్డి యాదగిరిరెడ్డి, పి.చంద్, బి.వి.ఎన్.స్వామి, బోయ జంగయ్య, జూకంటి జగన్నాథం, కె.వి. నరేందర్, పెద్దింటి అశోక్ కుమార్, ఐతా చంద్రయ్య, జాతశ్రీ, ముదిగంటి సుజాతారెడ్డి, నేరెళ్ళ శ్రీనివాస్ గౌడ్, పంజాల జగన్నాథం, అంబల్ల జనార్ధన్, జ్వలిత మేరెడ్డి యాదగిరి రెడ్డి, శిరంశెట్టి కాంతారావు, ఆడెపు లక్ష్మీపతి, వెల్దండి శ్రీధర్, సి.హెచ్. మధు, అనిశెట్టి రజిత, హనీబ్, స్కైబాబా, షాజహన్, దిలావర్, గీతాంజలి, డా॥. మహమ్మద్ షరీఫ్ మొదలైన తెలంగాణ ప్రాంత కథకులు తెలంగాణ వెనుకబడిన వర్గాల జీవితాలను కథల్లో చిత్రించారు. రైతుల పేరిట, వ్యవసాయం పేరిట, వ్యవసాయ కూలీల పేరిట చిత్రించిన దానిలో ఒక శాతమైనా చేనేత కులాల, వృత్తులపై సాహిత్యం వెలువడకపోవడం ఒక సామాజిక విషాదం. తోటివారి పట్ల స్పందించే స్వభావం వారి జీవితాలను పరిశీలించే దృష్టి లేకపోవడాన్ని ఇది తెలుపుతుంది.

కులవృత్తులు కోల్పోతున్న క్రమాన్ని, కులవృత్తుల్లో జీవిస్తున్న ప్రజల జీవితాన్ని అనేక కథల్లో చిత్రించారు. యాదవ, గంగపుత్ర, రజక, కుమ్మరి, చేనేత, పద్మశాలి, విశ్వబ్రాహ్మణ, వడ్డెర, మంగళి తదితర కులాల గురించి, అందులోని స్త్రీల గురించి ప్రత్యేకంగా దృష్టి పెట్టి కథలు.

బహుజన జీవితాలను రికార్డు చేసి భిన్నవైవిధ్యంతో చేతివృత్తుల కథలను సంకలనం చేసిన వారు జ్వలిత. ఇదొక విన్నూత అంశం. సామాజిక రాజకీయ చైతన్యాన్ని ఆలంబనగా పేర్కొనవచ్చు. శతాధిక మల్లెసాన చేతివృత్తి కథలు వెలుగు చూడడంలో అవిశ్రాంత కృషి చేసిన జ్వలితను అభినందన మందరమాల.

**ఆధార గ్రంథాలు :**

1. సత్యనారాయణ, ఎస్వీ 'దళిత సాహిత్యోద్యమం', ఆంధ్రప్రభ సాహితీ గవాక్షం - 1990.
2. సుజాతారెడ్డి, ముదిగంటి - తెలంగాణా అస్తిత్వాన్ని ఇతర ప్రాంతీయుల పెత్తనంలో నశించకుండా కాపాడుకోవాలి, 'మన తెలంగాణా' పత్రిక, హైదరాబాద్.
3. గౌరి - కాంచనపల్లి - కొలిమి - లిఖిత సాహితీ బులెటిన్ - సంచిక, 33, ఫిబ్రవరి, 2006.
4. బతుకు రేవువ - చైతన్య ప్రకాష్ రేణ కథల సంపుటం - ప్రథమ ముద్రణ, 2001.
5. ధిక్కారం - కాలువ మల్లయ్య అభ్యుదయ పత్రిక, ఫిబ్రవరి, 1989.
6. వెలి - పెద్దింటి అశోక్ కుమార్ - ఊటబాయి కథా సంపుటం, నవంబర్, 2002.
7. సాకిరేవు - పెద్దింటి అశోక్ కుమార్ - కొలిమి - లిఖిత సాహితీ బులిటెన్ - సంచిక 33.
8. మలేలయ్య మనసు - కాలువ మల్లయ్య - కొలిమి - లికిత సాహితీ బులెటిన్ - సంచిక 24, మే.
9. విధ్వంసం - జాతశ్రీ - చలివేంద్రం కథా సంపుటి - ఏప్రిల్ 2004.
10. ప్రయాస - శిరంశెట్టి కాంతారావు - ఊతకర్రల కథా సంపుటి - అక్టోబరు 2012.

★★★

Vol. 23 | Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# జాతశ్రీ నవలల్లో, కథల్లో వృత్తి కులాల జీవనం



- బంటు నర్సింహులు

తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొడంగల్, వికారాబాద్ జిల్లా, తెలంగాణ.

సాహిత్యమనగా సహృదయమునకు హితవు గొల్పునది. సమాజానికి మేలు చేకూర్చేది సాహిత్యం అవుతుంది. సాహిత్యానికి సమాజానికి అనినాభావ సంబంధం ఉంది. సమాజంలోంచి సాహిత్యం ఉద్భవిస్తుంది. సాహిత్యం సమాజం కోసమే సాహిత్యం రచనని అంచనా వెయ్యటానికి ఆనాటి సమాజ సి&థతిగతులు ఉపయోగపడతాయి. ఆ విధంగా చూసినట్లయితే సామాజిక స్తితిగతులు తెలుసుకోవడానికి సాహిత్యం ఎంతో ఉపయోగపడుతుంది. లిఖిత సాహిత్య చరిత్రను యుగాలుగా విభజించారు. 1875 నుంచి ఆధునిక యుగం ప్రారంభమైంది. ఆనాటి నుండి వెలువడిన సాహిత్యాన్ని ఆధునిక సాహిత్యం అంటున్నాం. ఆధునిక సాహిత్యాన్ని నవ్య సాహిత్యం, అభినవ సాహిత్యం అని కూడా అంటారు. కవి మనసులో ఎప్పుడో ఒకప్పుడు సంఘర్షణలకు గురి అవుతాడు. అట్టి సందర్భాలలో తిరుగుబాటు మనస్తత్వంతోఉండటం జరుగుతుంది. కొందరు తమకు తాము కొత్త పోకడలు పోతూ వాటికి మెరుగులు దిద్దుకుంటూ రోమాంటిక్ కవులుగా స్థిరపడతాడు. అయితే ప్రతిభావంతుడైన కవి ఆ భాణీ నుండి నెమ్మదిగా బయటపడి క్లాసికల్ కవిగా రూపొందవచ్చు. మరికొందరు సంప్రదాయ కవిగా ప్రారంభమై అంతటితోనే ఆగిపోతారు. ఒకసారి పరిశీలించి చూసినట్లయితే ప్రతి కవిలోను రెండు అంశాలు గోచరించవచ్చు. అయితే దేని ప్రభావం ఎక్కువగా ఉంటే ఆ కవిగా పిలువబడుతాడు. జాతశ్రీ జీవితాన్ని రచనలను పరిశీలించినట్లయితే ఆనాటి తెలంగాణ సాంఘిక వ్యవస్థలో ఉన్న స్థితిగతులను సమాజ సమగ్ర స్వరూపాన్ని ఫొటోగ్రఫీ తీసి పాఠకుల ముందు పెట్టారు. జాతశ్రీ జీవితం ఆయన రచించిన అన్ని ప్రక్రియలను వివరించడమే ఈ వ్యాస ముఖ్య ఉద్దేశ్యం.

ప్రపంచ సాహిత్యలో తెలుగు కథా సాహిత్యానికి ఒక విశిష్టమైన స్థానముంది. తెలుగు సాహిత్యం ప్రారంభమైనప్పటి నుండి అధ్యయన సౌలభ్యం కోసం సాహిత్య చరిత్రకారులు ప్రాచీన సాహిత్యం, ఆధునిక సాహిత్యం అని రెండు విభాలుగా వింగడించారు. అందులోనూ ఆధునిక సాహిత్యాన్ని ప్రక్రియల పరంగా కవిత్వ, నవల, కథా తదితర సాహిత్యాలుగా విభజించారు.

అయితే కథా సాహిత్యం ఆధునిక సాహిత్య ప్రక్రియ అయినప్పటికీ దీని దాఖలాలు ప్రాచీనకాలం నుండి మనకు కనిపిస్తున్నాయి. కథా సాహిత్యానికి కొన్ని లక్షణాలు ఉండాలనే నియమంతో ఆ నియమాలను అన్ని నింపుకున్నదే కథా సాహిత్యం అవుతుందని సాహిత్య చరిత్రకారులు నిర్ధారించారు. అలా నిర్ధారణలో తేలిన

మొదటి కథలుగా బండారు అచ్చమాంబ, కథను గురజాడ దిద్దుబాటు కథను తొలి తెలుగు కథలుగా చెప్పవచ్చు. తర్వాత సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతి, భావ, అభ్యుదయ, విప్లవ, దిగంబర, దళిత, స్త్రీవాద, మైనార్టీ, ప్రాంతీయ అంశాలకు సంబంధించి ఎన్నో కథలు వచ్చాయి. అందులో భాగంగానే కులవృత్తి జీవిత చిత్రణ గురించి చాలా కథలు వచ్చాయి. నేటికి వస్తున్నాయి. వాటిలో చెప్పుకోదగ్గ కథలు జాతశ్రీ కథలు.

జాతశ్రీ కథలకు అంత సహజత్వం, స్వీయత్వం. జాతశ్రీ కథల్లో ప్రతి కథ ఏదో ఒక సామాజికాంశాన్ని ప్రతి బింబించిన, మరెన్నో వైవిధ్యభరిత అంశాలు చోటు చేసుకున్నప్పటికీ ప్రధానంగా జాతశ్రీ కథల్లో వృత్తికులాల వారి, జీవన విధానం, వారి సమస్యలు ఆ కథలు చదివిన పాఠకులకు కళ్ళముందు ప్రత్యక్షమవుతాయి. మానవ జీవితంలో కులం, మతం, జాతి, వర్ణం, ప్రాంతం ఎంత ప్రభావాన్ని చూపుతాయో అంతే ప్రభావాన్ని వారి ఆచార సంప్రదాయాలు, కట్టుబాట్లు కూడా చూపుతాయని జాతశ్రీ కథల్లో స్పష్టంగా అర్థమవుతాయి.

జాతశ్రీ పూర్తి పేరు జంగం అగస్టన్ ఛార్లెస్. ఇతడు 1943 ఆగష్టు 4వ తేదీన నల్గొండ జిల్లా మఠంపల్లి మండలం, గొల్లపల్లి గ్రామంలో శామ్యూల్, నీలమ్మ దంపతులకు మొదటి సంతానంగా జన్మించిన బిడ్డ జాతశ్రీ.

సమాజం సాహిత్యం రెండు విడదీయరానివి. సాహిత్యం సమాజానికి ప్రతిబింబం వంటింది. సాహిత్యంలో వెలువడిన వివిధ ప్రక్రియలను పరిశీ లించినట్లయితే సమాజంలో మానవ జీవన పరిణామం, సంస్కృతి, సంప్రదాయాలు భాస మొదలైన విషయాలు వెల్లడి అవుతాయి. ఒక్కొక్క సమాజానికి ఒక్కొక్క సంస్కృతి ఉంటుంది. ప్రజల ఆచార వ్యవహారాలు, భాష, విద్య, కళలు మొదలైనవి సంస్కృతిలో భాగమే వీరి మధ్య భౌగోళిక, ఆర్థిక, రాజకీయ, మత విషయాలలో వైవిధ్య ముంటుంది. ఈ వైవిధ్యం సమాజంలోని ప్రజల మధ్య పరస్పర అవగాహనకు ప్రతిబంధకంగా నిలుస్తుంది. పై విషయాలన్నీ సాహిత్యంలో ప్రస్ఫుటమవుతాయి. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని జాతశ్రీ వృత్తి జీవన కథలను ఈ వ్యాసంలో వివరించడం జరిగింది.

బుచ్చిబాబు గారి కథలంటే ఎక్కువ ఇష్టం. ఆయన కథలు నన్ను బాగా ప్రేరేపించాయి. ఎందుకంటే ఆయన శిల్పంగానీ, రచనా శైలిగానీ నాకెక్కువ ఇష్టం. నాపై ఎవరి ప్రభావముందంటే రావిశాస్త్రి, బుచ్చిబాబు, చలంలది. మొత్తం తెలుగు కథా సాహిత్యంలో నాకు నచ్చిన కథ 'బంగారు మురుగు'. దీన్ని శ్రీ రమణ గారు రాశారు. ఈ కథ అంటే బాగా ఇష్టం. పాతతరం కథైతే బుచ్చిబాబు రాసిన నిరంతర త్రయం కూడా చాలా ఇష్టమే. అయితే మురుగు కథలో బామ్మ, మనువడికి మధ్యన ఉన్న అనుబంధం ఎట్లా ఉంటదో తెలుస్తుంది. నిరంతర త్రయంలో ప్రేమ కథ గురించి ఉంది. నా కథలపై బుచ్చిబాబు ప్రభావం ఉందని చెప్పుకున్నారు.

**నవలలు :**

**బలిపశువు :**

తెలంగాణ వలస కార్మికులపై వచ్చిన మొదటి నవల ఇది. ఈ నవలను 1982లో రచించారు. దొరల చేతుల్లో జీతగాళ్ళు ఎట్లా చాకిరి చేస్తారో వారి కష్టాలను, కడగండ్లను ఈ నవలలో ప్రస్తావించారు. జీతగాడి పెళ్ళాన్ని దొర దగ్గరకి పంపిస్తే బాకీ మాఫీ చేస్తాననే దొరల ఆధిపత్య భావ జాలాన్ని, వారి అహంకార భావాలను ఎలా కార్మికులపై రుద్ది దొరలు పెత్తనం చెలాయిస్తారో జాతశ్రీఎ ఈ నవలలో పేర్కొన్నారు. జీతగాడి భార్యకి దొర వల్ల కల్గిన సంతానం నక్సలైటుగా మారతాడనేదే ఈ నవల ఇతివృత్తం. ఈ నవలలో జీతగాడి భార్య గత్యంతరం లేక బతుకుదెరువు కోసం భిక్షగత్తెగా ఎలా మారుతుందనేదే విషయాన్ని రచయిత చెబుతూ, ఈ పాత్ర లాంటి స్త్రీలు, పురుషులు ఈ అమానవీయ సమాజంలో ఎంతోమంది ఉన్నారని చెప్పటమే రచయిత ఉద్దేశ్యం.

**వెదురు పొదలు :**

ఈ నవల గిరిజనుల జీవన విధానాలను ప్రతిబిం బించే నవల. ఇందులో రచయిత గిరిజనుల ఐక్య మత్యాన్ని చెబుతూ, వారి ఐకమత్యానికి వెదురు పొదలను

ప్రతీకలుగా తీసుకొని అవి ఎలా అయితే ఒకటిగా విడిపోవో గిరిజనులు కూడా అలా కలిసి మెలిసి ఉం డాలని ప్రబోధించాడు. ఈ నవలను తాను ఎల్లందు అనే ప్రాంతంలో పనిచేసినప్పుడు వారి నివాసం అడవి పక్కన గిరిజనులకు దగ్గరగా ఉండటం వలన అవి గమనించిన జాతశ్రీ స్వీయానుభవాలతో ఈ నవల పాత్రోచితంగా సృజించాడు.

**సింగరేణి మండుతోంది :**

గోదావరిఖని పరిసర ప్రాంతాల్లో సింగరేణి బొగ్గుగనిలో అకస్మాత్తుగా మంటలు రావటం అది చూసిన రచయిత ఈ కార్మికుల కష్టాలను ఇతివృత్తంగా తీసుకొని నవల రాశారు. ఈ నవలలో సింగరేణి కార్మికుల యొక్క సాధక బాధలను, వారి యూనియన్ల మోసాలను, సమ్మెల రూపంలో జరిగే రాజకీయ ఎత్తుగడలను, మధ్యలో అటు బడాబాబులకు ఇటూ లీడర్లకు బలవుతున్న సామాన్య కార్మికుల జీవితాల గురించి స్పందించి రాసిన నవలే ఈ సింగరేణి మండుతోంది. వాస్తవానికి ఇక్కడ మండుతుంది కార్మికుల కాలే కడుపులు ఇదే రచయిత చెప్పదలచుకన్న వాస్తవ చిత్రీకరణ దృశ్యాలు.

**కథలు :**

**కపోతం :**

ఇది మొట్టమొదటి కథా సంపుటి. దీనిలో 11 కథలున్నాయి. 'బీబీ' అనే కథలో విరుద్ధమైన శైలిని ప్రదర్శించాడు. రావిశాస్త్రి, చలం, బుచ్చిబాబు తదితర రచయితల శైలీలను ఈ కథలో ప్రవేశపెట్టాడు.

**ప్రభంజనం :**

జాతశ్రీ రాసిన ప్రచురించిన రెండవ కథల సంపుటి ఇది. దీనిలో 10 కథలున్నాయి. నెత్తురుకూడు, స్పృహ, పంచరైన బతుకులు, మైకం, ప్రభంజనం తదితర కథలున్నాయి. ఈ కథల్లో ప్రదానంగా ప్రజల కష్టాలు, కార్మిక జీవితాలున్నాయి. 'పంచరైన బతుకులు' కథలో పంచర్లేసే మనుషుల కష్టాల్నీ చిత్రీకరించాడు. 'నెత్తురుకూడు' కథలో కోయవారు తిండి కోసం ఎలా తిప్పలు పడతారో ప్రసవించారు. 'ప్రభంజనం' కథలో సింగరేణి కార్మికుల కష్టాలను చెప్పాడు.

**చలివేంద్రం :**

జాతశ్రీ రచించిన బలమైన కథల సంపుటి చలివేంద్రం. ఇందులో పదిహేను కథలున్నాయి. మొదటి కథ పేరే చలివేంద్రం. వృత్తిని నమ్ముకుని ఎంతగానో శ్రమించే ఒక కుమ్మరి కులానికి చెందిన ముసలాయనకు ఎదురయ్యే కష్టాల్ని ఈ కథలో చిత్రీకరించారు. అదేవిధంగా వృత్తిని నమ్ముకున్న వారి జీవితం ఎలా ఛిద్రం అవుతుందో, పోలీసులు అమాయక జనాల్ని ఎలా దౌర్జన్యం చేసి దోచుకుంటున్నారో ఈ కథలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ కథా సంపుటి జాతశ్రీకి గొప్ప పేరు తెచ్చిపెట్టింది. 'జిబ్రా' కథలో ఉపాధ్యాయులు పాఠం చెప్పకుండా విద్యార్థుల్ని ఎలా మోసగిస్తారో స్పష్టంగా చెప్పాడు. 'కొలమానం' కథలో ఆడపిల్లని ఎలా లోబర్చుకోవాలని మగవారు ప్రయత్నం చేస్తారో చిత్రీకరించాడు. ప్రస్తుతం జరుగుతున్న లైంగిక దాడుల్ని ముందే ఊహించి రాశాడేమోనని కొలమానం కథ చదివితే అర్ధమవుతుంది. 'నిప్పులనీడ' కథలో పేదరికంలో ఒక బిచ్చగాడు ఆకలి కోసం ఎలా అలమటిస్తాడో చూపించాడు. అదేవిధంగా 'రాజాయిజం' కథలో అమ్మనాన్నలేని బాలుడ్ని చదివించి గ్రూప్స్ ఆఫీసర్ చేస్తారు వారి బంధువులు. ఆఫీసరయ్యాక కృతజ్ఞాతాభావం లేని వారు ఎలా ఉంటారో ప్రస్తావించాడు.

**కుట్ర :**

ఇది కూడా కథా సంపుటి. 'కుట్ర' కథా సంపుటిలో 11 కథలున్నాయి. వృద్ధుల జీవితాలు ఎలా ఉండాలో 'ఒంటరి' కథలో రాశాడు. 'అమ్మ నీకు దండం'లో వడ్డెర జీవిత కష్టాల్నీ రాశాడు.

**ఆర్తారావం :**

జాతశ్రీ రాసిన 'ఆర్తారావం' అనే కథాసంపుటిలో 11 బలమైన కథలున్నాయి. ఈ పుస్తకానికి పాఠక ఆదరణ చాలానే ఉంది. దీన్ని 2009లో ప్రచురించాడు. 'అగ్నితుఫాను' కథలో బెస్తవారిపై యజమానులు దౌర్జన్యం కనబడుతుంది. గంటల తరబడి నీళ్ళలో చేపలు పడితే శ్రమను ఎలా దోచుకుంటారో ఈ కథలో బలంగా చిత్రీకరించారు. 'సాబ్ తీక్ నహీ హై'లో సెక్యూరిటీ గార్డు

వృత్తిని నమ్ముకుని నేపాల్ నుండి ఆంధ్రదేశానికి వచ్చి దొంగల చేతిలో హతమవ్వడం కనిపిస్తుంది. 'విధ్వంసం' కథలో దొమ్మరాటలు, 'చిరునామా'లో నేత పనివాళ్ళ జీవితాన్ని చిత్రీకరించాడు.

**పైరగాలి :**

'పైరగాలి' కథల సంపుటిలో మొత్తం 16 కథలున్నాయి. ఇందులో పేదవారి బాధలు, సాంఘిక సమస్యలు, వృత్తి జీవిత చిత్రణ, నిరుద్యోగ సమస్య, గంగిరెద్దు ఆటగాడు తదితర భిన్నమైన అంశాలు కనిపిస్తాయి. జాతశ్రీ రచలన్నింటిని పరిశీలించినట్లయితే నేడు సమాజంలో జరుగుతున్న శ్రమదోపిడి, పెత్తనం, యజమానును పోలీసుల దౌర్జన్యాలు వృత్తిని నమ్ముకున్న జీవితాలు, పడుపువృత్తి మొదలగు అంశాలు దర్శనమిస్తాయి. ఈయన రాసిన కథలను నా పరిశోధనలో భాగంగా తర్వాతి అధ్యాయాల్లో పరిచయం చేస్తూ విశ్లేషణ కొనసాగుతుంది.

**స్పందిస్తున్న హృదయం :**

రచయిత వ్యక్తిగతమైన జీవితం గురించి, ఆయన చవిచూసిన సంఘటనల గురించి దాదాపు 30 కవితల వరకు రాశాడు. ఈ కవితల్లో రచయిత వ్యక్తిగతంగా స్పందించినవే ఎక్కువగా ఉన్నాయి.

**నాటికలు :**

**మరో క్రిస్మస్ రావాలి :**

క్రైస్తవ మత ప్రజలను దృష్టిలో ఉంచుకుని వారు ఏవిధంగా రాజకీయ నాయకుల ఆగడాలకు బలవుతున్నారో తెలియజెప్తూ వారిని చైతన్యపరిచే దిశగా ఈ రచన కొనసాగింది.

**ప్రగతిపథంలో పాకుడురాళ్ళు :**

ఆంధ్రజ్యోతి దినపత్రిక నిర్వహించిన రంగా దీపికల నాటికల పోటీలో ఈ నాటికకు ఉత్తమ బహుమతి లభించింది. ఇది పూర్తిగా తెలంగాణ యాసలో రాయబడింది. రచయిత వచ్చిన జీవిత నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ తరాలకు విద్య యొక్క ప్రాముఖ్యతను తెలుపుతూ చదువే అన్నింటికి మూల కారణం, చదువును జయిస్తే ప్రపంచాన్ని జయించినవారు అవుతారని దళిత, పేద ప్రజల్ల నూతన ఉత్తేజాన్ని నింపే నాటిక ఇది.

**మరో దీపం వెలిగించు :**

దీపం తాను ఆరిపోతూ ఇతరులకు ఎలాగైతే వెలుగును ఇస్తుందో మనుషులు కూడా తను కష్టాల్లో ఉన్నప్పటికీ ఇతరులకు సాయం చేయాలనే గుణాన్ని అలవాటు చేసుకోవాలనే తత్వం ఇందులో ఉంది. ఈ నాటికను రైట్.రెవ. పి. సాల్మాన్ బిషప్ కి అంకితం ఇవ్వటం జరిగింది.

**నాయకులన్నారు జాగ్రత్త :**

ఈ నాటికను అంబేద్కర్ యువజన సంఘం వారు ప్రదర్శించారు. ఇందులో రాజీకయ నాయకుల బారి నుండి ప్రజలను చైతన్యపరచటం రచయిత ప్రధాన ఉద్దేశ్యం.

ఆధునిక సాహిత్యంలో వివిధ రచయితలు, కవులు సామాజిక జీవన చిత్రణను కళ్ళకు కట్టించారు. వీరిలో జాతశ్రీ తెలంగాణ సమాజంలో వచ్చిన ఆనాటి సాంఘిక వ్యవస్థ స్వరూప స్వభావాలను, పైన ఉదహరించిన ప్రక్రియలు అన్నింటిలోనూ వివరించారు.

**ఆధార గ్రంథాలు :**


1. కులవృత్తులు తెలంగాణ సాహిత్యం - నందిని సిధారెడ్డి, తెలంగాణ రచయితల వేదిక - 2008, హైదరాబాద్.
2. జాతశ్రీ ఆర్తారావం సృజనాలయ ప్రచురణలు, 2004, కొత్తగూడెం.
3. కథావలోకనం - కె.పి. అశోక్‌కుమార్, పాటపిట్ట బుక్స్, హైదరాబాద్, 2008.
4. తెలంగాణ తెలుగు కథ (సం) పంతంగి వెంకటేశ్వర్లు, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, 2011.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# గిరిజన నవలలో స్త్రీలు – సామాజిక జీవన చిత్రణ



- డా॥. సూరేపల్లి గోదావరి
అధ్యాపకురాలు, యాదాద్రి.

తెలుగు సాహిత్యంలో "సామాజిక దృక్పథం" అన్న మాట నేడు విస్తృతంగా ఉపయోగింపబడుతున్నది. రచయిత గానీ, కవిగానీ, తన అనుభవంలో ఉన్న సామాజిక స్పృహ నుండి విశ్లేషించడం శాస్త్రీయ దృష్టి అనిపించుకుంటుంది. సమాజంలో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎలా అధిరోహించాలన్న అవగాహనను కల్పించే ప్రయత్నాన్నే 'సామాజిక స్పృహ' అనవచ్చు. రచయిత తాను రాస్తున్న విషయాలలో సమాజంలో భిన్న వర్గాల మధ్య భిన్న ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అలాంటి అంశాలను జోడించి రాయటమే, చైతన్యానికి ప్రధాన భూమిక. అదే సామాజిక స్పృహ, ఒకే అంశాన్ని పలువురు పలు రకాల కోణాలలో చర్చించవచ్చు, విశ్లేషించ వచ్చు. ఏ అంశం అయితే ఎక్కువమంది మనసును ఆకట్టుకుంటుందో అదే మంచి రచన అవుతోంది. మంచి విశ్లేషణ అవుతుంది.

సాహిత్యంలో గిరిజన ప్రస్తావన చూసినట్లయితే అంతంత మాత్రమే. ప్రాచీన సాహిత్యం నుండి ఆధునిక సాహిత్యం వరకు గిరిజన సాహిత్యాన్ని పరికించి చూస్తే అక్కడక్కడ పాత్రల పరిచయాలే తప్ప సాహిత్యం ఎక్కువగా ఎక్కడా కనిపించదు. తెలుగు సాహిత్యంలో ఇలాంటి భావన కలిగినపుడు అసలు ఆధునిక గిరిజన తెలుగు సాహిత్యం పరిస్థితి ఏమిటి అనేది సందేహం వస్తుంది. ఇక తెలంగాణ గిరిజన సాహిత్యం అంటే కేవలం వామపక్ష భావజాలంతో వచ్చిన సాహిత్యం తప్ప మరే రచన అంతగా రాలేదని విమర్శ ఉంది. ఈ దృష్టితో పరిశీలించినప్పుడు ఆధునిక గిరిజన సాహిత్యంతో కవిత్వం, నవల, కథ, నాటకం మొదలైన విభిన్న ప్రక్రియల్లో గిరిజన సమస్యలు చిత్రీకరిస్తూ పలువురు రచయితలు వారి వాస్తవ జీవితాన్ని కళ్ళకు కట్టినట్లుగా వారి జీవితాలను ప్రతిఫలించే విధంగా తెలుగు సాహిత్యాన్ని మరింత పరిపుష్టి చేశారు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో నవల, కథ, కవిత్వం, నాటకం ప్రధాన ప్రక్రియలుగా వెలుగొందుతున్నాయి. ప్రాచీన సాహిత్యంతో కంటే ఆధునిక సాహిత్యంలోనే గిరిజన సాహిత్యం విరివిగా రాకపోయినా ఏదో పాత్రపరంగానో లేక సమస్య పరంగానో గిరిజన చిత్రణ కనిపిస్తుంది. పరిశీలన పరంగా చూసినప్పుడు వాటికి ఉండే విలువలు వాటికి ఉంటాయి. వివిధ మతాల్లో కులాల తెగల్లో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు లింగ వివక్షత, పేదరికం, శ్రమదోపిడీ వంటి సామాజిక సమస్యలు గిరిజనేతర వ్యక్తులు గిరిజనుల నివాస ప్రాంతంలో పని నిమిత్తం వచ్చి గిరిజన స్త్రీలతో సంబంధాలు ఏర్పరచుకోవడం వల్ల

ఎదురౌతున్న సమస్యలను స్త్రీల ప్రగతికి ప్రతిబంధ కాలౌతున్న తీరును వీటితోపాటు గిరిజన మహిళల నిరక్షరాస్యత, అమాయత్వం బయటపని, ఇంటిపని, పిల్లల్ని కని పెంచడం వంటి పనులు భారంతో సతమతాల్ని వివిధ సమస్యలనున ఈ వ్యాసంలో వివరించాను.

నవల సజీవముగా నవరస భరిత సంపన్నముగా మన ముందు సాక్షాత్కరింపవలెనన్న పాత్రచిత్రణ విషయంలో చిత్రకారుని వలె నవలా రచయిత మిక్కిలి శ్రద్ధ వహించి పని చేయవలసియుండును అని పుళ్ళబొట్ల వెంకటేశ్వర్లు అన్నారు. ఈ అభిప్రాయంతో గిరిజన నవల్లో స్త్రీ పాత్ర చిత్రణ పరిశీలిస్తూ పరిశోధన స్త్రీ పాత్రలకు మాత్రమే విశ్లేషణ చేయడం జరిగింది. వారు సామాజికంగా, ఆర్ధికంగా, సాంస్కృతికంగా ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేయడం జరుగుతుంది. మొట్టమొదటి నవలగా చెప్పవలసిన శ్రీరంగరాజచరిత్రలో గిరిజన జీవితం చోటుచేసుకోవడం హర్షించదగ్గ అంశం ఇప్పటి వరకు 13 నవలలు గిరిజన జీవితం ప్రధాన ఇతివృత్తంగా వచ్చాయి. గిరిజన స్త్రీ జీవితాలను చిత్రించిన రచనలు సామాజికంగా ఆర్ధికంగా, రాజకీయంగా మొదలైన అంశాలతో ముడిపడి ఉంటాయి. అందుకు ఈ కోణం లోనే చూడడం జరిగింది.

**గిరిజన పోరాట నవల :**

కొమురం భీం (సాహు మరియు అల్లం రాజయ్య - 1982), అతడు అడవిని జయించాడు (డా॥. కేశవరెడ్డి, 1982), అడవి (వసంతరావ్ దేశపాండే, 1988), సంఘం (చిన్నప్ప భారతి, 1988), సరిహద్దు (సాధన, 1991), ఊరు (వసంతరావ్ దేశ్‌పాండే, 1994), పునరావాసం (అట్టాడ అప్పల్నాయుడు, 1996), లంబడోళ్ల రాందాసు (కొర్రపాటి గంగాధరరావు, 1972), రాగో (సాధన, 1991), చివరి గుడిసె (డా॥. కేశవరెడ్డి, 1999), ఎల్లి (అరుణ, 2001), తాండా (జయశ్రీ మోహన్ రాజ్, ఎస్., మోహన్ రాజ్, 2004), అడవితల్లి (పులుగు శ్రీనివాస్, 1999) ఈ పదమూడు నవలలు గిరిజన నవలలుగా ప్రసిద్ధి పొందాయి.

'లంబడోళ్ళ రాందాసు' నవల రచయిత కొర్రపాటి గంగాధరరావు. ఈ నవలలో గిరిజనులు అంగీకృత సంస్కృతి, అనంగీకృతి సంస్కృతి ప్రధాన వస్తువుగా కనిపిస్తుంది.

సాహు, అల్లం రాజయ్య రాసిన 'కొమురం భీం' నవల వస్తువు చారిత్రక పోరాటానికి చెందినది. చరిత్రలో మానవుడు నిత్యావసరాల కోసం పోరాటం చేయడం జరిగింది. కొమురం భీం గిరిజనులకు భూమి కావాలని పోరాటం చేసి మరణించాడు. ఆ వస్తువును ఆధారంగా చేసుకుని ఈ నవల రాశారు.

అతడు అడవిని జయించాడు, చివరి గుడిసె నవలలను కేశవరెడ్డి రాశాడు. ఈ రెండు నవలలు వివిధ వైరుధ్యాలతో చిత్రించాడు రచయిత. 'అతడు అడవిని జయించాడు' నవల వస్తువు ఎరుకుల కులానికి చెందినది. 'చివరి గుడిసె' నవలలో యానాదుల గురించి రాశాడు. వసంతరావ్ దేశ్‌పాండే రాసిన 'అడవి', 'ఊరు' నవలలు ఇతివృత్తం గిరిజన జీవితాలకు చెందినది. 'సంఘం' నవల రచయిత చిన్నప్ప భారతి. ఈ నవల వస్తువు కొండ గిరిజనుల గురించి తీసుకోవడం జరిగింది. కొండ ప్రాంతంలో గిరిజనులు జీవితం ఎలా సాగుతుంది. వాళ్ళు ఆధారపడి జీవిస్తారనే అంశాన్ని వివరించడానికి ఈ నేపథ్యం తీసుకున్నాడు. 'సాధన' రాసిన నవలలు రెండు. అవి 'సరిహద్దు' 'రాగో' నవలల్లో విభిన్న అంశాలకు సంబంధించిన వస్తువులు కనిపిస్తాయి. సరిహద్దు నవలను రచయిత కోణం నుండి, రచయిత జీవితమే రచనగా వెలువడింది. సాధన (రచయిత) స్వయంగా అరణ్య జీవితాన్ని గడిపాడు. అరణ్య జీవితంలో ఎదురౌతున్న సమస్యలను ఆ క్రమంలో అడవుల్లో జీవించే గిరిజనుల జీవితాన్ని వస్తువుగా చేసుకున్నాడు. అలాగే 'రాగో' నవల గోండుల సాంస్కృతిక జీవితాన్ని చిత్రించింది.

అట్టాడ అప్పల్నాయుడు రాసిన 'పునరావసం' వలస జీవితాలతో బాధపడే గిరిజనులకు ఐ.టి.డి.ఏలు చేయూతనివ్వవలసింది పోయి, గిరిజనులు ఏవిధంగా మోసం చేస్తాయో, వాటి ఎత్తుగడలేంటో మొదలైన అనేక అంశాలను వస్తువుగా చేసుకుని చిత్రించాడు. పులుగు శ్రీనివాస్ 'అడవి తల్లి' ఈ నవల కొమురం భీం భార్య

సొంబాయి గురించి ఐ.టి.డి.ఏ పని తీరును గురించి వివరించిన నవల.

అరుణ రాసిన 'ఎల్లి' ఎరుకుల కులంలో ఉన్న మౌఢ్యాన్ని తెలుపుతుంది. 'నీలి', 'ఎల్లి' అను రెండు రచనలుగా రచయిత్రి రాయడం జరిగింది. కాని రెండిం టిని కలిపి 'ఎల్లి'గా ప్రచురించడం జరిగింది. ఈ నవల కొంత వరకు ఎరుకుల కులంలో ఉన్న బాల్య వివాహాల గురించి, సంస్కృతి గురించి స్థూలంగా వివరించింది. బాల్య వివాహాల వల్ల అమాయక స్త్రీ జీవితం ఏ విధంగా బలవుతుందో వివరించారు. 'తాండా' నవల రచయిత మల్లిఖార్జున్ హీరేమఠ్. కన్నడ నుండి తెలుగులోకి అనువాదమైన నవల. ఈ నవలలో లంబాడీల జీవితాన్ని వస్తువుగా తీసుకున్నాడు. లంబాడీల ఆచారాలను, వ్యవహారాలను స్థూలంగా చిత్రించారు.

సమకాలీన సమాజ స్వరూప నిరూపణకు ఆయా వ్యక్తులు ఎదుర్కొంటున్న సమస్యల్ని, అనుభవిస్తున్న కష్టసుఖాల్ని వ్యక్తీకరించటానికి, మానవ జీవిత వాస్తవ చిత్రణకి ఈ నవలా ప్రక్రియ తోడ్పడినంతగా మరే ఇతర ప్రక్రియ తోడ్పడలేదనటం అతిశయోక్తి కాదు.

చుక్కి అందమైన గిరిజన స్త్రీ. గిరిజన స్త్రీలు ఎంత అందగా వుంటారో చుక్కి పాత్ర ద్వారా తెలుస్తుంది. రాందాసు చేసే మంచి పనులకు ఆకర్షితురాలై పెండ్లి చేసుకుని కుమారునికి జన్మనిస్తుంది. భర్తను అందరు దేవుడని అంటే పొంగిపోయింది. కానీ, వాస్తవ విషయాన్ని గ్రహించడంలో చుక్కి పాత్ర విఫలమైంది. భర్త చేసే ఏ పని అయినా భార్యకి తప్పకుండా తెలుస్తాయి. కాని అటువంటి విషయాలు తెలిసినా కానీ, చుక్కి రాందాసును నివారించలేకపోయింది. తమ గిరిజన సమాజాన్ని అంటే తాండా వారందరని కాదని చెప్ప లేకపోయింది. అంతేకాకుండా లంబాడీ స్త్రీ వ్యవసాయ కూలీ పనులు ఎండలో ఎలా చేస్తుందో చుక్కి ద్వారా అంచనా వేయవచ్చు. గిరిజనేతరుడిని పెండ్లి చేసుకున్నా ఎంత ప్రేమగా చూసుకుందో కూడా అర్ధమవుతుంది. నేటికాలంలో కులాంతర వివాహాల వల్ల వచ్చే పరి ణామలు అనేకం. వాటిని ఈ పాత్ర ద్వారా కొన్ని చూపిం చాడు. కష్టంలో వచ్చే పరిణామాలను ఎలా జయించవచ్చో తెలుస్తుంది.

అడవి నవలలో మరో పాత్ర దేవుబాయి. గోండు స్త్రీలు ప్రాణం కంటే మానానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారని నిరూపించిన ఆదర్శ స్త్రీ మూర్తి దేవుబాయి. లైంగికంగా లొంగకుండా తమకు చెందిన అయిదువందల ఎకరాల భూమిని లెక్కచేయకుండా దేవుబాయి శీలాన్నిష్ట& కాపాడుకున్న తీరు సమాజంలో ఉండే స్త్రీలకు ఆదర్శ నీయమైనది. సాధారణంగా గిరిజన స్త్రీలు పోరాట పటిమను కలిగి ఉంటారు. అప్పుడప్పుడు బలవంతంగా అత్యాచారం చేయడానికి ప్రయత్నిస్తే ప్రాణాలే తీసు కుంటారన్నది పేపర్లో చూస్తూనే ఉన్నాం. దేవుబాయిలో సంప్రదాయ భావాలు, సంస్కరణ భావాలు మేళవించు కుని ఉన్నాయని తెలుస్తోంది.

ఎల్లి నవలలో ఎల్లి ప్రధాన పాత్ర. ఈ పాత్ర ద్వారా గిరిజనుల్లో జరుగుతున్న బాల్య వివాహాలు చూపించిన రచయిత్రి. అంతేకాకుండా ఓలి అనే ముసుగులో సొంత కూతుర్ని కూడా చూడకుండా ఎలా డబ్బు చేసుకుంటు న్నారో ఈ పాత్ర చెప్తోంది. వాస్తవానికి గిరిజనులు నిజ జీవితంలో ఓలి అనేది కీలకంగా తయారైంది. చాలామంది గిరిజన స్త్రీలు దీనికి భయపడి ఆత్మహత్యలు చేసు కుంటున్నారు. తరతరాలుగా వస్తున్న ఆచారం బాల్య వివాహాలు జరగడం గిరిజనుల్లో చాలా ఏళ్ళనుండి ఉంది. అయితే ఈ ఆధునిక కాలంలో కూడా అలాంటి పరిస్థితిని పాటిస్తున్నారు. ఒకప్పుడు ఉన్న పరిస్థితులకు ఇప్పుడున్న పరిస్థితులకు ఎంతో తేడా ఉంది. వాటిని గిరిజనులు గ్రహించడం లేదని రచయిత్రి ఎల్లి పాత్ర ద్వారా నిరూపించింది.

ఎల్లి నవలలో ఇంకో ముఖ్యమైన పాత్ర నీలి. నీలికి కూడా బాల్య వివాహం జరుగుతుంది. దురదృష్టం చేత భర్త చనిపోయి లైగింక అత్యాచారం నుండి బయట పుడుతంది. నీలి ఎల్లి పాత్రకు వ్యతిరేక దశలో నడుస్తోంది. నీలి, ఎల్లికి ఎటువంటి పోలికలు లేవు. కేవలం బాల్య వివాహాలు మాత్రమే జరితాయి కాని మిగిలిన అన్ని విషయాల్లో నీలిదే పైచేయి. నీలి కుల ఆచారాలను

వ్యతిరేకించి ఆధునిక సమాజపు భావాలనే తృణీకరించింది. ఓలికి వ్యతిరేకంగా పోరాటం చేసింది. నీలి పాత్ర చిత్రణలో రచయిత్రి ప్రత్యేక శ్రద్ధ చూపించింది. ఒక్కొక్కసారి నీలి పాత్ర రచయిత్రిదా అన్న భావన కలుగుతుంది.

బంతి సవర జాతికి చెందిన స్త్రీ. బంతి ఈ నవలలో ప్రధాన పాత్ర. గిరిజన రైతాంగ పోరాటంలో పోరాడి బంతి తల్లిదండ్రులు మరణిస్తారు. తాత నాయనమ్మల దగ్గరే పెద్దదవుతుంది. గిరిజనుల్లో చైతన్యం రావాలంటే ఆధునిక సమాజపు భావాలు రావాలంటే పట్టణ సంస్కృతి అల వాటు కావాలంటే చదువు తప్పనిసరి అంటున్న తరుణంలో చదువుకుంటే ఎటువంటి పరిస్థితి ఎదురవు తోందని ఈ పాత్ర చిత్రీకరించింది. చదువుకొని కష్టపడి ఉద్యోగం సంపాదిస్తే అధికారులు మోసం వల్ల ఉద్యోగం వదిలేసి ఇంటికి పరిమితం కావాల్సిన అవసరం ఏర్పడు తుందని బంతి ద్వారా నిరూపణ అయింది. గిరిజన నవలలో స్త్రీ పాత్ర చిత్రణ సమర్ధవంతంగానే చిత్రీకరిం చారు. అంతేకాకుండా రావాల్సిన చైతన్యాన్ని పోవలసిన అమాయకత్వాన్ని వివరించగలిగారు.

సృష్టి, స్థితి, లయ కారణమైన ప్రకృతి దట్టమైన అడవులతోనూ కొండలూ, కోనలతోనూ నిండి ఉంటుంది. వీటన్నింటితో మానవులకు సామాజిక సంబంధాలు ఉం టాయి. సామాజిక సంబంధాలనేవి కాలక్రమంలో వచ్చినవే. పూర్వకాలంలో సామాజిక సంబంధాలంటే కేవలం సంజ్ఞలే. ఆ తరువాత అనేక విధాలుగా పరిఢవిల్లింది. ప్రతి మనిషికి నిరంతరం తప్పు చేయడానికే అవకాశం ఎల్లవేళలా ఉ ంటుంది. కానీ, అధికంగా తప్పులను చేయలేడు. దానికి ప్రధాన కారణం ఒకే ఒక్కటి. అదే సామాజిక సంబంధం అనే చక్రం నిలిపేస్తుంది. అందుకే దాదాపు మనిషిని అదుపులో ఉంచే ఆయుధం లాంటిది సామాజిక సంబంధం.

**సాంఘీక పరిస్థితులు :**

'మార్క్స్' మానవుల అస్తిత్వాన్ని నిర్ణయించేది వాళ్ళ చైతన్యం కాదు సరికదా, వాళ్ళ సాంఘీక అస్తిత్వమే వాళ్ళ చైతన్యాన్ని నిర్ణయిస్తుందని అంటాడు. దేశమంతా బ్రిటీష్ ప్రభుత్వం రాజ్యమేలుతున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో మాత్రం నైజాం పరిపాలన సాగుతూ ఉండేది. వారి కాలాల్లో సాంఘీకంగా ఎదుర్కొన్న సమస్యలను గిరిజన నవలలు చిత్రించి చూపించాయి.

గిరిజన నవలల్లో కులం గురించిన చిత్రించిన విధానాన్ని, ఎదురైన సమస్యలను పరిశీలించినట్లయితే అనేక కోనాలు కనిపిస్తాయి. ఇక్కడ ఎరుకుల కులంలో పుట్టడమే పాపంగా పరిగణించబడింది. సుబ్బన్న చేసిన పాపం యేమీ లేకున్నా గాని చనిపోయాడు. పొలంలో పంది మేసినందుకు అగ్రకులస్థుడు చేసిన కార్యం భారతీయ సమాజాన్ని ఒక్కసారిగా ఆలోచింపచేసినట్లుగా చేసింది. వాస్తవానికి పొలం పక్కన పొలం తన కులస్థుడిదే ఉండాలనే భ్రమ ఈ సమాజంలో కనిపిస్తుంటుంది. పంది పొలంలో పడ్డందుకే చావే పరిష్కారంగా సుబ్బన్న జీవితం బలైపోయింది. కానీ, సమాజం ఆ దిశలో ఆలోచిస్తుందా, సాటి మనిషిపై ప్రేమ చూపించాల్సిందిపోయి, కర్కశంగా ప్రవర్తించడం కులదాహమే.

చివరి గుడిసె నవలల్లో యానాదోడు ఎలుకల్ని, యంటవల్ని కొట్టి బతక్కపోతే కలెక్టరు పనిచేస్తాడా? అంటే కుల అడ్డంగి అభివృద్ధికి ఆటంకంగా నిలుస్తుందనడానికి ఈ ఉదాహరణ చాలు. కలెక్టరు కేవలం అగ్రకులస్తులు మాత్రమే అవుతారా? కేవలం వాళ్ళకు మాత్రమే తెలివి తేటలుంటాయి అని అనుకోవడం పొరపాటు. అలా అనుకుంటే ఈ రోజు ఏ గ్రంథం లేకుండా ఒక్క నిముషం కూడా భారత వ్యవస్థ నడవని స్థితిని కల్పించిన డా॥. బాబాసాహెబ్ అంబేడ్కర్ ఏ కులం నుంచి వచ్చాడు. వాల్మీకి మహర్షి ఏ కులంవాడు? కాబట్టి తెలివితేటలు అనేవి కాలానుక్రమంలో సమకూరుతాయి అనే విషయాన్ని గ్రహించాలి. గిరిజన నవలల్లో కులపరమైన చిత్రణ రచయితలు ఎక్కువ చిత్రించలేదు. కేవలం కొన్ని నవలల్లో మాత్రమే అక్కడక్కడ చూపించారు.

ప్రతివాడు ఏదో ఒక రూపంలో కష్టపడాల్సి ఉం టుంది. కష్టపడడం మనిషి లక్షణం. శ్రమ మనిషిని బానిసత్వం ఉంచి విముక్తి చేస్తుంది. శ్రమకు తగిన ప్రతిఫలం రావటం లేదనేది ప్రాచీనకాలం నుండి ఆధునిక కాలం వరకు వస్తున్న సిద్ధాంతం. ఒక వ్యక్తి చేత పని చేయించుకొని తగిన శ్రమకు ప్రతిఫలం ఇవ్వక

పోతే దానిని శ్రమదోపిడీ అంటారు. మార్క్స్ టెక్నికల్ శ్రమ దోపిడీని వివరించాడు. గిరిజన నవలల్లో శ్రామిక విధానం అనేక విధాలుగా చెప్పబడింది. 'చివరి గుడిసె' నవలలో మణియం అనే వ్యక్తి ఊరికి దొర. తమ పొలాన్ని ఎలుకలు నాశనం చేస్తున్నాయనే ఉద్దేశంతో యానాది కులస్తుడైన మన్నుగాడికి ఆ పని చెప్తాడు. చెప్పిన తరువాత కూలీ విషయంలో ఇద్దరి మధ్య జరిగిన సంభాషణను గమనించి నట్లయితే, నాకు దెల్సు దొరా. ఐతే వాటి ఆటలు నా దగ్గర సాగవు. ఈ రాతిరంతా మేలుకున్నానంటే తెల్లారేసరికి ఇత్వానానికి గూడా ఎలుక మిగలదు. తెల్లారినాక నాకష్టం జూసినీకు తోచింది ఇయ్యి దొరా' అన్నాడు.

పై విధానాన్ని పరిశీలించినట్లయితే ప్రకృతి సంపద మీద కూడా ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నట్టుంది. జీవ జంతుజాలం పైన ఎవరికీ హక్కులేదు. ఇక్కడ యానాదుల శ్రమను దోచుకున్న తీరును చూస్తే కళ్లకు నీళ్ళు రాక మానదు. రాత్రంతా కష్టపడి ఎలుకల్ని పట్టితే మీకు తోచింది ఇవ్వండి దొరా? అంటే ఇచ్చేదేందిరా. పట్టిన ఎలుకలన్నీ నువ్వే తింటావు గదా. మళ్ళా ఇనాంలేంది రా? అన్నాడు. యిది ఎంత శ్రమ దోపిడి. చివరికి కొన్ని పైసలు ఒప్పుకున్న చేసిన పాపానికే ప్రాణాలే వదలాల్సిన అవసరం మన్నుగాడికి పట్టింది. గిరిజనులకు శ్రామికంగా ఎంత వేదనకు గురిచేస్తున్నారో తెలుస్తోంది.

**ఆధార గ్రంథాలు :**


1. తెలుగు నవల నూరు సంవత్సరాలు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరబాద్, 1973.
2. నాగభూషణ శర్మ మొసలి, తెలుగు నవలా వికాసం, సికింద్రాబాద్, 1971.
3. బి. రామాచార్యులు, తెలుగు కావ్యాల్లో గిరిజన సంస్కృతి, సాయి గ్రాఫిక్స్, హైదరాబాద్.
4. వి.ఎస్.వి.కె. శాస్త్రి 2005 (సంపా) ఆంధ్రప్రదేశ్ గిరిజన సంస్కృతి పరివర్తన, హైదరాబాద్.
5. విద్మహే, కాత్యాయనీ, తెలుగు నవలా కథానికా విమర్శన పరిణామం, చరిత్ర ప్రచురణలు.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# తిరుమల రామచంద్రుని బాల్యం - సాంఘిక పరిస్థితులు



- తోట రామకృష్ణ

పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం.

తెలుగు సాహిత్య చరిత్రలో తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్న రచయిత "శ్రీ తిరుమల రామచంద్రుడు" ఇతను స్వీయచరిత్ర అయిన "హంపి నుంచి హరప్పాదాక" లో తన బాల్య స్మృతులను ఆనాటి కాలంలో ఉన్న సాంఘిక ఆచారలను, సాంప్రదాయాలను, కట్టు బాట్లులను పేర్కొన్నాడు ముఖ్యంగా దేవదాసి/ బసవిలను ఆనాటి సమాజం దేవరదున్నపోతులాగే ఉమ్మడి ఆస్థిగా భావించే వారుని, క్రమంగా మోతుబరుల మనిషి అయిందని పేర్కొన్నాడు.

తిరుమల రామచంద్రుని బాల్యంలో బసవి (లేదా) దేవదాసి పద్ధతి ఉండేది. ఈ పద్ధతి మనదేశంలో వేల సంవత్సరాల నుండి ఉంది. ఈ సంసార బంధంలో చిక్కు పడక తనను భగవంతుని సేవకు జీవితం అంతా అంకితం చేయడం దీని ఉద్దేశంపూర్వం మగవారు ఇలాంటి సేవ చేసేవారు వారిని ఏకాంగి, ఏకాంగి వీరుడు అనే వారు. దైవ సేవకోసమే కాదు, రాజసేవ కోసం, తన లక్ష్య సిద్ధి కోసం ఇలా అంకితమయ్యే వారు. అలాగే మహిళలు, అంకితమయ్యే వారు. దీనికి గొప్ప ఉదాహరణ గోదాదేవి. ఈ పాత సంప్రదాయం శైవ వైష్ణవ మతాలలోనే పాకిది. వీరశైవ మత ప్రవర్తకుడు. బసవేశ్వరుడు. అతడు పరమేశ్వరుని వాహనమైన వృషభ శబ్దం ప్రాకృతంలో బసవ అయి కన్నడంలో చేరింది. బసవనిలాగే పరమేశ్వరునికి కింకరుడై జీవితాన్ని తదారాధనకు వినియోగించేవాడు బసవుడు. ఆ విధంగా వివాహాది సంసార జంజాటం మాని పరమశివ కైంకర్యానికి జీవితాన్ని అంకితం చేసిన మహిళా బసవి - బసివి. పిల్లలు కలగని వారు తమకు పిల్లలు పుడితే ఒక సంతానాన్ని బసివిగా భగవత్కైంకర్యానికి దులుతామని, జబ్బు పడిన బిడ్డపడే తీరను బాధను చూచి ఓర్చుకోలేని తల్లిదండ్రులు జబ్బు కుదిరితే నీ సేవకే బసివిగా వదులుతామని మొక్కుకోవడం కూడా కొన్ని కులాలలో చిన్నతనంలో వుండేది. ఆ విధంగా మహత్తర ఉద్దేశంతో ఆరంభమైనది దేవదాసీ - బసవి - బసివి పద్ధతి.

కాని... సంఘంలో స్వార్థపరులు ఊరికే ఉండరు. మంచిని పాడుచేస్తారు. ఆవిధంగానే దేవదాసి - బసివి పద్ధతి పాడయిపోయింది. బసవి-బసివి-దేవునికి చెందిన బసివి దేవరదున్న పోతులాగే ఉమ్మడి ఆస్తి అయింది. క్రమంగా వ్యభిచారంతో జీవించే వ్యక్తి అయింది.

తిరుమల రామచంద్రుని తాతగారు, నాన్నగారు, తక్కిన వారు జాతీయవాదులూ, సర్వ సమత్వ వాదులూ, అయినా, ఆచార వ్యవహారాలలో చాల కరుకుగానే ఉండేవారు. ఉల్లి, వెల్లుల్లి, మునగ, ముల్లంగి మొదలైన

కూరగాయలు తామసాహారాలని నిషిద్ధం. ఆకు కూరలతో గోంగూర (పుంటికూర) పూర్తిగా నిషిద్ధం. తిరుమల రామచంద్రుని నివసిస్తున్న ప్రాంతం లింగాయతుల ప్రాంతం. లింగాయతుల శాఖాహారులు. నీరుల్లిని విరివిగా వాడుతారు. వారి చిన్నతనంలో కాఫీ తాగడమూ అనాచారమే. ఒకవేళ నిషిద్ధమైన ఆహారం తింటే భ్రష్టుడుగా చూచేవారు కుటుంబసభ్యులు.

ఆనే గొంది సంస్థానానికి ప్రధాన పట్టణమైన కమలా పురంకన్నా చిన్నది. అనేగొందిలో శ్రీవైష్ణవుల ఇళ్ళు మాత్రమే పదిహేను దాక ఉండేవి. హవ్యకవ్యాలు ఏమి జరిగినా ఈ పదిహేను ఇళ్ళవాళ్ళు పాల్గనవలసిందే. శ్రీ వైష్ణవులందరూ పడగల సంప్రదాయం వారే గనుక కంచికి వెళ్లి తీర్థ పరిగ్రహంతో వేదాంత దేశికుల విగ్రహం తెచ్చి స్థాపించి కోవెల నిర్మించారు. అక్కడ తిరునక్షత్రాలు, శాత్తుమొరలు జరిగేవి. గోకులాష్టమి, కృష్ణజయింతి పండుగలు వస్తే గుంజాలడ్డు, సుర్మాలడ్డు, బూందీ లడ్డు, రవ్వలడ్డు, లడ్డూనే డజను రకాలు వుండేవి. కృష్ణునికి ఇష్టమని పాలతో పెరుగుతో చేసే పదార్థాలు ఎన్నో. ఇక గోధుమ, శెనగ పిండ్లతో, బియ్యప్పిండితో చేసేవి చక్కిడాలు, చేగొడియాలు, (కోల్‌బడ అని దీనిపేరు) ముచ్చోర, ఫేణీ రకరకాల పదార్థాలు, పెరుగటుకులు, బెల్లమటుకులు, పాలటుకులు, మీగడటుకులు, వేయించిన అటుకుల ఉండలు, అటుకులుదంచి పాకం పట్టిన ఉండలు. పాలకోవా, మీగడ తరగలు, బర్ఫీ, పాలు, విరిచి జున్ను ఇత్యాదిగా, గోకులాష్టమి నాడు ప్రతి ఇంటికీ వెళ్ళి కృష్ణ ప్రసాదం స్వీకరించాలి. అలా పోనివాడు శత్రువు. శత్రువు కూడా ఆనాడు పగను మరుస్తాడు కృష్ణసన్నిధిలో.

గోకులాష్టమి నాడు రంగనాధాలయంలో పెద్ద సంబరం రంగనాధుని ఉత్సవ బేరానికి (మూర్తి లేదా విగ్రహానికి) కృష్ణవేషం వేసేవారు. నాల్గు తిరువీధులలోను ఊరేగింపు తర్వాత యథాస్థానంలో వేంచేపు చేసిన మీద ఉట్లు కొట్టడం పెద్ద సంబరంతో ప్రారంభమయ్యేది. దాదాపు 30 అడుగుల ఎత్తు, ఎనిమిదడుగుల నిలువు గల కఱ్ఱ స్తంభానికి నెల ముందు నుంచే తుమ్మబంక, వేపబంక తక్కిన జిగుర్లూ దట్టంగా పూసి ఎండబెడతారు. ఆలేపనం దాదాపు రెండు మూడంగుళాల మందం, మఱ్ఱిపాలు, తక్కిన చెల్లుపాలు కూడా పూస్తారు. దానిని దేవాలయంముందున్న విశాలమైన మైదానంలో పాడుతారు. దానిమీద వృత్తాకారంలో ముఖమవ్ బట్టతో గుమ్మటం కట్టి అలంకరిస్తారు. గానిలో ఇద్దరు కూచుని మూడు నాలుగు గంగాళాల నీళ్ళు, పాలు, పెరుగు, రంగు నీళ్లు, పానకం పెట్టుకొనే ఏర్పాటు ఉంటుంది. గుమ్మటం అంచులకు రకరకాల పిండివంటలు, ఒక మూటలో ఐదు వెండి రూపాయలు కడతారు. గుమ్మటాన్ని తిప్పుతారు. కింద నుంచి స్తంభం ఎక్కి తిరుగుతున్న గుమ్మటానికి కట్టిన రూపాయల మూటను పట్టుకోవాలి. స్తంభం ఎక్కే వాళ్ళపై గుమ్మటంపై నుండి పాలు, పెరుగు, నీళ్ళు పోస్తారు. ఎక్కేవాళ్ల పైనుంచి పడేవాటిని లెక్క చేయకుండా ఎక్కాలి. స్తంబానికి బంకపూయడం వల్ల జారి జారి పడుతుంటారు. ఎంతో కష్టపడి ఒకళ్ళపై ఒకరు ఎక్కి గంటల తరబడి ప్రయత్నించి చివరకు ఒకడు రూపాయల మూట చేజిక్కించుకుంటాడు. పెద్ద కోలాహలం.

అనే గొంది సమీపంలోని గంగావతి తాలూకా కనిగిరి (కనకగిరి) రకరకాల బమ్మలు తెచ్చేవారు. నవరాత్రంలో పది దినాలూ వాటికి దశావతారాల వేషాలు వేసేవారు. దశమినాడు ఊరంతా తిరిగి జమ్మి ఇచ్చి పెద్దలకు నమస్కరించేవారు.

"శ్రమ శమయతే పాపం
శమీ శత్రు వినాశనీ
అర్జునస్య ధనుర్థారీ
రామస్య ప్రియదర్శినీ" అనే శ్లోకం చెప్పి ఇతర వర్ణాలవారు బ్రాహ్మణులకు దక్షిణ ఇచ్చేవారు.

తిరుమల రామచంద్రుడు తన బాల్యంలో అనే గొందిలో ఉన్నప్పుడు అనే గొంది రాజకుమారులు అయిన శ్రీ కృష్ణ దేవరాయలు, శ్రీరంగ దేవరాయలు వారికి మిత్రులు, వాళ్ళతో ఒకటి రెండు మార్లు తిరుమల రామచంద్రుడు వేటకు వెళ్ళారు. ఆనాటి కాలంలో రాజుల కుమారుల ప్రధాన వినోదం వేట. చిరుతపులులను ఎలుగ్గొడ్లను పట్టుకోవడం, అడవి పందులను చంపడం,

మహాసాహసోపేతంగా ఉండేవి. వేటాడిన జంతువులను కర్రలతో చిన్న పిరమిడ్‌వలె గౌడరీతి దేవాలయం శిఖరాలలా, లంబాడీ ఆడవాళ్ళు అమ్మే కట్టెల మోపు లాంటి బోనున వేటాడిన జంతువులను కట్టేవారు. దాని ఒకవైపు - ఎడమ కొన అందాం - సన్న గాను కుడికొన వెడల్పు గాను ఉంటుంది. ఇది దాదాపు పది పదిహేను అడుగుల పొడవు ఉంటుంది. దీనిలో రెండు అరలు. ఎడమ వైపు కొనలో చివరి నుండి రెండు మూడు గడీలకు ఈవలగా ఒక అర దీనిలో మేకను కట్టి పెట్టేవారు. తక్కిన పెద్ద అరముఖాన్ని సగం మూసేవారు. దాని వెడల్పు (వ్యాసం) మూడడులుంటుంది. చిరుతపులి లోపలికి వచ్చి మేకను లాగగానే అది ప్రవేశించిన బను ద్వారానికి కర్రలు అడ్డంగా పడుతాయి. చిరుత గింజుకుంటుంది. కదలడానికి ఇక ఉండదు. తర్వాత రాచనగరు ఎదుట ఉన్న కూడలిలో పెద్ద స్తంభం నాటి, దండోరా వేసేవారు. “చిరుతపులిన ఆడిస్తాము. చూడరండహో!” అని జనం తండోపతండాలుగా వచ్చేవారు బోనును మోసుకొని వచ్చి చిరుత కాలికి కట్టిన నూలు పగ్గం మరొక కొనను నాటిన స్తంభానికి కట్టి, దూరం నుంచి తలుపునకు అడ్డంగా ఉన్న కర్రలను తొలగించేవారు. చిరుతపులి బాధతో బయటకి వచ్చి తప్పించుకుపోదామనుకుంటుంది. కుంటుతూ నడుస్తుంది. ఒక్క సారిగా చుట్టూ మూగిన జనంపై దూకి పగ్గంతో కింద పడుతుది. పగ్గం పొడవు సుమారు 20 గజాలు. ఇలా కంబం చుట్టూ తిరుగుతుంది. అది బాధతో అరిచినప్పుడల్లా జనం చప్పట్లు; హర్షనాదాలు. పులి మరింత రెచ్చిపోతుంది. అప్పుడు నాగులువైపుల నుంచి నలుగురు బల్లేలతో దన్ని పొడవడానికి వస్తారు. చిరుత గింజుకుంటుంది. వాళ్లపైన పడటానికి దూకుతుంది. పగ్గం మూలంగా కింద పడుతుంది. ఇకచాలు అని దొరగారో ఆయన ప్రతినిధో ఆజ్ఞాపిస్తారు. నలుగురూ బల్లేలు విసురుతారు. చిరుతపులి రక్త రపవాహంతో కూలిపోతుంది.

తిరుమల రామచంద్రుని బాల్యంలో సామూహిక పండుగలు ఎక్కువ జరిగేవి. ముఖ్యంగా నాగులచవితి పండుగ జనులందరు కలసి చేసుకునే వారు. నాగుల చవితినాడు కొబ్బరి గిన్నెల పైన రకరకాల చిత్రాలు చాకుతో చెక్కి, అడుగున సరిగ్గా మద్యన రంధ్రం చేసి దారాలు రెండు కట్టి పురి తిప్పుతారు. ఆపురి తిప్పినప్పుడూ విడిపోయినప్పుడూ కలిగే ఒత్తిడికి కొబ్బరి గిన్నె వేగంగా తిరుగుతుంది. దానిని ఇంకొకరు ఇలాగే తిప్పే కొబ్బరి గిన్నెలకు తగిలించడం, చిక్కుపడదీయడం ఒక ఆట. పిల్లలకు ఉదయం పాము పుట్టలో పాలు పోయడం, పత్తితో వస్త్రాలు చేసి, దూపదీపాలతో పుట్టకు పూజ చేయడం. ఆవిరి కుటుములు మొదలయినవి నైవేద్యం ఆరగించడం తర్వాత సాయంత్రం ఊరిబయటికి వెళ్లి చెట్ల కొమ్మలకు ఉయ్యాలలు కడతారు. ఉయ్యాలనాడు ఆడా మగా బేధం ఉండదు. ఎవరైనా ఎవరినైనా ఊపవచ్చు పాత స్నేహితులతో స్వేచ్ఛగా ఊగుతారు. కొత్త స్నేహాలు కూడా ఉంటాయి. కొంటె కోరింగులు ఉయ్యాలలను గట్టిగా ఊపడం. ఊగుతున్న వారు భయపడటం, ఇష్టమున్న వారు కావాలనే మీద పడటం వంటి వినోదాలు ఎన్నో జరుగుతాయి.

ఇంతవరకు ‘తిరుమల రామచంద్రుని బాల్యం - సాంఘిక పరిస్థితులు’లో భాగంగా ఆనాటి కాలంలో ఉన్న సాంఘిక ఆచారాలు, సాంప్రదాయాలును మరియు సాంఘిక దురాచారాలు అయిన బసవి పద్ధతిని, జంతువులను వేటాడి బంధించడం వంటి విషయాలను తెలుపుటకు ప్రయత్నించితిని.


**ఆధార గ్రంథాలు :**

1) హంపీ నుంచి హరప్పాదాక - శ్రీ తిరుమల రామచంద్ర

2) అజోవిభాకందాళం (యు.ఎస్.ఏ) ప్రచురణలు


★★★

Vol. 23 | Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# ఉత్తరాంధ్ర తెలుగు కథా సాహిత్యంలో భూషణం స్థానం



- వంతిన బాలజీ
పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ,
ఆంధ్ర విశ్వవిద్యాలయం,
విశాఖపట్టణం.

- ఆచార్య జర్రి అప్పారావు
తెలుగు శాఖ,
ఆంధ్రవిశ్వకళాపరిషత్,
విశాఖపట్టణం.



## ప్రవేశిక

ఉత్తరాంధ్ర తెలుగు కథా సాహిత్యాన్ని ఒక ప్రాంతీయ సాహిత్య రూపంగా మాత్రమే కాకుండా, ఒక సామాజిక, సాంస్కృతిక ప్రక్రియగాలిలి విశ్లేషించడం. కథకుల వ్యక్తిగత అనుభవాలు, వారి సిద్ధాంత ద ృక్పథాలు, సామాజిక బాధ్యత, భాషా ప్రయోగాలు కథా సాహిత్య వికాసంపై ఎలా ప్రభావం చూపాయో ఈ అధ్యాయం పరిశీలిస్తుంది. ఇందులో గిడుగు రామమూర్తి పంతులు మొదలుకొని సమకాలీన కథకుల వరకు ఉత్తరాంధ్ర కథా పరిణామాన్ని లిలిక్రమానుగతంగాలిలి విశ్లేషించడం జరిగింది.

## ఉత్తరాంధ్ర ప్రాంతం – సామాజిక, సాంస్కృతిక నేపథ్యం

ఉత్తరాంధ్ర ప్రాంతం భౌగోళికంగా అటవీ ప్రాంతాలు, తూర్పు కనుమలు, సముద్ర తీరాన్ని కలిగి ఉండటం వల్ల, ఇక్కడి ప్రజల జీవన విధానం ప్రత్యేక స్వరూపాన్ని సంతరించుకుంది. గిరిజన తెగలు, రైతు సమాజం, మత్స్యకారులు, చిన్న పట్టణాల మధ్యతరగతిఈ విభిన్న సామాజిక వర్గాలు కథలకు విస్త ృత ఇతివ ృత్తాలను అందించాయి. బ్రిటిష్ పాలన, జమీందారీ వ్యవస్థ, స్వాతంత్ర్య ఉద్యమ ప్రభావం, తరువాతి కాలంలో సామ్య వాద ఉద్యమాలుఇవన్నీ ఉత్తరాంధ్ర కథా సాహిత్యాన్ని లోతుగా ప్రభావితం చేశాయి. భూషణం కథలలో గిరిజనులు సహజ జీవన విలువల ప్రతినిధులుగా నిలుస్తారు.

**ముఖ్యపదాలు :**
ప్రాంతీయ సాహిత్యం,సామాజిక వాస్తవికత, మాండలిక భాష, గిరిజన జీవితం, వర్గ చైతన్యం, సామాజిక సంస్కరణ, స్త్రీ అస్తిత్వం, కథా శిల్పం.

## ఉత్తరాంధ్ర కథా సాహిత్య వికాస దశలు

ఆరంభ దశలో కథ ప్రధానంగా సామాజిక సంస్కరణ, భాషా మార్పు, జాతీయ చైతన్యాన్ని ప్రతిబింబించింది. మధ్య దశలో వర్గ పోరాటాలు, గ్రామీణ దోపిడీ, వ్యక్తి, సమాజ సంఘర్షణ ప్రధాన అంశాలుగా మారాయి. ఆధునిక దశలో గ్లోబలైజేషన్, పట్టణీకరణ, వలస జీవితం, స్త్రీ స్వరం, అస్తిత్వ సమస్యలు కథల కేంద్రంగా నిలిచాయి. గిడుగు రామమూర్తి పంతులు - కథా భాషా విప్లవకారుడు. ఈయన ప్రత్యక్షంగా కథలు రాయకపోయినా, ఆధునిక తెలుగు కథకు అత్యంత అవసరమైన భాషా విప్లవానికి నాయకత్వం వహించారు. “వ్యవహారిక భాషే సాహిత్య భాష” అన్న ఆయన సిద్ధాంతం ఉత్తరాంధ్ర కథా రచయిత లకు ఒక ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. గిడుగు ఉద్యమానికి ముందు కథా రచన ఎక్కువగా గ్రంథభాషలో సాగింది. ఇది సామాన్య ప్రజల జీవితానికి దూరంగా ఉండేది.

గిడుగు సిద్ధాంతం వల్ల కథ ప్రజల మాటలతో, ప్రజల జీవితంతో అనుసంధానమైంది. ఉత్తరాంధ్ర మాండలికం కథలో ప్రవేశించడానికి ఇది బలమైన పునాది అయింది. గురజాడ అప్పారావు ఆధునిక కథా చైతన్యానికి పునాది. ఉత్తరాంధ్ర కథా సాహిత్యంలో ఒక మైలురాయిగా నిలిచాయి. ఆయన కథల్లో మధ్యతరగతి కుటుంబాలు, స్త్రీ స్థితి, మూఢనమ్మకాలు, ఆర్థిక అసమానతలు ప్రధానంగా కనిపిస్తాయి. గురజాడ కథలు ఉపదేశాత్మ కంగా కాకుండా, సంఘటనల ద్వారా సందేశాన్ని అందిస్తాయి. పాత్రల మానసిక వికాసం, వారి ఆలోచనా ప్రపంచం కథకు ప్రాధాన్యం ఇస్తుంది. ఈ శైలి తరువాతి ఉత్తరాంధ్ర కథకులకు ఆదర్శంగా నిలిచింది. భూషణం కథలలో గిరిజనులు సహజ జీవన విలువల ప్రతినిధు లుగా నిలుస్తారు.

ఆధునిక నాగరికత వారి జీవితాన్ని ఎలా విచ్ఛిన్నం చేసిందో ఆయన కథలు స్పష్టంగా చూపిస్తాయి. ఈ కథలు ప్రాంతీయ సాహిత్యాన్ని సామాజిక చరిత్రగా మలిచాయి. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి కథల్లో వ్యక్తి అంతర్ముఖ సంఘర్షణ ప్రధాన ఇతివృత్తం. ఉత్తరాంధ్ర కథను బాహ్య సంఘటనల నుంచి "మనసు అంతర్లీన ప్రపంచం వైపు" మళ్లించిన రచయితగా ఆయన ప్రత్యేక స్థానం సంపాదిం చారు. ఈ కథలు వ్యక్తిగత అనుభవాలను విశ్వాను భవాలుగా మార్చడంలో సఫలమయ్యాయి. ఉత్తరాంధ్ర కథా సాహిత్యంలో మానసిక విశ్లేషణకు ఇది దారితీసింది. రావి శాస్త్రి - సామాజిక విప్లవ కథకుడు. ఈయన మార్క్సిస్టు సిద్ధాంతంతో ప్రభావితమై, వర్గ పోరాటాన్ని కథా ఇతివృత్తంగా మలిచాయి. ఉత్తరాంధ్ర గ్రామీణ ప్రాంతాల్లోని పేదల జీవితం, భూస్వామ్య దోపిడీ, రాజ కీయ చైతన్యం ఆయన కథల్లో ప్రధానంగా కనిపిస్తాయి. కథను ఒక కళా రూపం కన్నా, ఒక సామాజిక ఆయుధంగా వినియోగించిన రచయితగా రావి శాస్త్రిని పేర్కొనవచ్చు. కాళీపట్నం రామారావు నైతికత, మానవ సంబంధాలు, గ్రామీణ జీవనంలో చోటు చేసుకునే సూక్ష్మ మార్పులను చిత్రిస్తాయి. నైతిక విలువలు, మానవ సంబంధాల పతనం, వ్యక్తిగత బాధ్యత ఆయన కథల కేంద్రంగా ఉంటాయి. మితభాష, సున్నితమైన శిల్పం ఆయన కథల ప్రత్యేకత. ఉత్తరాంధ్ర కథా సాహిత్యంలో సౌమ్య వాస్తవికతకు ఆయన ప్రతినిధి.

### సమకాలీన ఉత్తరాంధ్ర కథా ధోరణులు

సమకాలీన కథకులు ఉత్తరాంధ్ర కథను కొత్త సమస్యల వైపు తీసుకువెళ్తున్నారు. వలస జీవితం, నిరుద్యోగం, స్త్రీ అస్తిత్వం, పర్యావరణ సమస్యలు ఈ కథలు ప్రాంతీయ అనుభవాన్ని ప్రపంచ అనుభవంతో అనుసంధానిస్తున్నాయి.

అ. శిల్పం, భాష, కథన విధానం: ఉత్తరాంధ్ర కథలలో మాండలిక భాష, వాస్తవిక శిల్పం, అంతర్ముఖ కథనం, సామాజిక విమర్శ సమన్వయంగా కని పిస్తాయి.

### ఉత్తరాంధ్ర కథా సాహిత్య ప్రాముఖ్యత :

ఉత్తరాంధ్ర కథా సాహిత్యం తెలుగు కథను ప్రజల జీవితానికి దగ్గర చేసింది. ఇది ప్రాంతీయ సాహిత్యాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లిన శక్తిగా నిలిచింది. కథకుల వారీగా విశ్లేషించినప్పుడు, ఉత్తరాంధ్ర తెలుగు కథా సాహిత్యం ఒక లిలిప్రాంతపు జీవన చరిత్రలిలిగా, సామా జిక మార్పుల దర్పణంగా నిలుస్తుంది. ఈ సాహిత్యం తెలుగు కథా పరిణామంలో అనివార్యమైన అధ్యాయంగా భావించవచ్చు.

### గురజాడ అప్పారావు కథల్లో (1862-1915)

ఆధునిక తెలుగు కథా సాహిత్యానికి పితామహుడిగా గుర్తించబడతారు. ఆయన కథలు సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాలు, స్త్రీల దుస్థితి, మధ్యతరగతి జీవన సమస్యలు, నైతిక పతనాన్ని విమర్శాత్మకంగా ప్రతిబింబి స్తాయి. కథను కేవలం వినోద సాధనంగా కాకుండా, సామాజిక చైతన్య సాధనంగా మలిచిన రచయితగా గురజాడకు విశేష స్థానం ఉంది. గురజాడ కథల ప్రధాన లక్షణాల్లో ..

అ. సంఘ సంస్కరణ దృష్టి, గురజాడ కథలు సామాజిక మార్పును లక్ష్యంగా చేసుకున్నవి. బాల్య వివాహం, కుల వివక్ష, అంధ విశ్వాసాలు వంటి సమస్యలను

ఆయన కథల్లో స్పష్టంగా ప్రస్తావించారు. కథ ద్వారా పాఠకుడిని ఆలోచింపజేయడం ఆయన లక్ష్యం.

ఆ. వాస్తవిక పాత్ర చిత్రణ : గురజాడ కథల్లో పాత్రలు జీవన వాస్తవాలకు దగ్గరగా ఉంటాయి. ఆదర్శ పాత్రల కన్నా, లోపాలు ఉన్న మనుషులే ఆయన కథల్లో కనిపిస్తారు. దీనివల్ల కథకు సహజత్వం, విశ్వసనీయత ఏర్పడింది.

ఇ. వాడుక భాష వినియోగం: గిడుగు ప్రభావంతో గురజాడ కథల్లో వ్యవహారిక భాష వినియోగం కనిపిస్తుంది. ఇది కథను సామాన్య పాఠకుడికి చేరువ చేసింది.

**ముఖ్య కథలు – సంక్షిప్త విశ్లేషణ :**

**దిద్దుబాటు** : ఈ కథలో సామాజిక దురాచారాలపై విమర్శ ఉంది. కథానాయకుడి ఆలోచనా పరిణామం ద్వారా సమాజ మార్పు అవసరాన్ని గురజాడ సూచిస్తారు.

**సంధ్యారాగం** : మధ్యతరగతి మనోవ్యవహారాలను ఈ కథ ప్రతిబింబిస్తుంది. ఆశలు, నిరాశల మధ్య ఉన్న మనిషి సంఘర్షణ ప్రధాన ఇతివృత్తం.

**సరళ** : స్త్రీ అస్తిత్వం, స్వతంత్ర ఆలోచనల ప్రాముఖ్యతను ఈ కథ ద్వారా గురజాడ వ్యక్తపరిచారు.

**కథా శిల్పం - కథన విధానం** : గురజాడ కథలు సాధారణంగా సరళమైన శిల్పంతో సాగుతాయి. సంఘటనలకన్నా భావాలకే ప్రాధాన్యం ఇవ్వడం, అంతర్ముఖ వర్ణనలను ఉపయోగించడం ఆయన ప్రత్యేకత. కథకు ముగింపు ఉపదేశాత్మకంగా కాకుండా, ఆలోచనాత్మకంగా ఉంటుంది.

**గురజాడ కథల ప్రాముఖ్యత :**

ఆధునిక తెలుగు కథకు పునాది, సామాజిక సంస్కరణ భావజాలం, వాడుక భాష ప్రవేశం, పాత్రల మానసిక విశ్లేషణ. మొత్తంగా, గురజాడ అప్పారావు కథలు తెలుగు కథా సాహిత్యంలో ఒక మైలురాయి. ఆయన కథలు సమాజానికి అద్దంలా నిలిచి, మార్పు దిశగా ఆలోచింపజేశాయి. ఆధునిక తెలుగు కథా వికాసానికి గురజాడ చేసిన సేవ అపారమైనది.

**కాళీపట్నం రామారావు (1923-2000)**

ఆధునిక తెలుగు కథా సాహిత్యంలో గ్రామీణ జీవితాన్ని గంభీరంగా, సున్నితంగా చిత్రించిన కథకుడిగా గుర్తించబడతారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ఆయన, కథల్లో గ్రామీణ సమాజంలోని నైతిక విలువలు, మానవ సంబంధాలు, మార్పు దశలో ఉన్న జీవన విధానాన్ని లోతుగా ప్రతిబింబించారు. అలంకారరహితమైన భాష, మితమైన కథన శైలి ఆయన కథల ప్రత్యేకత.

**కాళీపట్నం కథల ప్రధాన ఇతివృత్తాలు**

అ. **గ్రామీణ జీవితం** : కాళీపట్నం కథల్లో గ్రామం ఒక నేపథ్యం మాత్రమే కాదు. ఒక జీవంతమైన సామాజిక వ్యవస్థ వుంటుంది. రైతులు, కూలీలు, గ్రామ పెద్దలు, స్త్రీలు మొదలైన శ్రీశ్రీ పాత్రలు సహజంగా కథలో మిళితమవుతాయి.

ఆ. **నైతిక విలువలు** : మనిషి అంతరంగంలో జరిగే నైతిక సంఘర్షణలు ఆయన కథల ప్రధాన బలం. స్వార్థం, త్యాగం, బాధ్యత, పలాయనం మధ్య పోరాటం కథలను లోతుగా మలుస్తుంది.

ఇ. **మానవ సంబంధాలు** : తండ్రి, కొడుకు, భార్య,భర్త, అన్నదమ్ములు, పొరుగువారు మధ్య గల ఈ సంబంధాల మధ్య ఉన్న సున్నితమైన భావోద్వేగాలను కాళీపట్నం కథలు సహజంగా చిత్రిస్తాయి.

**ముఖ్య కథలు – పరిశీలన**

**యజ్ఞం :**

కాళీపట్నం రామారావును జాతీయ స్థాయిలో గుర్తింపు నిచ్చిన కథ 'యజ్ఞం'.

**ఇతివృత్తం** : రైతు కష్టాలు, భూమిపై ప్రేమ, త్యాగ భావన.

**విశ్లేషణ** : ఈ కథలో రైతు తన భూమిని కాపాడుకోవడానికి చేసే త్యాగం ఒక వ్యక్తిగత కథ కాదు. అది రైతు వర్గపు సామూహిక వేదనకు ప్రతీక. నాటకీయత లేకుండా, భావోద్వేగాలను లోతుగా వ్యక్తీకరించిన కథగా 'యజ్ఞం' నిలుస్తుంది.

**ఇల్లు :**

**ఇతివృత్తం** : ఇల్లు ఆశ్రయం అస్తిత్వం

**విశ్లేషణ** : ఇల్లు కేవలం నివాస స్థలం కాకుండా, వ్యక్తి భావజాలానికి ప్రతీకగా నిలుస్తుంది. ఆధునికత వల్ల గ్రామీణ జీవితం ఎలా విఛిన్నమవుతుందో ఈ కథ సూచిస్తుంది.

**తీర్పు :**

**ఇతివృత్తం** : న్యాయం, అంతర్ముఖ సంఘర్షణ.

**విశ్లేషణ** : ఈ కథలో న్యాయవ్యవస్థకన్నా, మనిషి అంతరాత్మే ముఖ్యమని రచయిత సూచిస్తారు. మానవీయ విలువలకు కథ పెద్దపీట వేస్తుంది.

**పాత్ర నిర్మాణం** : కాళీపట్నం కథల పాత్రలు సాధారణ వ్యక్తులే అయినా, వారి అంతర్గత సంఘర్షణలు అసాధారణమైన లోతును కలిగి ఉంటాయి. పాత్రల మాటలు తక్కువ, భావాలే ఎక్కువగా కథను ముందుకు నడిపిస్తాయి.

**భాషా శైలి, కథన విధానం** : సరళమైన వ్యవహారిక భాష, అలంకార రహిత నిశ్శబ్ద భావవ్యక్తీకరణ ఈ లక్షణాలు కాళీపట్నం కథలకు ప్రత్యేక గుర్తింపునిచ్చాయి.

**కాళీపట్నం కథల ప్రాముఖ్యత :**

గ్రామీణ కథలకు గంభీరత, నైతిక విలువల ప్రతిష్ట, మితమైన కథా శిల్పం, మానవీయ దృష్టి. కాళీపట్నం రామారావు కథలు శబ్దాలకన్నా భావాలపై నిలబడిన కథలు. అవి గ్రామీణ జీవనానికి ఒక సాహిత్య సాక్ష్య పత్రంలాగా నిలుస్తాయి. తెలుగు కథా సాహిత్యంలో ఆయన స్థానం చిరస్థాయిగా నిలిచిపోతుంది. కాళీపట్నం రామారావు కథలు, గ్రామీణ జీవితం, నైతిక విలువలు, మానవ సంబంధాలు, మితమైన కథనం, వాస్తవికత.

**భూషణం కథా సాహిత్యం**

స్వాతంత్ర్యానంతర తెలుగు కథా సాహిత్యంలో భూషణం (బోనం నాగభూషణరావు) ఒక ప్రత్యేకమైన విప్లవాత్మక స్వరంగా నిలిచాడు. పేదరికం, పల్లె ఫ్యూడల్ వ్యవస్థ, మధ్యతరగతి సంక్షోభం, ఉపాధ్యాయ వర్గ సమస్యలు, స్త్రీ పీడన, గిరిజన అణచివేత వంటి సామాజిక వాస్తవాలను ప్రత్యక్ష అనుభవాల ఆధారంగా కథలుగా మలిచిన రచయిత భూషణం. ఈ వ్యాసం ఆయన జీవిత నేపథ్యం, కథా రచనలోని మూడు దశలు, కథా వస్తువు, శిల్పం, సామాజిక దృక్పథం, విప్లవ చైతన్యం వంటి అంశాలను విశ్లేషిస్తూ భూషణం కథా సాహిత్యానికి గల ప్రాముఖ్యతను అంచనా వేయడానికి ప్రయత్నిస్తుంది. 1938 జూలై 1న శ్రీకాకుళం జిల్లా ప్రస్తుతం విజయనగరం జిల్లా జియ్యమ్మవలస మండలంలోని చినమేరంగి గ్రామంలో జన్మించిన భూషణం జీవితం పేదరికం, కష్ట నష్టాలతో ముడిపడి ఉంది. తండ్రి వ్యసనాల వల్ల కుటుంబం ఆర్థికంగా కుదేలై, తల్లి ఆధ్వర్యంలో కుటుంబం బతుకు బండి నడిచింది. చిన్ననాటి నుంచే రోజుకు అర్ధరూపాయి కోసం గుండీలు కుట్టే స్థితి ఆయనలో జీవన వాస్తవాల పట్ల గాఢమైన అవగాహనను కలిగించింది. ఉపాధ్యాయ శిక్షణ అనంతరం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉపాధ్యాయ వర్గానికి చెందిన సమస్యలను ప్రత్యక్షంగా అనుభవించాడు. టీచర్స్ ఫెడరేషన్‌లో బాధ్యతలు నిర్వహించడం, ప్రజాసాంస్కృతిక ఉద్యమాల్లో పాల్గొనడం, విరసంలో సభ్యత్వం, ఎమర్జెన్సీ కాలంలో జైలు జీవితం. ఇవన్నీ ఆయన రచనలకు రాజకీయ, సామాజిక దృక్పథాన్ని ఇచ్చాయి.

**మొదటి దశ (1960–1970)**

ఈ దశలో ఆయన కథలు ప్రధానంగా పల్లె ఫ్యూడల్ వ్యవస్థ, ఉపాధ్యాయుల ఆర్థిక దుస్థితి, మధ్యతరగతి సంక్షోభం, నిరుద్యోగం, అవినీతి అనే అంశాలను ప్రతిబింబిస్తాయి. 'సుబ్బారావు పంతులు', 'ఐస్‌క్రీం', 'చాపకింద నీరు' వంటి కథలు ఉపాధ్యాయుల బతుకుబండిని హృదయ విదారకంగా చిత్రిస్తాయి. ఆకలి ఒక సామాజిక సమస్యగా మారి వ్యక్తిగత విషాదంగా ఎలా మారుతుందో ఈ కథల్లో స్పష్టంగా కనిపిస్తుంది.

**రెండవ దశ (1971 – 1980)**

ఈ దశలో భూషణం రచనల్లో విప్లవ చైతన్యం మరింత స్పష్టమవుతుంది. నక్సల్బరి ఉద్యమ ప్రభావం, శ్రీకాకుళం గిరిజన పోరాటం ఆయన రచనలకు కొత్త

దిశను ఇచ్చాయి. 'పద్మవ్యూహం', 'ఏది సత్యం- ఏది అసత్యం' వంటి కథలు రాజకీయ అధికార దుర్వి నియోగాన్ని, పేదలపై జరిగే అణచివేతను ప్రశ్నిస్తాయి. ఈ దశలో కథలు కేవలం వ్యక్తిగత విషాదాన్ని కాకుండా వ్యవస్థాపరమైన దోపిడీని ఎండగడతాయి.

**మూడవ దశ (1981 – 1998)**

ఈ దశలో భూషణం రచనల్లో ఒక విధమైన ఆత్మ పరిశీలన కనిపిస్తుంది. విప్లవ ఆశయాల పట్ల వచ్చిన నిరాశ, మారుతున్న సామాజిక - రాజకీయ పరిస్థితుల పట్ల మౌనమైన ప్రశ్నలు ఈ దశ రచనల్లో వ్యక్తమవుతాయి. 'కొండగాలి కొన్ని కథలు', 'కొత్తగాలి' వంటి కొన్ని సంపుటాలు సామాజిక దోపిడీని ప్రశ్నిస్తాయి.

**కథా వస్తువు – సామాజిక యథార్థవాదం :**

ఇది భూషణం కథల ప్రధాన లక్షణం. ఆయన కథల్లో ఆకలి, పేదరికం, స్త్రీ పీడన, కుల, వర్గ విభేదాలు, అధికార దుర్వినియోగం, అంశాలు సహజంగా, అతి శయోక్తి లేకుండా వ్యక్తమవుతాయి. స్త్రీ పాత్రలు బాధితు లుగా మాత్రమే కాక, వ్యవస్థ దౌర్జన్యాన్ని ప్రశ్నించే శక్తులుగా కనిపిస్తాయి. 'పూలు లేని కాడలు' వంటి కథలు స్త్రీ శరీరంపై వ్యవస్థ చూపే హక్కు భావాన్ని తీవ్రంగా ఖండిస్తాయి.

**భూషణం కథా శిల్పం :**

భూషణం కథాశిల్పం సరళమైనది. ప్రభావవంతమైనది. ఆయన సాధారణ భాష పల్లె నుడికారం, అంతర్ముఖ సంఘర్షణ, వాస్తవిక ముగింపుల అతని కథలకు ప్రత్యేకత నిస్తాయి. ఆడంబర రహిత కథనంతో పాఠకుడిని ప్రత్యక్షంగా సంఘటన మధ్యలో నిలబెట్టడమే ఆయన శిల్ప రహస్యం. భూషణం కథాసాహిత్యం స్వాతంత్ర్యా నంతర తెలుగు సమాజానికి ఒక సామాజిక దర్పణం. ఆయన కథలు కేవలం సాహిత్య సృష్టులే కాదు, అవి పీడితుల జీవితాల డాక్యుమెంట్లు. గురజాడ అప్పారావు గారితో సహా మహనీయులైన కళింగాంధ్ర రచయిత లెవ్వరూ ఆదివాసుల జీవితం గురించి పరిచయం ఉన్న వాళ్ళూ కారు, రాసినవాళ్ళూ కారు. శ్రీకాకుళం తిరుగుబాటు స్పష్టంగా గిరిజన అరణ్యరోదన, రక్త సిక్త వేదనను చిత్రించిన ఏకైక రచయిత భూషణంగారే.

**ఉత్తరాంధ్ర కథా సాహిత్యంలో భూషణం స్థానం**

"పట్టణ ప్రాంత జీవితాన్ని పెద్ద గురువు రా.వి. శాస్త్రి గారూ, (పల్లె ) మైదాన ప్రాంత జీవితాన్ని చిన గురువు కాళీపట్నం రామారావు గారూ.. రాస్తున్నారు. నాకు మిగి లింది కొండ ప్రాంతమే. (ఆదివాసీ ప్రాంతమే ) అదే పట్టుకొని రాస్తున్నాను ....." అనేవారు భూషణం గారు. తెలుగు సామాజిక రంగాన్ని, నక్సలైట్ ఉద్యమమెంతటి ప్రభావాన్ని కల్గించిందో అంతకంటే మించిన ప్రభావాన్ని శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాటం తెలుగు సాహిత్యం మీద కలుగజేసింది. భూషణంగారి కథలు చదువుతూంటే- శ్రీకాకుళం జిల్లాలోని సరవల దయనీయ జీవితం కళ్లకు కట్టినట్టుగా కనబడుతుంది. వాళ్లు ఎందుకు తుపాకీ పట్టవలసి వచ్చిందో అర్థం అవుతుంది. శ్రీకాకుళ ఉద్యమం వాళ్ళకు రక్తమాంసాలు గల మనుషులు తమ జీవిక కోసం, మనుగడ కోసం, మంచి బతుకు కోసం చేస్తున్న జీవన్మరణ పోరాటంగా, భౌతిక వాస్తవికతగా కన్నా ఎక్కువగా కాల్పనిక, ఉద్వేగభరిత భావనగానే అందింది. భూస్వామ్య వ్యవస్థ గ్రామీణ ఉత్పత్తి శక్తులను ఎలా అణగార్చింది. అందువల్ల తాడితుల, పీడితుల సంఖ్య ఎలా పెరిగింది. వ్యవసాయ సంబంధాల్ని నిర్దేశించి నియంత్రిస్తున్న శక్తులు ఎలా బలం పుంజుకొన్నది . భూషణం కథలు మన కళ్ళకు కట్టినట్టు చూపిస్తాయి. సాయుధపోరుకి మలుపుకి తిప్పిన, చారిత్రక ఘటన 1967 అక్టోబరు 31ని అద్భుతంగా కథనం జేసారు. శ్రీకాకుళం , పార్వతీపురం కొండలతో విడదీయలేని అనుబంధాన్ని అల్లుకున్న భూషణం సాహిత్యమంతా ఆ జనాల జీవితమే పరచుకుంది. నాలుగున్నర దశాబ్దాల క్రితం చరిత్రకి అర్థం చెప్పిన ఆయన కథలు కొండగాలి కథలు. ఆ తరువాత వచ్చిన మార్పులను వాటి ఫలితాలకు అద్దం పట్టిన కథలు. కొత్తగాలి కథలు, కొండగాలి అనుభవసారమయితే కొత్త గాలి పరిశీలనా కోణం. కొత్తగాలి ' సంపుటిలోని పదకొండు కథల్లో ఆరు కథలు 90-91 మధ్య కాలంలో రాసినవే,

ఈ కథల్ని 'కొండగాలి' (1974)తో పోల్చి చూడాలి. సూత్రప్రాయంగా , నిరాడంబరంగా కన్పించే ఈ రచనలు వెనుక 68 నుంచి 98 దాకా మూడు దశాబ్దాల పాటు శ్రీకాకుళం - పార్వతీపురం ఆదివాసుల జీవితాల్లో సంభవించిన విప్లవాత్మక పరిణామాల, ప్రకంపనల సిస్మోగ్రాఫిక్ రికార్డింగ్ వుంది.

**ఆధార గ్రంథాలు :**


1. కాళీపట్నం రామారావు రచనలు, మనసు ఫౌండేషన్, 2016.
2. కె.వి. రమణారావు- తెలుగు కథా సాహిత్య చరిత్ర, హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, 1986.
3. గిడుగు రామమూర్తి పంతులు - వ్యవహారిక భాషా వ్యాసాలు, విశాలాంధ్ర పబ్లిషింగ్‌హస్, 1984
4. గురజాడ అప్పారావు - సంపూర్ణ రచనలు, మనసు ఫౌండేషన్, 2021
5. జి.ఎస్. చలం - భూషణం కథలు, 2005
6. తెలుగు విశ్వవిద్యాలయం- ప్రాంతీయ సాహిత్య అధ్యయనాలు, 1998.
7. రావి శాస్త్రి - కథలు సామాజిక విమర్శ, విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, 1987.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# శ్రీపూతి చంద్రభూషణం గారి కథలు – సమాజం సమకాలీన సమస్యలు – సాహితీ సమాలోచన



– బోణం మోహన్‌గాంధీ
పరిశోధక విద్యార్థి, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం.

## పరిచయం

సమాజం అను పదము అతి విశాలమైన భావార్ధము కలిగి హిమవన్నమగు వంటి విశాలత్వము, మేరు నగము వంటి ఔన్నత్యము చాటి చెబుతుంది. వ్యక్తి - కుటుంబము - సమాజము ఈ మూడు ఒకదానికొకటి అవినాభావ సంబంధం కలిగి ఉంటాయి. ఇందు కుటుంబము కనిష్ట ప్రామాణికము అయితే, సమాజము గరిష్ట ప్రమాణము గలది. అనేక శిఖర కూటములు గల గృహ పర్వతం వలె సమాజమున అనేక జాతులు, వర్ణములు, మతాలు, సంస్థలు, కూటములు, రాజ్యములు సమాహారమై ఉండును. సమాజము సంఘములనేవి సమానార్ధకమును సూచించును. ఆదిమానవ సంఘం ఆవిర్భావం నాటి ఉండి నేటి వరకు సమాజం అనేక పరిణామాలకు లోనవుతూ వస్తుంది. వివిధ సంప్రదాయాలు, సంస్కృతులు, సిద్ధాంతాలు, మానవ క్రమ వికాసమునకు బాటలు వేసినవి. మానవ జీవన పరిణామాలతో బాటే సాహిత్యం కూడా వివిధ పరిణామాలకు లోనై మానవుని కర్తవ్యోన్ముఖునిగా చేస్తున్నది.

## సామాజిక సమస్యలు :

ప్రతి వ్యక్తి జీవన రంగంలో ఎదుర్కోవలసిన ఆటు పోటులెన్నో... జీవితమే ఒక రణరంగం. మనిషి సుఖ శాంతులతో ఉండడానికి తగిన ఆర్థిక వనరులను సమకూర్చుకోవడానికి చేస్తున్న నిరంతర యుద్ధమే జీవితం. ఆ పోరాటంలో ఎదురవుతున్నవే సమస్యలు. సమస్య చిక్కుముడు లాంటిది. దానిని విప్పుకుంటూ ముందకు సాగడమే జీవన నైపుణ్యం. ముడి సమస్య అయితే విప్పుకోవడం అన్నది పరిష్కారం. సమస్య ఎక్కడుంటుందో పరిష్కారం అక్కడే ఉంటుంది. వ్యక్తికి వ్యక్తికి సమస్యలు, కుటుంబంలో సమస్యలు అన్నీ కలిపితేనే సామాజిక సమస్యలు. అయితే అవి కాలక్రమేణా ఆర్థిక సమస్యలుగా, శారీరక సమస్యలుగా, మానిసక సమస్యలుగా, సాంఘీంక సమస్యలుగా, వివాద సమస్యలుగా, పలు రూపాలలో ఏదో ఒక సమయంలో ప్రతి ఒక్కరూ ఎదుర్కొంటూ, దాటుకుంటూ, వెళ్ళవలసి ఉంటుంది. లేకుంటే మనిషి చతికిలపడిపోతాడు. అందుకు సాహిత్యం మనిషిని నిరంతరం హెచ్చరిస్తూనే ఉంటుంది. ఉపదేశాల ద్వారా, సందేశాల ద్వారా, రచయితలను కర్తవ్యోన్ముఖునిగా చేస్తుంది.

## సమకాలీన సామాజిక సమస్యలు :

సమకాలీన సమస్యలపై కవులు ఆలోచనలతో దృష్టి సారించి సమాలోచనతో వెలువరించిన కవులు కవితలు,

నాటికలు, రూపకాలు, కథలు మొదలైన ఎన్నో ప్రక్రియలలో సమాజాన్ని చైతన్యవంతం చేశారు. అనాదిగా అణగారిన వర్గంగా ముద్రపడిన దళితుల కోసం ఒక దిశలో దళితవాదం విజృంభించి వారి సమస్యల పట్ల పాటల రూపంలో నృత్య రూపకాల రూపంలో నాటక నాటికల రూపంలోనూ కావ్యాలు ఖండకావ్యాలు మొదలైన రూపాలలో నిత్యం చైతన్యానిన కలిగించాయి. ఉన్నవ లక్ష్మీనారాయణ గారి మాలపల్లి నవల జాషువా గారి గబ్బిలం కుసుమ ధర్మన్న గారి హరిజన శతకం మొదలైన రచనలన్నీ దళిత సమస్యలపై వచ్చినవి బాల్య వివాహాలపై ధనవంతుల ప్రభావం దురహంకారము ఎదురొడ్డి పోరాడే సందేశాలతో గురజాడ గారి కవితలు సమాజంలో స్త్రీల అగచాట్లను అవమానాలను చూపిస్తూ వారి మానసిక స్థితిగతులను బహిర్గత పరుస్తూ స్త్రీవాద సాహిత్యం కూడా ప్రభంజనం సృష్టించింది. ఒకనాడు సమస్య కానిది రాజాధరణ పొందిన వేశ్యవృత్తిని ఛీత్కరిస్తూ దాని వలన కలిగే అనర్ధాలను సూచిస్తూ కన్యాశుల్కం అనే పెద్ద నాటకాన్ని వ్రాశారు గురజాడ అప్పారావు గారు. స్త్రీల మనోభావాలను ఎక్స్-రే తీసి రచనల్లో పొందుపరిచారు. సామాజిక, స్త్రీవాద రచయిత పారిశ్రామిక విప్లవానంతరం మార్క్సిజం వచ్చిన తర్వాత, కార్మిక సమస్యలపై పోరాటాలు అభ్యుదయ వాద రచనలు ద్వారా సాహిత్యం వచ్చింది. ఎందరో ప్రాచీన కవుల నుండి ఆధునిక కవులు అత్యధిక కవులు వరకు సమాజ శ్రేయస్సు నుంచి విశ్వశాంతి కొరకు మానవ అభ్యుదయమే లక్ష్యంగా వివిధ రూపాలలో ప్రక్రియలలో సాహిత్యాన్ని అందించి మంచి మార్గమును ఏర్పరిచారు మానవ అభ్యుదయమునకు మార్గదర్శకులను వివిధ మార్గములను సృష్టికర్త సిద్ధాంతికరించినట్లు మహాకవులు యొక్క అభిప్రాయం.

"బహుదాప్యాగమౌర్భిన్నాః పంధాన స్పిద్ధిహేతవః
త్వఏవ నిపతంత్యోయాః జాహ్నవీయా ఇవార్ణయే"

విభిన్న ప్రవాహములన్నీ సాగరమైనట్లు అన్ని ప్రక్రియలకు సిద్ధాంతములకు భగవంతుడే గమ్యమని కాళిదాసు గారి అభిప్రాయం. అట్టి మహాకవుల అభిప్రాయంలో సమస్యలు పరిష్కారాలు నివారణ ఉపాయాలకు కేంద్ర బిందువు భగవంతుడు.. భగవంతుడే భాషా స్వరూపం.. సాహితీ ప్రక్రియలే ప్రతిరూపాలని మనం గ్రహించుకోవచ్చు.... సమాజంపై సాహిత్య ప్రభావం ఎంత కాలానుగుణంగా సాహిత్యం వివిధ రూపాలలో సాక్షాత్కరిస్తున్నది. కవిత్వం శతకం, గేయం, వచన కవిత, కథ, కథానిక, వ్యాసం, గేయ కథ మొదలైన రూపాలలో మనకు నేడు దర్శనమిస్తున్నది. సాంఘిక సమస్యలు తత్పరిణామాలు ఈ సాహితీ రూపాలలో అప్పుడప్పుడు దర్శనమిస్తుంటాయి.

మానవ పరిణామ తత్వములను బోధించుటకు సాహిత్యమే సానుకూలమైంది. సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండుటకు పరిష్కార దిశగా ఆలోచలు సాగుటకు సాహిత్యమే మార్గం చూపిస్తుంది. ప్రపంచమే ఒక సమస్యల పుట్ట. ప్రపంచ సమస్యలను పరిష్కరించే ఉత్తమ సాహిత్యం భగవద్గీత.. ఇందు అన్ని సమస్యలకూ మనకు చక్కని పరిష్కార మార్గం లభిస్తుంది. మానవ ధర్మాలను నిర్ధేశించినది మనుధర్మ శాస్త్రమైతే, రాజ్యాంగ విధానాలను ఆర్ధిక విధానాలను సూచించేదే కౌటిల్యుని అర్ధశాస్త్రం. ఇది ఆర్ధికపరమైన సమస్యలకు పరిష్కార మార్గం చూపుతుంది. సమాజం కోసం ఏం చెప్పాలనుకున్నా నాటి కవులకు కవిత్వమే శరణ్యమైంది. పదకొండవ శతాబ్దం నాటికి మానవ సమాజంలో మత సంఘర్షణలు, మత విద్వేషాలు, చెలరేగుతున్న సమయంలో వైదిక మత రక్షణకు ధర్మసూత్రాలను తెలియపరుస్తూ నన్నయ మహాభారతమును వినియోగిస్తూ శివకవులు శైవమత రక్షణ కొరకు కూడా సాహిత్యాన్ని వినియోగించుకున్నారు. సంఘంలో అనేక సమస్యలను ఎత్తిచూపి దురాచారాలను దురాగతాలను తూర్పారబట్టే సాహిత్యము వేమన గారిది. కుటిల రాజకీయ తంత్రములను బేధించి శ్రామిక చైతన్యం కలిగింది, వారి సమస్యలను రూపుమాపుటకు మహాకవి శ్రీశ్రీ గారు సైతం కవిత్వాన్ని ఆయుధంగా ఉపయోగించారు. ఎందరో కవులు సమాజంలో ఉన్న సమస్యలకు స్పందించి కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని ఎన్నో రచనలు చేసి సమాజాన్ని చైతన్యపరిచారు. అలాంటి కోవకు చెందిన ఒక ప్రముఖ కవి శ్రీపూతి చంద్రభూషణం

గారు. కవిగా ప్రాచీన కావ్య ప్రక్రియను, ఆధునిక ప్రక్రియలను ఎంచుకొని సామాజిక స్థితిగతులకు దర్పణం పడుతూ వివిధ ప్రక్రియలో శ్రీపూతి చంద్రభూషణం గారు సాహితీ లోకానికి కొన్ని కథల ద్వారా సామాజిక సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపగలిగారు. అందులో ప్రధానమైనవి శిల్పి.. అనైతికం... పసి హృదయాలను స్వాతంత్ర్య సమరయోధుడు... అంతిమతీర్పు..

టిట్ ఫర్ టాట్... మొదలైన ఎన్నో కథలలో సమకాలీన సమస్యలను ప్రధానంగా వివరించారు.

సమాజంలో శ్రమదోపిడీ ఎలా జరుగుతుందో తెల్పే "శిల్పి" పాఠక లోకానికి గొప్ప సందేశాన్ని ఇచ్చింది. అక్రమ సంబంధాల వలన కుటుంబాలు ఎలా నాశనం అవుతాయో తెలిపే "అనైతికం" అనే కథ సమాజానికి చక్కని సందేశాన్ని ఇచ్చింది. స్త్రీల పట్ల జరిగిన అఘాయిత్యాలకు ఒక పరిష్కార మార్గంగా ఈయన రాసిన "టిట్ ఫర్ టాట్" అనే కథా చక్కని సందేశాన్ని ఇచ్చింది. స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన తన కాళ్ళనే కోల్పోయిన ఒక స్వాతంత్ర్య సమర యోధుడు చివరకు ప్రభుత్వం ఇచ్చిన తన భూమిని కూడా చివరకు పొందలేని స్థితిలో ప్రస్తుతం సమాజం రాజకీయ నాయకుల చేతుల్లో ఎలా ఉంది అనే అంశాన్ని చక్కగా వివరిస్తూ వ్రాయబడిన "స్వాతంత్ర్య సమర యోధుడు" ఇలా ఎన్నో ఆయన కలం నుండి జాలువారిన గొప్ప సందేశాత్మక కథలు సమాజాన్ని మేలు కొలుపుతున్నాయి అనుటలో అతిశయోక్తి లేదు.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు కవిత - సాంఘిక సిద్ధాంతాలు - పి. చంద్ర భూషణం.
2. గత శతాబ్దం - సాహిత్యం (1970-1980) - పి. చంద్ర భూషణం.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# ఒక దశాబ్ది కథలు - మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాల విశ్లేషణ



- మామిడి విజేత

పరిశోధకురాలు, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

**పరిచయం :**

అనగా... అనగా... అంటూ కథ చెప్పే దశ నుండి ఈనాటి ఆధునిక కథ వరకు ఎన్నో దశలు దాటి వచ్చిన కథలను ఇప్పుడు మనం చదువుతున్నాం. ఇవన్నీ జీవితాల నుండి, జీవన విధానం నుండి పుట్టినవే. నిజజీవితంలోని సంఘటనలు, పాత్రలతో రచయిత జరిపే సంభాషనే కథ.

ఆధునిక వచన సాహిత్య ప్రక్రియలో నవల, కథ, వ్యాసం, జీవిత చరిత్ర మొదలైనవి పేర్కొనదగినవి. వీటిలో కథ నేడు విశేష పాఠకాదరణ పొందింది. సామాన్యుని జీవిత విశేషాలను చిత్రించడంలో కథ తనదైన పాత్రను పోషిస్తుంది. కథలో వస్తు, శిల్పాలు రెండు సమాన ప్రాధాన్యతను కలిగి ఉంటాయి. విమర్శకులు కథలలో వస్తువు ముఖ్యమని కొందరు అంటే, శిల్పం ముఖ్యమని మరికొందరు అంటారు. వస్తువు అంటే రచయిత ఎంచుకున్న అంశం. కథలో రచయిత ఏమి చెప్పాడన్నది వస్తువు అవుతుంది. ఆ వస్తువు ఎలా చెప్పాడన్నది శిల్పం అవుతుంది.

సాహిత్యం అనేది మానవ అనుభవాల కూర్పు. వస్తువును రచయిత మానవుని అనుభవం నుంచే ఎంపిక చేసుకుంటాడు. ఈ వస్తువు అనేది రచయిత జీవితంలోని సంఘటన కావచ్చు లేదా రచయిత గమనించిన పరిసరాల నుండి గాని, ఆయన సంభాషించిన వ్యక్తుల నుండి గాని రచయిత వస్తువును ఎన్నుకోవచ్చు. ఈ వస్తువు అనేది మానవానుభావాల సమహారం. రచయిత సామాజిక సమస్యలను, పరిణామాలను, రాగద్వేషాలను మానవ సంబంధాలను, మానవుని మనస్తత్వ లోతులను, ఆర్థిక అంశాలను మొదలైన అనే విషయాలను వస్తువుగా స్వీకరించవచ్చు.

వస్తువు గురించి సాహితీవేత్తలు చెప్పినా అభిప్రాయాలను పరిశీలిస్తే 'నిగూఢ బీజ స్థితి నుండి వెలికి వచ్చిన విషయాంకుర కథా వస్తువు' (దక్షిణామూర్తి, 1988:239) ''సాహిత్యంలో వ్యక్తం అయ్యే ప్రధాన భావాన్ని వస్తువు అనవచ్చు. రచయిత సాహిత్యంలో వివరించిన ఆశయాన్ని వస్తువుగా చెప్పవచ్చు'' (మధుసూదన్ రావు, 1987:13)

కవి లేదా రచయిత చెప్పే ప్రధాన విషయాన్ని 'వస్తువు' అనవచ్చు. సాహిత్యంలో వ్యక్తమయ్యే ప్రధాన భావాన్ని వస్తువు అనవచ్చు. తాను ఎంచుకున్న వస్తువు అంశం. వస్తువును అభివ్యక్తం చేసే తీరు శిల్పం. ఈ రెండింటిలో ముఖ్యమైనది వస్తువు. కంటెంట్ అనే ఆంగ్ల పదానికి

సమానార్థకంగా తెలుగులో వస్తువు అని వాడుతున్నాం. 'ఒకానొక విషయంలో ప్రత్యేకంగా నియమబద్ధంగా ఉన్న మూలకాల, క్రమ విధానాల మొత్తమే వస్తువు. మనిషి, మానవ సంబంధాలు సామాజిక జీవితం వస్తువు అవుతుంది. కవిత్వంలో వ్యక్తమయ్యే ప్రధానమైన conceptని వస్తువుగా చెప్పుకోవచ్చు' (లక్ష్మీకాంతం, పింగళి. 1986:39)

రచనలో, కవిత్వంలో వ్యక్తమయ్యే ముఖ్యమైన అంశం వస్తువు. 'మనిషి ప్రకృతిలో పోరాడుతూ జీవిక కోసం పడిన ఘర్షణ సాహిత్యంలో వస్తువు అయింది.' (కాసిం, 2012:96). వస్తువు అంటే సంబంధాలు, సామాజిక జీవితం అందలి సమస్త వైరుధ్యాలు, వీటన్నింటి యొక్క కళాత్మకమైన ఆవిష్కరణ సాహిత్యంలో వస్తువు (శివశంకర్, పాపినేని.2008:8)

మనుషులు, వాళ్ల మధ్య సంబంధాలు, బాంధవ్యాలు, ఆప్యాయతానురాగాలు, ప్రేమలు, ద్వేషాలు మానవ సంబంధాల్లోని సమస్త అంశాలు సాహిత్యంలో వస్తువే. సమాజం మారినకొద్దీ వస్తువు కూడా మారుతుంది. ఎందుకంటే సాహిత్యం నిరంతరం చలనశీలమైనది.

కవులు, రచయితలు వస్తు స్వీకరణలో వైవిధ్యం పాటించారు. మారుతున్న కాలాన్ని అనుసరించి వస్తువు స్వరూపం దాని విలువలు, ప్రయోజనాలు కూడా మారాయి. ప్రాచీనులకు ప్రకృతి ప్రధాన కవిత వస్తువుగా కనిపించేది. ప్రాచీన కవులు నదులు, గుట్టలు, చెట్లు చేమలు, సూర్యోదయం, చంద్రోదయం మొదలైనవి వర్ణించేవారు. కానీ నేడు కవులు, రచయితలు ప్రజల దుర్భర జీవితాలు, పేదరికం, వలస, కుల నిర్మూలన, మానవ సంబంధాలు, భాష గొప్పదనం, నిరక్షరాస్యత, మూఢనమ్మకాలు మొదలైనవి ఆధునిక కవులకు వస్తువులు అవుతున్నాయి.

మానవత్వం మానవ లక్షణం. మానవత్వం అంటే ప్రేమ, దయ, అనురాగం, ఆప్యాయత, స్నేహం, సౌజన్యం, పరోపకారా ప్రవృత్తి, రుజువర్తన వంటి మంచి గుణాలు వీటిని సంపూర్ణంగా కలిగి ఉన్నవాళ్లే మానవులు.

మనిషి సహజంగా కుటుంబ జీవి, సంఘజీవి. కుటుంబంలో, సంఘంలో ప్రశాంతత నేలకొని ఉండాలంటే మనుషుల మధ్య పరస్పరం ఆప్యాయతను రాగాలు, స్నేహ సౌజన్యాలు, పరస్పర గౌరవాదరణలు కొనసాగాలి. నేటి మానవుల్లో కొందరు ఈ గుణాలను వదిలి వదిలి బాంధవ్యాలను, మమతానురాగాలను బుక్కు అమ్మి వేస్తూ అర్థమే (ధనమే) పరమార్ధంగా భావించడం వల్ల సంబంధాలు చెడిపోతున్నాయి. ఆత్మీయమైన పలకరింపులతో పులకరించే రోజులు గత వైభవాల అయిపోతున్నాయి. మనిషి స్నేహ సౌజన్యాలకు మంగళం పాడుతూ, ఒంటరితనానికి అలవాటు పడిపోతున్నాడు. తన కళ్ల ఎదుటే దౌర్జన్యాలు జరుగుతున్న కనీసం స్పందించాలనే తలపు శూన్యమైపోతుంది. వరకు రాకుంటే చాలు స్వార్థ బుద్ధి ప్రభలుతున్నది. ఇది సమాజానికి చేటు.

బాహ్య పరిణామాలు వ్యక్తిగత జీవితాల్లో తెస్తున్న పెను మార్పులన్నీ మానవ జీవితంలోకి ఇంకిపోయి మానవ విలువల స్వరూప స్వభావాలను సమూలంగా మార్చి వేస్తున్నాయి. వ్యవస్థీకృత పునాదులు కదిలిపోతున్నాయి. ప్రతి అంశాన్ని ఆర్థిక విషయాలు శాసిస్తున్నాయి. నూతన ఆర్థిక విధానాలు ప్రారంభమై ప్రపంచీకరణ దిశగా సమాజం పరుగులు పెట్టడంతో వస్తున్న విపరీత పరిణామాలు మనం ప్రత్యక్షంగా చూస్తున్నాము. ఇంతకు ముందు కథల్లో ఉన్న ఉన్న అస్పష్టత, అయోమయం, అర్థం కాని తనం ఇప్పుడు ఏమీ లేదు. ఇప్పుడు అంతా నలుపు తెలుపుల్లో స్పష్టంగా ఒక వికృత సమాజం మన కళ్ళ ముందు కనిపిస్తుంది. అలాగే రైతు జీవితంలో ఆర్థిక సంబంధాలు తెచ్చిన మార్పును మనం రామచంద్రమౌళి రాసిన భూమి దుఃఖం దుఃఖం కథలో గమనించవచ్చు.

**ముఖ్యాంశాలు :**

గొర్రు, బర్రెలు, సాంక్షన్ సాంక్షన్, మతలబు,బ్యారం, గుత్తా, అగ్గువా సగ్గువ,పెయ్యి, కార్ఖానా, పాసి పాయె.

**విషయ విశ్లేషణ :**

భార్యాభర్తలిద్దరూ కాయ కష్టం చేసుకుని సంపాదించిన భూమిని ప్రభుత్వం తీసుకొని ఊరు ఖాళీ చేయించి, ఆ భూములకు సర్కార్ లెక్క ప్రకారం పైసాపర్కో కట్టించి

ఎక్కడన్నా పునరావాసం ఏర్పాటు చేస్తుందని, గవర్నమెంట్ దేశాన్ని డెవలప్ చేయాలని స్పెషల్ ఎకనామిక్ జోన్స్ ఏర్పాటు చేస్తుంది. మన భూమిని మనకు ఇష్టం ఉన్న, లేకున్నా ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చిందంటే తీసుకోవడం ఎంత దురాక్రమణ, దగా. ఇంత వ్యాపారం, మనుషులు మనుషులు మనుషులను కొనడం, మనుషులు భూము లను కొనడం, భూములు మనుషుల చేతుల్లో కాగితపు ముక్కల కంటే హీనంగా పీలికలు పీలికలైపోవడం, ఒర్రెలు, వాగులు, గుట్టలు అన్ని డబ్బుగా మారిపోతు న్నాయి. ఇంతకుముందు మనిషి అంటే మానవతా, ప్రేమ కనిపించేవి. ఇప్పుడు మనిషి అంటే డబ్బు అనే అర్థం.

భూమి అంటే వ్యవసాయ క్షేత్రంగా చూసేవారు. వ్యవసాయం చేసే రైతును రాజుగా భావించేవారు. కానీ గవర్నమెంట్ డెవలప్ చేయాలనుకుంటుందని తెలిసి కొందరు వ్యాపారవేత్తలు ముప్పై వేలకు ఎకరం ఉన్న భూమిని మంచి రేటు పెట్టి కొని అతను ఎవరికి అమ్ము కున్న పరవాలేదు. మనం భూమియ కుంటే, అందరూ అమ్ముకొని పోతే మనం ఒక్కలమే ఉండాలే. అది కాకుండా ప్రభుత్వం అగ్గువ సగ్గువ కు తీసుకుంటదని బెదిరింపులు. ఇట్లాంటి అప్పుడు నలుగురితో నారాయణ అన్నట్లు ఉండాలె.

"తరతరాలుగా ఈభూమిలపుట్టి ఈ భూమిల పెరిగి ఈ భూమితోనే బతుకుతున్నోళ్ళం.... ఈ భూమిని ఇచ్చి ఎట్ల పోతాం. ఏడికి పోతాం... ఇన్ని రూపాయలు ఇచ్చిన ఈ భూమి మన పెయ్యిల అంగం లెక్కుండే. ఎట్లా వాళ్ల పాలు చేస్తాం" (రామచంద్రమౌళి : 2007:పుట:464) భూమిని ఆధారంగా చేసుకుని బతికేవాళ్లు, శరీరంలో ఒక అవయం లెక్క అనుకొని, ఆ అవయవానికి ఏదైనా ఇబ్బంది వస్తే ఎంత బాధ పడుతామో, భూమిని కోల్పో వాల్సి వస్తే ఆ భూమిని నమ్ముకుని బతికే వాళ్ళు పరిస్థితి కూడా అలాగే ఉంటుంది. ఇప్పుడు భూమి ఎంత ఉంటే అన్ని డబ్బులుగా లెక్క కడుతున్నారు.

ఎక్కడో ఢిల్లీ నుంచి వచ్చి ఊరిని కబ్జా చేయడం, కార్ఖానా పెట్టడం పెట్టడం వాడెవ్వనికో ఉద్యోగాలు ఇవ్వడానికి మన ఊళ్ళమ్ముకొని మన బతుకులను మట్టి పాలు చేసుకుని వెట్టి కూలీలుగా, వలస పక్షులుగా మారడం ఎంతవరకు సమంజసం.

ఇంతకుముందు ఊర్లలో జనాలు ఒకరితో ఒకరు ఎంత నిష్కల్మషంగా ఉండేవారు. ఒకరి మనసులో మాట ఒకరు పంచుకొని, ఒకవేళ ఏమైనా సమస్య వస్తే కలిసి పరిష్కరించుకునేవారు. కానీ ఇప్పుడు ఎవనికి వాడే రహస్యంగా ప్రవర్తిస్తున్నాడు. ప్రతివాడు తన కడుపులో ఏముందో బయటకి చెప్పకుండా ఎదుటివాని విషయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాడు.

మంగలి రాములు తన రెండెకరాలు ఆరు లక్షలకు అమ్ముతాడు. నిజానికి అది ఎక్కువ రేటు. ఇంత రేటు పెట్టి కొన్నోడు, వ్యవసాయం అంటే తెల్వనోడు. భూమి కొని ఏం చేస్తాడంటే తప్పకుండా అంతకన్నా ఎక్కువకు ఎవరికో అమ్ముతాడు లేదా అంతకంటే ఎక్కువ డబ్బును ఈ భూమిలోనుండి ఏదో రకంగా పుట్టిస్తాడు.

భూమికి, మనిషికి మనిషికి వొట్టి మట్టికి, డబ్బుకు ఉన్న సంబంధమే ఉందా అంటే ఒక తల్లితో పిల్లలకు ఏర్పడే అనుబంధం ఉంటుంది. కానీ మట్టిని నమ్ముకున్న మనిషి గుండె పగిలి భూమి నుండి ఎలా వేరవుతాడు. ఈ అనుబంధం విలువ ఎంత. అనుబంధం ఉన్నంత మాత్రాన డబ్బుతో కొలువబడే విలువ మారతాయా, మట్టి ముంతలో ఉన్న నీళ్లు, కల్లు, బంగారం వంటి పదార్థం విలువలు మారుతాయి. కానీ మట్టి ముంత విలువ అంటే ఉంటుంది కదా.

ఒకప్పుడు ప్రతి ఒక్కరూ భూమిని నమ్ముకొని, వ్యవసాయం పనుల మెలకువలు ఒకరి నుంచి మరొకరు తెలుసుకొని పోటీపడి పంటలు పండించి నిండుకుండల్లా పండు వెన్నెల్లా బతికిన వాళ్లు. ఇప్పుడు ఊరంతా భూమిని అమ్ముకోవడం పిచ్చి కమ్మింది.

సుందరయ్య పెద్దకొడుకు రాజ కొమురు కూడా భూమిని అమ్ముదామని తండ్రిని అడుగుతాడు. వాడెవడో రెండు వందల ఎకరాలు కొని ఊకుంటే మిగిలిన భూమి పడావు పడతదని, ఆలస్యమైతే గవర్నమెంట్ చేతులపడితే

వాడేమిస్తడు, దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకో మన్నారు పెద్దలు. రాజకొమురు ముఖం భూమిని అమ్ముకుంటే రాబోయే లక్షల డబ్బు ఊహతో కైపెక్కి ఎర్రగా తోమిన రాతి గిన్నెల మారుతది.

"రెండేండ్ల కిందనే భూమిని అంతా మీ ఇద్దరి పేర చేసిన గదరా రాజ కొమురు. భూమి ఉంచుకునుడా, అమ్ముకునుడా మీ ఇష్టం తమ్ముని కూడా అడుగు."

'నువ్వు మనస్ఫూర్తిగా చెప్తలేవే నాయన....'

'ఏం జెప్పేది బిడ్డ... నడుమంత్రపు డబ్బు కట్టల కట్టలు గుట్టలోలే నెత్తిలపడి మనుషులను పాపబట్టే....' (రామచంద్రమౌళి : 2007: పూట:466)

మనుషులను డబ్బు అనే మాయ కమ్మి, ఎవుని మాట ఎవడింట లేడు. రాజకొంరు భూమిని అమ్మి డబ్బు ఇంటికి తీసుకొచ్చాక, ఇక ఆ భూమి మీద తనకు ఏ హక్కు లేదు, అది తనది కాదు అన్న భావనను కూడా సుందరయ్య భరించలేక పోయిండు. తన పొలంలోని నీటి సంపులో దబాల్న పడిపోతాడు. డబ్బంతా తనదే కావాలన్నా అత్యాశతో విషయం కలిపిన స్వీట్ ను తన తమ్ముడికి తినిపిస్తడు. తండ్రి, తమ్ముడు పోయారని తెలిసిన ఏడవకుండా ఇంట్లోకి వెళ్లి రాత్రి గుమ్మిలో దాచిన డబ్బు బ్యాగును తృప్తిగా చూసుకుంటాడు.

**ముగింపు :**

భూమికి రెక్కలొచ్చి ఎక్కడెక్కడికో ఎగిరిపోతుంది. త్వరితగతిన అనేక చేతులు మారి మల్టీ నేషనల్ కంపెనీలు, కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళ్ళిపోతుంది. ఈ ప్రక్రియ చిన్నపాటి పట్టణ ప్రాంతాల్లోను వేగవంతం అయింది. ఈ క్రమంలో భూమి విలువలో వచ్చినా అనూహ్యమైన పెరుగుదలను మన సమాజపు మానవ సంబంధాలు తట్టుకోలేనంతగా అయిపోయాయి. భూమి ఇక ఎంత మాత్రమూ పంటలు పండించే క్షేత్రం కాదు. కోట్లు కుమ్మరించగలిగే సాధనం. పోనీ ఈ ఫలితాలు అందరికీ అందుతున్నాయా అంటే అది లేదు. అతి తక్కువ ధరకు చేతులు మారిపోయి కోట్ల విలువను సంతరించు కుంది. ఒకవేళ ఈ అనూహ్య సంపద సామాన్యుల చేతి కొచ్చిన దాని వెన్నంటి వచ్చే కృతకమైన విలువలు, విశృంఖల భావనలు, అనుమానాలు, ఆరాటాలు, హత్యలు, ఆత్మహత్యలు. మానవ సంబంధాల కన్నా ఆర్థిక సంబంధాలు బలీయమైనవిగా కనిపిస్తాయి.

**ఆధార గ్రంథాలు :**


1) రామా చంద్రమౌళి "భూమి దుఃఖం" హైదరాబాద్: చరిత్ర ఇంప్రెషన్స్, 2007.
2) రాములు, బి. ఎస్. "మమతలు మానవ సంబంధాలు" జగిత్యాల: విశాల సాహితీ అకాడమీ, 2000.
3) వెంకటసుబ్బయ్య, అప్పజోడు. "మహాభారతం మానవ స్వభావ చిత్రణ", కర్నూలు, 2009.
4) కాత్యాయని విద్మహే "కన్యాశుల్కం సామాజిక సంబంధాలు" వరంగల్: జిజ్ఞాస ప్రచూరణలు, 2005.
5) పిచ్చయ్య, చదలవాడ. "మానవుడు - మానవత" నవ భారతి ప్రచురణలు,1967.


★★★

Vol. 23 | Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# తెలంగాణ మట్టి పరిమళం - అన్నవరం దేవేందర్ కవిత్వం



- పుష్పలత

**పరిచయం :**

కప్పి చెప్పేది కవిత్వం, విప్పి చెప్పేది విమర్శ అన్నారు సి.నా.రె. గారు. కవిత్వం అంటే ఎలాంటి నియమ నిబంధనలు లేకుండా కవి తనచుట్టూ ఉన్న ప్రపంచాన్ని నిత్య పరిశీలన చేస్తుంటాడు. తాను చూసే ప్రపంచంలో అన్యాయాలు, అణచివేతలు, పీడన దోపిడి, హింస, క్రూరత్వం, ఆకలి, నిరుద్యోగం లాంటివి ఉండవచ్చు. వాటివల్ల కలిగే సంవేదనను, ఉద్వేగాలను అనుభూతులను కవి కలిగి ఉంటాడు. దాని నుండి ప్రశ్నించే తత్వం పుడుతుంది. అందరిలాగా కాకుండా తన ఆలోచనలను ఉద్వేగాలను తనకు తెలిసిన భాషలోనే వెల్లడిస్తాడు. అలా వెల్లడించడంలో తనదైన ప్రత్యేక పద్ధతి కలిగి ఉంటాడు. దీని వలన తన కవిత్వం ప్రత్యేక గుర్తింపు పొందుతుంది.

అన్నవరం దేవేందర్ గారు ఈ కోవలోకే వస్తారు. వారి కవిత్వంలో తెలంగాణ జీవితం, తెలంగాణ భాష ప్రవహిస్తుంది. గాయమై పారుతున్న తెలంగాణ భాషకు పల్లె బతుకులకు కవిత్వం లేపనం రాస్తున్న కవి దేవేందర్ గానెరు. తెలంగాణ బాషలోని పదజాలాన్ని అలవోకగా వాడుకుంటూ తన కవిత్వంలో ప్రధానంగా తెలంగాణ పల్లె జీవన చిత్రణ, తెలంగాణ అస్థిత్వం, బహుజన దృష్టికోణం, మానవత్వం, మానవ సంబంధాలు, ప్రపంచీకరణ, విప్లవ దృష్టి, సామాజిక అసమానతలు, కులవృత్తులు, బడుగు బలహీనవర్గాల జీవన చిత్రణ, శ్రామికవాద దృక్పథం కనిపిస్తాయి.

అన్నవరం దేవేందర్ గారు 1962 అక్టోబర్ 17న కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ మండలం పోతారం గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రుల దశరథం, కేదారమ్మ. తండ్రి వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. దేవేందర్ గారు పాఠశాల దశలోనే చంద్రిక అనే పత్రికలో తన మొదటి గజల్ అచ్చయింది. వివిద పత్రికలకు కాలమిస్టుగా, కవిగా, రచయితగా ఎదిగారు. పంచాయితీరాజ్ శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు.

వీరు రాసిన రచనలకు గాను రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారం, అలిశెట్టి ప్రభాకర్ సాహిత్య పురస్కారం, మలయశ్రీ పురస్కారం, మానస రుద్రకవి పురస్కారం, ఉమ్మడిశెట్టి ప్రతిభా పురస్కారం లభించాయి. పొక్కిలి వాకిళ్ళ పులకింత రచనకు గాను తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ పురస్కారం, ఊరు దస్తూరి అనే రచనకు గాను తెలంగాణ సారస్వత పురస్కారం, గవాయి రచనకు గాను 2023 సినారే పురస్కారం లభించాయి.

తన మొదటి కవితా సంపుటి "తొవ్వ" ఇది తన

కవిత్వానికే దారి వేసింది. దీనిలో తెలంగాణ పల్లె కన్నీళ్లను, రైతులు జీవితాల్లోని వాస్తవాలను చిత్రీకరించారు.

కనుకొనుల నుంచి రాలుతున్న సముద్రం
తెలంగాణ పల్లె / ఇది కన్నీళ్ళ కోనేరు
....................................
....................................
రైతు జీవితాలు / పిల్లి పట్టిన కోడివైనం

తెలంగాణ పల్లె ఇరిగిపోయిన పెంకపానక, తూట్లుపడ్డ వడ్లబోరెం, కూలిన పిడికెల కుచ్చె, చెదలుపట్టిన పాత గుమ్మి, పగిలిపోయిన కుంటికుండ అంటూ తెలంగాణ పల్లె కన్నీళ్ళ కోనేరు అనే వాస్తవాన్ని చిత్రించారు.

నడక రెండవ కవితా సంపుటి 2023లో వచ్చింది. 34 కవితలున్న ఈ సంపుటిలో తెలంగాణ పల్లె పరిమళాన్ని వెదజల్లుతాయి.

**'పురిటి వాసన' అనే కవితలో**

జన్మల జన్మభూమి జననిల ప్రసవరాగం
ఇపుడిప్పుడే పడ్డ శిశువుల కేర్, కేర్ రాగాలు
ఆగమాగమై తిరుగుతున్న అమ్మమ్మలు, నానమ్మలు

పొత్తిళ్ళ పురిటి వాసన పురివిప్పి పరివ్యాప్తమవుతుంది. అంటూ మానవుని పుట్టుక ఆసుపత్రులలో ఎలా మొదలైందో చిత్రీకరించారు.

'మంకమ్మ తోట లేబర్ అడ్డా' 2005లో వెలువరించారు. కరీంనగర్ జిల్లాలో మంకమ్మతోట లేబర్ అడ్డాను చూసి దానినే కవిత్వీకరించారు. నిలువెత్తు మనిషి అడ్డాలో ఎలా తనను తాను అమ్ముకుంటాడో చిత్రించాడు.

పల్లె పొలిమేరలు దాటి
అడ్డ మీద కూలిగా మారిన సందర్భం
అంగడిలో గొడ్డు గోదా అమ్ముడు పోయినట్లు
నిలువెత్తు మనిషి
తనను తానే అమ్ముకుంటున్న దృశ్యం
....................................
....................................
చేయి సంచిల సద్దిగిన్నె
జబ్బ మీద తువ్వాల
ఇంకో చేతల అతారలు
ఎవరు పిలుస్తారా అని ఎదురుచూపులు అంటూ

తెలంగాణ భాషలో పదజాలాన్ని అలవోకగా వాడుకుంటూ రాశారు. ఈ సంపుటిలో 37 కవితలున్నాయి. ఏ కవిత చదివినా ఆ విషయం స్పష్టమవుతుంది.

బుడ్డ పర్కలు (2006) నానీలు వెలువరించారు. తక్కువ పదాలతో లోతైన నిగూఢత కలిగినవి నానీలు. వందేళ్ళ చరిత్రను గర్భితం చేస్తున్నవి నానీలు. సహజ రమ్యతను కనబరుస్తాయి. మట్టిగుణం, వాస్తవికత, స్థానియతను ఈ నానీలు ప్రదర్శిస్తాయి.

దొరగడిని చూస్తేనే
ఉచ్చబడేది
ఇప్పుడు అండ్లనే
పోస్తనం

స్వరాజ్య ఆకాంక్షను వ్యక్తం చేస్తూ రాసిన నానీలో మూడు కోట్ల గొంతు ఒక్కటేమాట ఒక్కటే ముచ్చట సిర్ఫ్ తెలంగాణ.

బువ్వకుండా అనే దీర్ఘకవితను 2016లో వెలువరించారు. జీవన మూలాలు తడిమిన మట్టికుండ మన నాగరికతకు మూలం. వండుకు తినే బువ్వకుండా మూలాలను దీర్ఘకవిత్వంగా రాశారు. మూడు వేల సంవత్సరాల కింద సింధూ, మెసపుటోనియా సంధుల నేల తవ్వకాల కింద దొరికిన కుండలో కండ్లు చెదిరే కళాత్మకత దాగి ఉందన్నారు. మనిషి జీవితం మట్టికుండతో మొదలై ఆ కుండతోనే చివరగా అగ్గిలో మాయమైపోతాడని, మట్టికి, మనిషికి మధ్య గల అవినాభావ సంబంధాన్ని తెలియజేశాడు.

ఊరు దస్తూరి అనే మరో పుస్తకం ద్వారా తెలంగాణ పల్లె జీవితాలను, వారి యొక్క అనుబంధాలను, తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను అద్దం పట్టే విధంగా మూడు సంవత్సరాలు తెలంగాణ యాస, భాషలో రాశారు. దీనికి తెలంగాణ సారస్వత పురస్కారం లభించింది.

జీవన తాత్పర్యం 2022లో వెలువరించారు. దీనిలో 22 కవితలున్నాయి. జీవితానికి కవిత్వం వ్యాఖ్యానమైతే

ఇందులోని కవిత్వం జీవితానికి తాత్పర్యం. దీనిలో మనసు అల్లుకునే భావాలున్నాయి. పోయిరావలె కవితలో

పోయిరావలెను పోయి చూసిరావలెను
వెళ్లేందుకు వీలు కల్పించుకోవలెను
కంటినిండ చూసి చాన్నాలైంది
మాట్లాడుకోవడానికే బయలుదేరి పోవాలి
....................................
....................................
మనసు దాహం తీర్చేవి మాటలు ముచ్చట్లు

అమ్మమ్మ ఊరి మీద వాలి రావాలి అంటూ మనిషి ఎంత ఎదిగినా తన మూలాలను మర్చిపోకూడదని ఈ కవితలో చక్కగా వివరించారు.

తెలంగాణ యాస, భాష మట్టి పరిమళాన్ని వెదజల్లే పల్లె జీవన చిత్రణ, మనం మరచిపోతున్న తెలంగాణ అస్థిత్వపు మూలాలు, బహుజనుల చేతివృత్తులు కనుమరుగై యంత్రాలు, ఆధునిక పనిముట్లు వచ్చి పల్లె వాతావరణాన్ని మార్చివేశాయి. ప్రపంచీకరణలో భాగంగా క్రమంగా పల్లెలు, పల్లె జీవన విధానం కనుమరుగవుతున్న దశలో దేవేందర్ గారు తన కవిత్వంలో తెలంగాణ యాసను, భాషను, పల్లె జీవన విధానం, తెలంగాణ సంస్కృతి సాంప్రదయాలును సజీవం చేస్తూ తెలంగాణ పలుకుబడులను ఒంటబట్టించుకొని కథ చెప్పినా, కవిత్వం చెప్పినా తెలంగాణ బ్రతుకు సొగసును, సౌందర్యాన్ని, సాంస్కృతిక వైవిధ్యాన్ని తెలంగాణ నుడికారాన్ని సున్నితంగా, బాధ్యతగా స్పందిస్తూ సృజనాత్మక ప్రపంచాన రాణిస్తున్నారు. అలాంటి వారి కవిత్వాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉంది.

దేవేందర్ గారి కవిత్వం నిండా తెలంగాణ మట్టి పరిమళాలే. తెలంగాణ భాషను, యాసను ఎక్కిరిస్తూ అపహాస్యం చేస్తున్నప్పుడు కూడా తన కలం నుండి తెలంగాణ భాషలోనే కవిత్వం రాశారు. దేవేందర్ గారి కవిత్వం గురించి తెలుసుకుంటే తెలంగాణ పల్లె చిత్రణ, శ్రామికుల జీవన చిత్రణ తెలుసుకున్నట్లే.

**ఉపయుక్త గ్రంథ సూచీ :**

1) తొవ్వ - 2001.
2) నడక - 2003.
3) మంకమ్మ తోట లేబర్ అడ్డా - 2005.
4) బుడ్డపర్కలు - 2006.
5) బువ్వకుండ - 2016.
6) ఊరు దస్తూరి - 2020.
7) గవాయి - 2021.
8) జీవనతాత్పర్య - 2022.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# బి.వి.యన్. స్వామి రచనల్లో కథన రీతులు – వస్తు శిల్పాల సమన్వయం



- రెడ్డి శ్రీనివాస్
పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

"సాహిత్యంలో 'కథ ఒక ప్రక్రియ కథా వస్తువును పాఠకులకు చేరవేసే విధానం శిల్పం. వస్తు, శిల్పాలలో ఏది ప్రధానం? అనే ప్రశ్నకు అనేక జవాబులు, సిద్ధాంతాలు చెప్పబడ్డాయి. నేటి సాంకేతిక యుగంలో ప్రజల జీవితం వేగంగా మార్పు చెందుతుంది. అంతేవేగంగా వస్తువు రూపొందుతుంది. వస్తువంత వేగంగా శిల్ప రీతులు రాకపోవడం గమనార్హం. ఆ విధంగా శిల్పరీతులకు కొంత పరిమితి వచ్చి చేరింది. ఏదేమైనా మంచి కథలో వస్తు శిల్పాలు పెనవేసుకొని ఉంటాయి. వస్తువుకు సారం ఉన్నట్లే రూపం కూడా ఉంటుంది. రూపం, సారం రెండూ కూడా పరస్పరాధారితాలు, వాస్తవంలో ప్రతిదీ రూప-సారాల సమ్మేళనమే, సారం లేకుండా రూపాన్ని గానీ, రూపం లేకుండా సారాన్ని గానీ ఊహించలేం. అలా రెండూ విడదీయలేని పార్శ్వాలుగా ఉంటాయి. పాత్రలు, సన్నివేశ కల్పన, కార్యకారణ సంబంధాలు, సంఘటనలు, వైరుధ్యాలు, నేపథ్యం కలగలసి ఒక జీవన విషయంగా పాఠకునికి చేరాలి. పాఠకునికి అనుభూతి గాఢత కలిగించాలి. చిత్రిత జీవితం వాస్తవమనిపించాలి. "ఇతివృత్తం నుండి శిల్పాన్ని వేరు చేయడం సాధ్యం కాదని అనుకున్న తర్వాత, శిల్పంతో ప్రమేయం లేకుండా ఇతివృత్తంలోని ఒక పాత్రగాని, ఒక సన్నివేశం గాని యదార్థం అనుకోవడంలో అర్థం లేదు. నా ఉద్దేశంలో అనేకమంది రచయితలు శిల్పాన్ని పోగొట్టుకునేది జీవితంలో తాము గమనించిన కొన్ని విషయాలు తీసుకొని వాటికి బలాత్కారంగా తమ ప్రయోజనాలను జోడించడం వల్లనే" అని కొడవటిగంటి చెప్పాడు.

శిల్ప పరిస్థితిలోని ప్రధాన భాగం గురించి తన మనస్సులో స్పష్టత ఏర్పడిన తరువాతనే కథా వస్తువును కథగా మల్చడానికి రచయిత కృషి చేస్తాడు. రచయిత తను స్వీకరించిన వస్తువును అందమైన కథనం ద్వారా అందించాలి. కథనం అంటే కథ చెప్పే పద్ధతి, కథా రూపంలో కథనం ఒక అంశం. వాస్తవ ప్రపంచాన్ని కథలో చిత్రించడానికి కథనం పనికొస్తుంది. అలాంటి కథన పద్ధతులలో వాస్తవిక కథనం, లేఖారచన కథనం, డైరీ కథనం, ఊహాకల్పనా కథనం, అంతరార్థ కథనం, చైతన్య స్రవంతి, కథనం, మ్యాజిక్ రియలిజం కథనం, క్యాసెట్ కథనం మొదలగునవి ఉన్నాయి.

**వాస్తవిక కథనం :**

తెలుగు కథా సాహిత్యంలో ఎక్కువ కథలు వాస్తవిక కథన పద్ధతిలో వచ్చాయి. వాస్తవికతా వాదం ఒక కిల్ప పద్ధతే కాదు, జీవితాన్ని చూసే పద్ధతి కూడా, అందుకే కథల్లో కల్లోల పరిస్థితులు, ఉద్యమాలు, పరిష్కార

మార్గాలు, అన్ని వర్గాల జీవితాలు, త్రిగుణ సంబంధిత సమస్యలు, సాంఘిక మార్పులు, సాంకేతిక విజయాలు ఇలా ఒకటేమిటి సమస్తం చిత్రించబడ్డాయి.

కార్మిక స్థితిగతులను, సుఖదుఃఖాలను వాస్తవిక దృక్పథంతో చిత్రించిన కథ. తుమ్మేటి రఘోత్తమరెడ్డి రాసిన "ఉరి" కథ. తోట రామచంద్రం ఉరిని నేపథ్యంగా చేసుకొని కథ నడుస్తుంది. రామచంద్రం చనిపోతే చూడడానికి వచ్చిన మిత్రుడు నారాయణతో రచయిత కథ నడిపిస్తాడు. శవాన్ని చూసిన నారాయణ గతంలోకి వెళ్ళి వర్తమానంలోకి రావడం కథలో కనిపిస్తుంది. కథంతా వచ్చి వాస్తవాల చిత్రీకరణలో నడుస్తుంది. కథనం ఆకట్టుకునే విధంగా ఉంటుంది. బి.ఎస్. రాములు రాసిన కామన్‌వెల్త్ కథ వైరుధ్యాలను చర్చకు పెడుతుంది. మనిషి లోపలి, సమాజంలోపలి సంక్లిష్టతలను వాస్తవిక దృష్టితో చిత్రిక పట్టింది. గ్లోబలైజేషన్‌ను సమర్థిస్తూ, దాన్ని తనకు అనుకూలంగా మలచుకుంటూ, ఇందులోని ప్రధానపాత్ర ముందుకెళ్ళడం కనిపిస్తుంది. అందులో భాగంగానే అతడు ఎత్తుగడలను చర్చలను, సంబంధాలను, సంఘర్షణలను చివరికి ఆత్మవంచనను ప్రదర్శనకు పెడతాడు. కథ పాఠకుడిని అనేక ఆలోచనలకు గురిచేస్తుంది. జరుగుతున్న పరిస్థితులను, ఉన్నదున్నట్లుగా చిత్రించడం వల్ల ఇది సాధ్యమైంది.

**లేఖా కథనం :**

లేఖా కథనం ప్రసిద్ధికెక్కిన పాత పద్ధతి. లేఖలు అనేక రకాలు. రంగనాయకమ్మ లాంటి పేరుగాంచిన రచయిత్రుల నుండి వర్ధమాన రచయితల వరకు ఎందరో లేఖా రచన పద్ధతిలో కథా సాహిత్యాన్ని సృష్టించారు. లేఖా కథనంలో రచబంత అదృశ్యంగా ఉంటూ పాత్రలు పరస్పరం రాసుకొనే ఉత్తరాలతో కథ నడిపిస్తాడు.

వరికొండ కాంతారావు "దోస్తానా" కథా సంపుటి వెలువరించారు. అందులో ఇల్లు, ఊరు-పేరు, అధముడా, న్యాయం లాంటి కథలు లేఖారచన పద్ధతిలో నడిచాయి.

ప్రముఖ కథా రచయిత్రి మదుగంటి సుజాతారెడ్డి "స్నేహలతాదేవి లేఖ" కథ బతకడానికి ఇల్లు విడిచిన స్త్రీ గురించి చెబుతుంది. పెళ్ళి చూపులలో వరుడు నచ్చలేదని, చెప్పలేని నిస్సహాయ స్థితిలో తల్లిదండ్రులకు ఉత్తరం రాస్తుంది. వరకట్నం కూడా ఒక సమస్యగా అందులో కనిపిస్తుంది. తను వెళ్ళేది చావడానికి కాదని, తలెత్తుకు బ్రతకడానికని ఉత్తరం ద్వారా తెలుపుతుంది. నేరుగా చెప్పలేని స్థితిలో, మరొకరితో చెప్పించలేని పరిస్థితిలో, ఉత్తరాన్ని ఆశ్రయించడం సబబేనని పాఠకుని గ్రహింపుకు వస్తుంది.

నామని సుజనాదేవి మనోస్పందన అనే కథా సంపుటిని వెలువరించింది. అందులో ప్రేమలేఖలు కథంతా, లేఖల రూపంలో ఉండటం విశేషం.

**డైరీ కథనం :**

కథకుడు తను చెప్పదలచుకున్న విషయాన్ని, అనువైన పద్ధతుల్లో తెలవడానికి అనేక రూపాలను ఎంచుకుంటాడు. అటువంటి రూపాలలో డైరీ కథనం ఒకటి. సాధారణంగా విద్యావంతులైనవారు తమ దినచర్యను డైరీ రూపంలో రాసుకుంటారు.

ఆ రోజులో జరిగిన ముఖ్య సంఘటనలను, స్పందించిన విషయాలను, తమపట్ల ప్రభావితం అయిన మనుషులను, కొందరు చైనీలో రికార్డు చేస్తారు. వాటన్నిటిని ఒకేసారి చదివినపుడు అనుభూతికి లోనవడం జరుగుతది. చైరీ రూపంలో కథలు రాసినవారు అనేకులు ఉన్నారు. అటువంటివారిలో కె. రాంమోహనరావు ఒకరు. వారి కథా సంపుటికి అనామకుడి వైరీ అని పేరు పెట్టారు. అందులో "అనామకుడి డైరీ" ఒక కథ ఉత్తమ పురుషలో సాగిన ఈ కథ అనుభవసారంగా కనిపిస్తుంది. ఒక్కోచోట కథ ప్రథమ పురుషలో చెపుతూ డైరీ రూపంలో రాశారు. కథ వర్ణనలు, సామెతలలో సాగుతుంది. రోజు తరువాత రోజు, వరుస క్రమంలో సాగిన ఘటనల కూర్పు కనబడుతుంది. డైరీ రూపంలో సాగిన ఈ కథా శిల్పం వాస్తవ అనుభవాల పునాదిపై ఉండడం గమనార్హం.

**ఊహాకల్పనా కథనం :**

వికమైన జీవితాన్ని ఉన్నదున్నట్లుగానే ప్రదర్శించవలసిన అవసరం లేదు. వాస్తవికత ఆధారంగా అనేక రకాలైన ఊహాకల్పనలు చేసి వాస్తవికతను స్ఫురింపచేయవచ్చు. కథ వాస్తవికత సరిహద్దుల్ని దాటి వెళ్ళినపుడే

దాన్ని "ఊహాకల్పన - ఫాంటసీ" అంటారు. సాధారణంగా ఊహాకల్పన మానవజీవితానికి సంబంధించిన సూత్రాలను తిరస్కరించి పాఠకున్ని ఒక కొత్తలోకంలోకి తీసుకు వెళ్తుంది. ఇందుకు కల వచ్చినట్లు చెప్పడమో, మరో లోకసృష్టి చేయడమో కథకులు చేస్తుంటారు. సక్రమంగా ఉపయోగిస్తే ఈ విధానం పాటకుల్ని ఆకట్టుకుంటుంది.

"బుర్ర రాములు రాసిన "ఏడోసారా కథ" కూడా ఈ కోవలోకి వస్తుంది. పురాణ పద్ధతిలో నరకలోకాన్ని సష్టించి, అందులో సామాజిక అన్యాయాన్ని ఎండకట్టడం కథలో కనిపిస్తుంది. అప్పటికే చనిపోయిన రావిశాస్త్రి, చెరబండ రాజు, రామనాథం లాంటి రచయితలు, పౌరహక్కుల నాయకులు నరకంలో కనపడుతారు. వ్యాస్ లాంటి పోలీసు అధికారులు కూడా ఒకవైపు కనపడతారు. రావి శాస్త్రి సారా కథల మీద విచారణ జరుగుతుంది. ఇరుపక్షాల వాదనలు వినవస్తాయి. స్వతంత్ర భారత పాలనా విధానాల మీద, ఆర్థిక చట్రం మీద విమర్శలు, వ్యంగ్య బాణాలు కథలో ఉన్నాయి. కథ దోపిడీ వ్యవస్థ కొన సాగింపులోని అసంబంధ్ధతను గూర్చి ఆలోచింపజేస్తుంది.

**అంతరార్ధ కథనం :**

అంతరార్ధ కథనాన్ని ఇంగ్లీషులో అలిగర్ అంటారు. అంతరార్ధ కథనం ఉన్న కథలోని ప్రధాన పాత్రలు, సంఘటనలు, భావాలు, ఇతర వ్యక్తులకూ, సంఘటనలకూ భావాలకూ ప్రాతినిధ్యం వహిస్తాయి. ఈ ప్రాతినిధ్యం వహించడం ఒక పాత్రకో, సంఘటనకో, భావానికో పరిమితంగా ఉండదు. కథ ప్రారంభం నుండీ చివరి వరకూ ఈ అంతరార్ధ కథనం కొనసాగుతూనే ఉంటుంది. ఇలాంటి కథలు అరుదుగానే వచ్చాయి.

**చైతన్య స్రవంతి కథనం :**

చంచలంగా సంచరించే మనస్సంచారాన్ని చిత్రించడానికి చైతన్య స్రవంతి అనే శిల్ప పద్ధతిని రచయితలు ఎన్నుకున్నారు. హెన్రీజేమ్స్ అనే రచయిత ఈ రచనా విధానానికి అనే పేరు పెట్టారు. ఈ మాటనే శ్రీశ్రీ చైతన్య స్రవంతిగా తెలుగులోకి అనువదించారు. ఈ పద్ధతిలో రచించే కథలలో పాత్రల్ని లోపల్నించి, అంటే వాళ్ళ మనసు పొరల్లో ఏమి జరుగుతున్నదో చూపిస్తారు. మనిషి మనఃప్రపంచంలో చెలరేగే విభిన్నమైన, విరుద్ధమైన భావాలకు సాధ్యమైనంతో యధాతథంగా అక్షరరూపం ఇవ్వడమే చైతన్య స్రవంతి రచనా విధానమని చెప్పవచ్చు.

"అంపశయ్య నవల ద్వారా సాహితీ లోకంలో నవీన్, అంపశయ్య నవీన్‌గా స్థిరపడ్డారు. అంపశయ్య చైతన్య స్రవంతిలో వెలువడ్డ నవల. ఈ విధానంలో వీరు కథలు కూడా రాశారు. ఈ పద్ధతిలో ఆడెపు లక్ష్మీపతి కథలు రాశారు. "నాలుగు దృశ్యాలు" అనే వీరి కథా సంపుటిలో జీవన్మృతుడు, తిర్యగ్రేఖ అనేవి చైతన్య స్రవంతి టెక్నిక్‌కు చెందిన కథలు.

చైతన్య స్రవంతి కథా రచనా విధానం గురించి బుచ్చి బాబు ఇలా అంటారు. "క్షణికమైన అనుభవాన్ని మొత్తం జీవితానుభవంతో ముడెట్టి ఈ రెంటి తారతమ్యాల విభజన లేకుండా ఉన్నది. ఉన్నట్లు ప్రదర్శించే యత్నమే చైతన్య స్రవంతి.

**క్యాసెట్ కథనం :**

కథకుని ఆలోచనను బట్టి, వస్తుతత్వాన్ని బట్టి కథా నిర్మాణం రూపొందుతుంది. కథా నిర్మాణ పద్ధతులలో వైవిధ్యం కథా సాహిత్యాభివృద్ధికి, సామర్ధ్యానికి నిదర్శనంగా నిలుస్తుంది. రచయితలు వస్తువును సమాజం నుండి గ్రహించి, కళాత్మకంగా అల్లి తిరిగి సమాజానికి అప్పగిస్తారు. ఇలా ఇచ్చే క్రమంలో వస్తువును సమాజం నుండి గ్రహించి, కళాత్మకంగా అల్లి తిరిగి సమాజానికి అప్పగిస్తారు. ఇలా వచ్చే క్రమంలో వస్తువు తగిన రూపాన్ని పొందుతుంది. అందుకు జూకంటి జగన్నాథం "యాతన" కథను ఉదహరించవచ్చు. వ్యక్తుల మధ్య ఉత్తరాలు ఆత్మీయతను పంచేవి, సమాజంలోని ఉత్తరాల వ్యవస్థ సాహిత్యంలోకి వచ్చింది. ఫలితంగా లేఖారచన అనే రపం ఏర్పడింది. సాంకేతిక విజ్ఞానం పెరిగాక, దూరాలు మరింత దగ్గరయ్యాయి. విదేశ్యాలకు వెళ్ళిన కార్మిక, శ్రామికులు తమ వారిని ఉద్దేశిస్తూ క్యాసెట్లో మాట్లాడి పంపిస్తుంటారు. టేప్ రికార్డర్ ద్వారా వినడం వల్ల మాట్లాడి అనుభూతి కలుగుతంది. ఈ విధానం సమాజంలో జరగడం చూసి, దాన్ని కథలో ప్రవేశపెట్టాడు.

సమాజంలో వస్తున్న మార్పులను, మార్పుకు కారణ మైన అంశాలను అన్నింటిని స్వామి తన కథా వస్తువు లుగా శైలి, శిల్పంతో మలచుకున్నాడు.

"నెల పొడుపు", "శారద" అనే స్త్రీ జీవిత వ్యథ తప్ప తాగిన భర్త తనువు చాలిస్తే, ఇటు అత్తింటివారూ, అటు పుట్టింటివారూ ఆమెను పట్టించుకోరు. ఈ నేపథ్యంలో తన పిల్లల పాలనా పోషణకు ఆమె జీవన పోరాటం చేస్తుంది. మసిబారిన ఆమె బ్రతుకులో మరో పురుషుడు ప్రవేశిస్తాడు. వెన్నెల కురిపిస్తాడు. చాలా కథల్లోలా కాకుండా స్త్రీల బలహీనతల్ని ఆసరా చేసుకొని ఆమెను వాడుకొని వదిలేసే పురుషుల్లా కాకుండా, ఆమెకు తోడుగా ఉండా లనుకోవడం రచయిత ఆశావాద దృక్పథానికి నిదర్శనం! ఈ కథలో బి.వి.యస్. స్వామి చక్కటి శిల్పాన్ని ప్రవేశ పెట్టాడు. స్త్రీ జీవిత వ్యధను తనదైన శైలిలో చిత్రీకరిం చారు.

'రాత్రి పలు ఒక మెలకువ కథ సంబంధించిన ఒక విశేషం ఏమిటంటే 'నిజం పత్రిక'లో ఈ కథ ప్రచురిత మైనప్పుడు కాళీపట్నం రామారావు మాస్టారు గారు చదివి నాకు ఫోన్ చేసి మాట్లాడారు. కథ నడిపిన తీరు కొత్తగా ఉందని, తనకు నచ్చిందని ఆయన అన్నారు. ఆ మాట నాకు బలాన్నిచ్చింది. ఈకథ బీడీ కార్మికుల కథ. బీడీ కట్ట మీద పుర్రె గుర్తు ఉండకూడదని ఒక చట్టం తేవాలని పార్లమెంటులో దుమారం రేగింది. అది తీసేస్తే దాని ప్రభావం బీడీ కార్మికుల మీద ఏ విధంగా ఉంటుందనేది నేను స్వయంగా చూసినా, ఆ చట్టానికి వ్యతిరేకంగా బీడీ కార్మికులు కలెక్టరేట్‌కి పెద్ద ధర్నా చేయడం కూడా జరిగింది. పరోక్షంగా ఇది సిగరెట్ పాకెట్‌లకి దోహద పడుతుందని ఒక వాదన కూడా వచ్చింది. అంటే చిన్న కార్మికుల మీద, చిన్న కంపెనీల మీద దెబ్బన్న మాట. అది పెద్ద కంపెనీలకు ఏ విధంగా ఉపయోగపడుతుంది అనేది ఈ ధర్నా ద్వారా నాకు అర్థమయింది. ఆ ధర్నాని దూరం నుంచి చూస్తున్న వ్యక్తి ఏవిధంగా స్పందించాడు, కలెక్టరేట్ ఉద్యోగులు ఆ ధర్నా పట్ల ఎలా స్పందించారు అనేది కూడా నేను ఈ కథలో చెప్పాను. ఒక చట్టం ఒక ధర్నాకు ఏ విధంగా మూలమయింది, ఉద్యోగ వర్గాలు దాన్ని ఏ విధంగా చూసినయి అనేది కూడా ఒక పాత్ర ద్వారా చెప్పడం జరిగింది. అంటే ఇవాళ అటు బీడీ కార్మికులు కావచ్చు లేదా కుటుంబాలలో స్త్రీ పురుషు లిద్దరూ పనిచేయడం కావచ్చు దీనివల్ల ఏమవుతుందంటే కుటుంబంలో ఒకరు ఇంకొకరికి టైం ఇవ్వని దశ వస్తోంది.

భార్యాభర్తలిద్దరూ పని చేస్తున్న క్రమంలో ఒకవేళ భర్తకి ఒంట్లో బాగా లేకపోయినా, ఏదైనా జ్వరం వచ్చిన భార్య అతనికి టైం కేటాయించలేని పరిస్థితి. అది కూడా ఒక వ్యథకి సంబంధించినదే. అంటే కుటుంబపరమైన వ్యథ. బీడీ కార్మికులకు సంబంధించి వ్యవస్థాపరమైన బాధ. ఇట్ల బాధ అనేది రకరకాల తీరులలో కనబడతా ఉం టది. అయితే ఆ రకరకాల తీరులో కనబడ్డ సమయాల్లో కూడా బాధకి ఏ విధంగా ఉపశమనం కలిగించే దారులు ఉంటాయనేది ఒక కథకుడిగా నేను ఈ కథలో సూచిం చడం జరిగింది. సమాజంలో వృత్తులను నమ్ముకున్న వారి జీవితంలో ఎలా అలజడులకు గురి అవుతున్నాయో తనదైన శిల్ప నైపుణ్యాన్ని ప్రవేశపెట్టాడు.

బి.వి.ఎస్. స్వామి తన కథలో బీడీ కార్మికుల జీవన చిత్రణలో ఒక ప్రత్యేక శైలిని, శిల్పాన్ని, వస్తువు ప్రెజెం టేషన్‌ను రూపొందించుకున్నారు. వస్తు వైవిధ్యాన్ని అనుస రించి శైలీ, శిల్పాలు మారుతుంటాయి.

ఉదాహరణకు తెలంగాణ ప్రాంత ప్రజల జీవితాలు చిత్రించేటప్పుడు వస్తువుతో పాటు శైలి, శిల్పాలు, దృక్పథం కూడా ప్రత్యేకంగా వున్నప్పుడు అవి మరింత విశిష్టంగా ఆకర్షిస్తుంటాయి. ముఖ్యంగా కథా వస్తువులోని పాత్రలు కూడా ఆ సాహిత్యానికి ప్రధాన పాఠకులుగా ఆకర్షించ దల్చుకున్నప్పుడు వారికనువైన శైలి, శిల్పం, ప్రజెంటేషన్, దృష్టికోణం అవసరం.

ప్రజల బతుకులు సామాన్యంగానే వుంటాయి. ఇట్లా సామాన్యులు అసామాన్యులుగా ఎదిగే క్రమంలో కథలు రాయడం ఒక చక్కని పద్ధతిగా ఉపయోగపడుతుంది. జాక్ లండన్, షాలకోవ్ ఆ పాత్రల్లోని భావోత్తేజాన్ని తీసుకొని 'దేవులాట, కరియేపాకు, కుంఠనం కథల్లో శైలి, శిల్పం మలిచారు.

నీ దగ్గరి వాళ్లు దూరమైనప్పుడు చనిపోయినపుడు ఎంతో బాధ కలుగుతుంది. కథలోని పాత్రకు ఆ బాధకు మూలమైన వారి మధ్యగల అనుబంధాన్ని సాన్నిహిత్యాన్ని ప్రేమను పాఠకుల కూడా కథా చిత్రణలో చెపితే నీలాగే ఆ పాత్రపట్ల పాఠకులు స్పందిస్తారు. ప్రజల కష్టాల్లో రచయిత తోడున్నానని నిలబడాలి. ఆత్మవిశ్వాసం ఇవ్వాలి. వారిపట్ల ప్రపంచం కరిగి కదిలివచ్చేట్టు చేయాలి. కష్టాలు రాగానే వదిలేసి సుఖాలు రాగానే పట్టించుకుంటే పలాయనవాది అవుతారు. అవకాశవాది అవుతారు. కష్టాలు లేకపోతే కథోలేదు అని వినేవుంటారు. రచనలో దృక్పథం, దృష్టికోణం ఎంతో అవసరం. అది మనసుకు, హృదయానికి, అవగాహనకు సంబంధించింది. మనసు చూడకుండా కన్ను చూడలేదు. కన్ను చూడకుండా మనసు చూడలేదనే మాట ఎంత నిజమో మనసు చూడకుండా కన్ను చూడలేదు అనే మాట కూడా అంతే నిజం. సమాజానికి మార్గదర్శకత్వం వహిస్తూ సమాజాన్ని ఉన్నతస్థితి నుంచి మరింత ఉన్నత స్థితికి ఎదిగించడానికి కావాల్సిన ధైర్య, స్థయిర్యాలు, త్యాగరుణం, ఉదాత్త వ్యక్తిత్వం, నమూనా పాత్రల ద్వారా ఆదర్శంగా చిత్రించడం అవసరం. మనం కూడా ఈ ప్రపంచాన్ని గెలవగల గమనం కూడా ఈ ప్రపంచంలో బతుకు గెలుచుకోగలం. మనం కూడా ఈ ప్రపంచాన్ని ఎలగలం అనే ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగుతారు. ఈ ఆత్మవిశ్వాసం కలిగించడం కన్నా సాహిత్యానికి అంతిమ లక్ష్యం మరేం కావాలి. అని బి.వి.యస్. స్వామి తన కథల ద్వారా నిరూపించారు.

**ఉపయుక్త గ్రంథ సూచీ :**



1) డా॥. బి.వి.యస్. స్వామి, పి. వి. నరసింహరావు (కొన్ని వచన రచనలు - ఒక పరిశీలన), సురభి ఎడ్యుకేషనల్ సొసైటీ, మాదాపూర్, హైటెక్ సిటీ రోడ్డు, హైదరాబాద్, 2021.
2) డా॥. బి.వి.యస్. స్వామి, కథా సోపానములు, నీల్ కమల్ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, సుల్తాన్ బజార్, కోఠి, హైదరాబాద్, 2023.
3) జి. గిరిజానమనోహరాబు, కథకు శతమానం, కథానిక సాహిత్య వ్యాసాలు, గన్నమరాజు ఫౌండేషన్, విజయనగర్ కాలనీ, హనుమకొండ, 2012.
4) డా॥. బి.వి.యస్. స్వామి, పల్లేరు కాయలు, బి.వి.యస్. రచనలు - సంక్షిప్త పరిచయం.
5) కాలి బాటలు, తెలంగాణ కథా విమర్శ, బి.వి.యస్. స్వామి, తెలంగాణ పబ్లికేషన్స్, ముషీరాబాద్, హైదరాబాద్, 2022.


★★★

భావవీణ
January 2026

Journal of Arts, Literary, Culture & Language Study

Reffered Journal & Peer Reviewed Journals
ISSN No. 2456-4702 | RNI No. APTEL/2003/12253




Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002.
Andhra Pradesh, Cell : 7386529274, 7989781963, E-mail : parisodhanatelugu@gmail.com,
Printed at : GLS Enterprises, Guntur - 522 002. Ph. 9494 660 509.